# మిసిమి

చింతనాత్మక సారస్వతం



సుందరి

మాసపత్రిక, సెప్టెంబర్, 2023 ₹ 50/-

ISSN 2454–4329




ధర్మరాజు

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 9

సెప్టెంబర్ - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI — Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR

**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి

**040-27645536**

Scan QR to Pay

**Misimi Publication**

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

ISSN — INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## సెప్టెంబర్ నెల సూచికలు...






మెట్రో మెట్లు : అశ్వినీ కుమార్ ...3

రవ్వా శ్రీహరి-సాహిత్య విమర్శ : డా. వంగరి త్రివేణి ... 5

సాహసయాత్ర - క్యూబా - 3 : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 12

పింగళి వెంకయ్య : గారపాటి కోటమ్మ ... 19

తెలుగు పౌరాణిక సినిమా : డా. కొట్టు శేఖర్ .... 22

ఉద్యమ కవిత : డా. రాగ్యానాయక్ ఆడావతు ... 29

గద్దర్: దేదీప్యకాంతుల ఉల్కాపాతం : ప్రొ. వై. పార్థసారధి.... 33

నవలాహృదయం-కమలమ్మ కమతం : రాజారామమోహన రావు... 37

విద్యాబుద్ధులు నేర్పని సాంకేతికత : డా. శ్రీరాములు గోసికొండ ... 39

తాళ్ళపాక : గూడూరు యానాదిరాజు ... 42

స్త్రీ సాహిత్యం - దళితులు : జంధ్యాల కనకదుర్గ ...47

చిత్రగీతాలు - జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 51

సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు ... 54

దసరా-రాజస్థాన్-2 : ప్రొ. లక్ష్మీ అయ్యర్... 56

కళాకడలిలో కొత్త కెరటాలు : తంగెడ విశ్వేశ్వరప్రసాద్ .... 59

దర్శి అన్నపూర్ణమ్మ : డా. షేక్ మహబూబ్‌బాషా... 63

కాశీపండా : డా. కె. సత్యనారాయణ... 75

చదవండి : ***మిసిమి*** ... 78


### అట్టమీది బొమ్మలు



సుందరి




ధర్మరాజు




దుర్యోధనుడు



శాంతి

## మెట్రో మెట్లు

*మీరు సరిగానే విన్నారు – ఎస్కలేటర్లు, లిఫ్టులు నిత్యం తిరిగే మెట్రో స్టేషన్స్‌లో మెట్ల గురించి ఎవరికి కావాలి? చాలా వెడల్పు, రెండు మూడు అంచెలుగా ఎక్కటానికి దిగటానికి అనువుగా ఏర్పాటు చేసిన ఈ మెట్రో మెట్ల మీద చాలా కథలు నడుస్తుంటాయి. పైన లిఫ్టులున్నాయి అన్నాను కదా – అవి వృద్ధులకు, వికలాంగుల కోసమని స్పష్టంగా రాసి ఉంటుంది. కాని వాటికోసం పరుగులు పెట్టేది పుట్టుకతోనే వృద్ధులయిన ఈనాటి యువకులు – వీరు ఎస్కలేటర్లు – లిఫ్టులు తప్ప – మెట్లు దిగిన – ఎక్కటం వదిలేయండి – పాపానపోరు. రెండు మూడు సార్లు – నాకు అవకాశం చిక్కినపుడు – అవి వికలాంగులకు – వృద్ధులకు – మీ రెందుకు పరుగు పెడుతున్నారంటే – వారి ప్రతి స్పందన చూడాల్సిందే – సరే అసలు విషయానికి వద్దాం – మెట్రో మెట్లు ఏమిటి? మచ్చుకు రెండు మూడు స్టేషన్లు చెప్తాను. మా ఆర్టీసీ క్రాస్‌రోడ్ స్టేషన్ మెట్లు – మెట్టు మెట్టుకీ (కొద్దిగా అతిశయం) ఓ కాకి, ఓ కోకిల కా–కూ; అంటుంటాయి! ఓ గువ్వా, ఓ చిలుక కువకువలాడుతుంటాయి. ముఖ్యంగా నాబార్డు వంక. మొదట్లో అంతగా పట్టించుకోలేదు కాని – కదిలే కాలు – రాసే కలం ఊరుకోవు – పరికించటం – పరిశీలించటం అయిన తర్వాత తేలిన విషయం, ఈ చుట్టుప్రక్కల బాయ్స్ హాస్టళ్ళు, అల్లంత దూరంలో వుమెన్స్ హాస్టళ్ళు వున్నాయి. కావలసినన్ని సినిమా హాళ్లున్నాయి (ఈమధ్యన కొన్ని మూతపడ్డాయి) వారూవీరూ సినిమాకు వెళ్లటానికో – వెళ్లిన తర్వాత పిజ్జాలు పట్టుకుని ఈ మెట్లని ఆశ్రయిస్తారు. చల్లటి గాలి – ఎవ్వరికీ కనపడకుండా ఎంతసేపయినా ఊసులాడుకుంటానికి అనువుగా ఉంటాయి. మనకు పార్కులు తక్కువ కదా – ఇదోరకం మెట్రో మెట్ల ఉపయోగం – ముసురు పట్టినప్పుడు ఓ వీధి కుక్క ముడుచుకుని పడుకుంటుంది ఓ మెట్టు మీద.*


హైటెక్స్ మెట్రో మెట్లు

**ఇప్పుడు మరో 'పెద్ద' విషయం ముచ్చటించుకోవల్సిందే....**

*హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ చాలా ముఖ్యమైనది. అక్కడ కూడా మెట్లు చాలానే చాలా వైపులకు అంటే కాంకోర్సుకు నాలుగు వైపులా, స్కైవాక్ వైపు ఉంటాయి. ఈ మధ్యనే వీసా అప్లికేషన్ సెంటర్‌వారు ఈ మెట్రో స్టేషన్ సగం పైగా ఆక్రమించారు. ఆ వైపు మెట్లు – మన భావితరాలకు బంగారు లోకపు సోపానాలు ! బి2లో కారుపెట్టి – ఒక లిఫ్టు ఎక్కి – గ్రౌండ్ ఫ్లోరులో మారి – రెండో లిఫ్టులో మూడోఫ్లోర్‌కి చేరి స్కై వాక్ మీద నడిచి – ఈ మెట్లు మూడంచెలుగా దిగాలి. ఇక ఆ మెట్లకు ఇరువైపులా అన్ని వయసుల, అన్ని సైజుల, కాబోయే మరో లోకపు 'యాస్పిరెంట్ల'తో నిండిపోయి వుంటాయి.*

*నేను వారిని తప్పించుకుంటూ, ఒకోసారి పక్కకు తోసుకుంటూ మెట్లు మూడంచెలు దిగాలి. అక్కడ ప్రభుత్వ ఆహార్యంతో ప్రైవేటు సెక్యూరిటీ పహారాగాళ్ళు వీళ్ళని గదమాయిస్తూ – వరసల్లో నిలబెడతారు – అయితే అప్లికేషన్ సెంటర్ చాలా పెద్దది. మామూలుగా కదిలిపోయే ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేసిన మెట్లు వీరికి ఇరుకైపోతున్నాయి. ఈ యాస్పిరెంట్లు ఆడా మగా, చిన్నా, పెద్దా ఎనభైశాతం విద్యార్థులు 'పై' చదువుకోసం ఈ మెట్లను ఆశ్రయిస్తున్నారు. అమ్మా – నాన్నలు, అత్తా–మామలు డెలివరీ బాయిస్‌గా అప్లికేషన్లు సమర్పించుకుంటున్నారు. అప్లికేషన్ సమర్పించే సమయంలోనే బాడీ లాంగ్వేజ్ మారిపోతున్నది. ఇప్పుడు వీసా వస్తుందో రాదో అన్న ఆందోళన తగ్గింది. అందరికీ స్టిక్కర్లు వేస్తున్నారు. ఈ మెట్లు రెండువైపులా వేలాడపడి చిన్న కోలా సీసాలు, అప్పుడప్పుడు శాండ్‌విచ్ తింటుంటారు –*

సీసాలు, టిష్యూలు – సాయంత్రానికి బాగా చెల్లాచెదురుగా పడి వుంటున్నాయి. ఈ తంతు మొదలు కాక మునుపు చాలా శుభ్రంగా వుండే ఈ మెట్లు స్వచ్ఛభారత్‌కు ఆహ్వానం పలుకుతూ షేక్‌స్పియర్ ఈవెనింగ్ ఫేస్ లా మారిపోతున్నాయి. నా తిరుగు ప్రయాణంలో ఫ్లాట్‌ఫాం మెట్లు – అప్పర్ కాంకోర్స్ – ఎస్కలేటర్ – లోవర్ కాంకోర్స్ – వీసా అప్లికేషన్ సెంటర్ – నిర్జనంగా మారిపోయి వుంటాయి. ఎప్పుడైనా నేను ఓ గంట ముందుగా వచ్చినపుడు అదీ నిన్ననే, స్కైవాక్ చేరేముందు మెట్రో భారీ పిల్లర్ దగ్గర ఇద్దరు అబ్బాయిలు – ఇద్దరు అమ్మాయిలు తారసపడ్డారు. వాళ్లను తప్పుకుని కుడి పక్కగా పిల్లర్ దాటుతున్నపుడు ఒక అమ్మాయి భోరున ఏడుస్తోంది. ఇద్దరు అబ్బాయిలు ఓదార్చటానికి ప్రయత్నిస్తున్నారు. రెండో అమ్మాయి కాస్త దూరంగా ఉండి చూస్తోంది. నేను కాస్త నెమ్మదిగా వాళ్ళను చూస్తూ నడుస్తున్నా. బహుశా వీసా రిజక్ట్ అయి వుంటుంది. విడిగా వున్న అమ్మాయి వంక చూశాను. ఏమిటి విషయం అన్నట్లు – ఆమె V అక్షరం గాలిలో వేసి X కొట్టింది. కొంపలు మునిగిపోయినట్లు ఏడుస్తోంది. అయ్యోపాపం అందామా? మన మంచికే అందామా? స్కైవాక్ మీద నుంచి కిందకు చూశాను. ఓ పక్క టెయిల్ లాంప్‌లతో రోడ్డంతా ఎర్రగా మండిపోతోంది. మరోపక్క హెడ్‌లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. బి2కి చేరి కారు తీసి – ఈ 'ప్రధాన స్రవంతిలో' జేరిపోయాను!



నిన్న ప్రొద్దున 9.30 హైటెక్స్ మెట్రో, కాంకోర్స్ ఎస్కలేటర్ వైపు నడుస్తున్నా. ఓ పాతికేళ్ల కుర్రాడు ఆధార్ – మరో కాగితం పట్టుకుని నా దారిలోకి వస్తే I-20 నా అన్నాను కాదు వర్క్ వీసా, పాస్‌పోర్ట్ కలెక్షన్‌కి వచ్చా అన్నాడు. అంతలో ఎవరో 'అశ్వినిసార్' అని కేక వేశారు. అప్పటికే ఎస్కలేటర్ మీద వున్నా – వెనుదిరిగి చూసాను. నాకోసం ఎవ్వరూ లేరు – కాని సెక్యూరిటీ పెద్దమనిషి "పాస్‌పోర్ట్ కలెక్షన్ విండో వోపెన్ చెయ్యండి" అని అరుస్తున్నాడు – అదీ విషయం. పరిచయం చేసుకుంటే పనికివస్తాడు!

మరో విషయం బెజవాడ నుంచి పల్లవి వచ్చింది. అమ్మాయి 1-20 స్లాట్ – కాన్సులేట్‌లో వీసా ఇంటర్‌వ్యూ అని చెప్పింది. మళ్లీ సాయంత్రానికి ఫోన్ చేసి చాలా సంతోషంగా అమ్మాయికి వీసా వచ్చింది. రేపు డిన్నర్‌పార్టీ తప్పక రమ్మంది! ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు – మెట్రో మెట్ల అతిథులు ఎక్కడకు, దేశం వదిలి పారిపోతున్నారు? నిజంగా ఉన్నత విద్యలకా – బానిస బ్రతుకులకా? ఒక జీతం చాలక రెండో జీతం కోసం 'పనికి' వచ్చే పెళ్లి చేసుకుని అక్కడే ఉండిపోవటానికా? ఎందుకు వాళ్లందరూ – పుట్టిన గడ్డను వదిలిపోవాలని ఆరాటపడుతున్నారు? క్వాలిటీ లైఫ్ అంటాడు ఒకడు – తలిదండ్రులు మావాడు అమెరికా అంటారు (మెట్రో రైల్లో 'అమెరికా, అమెరికా' అని కేకలు పెడుతూ ఒక ప్రకటన వస్తుంది) ఆడపిల్లలు – మెడికల్ అయితే చాలా డిమాండ్, ఇంజనీరింగ్ అయితే బాగా 'ఛాయిస్' – అందరూ ఎగిరిపోవటానికి ఎక్కవలసిన మెట్లన్నీ – చివరిగా మెట్రో మెట్లతో సహా – ఎక్కి 'బంగారు' లోకానికి సోపానాలు వేసుకుంటున్నారు. ఇప్పుడు, కోటి కోరికలతో గూడు వదిలి వెళ్లిపోతున్న గువ్వలు ఎన్నడైనా గూటికి చేరేనా?

కొసమెరుపు : నేనీవారంలో బి1 బి2 వీసా కొనసాగింపుకి స్లాట్ తీసుకోవాలి. డ్రాప్ బాక్స్‌లో వీసా అప్లికేషన్‌తో పాస్‌పోర్ట్ పడవేయాలి! రావాలంటే, వెళ్లాలి కదా!?

# సాహిత్య విమర్శ
# రవ్వా శ్రీహరి

– వంగరి త్రివేణి

"పొరలను విదిలించి నిక్షిప్త దాతువులను ఎత్తి చూసినప్పుడే మౌలిక సత్యం ఆవిష్కృతమవుతుంది." అంటూనే "ఆచార్య రవ్వా శ్రీహరి గారు 'లోనారసి' మేలెంతో తాలెంతో విశ్లేషించి చూపే వివేచన శీలురు. ప్రాచీన సంస్కృతాంధ్ర కృతులను సమీక్షించినా, వర్తమాన భాషా కవిత్వ రీతులను తరచి చూసినా శ్రీహరి గారి వ్యాసాల్లో ఏదో ఒక నూత్న దృక్కోణమూ, ఎన్నో కొన్ని విలక్షణాంశాలు ప్రతిఫలిస్తాయి." (ఉభయ భారతి పుట.(V) ఉభయ భారతి వ్యాస సంపుటికి ఆచార్య సి. నారాయణ రెడ్డి రాసిన అంతశ్శోధనంలోని వాక్యాలివి. ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి తదితరులు శ్రీహరి గారు భాషా సాహిత్యాల మీద, పాఠబేధాలు – పరిష్కరణల మీద, సంస్కృత ప్రాకృత సాహిత్యాల మీద, మాండలిక భాషా ప్రయోగాల మీద చేసిన సేవను కొనియాడారు. వివిధ విశ్వవిద్యాలయాలు, సాహిత్య సంస్థలు, అకాడమీలలో పరిశోధనలు కూడా జరిగాయి. మహామహోపాధ్యాయ, ప్రతిభా పురస్కారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సంస్కృతాంధ్ర భాషల్లో పండితులు, అపార జ్ఞాన సంపన్నులు, లాక్షణికులు, సద్విమర్శకులు, నిఘంటు నిర్మాణ కర్త, పాఠ భేద పరిష్కర్త, వ్యాకరణ భాషాశాస్త్ర వేత్త, అనువాదకులు, మాండలిక భాషా ప్రయోగ కర్త, పాఠ్యపుస్తకాల నిర్మాణ కర్త, గొప్ప సాహితీవేత్త, ఉత్తమ అధ్యాపకులు అయిన ఆచార్య రవ్వా శ్రీహరి గారికి భాషా సాహిత్యాల మీద సునిశితమైన విమర్శనాత్మక దృక్పథం ఉంది. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

పాఠబేధాలు పరిష్కరణలు: తాళ పత్ర పాఠానికి , ముద్రిత పాఠానికి అనేకమైన పాఠబేధాలు ఉన్నాయని ఆచార్య రవ్వా శ్రీహరి గారు తన పరిశోధనా కాలానికే గుర్తించారు. అప్పటికే చాగంటి శేషయ్య తన కవితరంగిణిలో చెప్పిన తాళ పత్రాలలో కంటే ముద్రిత పత్రాలలో పాఠాంతర పద్యాలు అధికంగా ఉన్నాయనే విషయాన్ని గ్రహించారు. విస్తృత అధ్యయనం తర్వాత శ్రీహరి గారు అరణ్యకాండలో పద్యాలకు పద్యాలే పాఠాంతరాలు ఉన్నాయని తెలుసు కున్నారు. వాటిలో ప్రధానమైనవి "భాస్కర రామాయణంలో పాఠభేదాలు" అనే వ్యాసంలో సూచించారు. అందులో భాగంగానే అరణ్య కాండంలో ఒకటవ ఆశ్వాసంలో 66 పాఠాంతరాలు, రెండవ ఆశ్వాసంలో 92 పాఠాంతరాలు గుర్తించారు. ఆనందాశ్రమం వారు ముద్రించిన భాస్కర రామాయణానికి పీఠిక రాసిన తేవప్పెరు మాళయ్య ప్రధాన పాఠ పద్యాలను గూర్చి తెలుపుతూ "అరణ్య కాండమున వ్రాతప్రతులు చూపట్టు పాఠము మిక్కిలియు సంగ్రహముగా నుండవచ్చు. ప్రతులందలి పాఠమదేమి కారణమో అంతకంటే చాల నధికముగాను బెక్కుచోట్ల మిక్కిలియు భిన్నముగాను చూపట్టుచున్నది. కొన్ని చోట్ల వ్రాతప్రతుల యొక్క పద్యమునకు అచ్చుప్రతులంగానిపించు నధిక పద్యములుగాని, భిన్న పద్యములుగాని మాకు దొరికినన్ని వ్రాతప్రతులందును, ప్రాచ్యలిఖితపుస్తక భండారమందలి ప్రతులందును గానిపింపవు. ఈ గ్రంథమును తొలుత ముద్రణము గావించిన కరాలపాటి రంగయ్యగారు మంచి కవి యగుటచే సంగృహీతములుగాను, గ్రంథపాతములు గాను నున్న యెడల సొంత కవనముచే బెంచియు బూరించియు నుండునేమో యని సందేహము గలుగుచున్నది." (ఉభయ భారతి పుట. 3) అని శ్రీహరి గారు వివేచించారు.

దీని ద్వారా ముద్రణా ప్రతుల్లోని వివరణాత్మక పద్యాలన్ని కరాలపాటి రంగయ్యార్యులు రచించారని తేవప్పెరు మాళయ్య సందేహించిన విషయం తెలుస్తుంది. కాని ఇవన్నీ కరాలపాటి రంగయ్యార్యులు ప్రక్షిప్తం చేసిన పద్యాలు కావని శ్రీహరి తెలిపారు. ఎందుకంటే ఈ పద్యాలున్న ప్రాచీన తాళప్రతులు రెండు ఆంధ్ర సారస్వత పరిషత్తు కాకినాడ గ్రంథాలయంలో ఉన్నాయని అన్నారు. (నెం. 100/14, నెం. 182/14) ఈ రెండు ప్రతులు ఒక్క తీరుగా లేవనే అభిప్రాయాన్ని కూడా వెలిబుచ్చారు. తాళ ప్రతుల్లో కానరాని అనేక పద్యాలు ముద్రణా ప్రతుల్లో ఆయా ఘట్టాలలో అధికంగా కనిపిస్తున్నాయని అన్నారు.

శ్రీరాముడు శరభంగ, సుతీక్ష్ణులను దర్శించడం ముద్రణ ప్రతులలో 23 గద్యపద్యాలలో వర్ణింపబడితే, ఈ రెండు ప్రతుల్లో సుమారు 50 గద్య పద్యాలలో వర్ణితమైందని దృష్టాంతాలతో సహా విశ్లేషించారు. అగస్త్యుడు శ్రీరామునికి దివ్యాయుధాలను ప్రసాదించే ఘట్టం మొదలుకొని ఖరుడు శ్రీరామునిపై కదిలి వచ్చే ఘట్టం వరకు గల విషయ మంతా ముద్రణ ప్రతుల్లో సుమారు 100 పద్యాలలో కనిపిస్తాయని తెలిపారు. వర్ణనా ప్రీతి చేత ఆయా సందర్భాలలో అనంతర కవులు తమ పద్యాలను ప్రక్షిప్తం చేసి ఉండవచ్చని శ్రీహరి గారు తన ఊహగా తలపోశారు. ఆయన ఊహను బలపరిచే ఒక తాళ ప్రతి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉందని అన్నారు. అయోధ్యా అరణ్య కాండములలో ముద్రణా ప్రతిలో నాలుగు రెట్లు అధికంగా ప్రక్షిప్తాలు ఉండడానికి కారణం మామిడివల్లి వేంకటార్యుడని శ్రీహరి అభిప్రాయ పడ్డారు. అదే విధంగా ప్రాచీన కావ్యాలైన భాస్కర రామాయణం, ఉత్తర హరివంశం, కుమార సంభవం వంటి తదితర కావ్యాల్లో పాఠ పరిష్కరణలను గూర్చి శ్రీహరి గారు "ప్రాచీన కావ్యాలు పాఠ పరిష్కరణలు" అనే వ్యాసంలో విశేషంగా తెలియజేశారు. పరిష్కరణంలో పాఠ నిర్ణయమే ప్రధానమనీ తెలుపుతూ పాఠ నిర్ణయంలో పరిష్కర్తకు ఈ క్రింది అంశాలు తోడ్పడుతాయని అన్నారు.

పద్యపాదాలను యథాతథంగా మరో కావ్యంలో వాడుకున్న రచనలు (Paradies). ప్రాచీన వ్యాఖ్యానాలు ఉదాహరించిన గ్రంథ భాగాలు. అనువాదాలు – లభ్యమౌతున్న అతి ప్రాచీనమైన ప్రతికి ముందుకాలంలో వచ్చిన అనువాదాలు మూల గ్రంథ నిర్ణయానికి ఎంతగానో తోడ్పడతాయి. సంస్కృతంలోని మహాయాన గ్రంథాల స్వరూప నిర్ణయంలో టిబెట్, చైనీస్ భాషల్లోని అనువాదాలు ఉపయోగపడ్డాయి. అలాగే తెలుగు మహాభారతం సంస్కృత భారతానికి లభ్యమవుతున్న అతిప్రాచీన ప్రతికి పూర్వం వచ్చిన అనువాదం కనుక దాని ఆధారంగా మూల సంస్కృత భారత ప్రతి స్వరూపాన్ని నిర్ణయించడానికి వీలైంది. తరువాతి సాహిత్యంలో కనిపించే మూల గ్రంథంలోని భాగాల ఉదాహరణలు – ముఖ్యంగా ఛందోవ్యాకరణాలంకార శాస్త్ర గ్రంథాల ఉదాహరణలు. సంకలన గ్రంథాల్లో ఉదాహరింపబడ్డ పద్యాలు (హరివంశం ఉత్తర భాగం 1-90)

వ్యాకరణ విశేషాలు : ప్రఖ్యాత సంస్కృత వ్యాకరణ వేత్త పాణిని రచించిన పాణినీయం భారతీయ భాషా పండితులకే గాక, పాశ్చాత్య భాషా పండితులకు సైతం తలమానికంగా నిలిచింది. సంస్కృత భాషకు అనేక వ్యాకరణాలు ఉన్నప్పటికి పాణినీయ వ్యాకరణమే అత్యంత ప్రసిద్ధం. పాణినీయానికి అష్టాధ్యాయి, అష్టకం, శబ్దాను శాసనం, వృత్తి సూత్రం అనే పేర్లు ఉన్నా "అష్టాధ్యాయి"గా ప్రచారంలో ఉంది. వ్యాకరణ శాస్త్రాల మీద శ్రీహరి గారి విమర్శా నేర్పు అమూల్యమైంది. అల్పాక్షరాలతో శాస్త్రీయంగా, సంక్షిప్తంగా మనోహరమైన లాఘవాన్ని పాణినీయంలో సాధింపబడిన సందర్భాలను "పాణినీయంలో లాఘవం" అనే వ్యాసంలో తెలియ జేశారు. దీనికి అనుబంధంగా పతంజలి భాష్యంలో వర్ణించిన పాణినీయ సూత్ర రచన శాస్త్రీయమైన పద్ధతిలో సాగడం, ఒక్క అనర్థకమైన వర్ణం కూడా ఉండకపోవడం వంటి విషయాలను ప్రస్తావించారు. ఈ వివరణ నేపథ్యం లోనే పాణినీయ వ్యాకరణ శాస్త్రమంతటా లాఘవాన్ని ఎలా సాధించారో నిరుపించారు. సంజ్ఞా సూత్రాలు, పరిభాషా సూత్రాలు, అధికార సూత్రాలు, అనువృత్తి, ప్రత్యాహారాలు, గుణపాఠము, ధాతు పాఠము, ఉదిత్తులు వంటివి విశ్లేషించారు. మహేశ్వర సూత్రాలలోనే లాఘవాన్ని ఎలా సాధించాడో ఉదాహరణగా తెలియజేశారు. అఇఉణ్, ఋ?క్, ఏఓఙ్, ఐఔచ్, హయవరట్, లణ్, ఇమఙణనం, ఝభఞ, ఘఢధష్, జబగడదశ్, ఖఫఛఠథచటతవ, కపయ్, శషసర్, హల్ వంటి సూత్రాలలో గల లాఘవాన్ని అద్భుతంగా వర్ణించారు శ్రీహరి గారు. ప్రత్యాహార పద్ధతి వల్ల మహేశ్వర సూత్రాల్లో 300 వరకు ప్రత్యాహారాలు ఏర్పడడానికి అవకాశమున్నా పాణిని వాడుకున్న ప్రత్యాహారాలు 44 మాత్రమే అని, సంక్షిప్త సుందరానికి ఇది ఒక నేర్పు అని పేర్కొన్నారు. ఒక వ్యాసంలో "మాధవీయ ధాతువృత్తి" విశిష్టతను రవ్వా శ్రీహరి వర్ణిస్తూ "సర్వం ధతుజ మహా శకటస్వచ తోకమ్" అనే వ్యాకరణాభిజ్ఞుల ఉక్తిని పేర్కొన్నారు. ఈ శ్లోక నిర్వచనం ప్రకారం శబ్దార్థ నిర్ణయంలో సంస్కృతంలో ధాతువులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. గణ పాఠం, ధాతు పాఠం, లింగానుశాసనం, శిక్షా వంటివి పాణినీయానికి అనుబంధ గ్రంథాలు.

*"అష్టకం గణపాఠశ్చ, ధాతు పాఠస్త థైవచ*
*లింగానుశాసనం శిక్షా పాణినీయమమి క్రమాత్"*

ఈ సందర్భంలోనే శ్రీహరి గారు యజ్ఞ నారాయణు డనే నక్షత్రనామం గల సాయణుడు మాధవుని ప్రేరణ వల్ల సాయణుడు ధాతువృత్తిని రచించారనే విషయాన్ని తెలిపారు. అందువల్ల దీనికి మాధవీయ ధాతువృత్తిగా నామకరణం చేసి ఉంటాడని అభిప్రాయ పడ్డాడు. పాణినీయ ధాతుపాఠంలో తెలుపబడిన 1944 ధాతువులు మాధవీయ ధాతువృత్తిలో వ్యాఖ్యానించబడ్డాయని శ్రీహరి గారు తెలిపారు. ఈ ధాతు వృత్తిలో గల క్రియా రూపభేదాలు, శత్రాద్యంత రూపాలు, ధాతువుల కృదంత రూపాలు, ఉణాది రూపాల విశ్లేషణలు చేశారు. ధాతురూపాల ప్రయోగంలో కనిపించే కారక విశేషాలను కూడా వివరించారు.

అనుకరణ వాచకాల గూర్చి శ్రీహరి గారు ప్రత్యేకంగా ''తెలుగులో అనుకరణ వాచకాలు'' అనే వ్యాసంలో వివరించారు. ఆంధ్ర శబ్ద చింతామణి, వైకృత చంద్రిక, బాల వ్యాకరణం వంటి వ్యాకరణ గ్రంథాలలో అనుకరణ పదాలకు సంబంధించిన సంధి విశేషాలు ఉన్నాయని అన్నారు. ధ్వనిని అనుకరించేవి అయినా, ధ్వని తరంగాలు (కాంతి, వేగం, బాధ మొ.) లను అనుకరించేది అయినా వాటన్నింటిని ధ్వన్యనుకరణ పదాలుగానే ప్రౌఢ వ్యాకర్త వ్యవహరించారని పేర్కొన్నారు. ఉదా: ధ్వన్యనుకరణ - కిలకిల, కాంత్యనుకరణ - తళతళ, వాసనానుకరణ - గమగమ, బాధానుకరణ - కలుక్కు, వేగానుకరణ - చకచక, దాహానుకరణ - భగభగ, ఆకస్మికతానుకరణ - దిగ్గున. అనుకరణ పదాలకు సంబంధించి వ్యాకరణ విశేషాలు శ్రీహరి గారు తెలిపారు. ''అను'' ధాతువు పరమైనప్పుడు ముగాగమంగా, ద్విరుక్తంగాబీ ''ఆలు'' శబ్దం పరమైనప్పుడు నవర్ణాగమంగా వచ్చే సూత్ర రూపాలను విశ్లేషించారు. అనుకరణ పదాలను కొన్నింటిని వ్యస్తంగానే కాకుండా సంస్కృత కృదంత రూపాలుగా మార్చి తెలుగు కవులు తమ కావ్యాల్లో వాడుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీహరి గారు కావ్య ప్రయోగాలను అనేకం తెలియజేశారు. అందులో కొన్ని...

*ధగధగాయమానంబులు (భాగవతం 1-174)*
*సిమసిమచ్ఛబ్దంబుతో (మనుచరిత్ర 11-22)*
*ఝుళంఝుళత్కటక సూచిత (మనుచరిత్ర 11-26)*
*ఘుమఘుమాయితములై (భాస్కర రామాయణం 1491)*
*చిమచిమాయిత చటచ్చటారావంబుల (హరివంశం* ఉత్తర భాగం 1-90)

అనుకరణ పదాల యొక్క వ్యాకరణ విశేషాలు తెలుపుతూ భావార్థక తద్ధితాంతాలుగా తెలుగులో కనిపిస్తాయని అనేక ఉదాహరణల ద్వారా శ్రీహరి గారు తెలియజేశారు. ప్రౌఢ వ్యాకర్త బహుజనపల్లి సీతారామాచార్యులు సమాస పరిచ్ఛేదంలో వచ్చే ప్రకృతి విభక్తిలోని మార్పులను సాదృశ్య వాచకాలుగా పేర్కొన్నారు. వాటి ప్రయోగ విశేషాలను గూర్చి రవ్వా శ్రీహరి గారు "తెలుగులో సాదృశ్య వాచకాలు బి ప్రయోగ విశేషాలు" అనే వ్యాసంలో వివరించారు. "అట్లు, పోలె, బలె, వలె" వంటి ఇవార్థకాలన్ని సాదృశ్య వాచకాలేనని అన్నారు. ప్రౌఢ వ్యాకర్త తెలిపిన "అట్లు కరణ్యాదులకు గ్రాహకంబు" సూత్రం ప్రకారం "అట్లు, పోలె, బలె, వలె" అవ్యయాలు కాగాబీ ''విధము, ఓజ, భంగి'' నామవాచకాలుగా పేర్కొన్నారు. భాషా భాగాలలోని ఈ ప్రత్యేకమైన అంశాన్ని శ్రీహరి గారు ప్రయోగాత్మకంగా విశ్లేషించి చెప్పారు. ఇవార్థకమైన సాదృశ్యార్థాన్ని "అట్లు" మొదలైన అవ్యయాల ద్వారానే కాకుండా "విధము, ఓజ, భంగి" మొదలగు నామవాచకాల ద్వారా కూడా ప్రయోగింప బడుతాయని అన్నారు. "రాముని వలె, రాముని భంగి" వంటి అనేక ఉదాహరణలు తెలిపారు. ఒక్క "విధము" అనే ఆరోపం మీదనే 152 పదాలు ఉన్నాయని, ఆచార్య జి. ఎన్. రెడ్డి తెలుగు పర్యాయ పద నిఘంటువు ఆధారంగా శ్రీహరి తెలియజేశారు. ప్రౌఢ వ్యాకరణంలో "ఉపమేయము ప్రథమాంత మగునపుడు ''అట్లు'' పరంబగుచో ఉపమానంబులగు నామ తదస్మద్యుష్మదాత్మార్థములకు షష్ఠి యగు'' అనే సూత్రం అనుసరించి అనేక కావ్య ప్రయోగాలను పేర్కొన్నారు. కావ్యాలలో గల సాదృశ్య వాచకాలను పరిశీలించినప్పుడే ఇవార్థకాల ప్రయోగాలు తెలుస్తాయని అన్నారు. అందులో రెండు ఉదాహరణలు స్వీకరిద్దాం: - అట్లం పోలె బాలునట్లు పోలె (మహాభారతం ద్రోణ పర్వం 3 - 274) - ఏను బోలె నెక్కటి యీ సర్వంసహా చక్రంబును భరియింపం గల యదియే (కాశీ ఖండం 1-100)

భాషా ప్రయోగాలు: తెలంగాణ భాషలో అసమాపక క్రియలకు ఒక ప్రత్యేకత ఉంది. నేడు భాషగా వ్యవహరిస్తున్న నాడు శ్రీహరి గారు మాండలికంగానే అభిప్రాయపడ్డారు. క్త్వార్థకాలు, తుమున్నార్థకాలు, ఆనంత్యార్థకాలు, శత్రర్థకాలు, చేదర్థకాలు, సతిసప్తమ్యర్థకాలు వంటి అసమాపక క్రియలకు ధాతువులు చేరినప్పుడు మార్పులు

ఏర్పడుతున్నాయి. వాటన్నింటిని శ్రీహరి గారు అనేక ప్రయోగాలతో "తెలంగాణ మాండలికంలో అసమాపక క్రియా రూపాలు" అనే వ్యాసంలో ఉదాహరించారు. అయితే క్త్వార్థక క్రియలకు అనుబంధంగా చేరిన "కొను" ధాతువు తెలంగాణ వాడుక రూపంలో ఎటువంటి భేదం కనిపిస్తుందో గమనిస్తే : "కొను" ధాతువులోని ఒకారం వికల్పంగా దీర్ఘంగా మారడం: కోస్తా: చదువుకొని, తీసుకొని. తెలంగాణ : చదువుకోని, తీసుకోని. (ఉభయ భారతి పుట. 31) క్త్వార్థక క్రియలకు పోవు, వచ్చు క్రియా రూపాలు అనుబంధంగా ఉన్నప్పుడు తెలంగాణ మాండలికంలో "కొను" ధాతువు "క"గా మారుతుంది. కోస్తా వాడుకలో "కు"గా మారడం. కోస్తా: పట్టుకు పో, తీసుకు పో తెలంగాణ: పట్టుక పో, తీసుక పో (ఉభయ భారతి పుట. 31) తెలంగాణ భాషలో సమాపక క్రియా రూపాల మీద కూడా శ్రీహరి గారు అధ్యయనం చేసి "తెలంగాణ మాండలికంలో సమాపక క్రియా రూపాలు" అనే వ్యాసం రచించారు. వర్తమానార్థకాలు, అమహదర్థకాలు, భూతార్థకాలు, సంభావనార్థకాలు, భవిష్యదర్థకాలు, విధ్యర్థకాలు, ఆజ్ఞాద్యర్థకాలు, వ్యతిరేకార్థకాలు వంటి క్రియారూపాలను, వాటి ప్రయోగ రీతులను వివరించారు. జీవద్భాషకు పలుకుబడులు భూషణాలు. తెలంగాణలోని పలుకుబడుల ప్రయోగాల గూర్చి రవ్వా శ్రీహరి గారు విశేషంగా "తెలంగాణలోని పలుకుబళ్ళు" అనే వ్యాసంలో అధ్యయనం చేశారు. గ్రామీణుల పలుకుబడుల్లో అనేక గ్రాంథిక రూపాలు సజీవంగా నిలిచి ఉన్నాయి. వాటిలో స్వల్పమైన రూపభేదాలతో జన వ్యవహారంలో ఉన్న పలుకుబడులను గూర్చి విశ్లేషంచారు.

అంగలార్చు, అరుసు(ర్సు) కొను, ౘ్ర, ఊసులు, ఎంచు, ఎనుగు, ఎసల, ఎరుక, ఏట, ఏరాలు, కౘ్రె, కాడ – కాడికి, కోలె(ఎన్), కొంచబోవు, గదువ(మ), జాలారి(రు), జీ(జి)విలి, తలికి, తాన, దివిలి(దీవి), దూప, నెరి – నెరియ, పారి, బొక్క, తొక్కు, తోడెం, మొల వంటి పదాలకు శ్రీహరి గారు ప్రాచీనాంధ్ర భాషా ప్రయోగాలను విశ్లేషించి చూపారు. ఈ పలుకుబళ్లకు దాదాపు 20 వరకు ప్రాచీన కావ్యాలలోని దృష్టాంతాలను చూపి, వాటి స్వరూప స్వభావాలను పేర్కొన్నారు. శ్రీహరి గారు ప్రత్యేకంగా "సింహాసన ద్వాత్రింశతి – భాషా ప్రయోగాలు" అనే వ్యాసం వ్రాసి, వాటి విశేషాలను పేర్కొన్నారు. ఈ కావ్యంలో కొరవి గోపరాజు ప్రయోగించిన ధ్వనులు, విభక్తి ప్రత్యయాలు, ఔపవిభక్తికాలు, సంధులు, తత్సమాలు, దేశ్య పదాలు, మాండలికాలు, అన్యదేశ్యాలు, తద్ధితాంశాలు, వ్యావహారిక ప్రయోగాలు, సామెతలు, జాతీయాలు వంటివి ఎలా సాధించారో, ఎలాంటి ప్రయోగ నేర్పును ప్రదర్శించారో తెలిపారు. అదే విధంగా విశ్వనాథ సత్యనారాయణ విరచిత రామాయణ కల్పవృక్షంలోని భాషా నైపుణ్యాన్ని గూర్చి "రామాయణ కల్పవృక్షం – భాషా ప్రయోగాలు" అనే వ్యాసంలో శ్రీహరి గారు చర్చించారు. ముఖ్యంగా వ్యవహారిక భాషా ప్రయోగాలు, తెలుగు పలుకుబళ్లు, జాతీయాలు, ఉక్తి వక్రత, తద్ధిత రూపాల వంటి ప్రయోగాలను కూలంకషంగా వివరించారు. అందులో ఒక ప్రయోగాన్ని చూద్దాం:

"బ్రతుకగ దప్పని యప్పుడు
బ్రతుకుట లోపలను చచ్చు బ్రతుకేలా"

ఆధునిక కవిత్వం అనేక అస్తిత్వ ఉద్యమాల ధోరణులతో, భావజాల సిద్ధాంతాలతో నూతన పంథాను అవలంబించింది. భాష పరంగా కూడా అనేక మార్పులకు లోను అయింది. శ్రీహరి గారు తన సమకాలీన కవుల కవిత్వంలో భాషా ప్రయోగాలు ఏ విధంగా ఉన్నాయో "ఇటీవలి కవిత్వం భాషా ప్రయోగ విశేషాలు" అనే వ్యాసంలో చర్చించారు. సి. నారాయణ రెడ్డి, శేషేంద్ర, శివారెడ్డి, పాపినేని, జయప్రభ, కొండేపూడి నిర్మల, వేగుంట మోహన్ ప్రసాద్, నిఖిలేశ్వర్, గోపి, ఎండ్లూరి సుధాకర్, సిధారెడ్డి, యాకూబ్ ఇస్మాయిల్ వంటి తదితరుల కవితా విశేషాంశాలను ప్రత్యేకంగా పేర్కొన్నారు. కవులు తమ తమ కవితల్లో ప్రయోగించిన భావార్థకాలు, ఉక్తి వక్రత, నూత్న పదబంధాలు, సమాస కల్పన, కర్తృ వాచక పదంలో బహువచనానికి ఏకవచన క్రియా ప్రయోగాలను విశ్లేషించారు. ఉదా: "న్నిర్ఘుంగా, చౌరస్తాయిజం" వంటి కవితా శీర్షికల్లో కనిపించే భాషా ప్రయోగాలలో ఎటువంటి ప్రభావాలు చోటుచేసుకున్నాయో సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం మనం వాడుతున్న తెలుగు భాషలో అప ప్రయోగాలు ఎలా ఉన్నాయో "నేటి వాడుక తెలంగాణలో అపప్రయోగాలు" అనే వ్యాసంలో శ్రీహరి గారు వివరించారు. ప్రచార ప్రసార సాధనాలలో, పరిపాలనా వ్యవహారాల్లో, కళాశాల స్థాయి తెలుగు మాధ్యమంలో, విజ్ఞాన శాస్త్రం వంటి వివిధ రంగాల్లో భాషా వాడుక ఏ విధంగా విస్తరించిందో తెలియజేశారు. అదే స్థాయిలో అపప్రయోగాలు కూడా అనివార్యంగా చోటు చేసుకున్నా

యని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దానికి ఒక ఉదారణగా హైదరాబాద్ టంక్ బండ్ మీద నిలిపిన తెలుగు మహనీయుల ప్రాంగణానికి "తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త ప్రాంగణం" పేరు పెట్టిన విషయాన్ని చెబుతూ అందులో తెలుగు వెలుగులు తెలుగు సమాసం కాగాబీ మూర్తి నిక్షిప్త ప్రాంగణం సంస్కృత సమాసంగా పేర్కొన్నారు. ఇలా వ్యవహారంలో అనేక అపప్రయోగాలను శ్రీహరి గారు ఎత్తిచూపారు.

నిఘంటువుల విశ్లేషణ: శ్రీహరి గారు సంస్కృత నిఘంటువులలో గల వైవిధ్యమైన విశేషాంశాలను "సంస్కృత నిఘంటువులు వైవిధ్యం" అనే వ్యాసంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిఘంటువు యొక్క అర్థఉక్తిని వర్ణించారు. వ్యాకరణం, ఉపమానం, వివృతి, సిద్ధ పద సాన్నిధ్యం వంటివి శక్తిగ్రాహకాలుగా పేర్కొంటూ కోశానికి ప్రత్యేకంగా అనుశాసనం, అభిదానం, నిఘంటువు అనే వ్యవహార నామాలు ఉన్నాయని అన్నారు. "నిశ్చయేన వేద మంత్రార్థాన్ నిగమయంతి ఇతి నిగంతవ" అనే శ్లోకం బట్టి వేదమంత్రాల అర్థ జ్ఞానాన్ని కలిగించేవి నిగంతువులని అన్నారు. నిగంతు శబ్దమే నిఘంటువుగా శ్రీహరి గారు పేర్కొన్నారు. భాషా విశేషాంశాలను బట్టి సంస్కృత నిఘంటువులను పర్యాయ పద కోశాలు, అనేకార్థక పద కోశాలు, శాస్త్ర పద కోశాలు, ద్విరూప కోశాలు, ఏకాక్షర కోశాలు, క్రియా కోశాలుగా విభజించి అధ్యయనం చేశారు. నిఘంటువుల ఆవిర్భావ వికాసాలను గూర్చి సంక్షిప్తంగా తెలియజేసిన ఆయన కశ్యప ప్రజాపతి రచించిన వైదిక నిఘంటువు మొదటిదిగా తెలిపారు. యాస్కుని నిరుక్త రూపంలో వ్యాఖ్యానం ఉండగా, 17 మంది నిఘంటు కారులు అప్పటికే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 వ. శతాబ్దంలో భాస్కరాయ పండితుడు అనుష్టుప్ వృత్తంలో నిఘంటువు రచించారని, ఆధునిక కాలంలో విశ్వబంధు శాస్త్రి సంస్కృతంలో వైదిక శబ్దార్థ పారిజాతం, వేదార్థ శబ్ద కోశం వంటివి రాశారన్నారు.

తులనాత్మక పరిశీలన: తెలుగు సాహిత్యంలో పురాణేతిహాసమైన మహాభారతానికి ఎంత ప్రశస్తి ఉందో, అంతకు రెట్టింపు కీర్తిదాయత కావ్యేతిహాసమైన రామాయణానికి ఉంది. రవ్వా శ్రీహరి గారు "భాస్కర, రంగనాథ రామాయణములు తులనాత్మక పరిశీలన" అనే వ్యాసంలో భాస్కర రామాయణంలో రంగనాథ రామాయణ అనుకరణలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గౌతమ వ్యాసములలో తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అటువంటి అనేక అనుకరణలను ఆయన తన ఆంధ్ర సాహిత్య చరిత్రలో పేర్కొన్నారని అన్నారు. "భాస్కర రామాయణ కర్తలు ప్రధానములగు కథాంశములనే గాక భావములను, అలంకారములను పద బంధాలను యథాతథంగా రంగనాథ రామాయణం నుండి అనుకరించిరనుటకు అనేక దృష్టాంతాలు కలవు." (గౌతమ వ్యాసములు పుట. 126) పీఠికలో రంగనాథ రామాయణమే మొదటి రామాయణంగా పింగళి లక్ష్మీకాంతం పేర్కొన్నారని అన్నారు. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధకాండ పూర్వ ఉత్తర భాగాలలో భాస్కర – రంగనాథ రామాయణాలలో ప్రదర్శితమైన పద భావాంశాలు, కథాంశాలు, వైషమ్యాలను శ్రీహరి గారు విశ్లేషించారు.

పద భావాంశాలు: యజ్ఞదత్తుడనే ముని బాలుడు దశరథుని బాణము చేత మృతి చెందగా అతని తండ్రి కుమారుని గూర్చి విలపించే ఘట్టాన్ని శ్రీహరి గారు వర్ణించారు. దీర్ఘాయువువని నిన్ను దీవింతు గాని నిర్ఘాతవటు బాణనిహతి పల్కితినె (రంగనాథ రామాయణం పు. 110) దీర్ఘాయువనుట కర్థము నిర్ఘాత పటిష్ఠ బాణనిహతియె పుత్రా (భాస్కర రామాయణం 11-283)

కథాంశాలు: అరణ్య కాండంలో జంబు కుమారుడి వధ వృత్తాంతం భాస్కర రామాయణ అరణ్య కాండ కర్తృకం కాదని రవ్వా శ్రీహరి గారి అభిప్రాయం. మొట్టమొదటి సారిగా కరాలపాటి రంగయ్యార్యులు భాస్కర రామాయణ పరిష్కరించి ముద్రించే సందర్భంలో ఇది చేరి ఉండవచ్చునని అన్నారు. భాస్కర, రంగనాథ రామాయణాలు రెండింటిలో జంబు కుమారుడి వధ వృత్తాంతం ఉందని అన్నారు.

వైషమ్యం: యుద్ధ కాండంలో సేతు బంధు సమయంలో ఉడుత చూపిన భక్తి భావం, రావణ మరణానంతరం సులోచనా సహగమనం, లక్ష్మణ దేవర నవ్వు తదితర ఘట్టాలు భాస్కర రామాయణంలో లేవని శ్రీహరి గారు తెలియజేశారు. సంస్కృత కావ్యాలలోని అనుకరణలను తెలుగు కవులు తమ తమ కావ్యాల్లో ఏ రూపంగా స్వీకరించారో అత్యంత వివరణాత్మకంగా శ్రీహరి గారు "తెలుగు కవుల సంస్కృతానుకరణలు" అనే వ్యాసంలో తెలిపారు. "లోకంలో అనుకరణమనేది అతి సహజమైన విషయం" అంటూనే భారత భాగవత రామాయణాలు, పురాణాలు, కావ్యాలు మొదలగునవి సంస్కృత కృతులకు అనుకృతులే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా

రాజశేఖరుడు తన కావ్య మీమాంసలో చెప్పిన "కవులలో అనుకరణ అనివార్యం" అనే మాటను ప్రస్తావించారు. ముఖ్యంగా కవులు భావ సౌందర్యాన్ని, ఉక్తి చమత్కృతిని సంస్కృత శ్లోకాల ద్వారా సాధించారని అన్నారు. సంస్కృతంలో సుభాషితాలను యథాతథంగా స్వీకరించడం: తత్ర మిత్ర నవస్తవ్యం (సంస్కృత సుభాషితం), అప్పిచ్చు వాడు వైద్యుడు (సుమతీ శతకం), కార్యేషు దాసి కరణేషు మంత్రి (సంస్కృత శ్లోకం), పనులు సేయునెడల బానిస వలె, బుద్ధి గరపునెడ ప్రధాని కరణి (కుచేలోపాఖ్యానం), గురు శుశ్రూషయా విద్యా (సంస్కృత శ్లోకం) గురునకు సేవ జేయుట దగందగు విద్య (అనంతామాత్యుడు), సాహిత్య సంగీత కళా విహీన (భర్తృహరి నీతి శ్లోకం), సంగీతాంబు గవిత్వతత్త్వమును సౌజన్యంబు భావంబు (సింహాసన ద్వాత్రింశిక) శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేషు (భారతం–ఆది శ్లోకం), సిరియును వాణి గౌరియును జెన్నగ కన్యకు మేను వాకున్ (వీరభద్ర విజయం)

సంకలన విషయాలు: తెలుగు సాహిత్యంలో సంకలన గ్రంథాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇవి చారిత్రక, సామాజిక, సాంస్కృతిక విశేషాలను పేర్కొంటూ సమకాలీన జీవన స్థితిగతులను అద్దం పడుతాయి. రవ్వా శ్రీహరి గారు వేటూరి ప్రభాకర శాస్త్రి "ప్రబంధ రత్నావళి" మీద సమగ్రమైన సంకలన విశేషాలను తెలుపుతూ "సంకలన గ్రంథంగా ప్రబంధ రత్నావళి" అనే వ్యాసం రచించారు. ఈ సందర్భంగా ప్రాచీన, ఆధునిక సంకలన గ్రంథాలను తెలియజేశారు. మొట్టమొదటి సంకలన గ్రంథం 14 వ. శతాబ్దంలో మడికి సింగన రచించిన సకలనీతి సమ్మతం. అయితే పెదపాటి జగ్గకవి ప్రబంధ రత్నాకరం, అజ్ఞాత కర్తృకంగా ఉదాహరణ పద్యములు, కళావతి ప్రబంధ సార శిరోమణి, ప్రబంధ మణి భూషణం వంటివి ప్రాచీన సంకలన గ్రంథాలు కాగాబీ వేటూరి ప్రభాకర శాస్త్రి ప్రబంధ రత్నావళి, చాటుపద్య మణిమంజరి, దాసరి లక్ష్మణ స్వామి వర్ణన రత్నాకరం, కట్టమంచి సుబ్రహ్మణ్య రెడ్డి భారత సార ముక్తావళి, భాగవత సార ముక్తావళి, దీపాల పిచ్చయ్య శాస్త్రి చాటు పద్య రత్నాకరం వంటివి ఆధునిక సంకలన గ్రంథాలు.

పెదపాటి జగ్గకవి ప్రబంధ రత్నాకరం, అజ్ఞాత కర్తృకం ఉదాహరణ పద్యములను కలిపి సంకలన గ్రంథంగా ప్రబంధ రత్నావళిని వేటూరి ప్రభాకర శాస్త్రి రచించారు. ఈ రెండు సంకలన గ్రంథాలను ఆయన ఏ విధంగా సంకలనం చేశారో శ్రీహరి గారు వివరించారు. అందులోని విశేషాంశాలు ప్రత్యేకంగా తెలియజేశారు. 16 వ. శతాబ్దంలో రచించబడిన ప్రబంధ రత్నాకరం గూర్చి తెలుపుతూ తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రేరీలో ఉన్న నారాయణ స్తుతి, శంకర స్తుతి, త్రిపుర విజయం వంటి కావ్యాలే గాకబీ పూర్వ కవుల 78 కావ్యాలలోని అనేక పద్యాలను కూడా సంకలనం చేశారని అన్నారు. దీని ద్వారా ఎన్నో అజ్ఞాత కావ్యాలు, ఎంతో మంది అజ్ఞాత కవుల పరిచయం కలిగిందని అన్నారు. ఉదాహరణ పద్యములను గూర్చి తెలుపుతూ మహా భారతాది గ్రంథాల నుండే గాక లభ్యం కాని అనేక ప్రాచీన కావ్యాల నుంచి అనేక పద్యాలు సంకలనం అయ్యాయని పేర్కొన్నారు. పరిశోధకులు, సాహితీకారుల ప్రయోజనం మేరకు శ్రీహరి గారు సంకలన పద్యాలను విషయానుగుణమైన శీర్షికల్లో గాక కవినామ శీర్షికల్లోకి మార్చారు. కవులు, కావ్యాలు, పద్యాలు వంటి వివరాలను అందించారు. అదనంగా ప్రబంధ రత్నాకరం అవతారికను చేర్చారు. తద్వారా జగ్గకవి వ్యక్తిగత విషయాలు కూడా తెలుసుకొనే అవకాశం కలిగింది.

ప్రాకృతాంధ్ర భాషా సాహిత్యాలు: ప్రాచీన కాలంలో అష్ట భాషలు వ్యవహారంలో ఉండి, ఆయా భాషల్లో ప్రావీణ్యం చూపిన పండితులను, ప్రతిభా విశేషాలను "ప్రాకృతాంధ్ర భాషా సాహిత్యాలు" అనే వ్యాసంలో రవ్వా శ్రీహరి ప్రత్యేకంగా కొనియాడారు. సంస్కృతాంధ్రులు ఉభయ భాషలు కాగాబీ ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, చూళిక, అపభ్రంశలు షడ్విధ భాషలు. దీనికి దృష్టాంతంగా:

*సంస్కృత ప్రాకృతంబును శౌరసేని*
*జగతిపై మాగధియును బైశాచికయును*
*జూళికను నపభ్రంశంబు సొరిదినాంధ్ర*
*భాషయును విని చనునష్ట బాషలనగ (మహాభారతం:1-77)*

"ప్రాకృతభాషా పాండిత్యమూ, కవితా వైదగ్ధ్యమూ సంపాదించినవాళ్ళు తెలుగు కవుల్లో ఎంతోమంది ఉన్నారు. వీరిలో భారత రచనలో నన్నయభట్టుకు బాసటగా నిలిచిన నారాయణభట్టు. ఆయన రచించిన గ్రంథమొక్కటీ మనకు లభించకపోయినా సంస్కృతాంధ్ర కన్నడాలతోపాటు ప్రాకృత పైశాచిక భాషల్లోను 'కవి రాజశేఖరుడనే' విషయం నన్నయ రచియితమైన నందంపూడి శాసనం (క్రీ. శ. 1063) లోని 'యః సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచి కాంధ్రభాషాసు, కవి రాజశేఖర

ఇతి ప్రథితః సుకవిత్వ విభవేన' (25 శ్లో) అనే శ్లోకంవల్ల తెలుస్తుంది." (ఉభయ భారతి పుట. 57) అని శ్రీహరి గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నృసింహ పురాణంలో ఎర్రన "భాసుర భారతార్థ బహు భంగుల నిక్క మెరుంగ నేరమిన్, గాసట బీసటే చదివి గాథలు త్రవ్వ తెలుంగు వారికిన్" అనే ఈ పద్యంలో గాసట అంటే గాథా సప్తశతి, బీసట అంటే బేతాళ పంచవింశతి అని నిడదవోలు వెంకటరావు చెప్పిన అర్థాన్ని, వేటూరి శివరామ కృష్ణ చెప్పిన వ్యుత్పత్తిని శ్రీహరి గారు వివరించారు. ఇవి రెండు ప్రాకృత కావ్యాలు కాగా భారత రచన కంటే పూర్వం ప్రాకృత కావ్యాలు ఆరాధించారనే విషయం తేటతెల్ల మవుతుంది. ప్రాచీన కాలంలో నారాయణ భట్టు, నాచన సోమన, శ్రీనాథుడు, దోనూరి కోనేరు కవి, దుగ్గన, ధరణి దేవుల రామమంత్రి, కొరవి గోపరాజు, గణపవరపు వేంకట కవి, రంగాజమ్మ, మల్లికార్జున భట్టు, మందేళ్ల వాసుదేవ కవి, నివర్తి శేష సుమతి, ఎలకూచి బాల సరస్వతి తదితరుల ప్రాకృత భాషా పాండిత్యాన్ని, కావ్య రచనా సౌందర్యాన్ని గూర్చి శ్రీహరి గారు విపులంగా పేర్కొన్నారు. వారి వారి కావ్యావతారికల్లో, కవితా విశేషాంశాల్లో, రచనా రీతుల్లో, బిరుద నామాల్లో, షష్ఠ్యంత్యాలలో, ఆశ్వాసాంత గద్యల్లో పేర్కొబడిన ప్రాకృత భాషా సామర్థ్యాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. అదే విధంగా ఆధునిక కాలంలో పంచాగ్నుల ఆది నారాయణ శాస్త్రి, పరవస్తు వెంకట రామానుజ స్వామి, వేటూరి ప్రభాకర శాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, నిడుదవోలు వెంకట రావు, పుట్టపర్తి నారాయణార్యులు, తిరుమల రామచంద్ర, తూమాటి దోణప్ప, అవధానం చంద్రశేఖర శర్మ, చీమకుర్తి శేషగిరిరావు, ఎన్. ఎస్. కృష్ణమూర్తి ప్రాకృత భాషలో విశేషమైన కృషి చేసిన విషయాన్ని శ్రీహరి గారు వివరించారు.

సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలు: సంస్కృత భాషలోకి అనువదింపబడిన తెలుగు కావ్యాలను రవ్వా శ్రీహరి గారు "సంస్కృతీకరించబడ్డ తెలుగు కావ్యాలు" అనే వ్యాసంలో అనుశీలించారు. చాలా కావ్యాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువాదం చేసుకున్న విషయం మనకు తెలిసిందే. కాగా విస్తృతమైన తెలుగు సాహిత్యం కూడా సంస్కృతీకరించబడిందని ఈ విమర్శ ద్వారా తెలుస్తుంది. 15 వ. శతాబ్దంలో గురురాజకవి పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్రను అనువాదం చేసి సంస్కృత పండితారాధ్య చరిత్రను రచించారని అన్నారు. ఆధునిక కాలంలో శివపురపు రాజలింగసూరి పండితారాధ్య చరిత్రలోని దీక్షా ప్రకరణాన్ని అనువదించి చారిత్ర దీక్షా ప్రకరణంగా సంస్కృతంలో రచించారు. సంస్కృత సాహిత్యంలో స్మృతి కవిత్వ రూపం ఎలా ఉందో ప్రత్యేకంగా "సంస్కృత సాహిత్యంలో స్మృతి కవిత్వం" అనే వ్యాసంలో వివరించారు శ్రీహరి గారు. ఒక సందర్భంలో వాల్మీకి శోక పూరిత హృదయంతో చెప్పిన "మా నిషాద ప్రతిష్ఠాంత్వమగమః శాశ్వతీః సమాః యత క్రౌంచ మిథునాదేక మవధీః కామ మోహితమ్" అనే శ్లోకం మొట్టమొదటి స్మృతి గీతంగా నిలుస్తుందని అన్నారు. ఇలా అనేక కావ్యాలలో గల స్మృతి ఘట్టాలను వర్ణిస్తూ మహాభారతంలో గృహిణి ఎడబాటుకు వ్యథ చెందిన శ్లోకాలు, భాగవతంలో చిత్ర కేతుడి భార్య కృతిద్యుతి కుమారుడి మృతికి శోకిస్తూ బ్రహ్మను ప్రశ్నిస్తున్న సన్నివేశాలను శ్రీహరి గారు ప్రస్తావించారు. తెలుగులో విస్మృతంగా, అలబ్ధంగా ఉన్న సాహిత్యాన్ని శ్రీహరి గారు పరిశీలించి "తెలుగులో అలబ్ధ వాఙ్మయం" అనే వ్యాసంలో విలువైన సమాచారాన్ని పొందుపరిచారు. సాహిత్య చారిత్రలోకి చేరని కావ్యావతారికలు, చందో వ్యాకరణ గ్రంథాలు, సంకలన గ్రంథాలను గూర్చి సవివరంగా తెలిపారు. నేటి పరిశోధకులకు అత్యంత మేలైన సాహిత్య ఆధారాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ విధంగా ప్రఖ్యాతి గాంచిన, బహుముఖాలుగా విస్తరించిన శ్రీహరి గారి భాషా సాహిత్య విమర్శా వ్యాసాలు ఉభయ భారతి సంపుటిలో ఉన్నాయి. భాషా సాహిత్యాలకు చెంది ఉభయ భారతిగా భాసిల్లినా, ఇందులో పాఠభేదాలకు, పరిష్కరణలకు, వ్యాకరణాంశాలకు, నిఘంటు నిర్మాణాలకు, భాషా ప్రయోగాలకు, సంకలన గ్రంథాలకు, సంస్కృత ప్రాకృతాంధ్ర భాషా సాహిత్యాలకు చెందిన వ్యాసాలు అత్యంత అమూల్యమైనవి. ఆయా శాస్త్ర గ్రంథాలలోని సమగ్రమైన విషయాలను ఈ గ్రంథం తెలియజేస్తుంది. పాండిత్య ప్రమాణాలతో "ఉభయ భారతి" చిరకాలం వెలుగొంది, నిరంతరం సాహితీ కారులకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

మి

ఆచార్య వంగరి త్రివేణి
తెలుగు అధ్యయనశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం,
నిజామాబాద్ - 503322
Mobile: 995144803 Email: telugutriveni@gamil. Com



# ట్రినిడాడ్ - క్యూబా

– నిమ్మగడ్డ శేషగిరి రావు

ట్రినిడాడ్ దిశగా మా ప్రయాణం కరీబియన్ సముద్రతీరం వెంబడి, ఎస్కాంబ్రే పర్వతాల మీదగా సాగింది. ట్రినిడాడ్ అనగానే ఉత్తేజితులయ్యే క్రికెట్ ప్రేమికుల కోసం ఒక ప్రత్యేక వివరణ ఇక్కడ అవసరమనుకుంటున్నాను. ఈ ట్రినిడాడ్, క్రికెట్‌కు దిగ్గజం లాంటి బ్రయన్ లారా స్వదేశమైన, 'ట్రినిడాడ్ టొబాగో' కాదు. అది కూడ కరీబియన్ సముద్రంలోనే దక్షిణాన ఉన్న మరో దేశం. మేము వెళుతున్నది క్యూబాలోని ట్రినిడాడ్ పట్టణానికి. క్యూబాకు నైరుతి తీరంలో ఉన్న అందమైన సముద్ర తీర పట్టణం ఈ ట్రినిడాడ్. 1514వ సంవత్సరంలో స్పెయిన్‌వారు తొట్టతొలిగా జెండా పాతి స్థిరపడినప్పటి నుండి, చాలా కాలంపాటు వారి పాలనలో ఉన్న పట్టణాలలో ఇది ఒకటి. ఇక్కడి భవనాలు ఈ నాటికీ అలనాటి స్పానిష్ నిర్మాణాల స్వభావ, స్వరూపాలను ప్రతిబింబిస్తూ ఉంటాయి. అమెరికాలో ప్రవేశించటానికి కాలూత కోసం, స్పానిష్ వారు ఈ నగరాన్ని ఉపయోగించేవారట. నేను ఈ మధ్యనే మైఖేల్‌వుడ్, 16వ శతాబ్దంలో అమెరికా ప్రధాన భూభాగాన్ని అధీనంలోకి తెచ్చుకున్న స్పానిష్ యుద్ధవీరులు, కాంక్విస్టడార్స్ మీద వ్రాసిన పుస్తకాన్ని చదివాను. స్పెయిన్ లోని ఎక్స్ట్రిమదురా అనబడే ప్రాంతం నుండి ఇక్కడికి తరలి వచ్చిన హెర్మాన్ కోర్టెజ్, 1519వ సంవత్సరంలో ట్రినిడాడ్‌నుండి క్యూబాకు వలస వచ్చిన ఎంతో మంది ప్రజలను కూడగట్టుకుని మెక్సికోను ఆక్రమించి, స్థానిక అజెటిక్ నాగరికతను సమూలంగా ధ్వంసం చేసిన కాంక్విస్టడార్.

ఆ సాయంత్రం మేము నెమ్మదిగా నడచుకుంటూ, ఒకదానికొకటి అనుసంధానమై ఉన్న నగరవీధుల కూడళ్ళు, అందమైన చర్చ్‌లు చూశాము. వీటిలో ముఖ్యమైన 'ప్లాజా మేయర్', చాలా విశాలంగా ఉండి, దాని ప్రాముఖ్యతను చెప్పకనే చెప్పుకుంటోంది. ఆ పట్టణం దాదాపు 200 సంవత్సరాల నుండి ఏమీ మారలేదని మా గైడు మార్త చెప్పింది. గుండ్రని గులకరాళ్ళు పరచిన వీధులు, పెంకుల కప్పులతో, వెలసినట్టు కనిపించే లేత రంగుల భవనాలు, హడావుడి లేని వెనుకటి కాలంలోకి తీసుకెళతాయి. నగర కూడలి గతకాల విభవాన్ని ప్రతి ఫలిస్తోంది. అక్కడ సముద్ర తీర దృశ్యాలను అడ్డుకునే ఎటువంటి ఆకాశహర్మ్యాలు లేవు. దానికున్న ప్రాముఖ్యతను బట్టి, ఈ ప్రదేశం యునెస్కో వారి ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేరిపోయింది.

మా బస ట్రినిడాడ్ మధ్యలో అందమైన పాతకాలపు భవంతిలో ఉన్న హోటల్ 'ఐబెరోస్టార్'లో. మధ్యాహ్నం వరకు నిద్రలో తూగుతున్నట్టుండే ఈ నగరం, సాయంత్రమయ్యే సరికి, సింగారించుకుని కవ్విస్తుంది. పీల్చే గాలి సైతం స్థానికగాయకుల స్వరతంత్రులు సంధించే తరంగాలతో సాంద్రమౌతుంది. క్యూబా సంగీత ప్రధానమైన దేశం. దేశజనాభాలో సంగీతజ్ఞుల నిష్పత్తి దృష్ట్యా క్యూబా మొదటి స్థానంలో నిలుస్తుందేమో. వీరంతా జన్మతః గాయకులేమోననిపించింది నాకు. ప్రతి వీధి చివరలో ఒక సంగీతకార్యక్రమం నడుస్తూ ఉంటుంది. నాలాంటి సందర్శకులతో అక్కడి వారు, మాటలతో కాకుండా, పాటలతో సంభాషిస్తారు. ట్రినిడాడ్, క్యూబా పంచదార పరిశ్రమకు కేంద్రం. 250 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో, కొన్ని వేల ఎకరాలలో చెరకు పండిస్తారు. క్యూబా తిరుగుబాటు తర్వాత, ఫైడేల్‌కాస్ట్రో వాటిని జాతీయం చేయక ముందు, అవన్నీ సంపన్న అమెరికన్ భూస్వాములకు చెందినవే అని మార్త చెప్పింది. ఈ పరిశ్రమ ఉచ్ఛదశలో ఇక్కడ డెబ్బై మిల్లులు ఉండేవట. ప్రతి చెరకు తోటలోనూ, 'హసియండా' అని పిలువబడే ఒక పెద్ద ఇల్లు ఉంటుంది. దానిని నివాసంగానూ, ఆఫీసుగానూ కూడ ఉపయోగిస్తారు.

మేము ఒక సంపన్న స్పానిష్ కుటుంబానికి చెందిన చెరకు తోటకు వెళ్ళాము. దాని పేరు "మనాకా ఇగ్నాగా".

ఇది 'షుగర్ మిల్లుల లోయ'లో ఉన్న 'వాలే డి లాస్ ఇన్‌జీనియోస్, అనే చోట ఉంది.. అది ట్రినిడాడ్‌కు వెలుపల 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని 'హసియండా'కు దగ్గరలో 45 మీటర్ల ఎత్తైన వాచ్ టవర్ ఉంది. ఇలాంటి పెద్ద ప్లాంటేషన్స్‌లో పని చేసే బానిసలను, వందలాది మంది పనివాళ్లను గమనించటానికి ఈ టవర్‌ను ఉపయోగిస్తారట. మొదట మేము సందేహించినా, మార్త ప్రోద్బలంతో ఎక్కాము. టవర్‌పై నుండి కనిపించిన దృశ్యాలు ఎక్కిన శ్రమను మరపించాయి. మైళ్ళ కొద్దీ సముద్రపు అంచులవరకు పరచుకున్న పచ్చని చెరకు తోటల దృశ్యం అద్భుతంగా ఉంది. ఇండియాలో చెరుకు పండించే రైతు కుటుంబం నుండి నేను రావటం వలనో, పంచదార పరిశ్రమపై ఆధారపడిన శక్కరనగర్ (నిజామాబాద్, తెలంగాణా)లో చదవటం వలనో కాని, అక్కడ చూస్తున్నదంతా తెలిసిన విషయంలానే తోచింది. క్యూబా ప్రపంచానికే 'పంచదార పాత్ర'. చెరకును మిల్లులకు సరఫరా చేయటానికి, వారికి సొంత రైలు స్టేషన్ కూడా ఉంది. అక్కడ ఉన్న శిథిలగృహాలను చూపిస్తూ మా గైడు ఈ పెద్ద ప్లాంటేషన్ల చీకటి కోణాలను చూపించింది. మొదట స్థానిక క్యూబా శ్రామికులు ఈ తోటలలో పని చేసేవారట. కాని ఐరోపా నుండి సంక్రమించే రోగాలకు తట్టుకోలేక వారు త్వరగా చనిపోయేవారట. అప్పుడు ఆఫ్రికా నుండి నల్లవారిని, ప్లాంటేషన్లలో పని చేసేందుకు బానిసలుగా తీసుకొచ్చే వారట. వారికి చెందినవే ఆ గృహాలు. అదంతా ఒక రక్త చరిత్ర. సాటి మనుషులను, బానిసలుగా, జంతువుల మాదిరిగా బంధించి, హింసించి, వస్తువుల మాదిరిగా కొనటం, అమ్మటం....ఇదంతా పాశ్చాత్య దేశాల వైభవం వెనుక తారాట్లాడే నీలి నీడ. బానిసలు తమ సమాజం, కుటుంబాలు, పిల్లల నుండి వేరు చేయబడి, జీవితాంతం పనిచేసే యంత్రాలుగా దుర్భరజీవితం గడిపేవారు. ఆ వాచ్ టవర్‌లు బెల్ టవర్లుగా పనిచేసేవని తెలిసింది. వాటి పైన వ్రేలాడే గంటలను పనివాళ్ళకు సందేశాలివ్వటానికి ఉపయోగించేవారు. ఎవరైనా పారిపోయే ప్రయత్నం చేస్తే ఆ గంటను మోగిస్తారు. 1820వ సంవత్సరంలో స్పెయిన్ బానిసత్వానికి స్వస్తి చెప్పింది..

సూర్యాస్తమయ సమయానికి సముద్రపొడ్డు చేరుకున్నాము. కరీబియన్ సముద్రతీరంలో ఆకాశం ఎర్రటి విప్లవ రంగును అద్దుకున్న క్షణాలలో నీరు నిప్పు కలుసుకుంటున్న అద్భుత దృశ్యాన్ని కళ్ళలో నింపుకుని, నిలుపుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేశాము. రేపు మళ్ళీ కలుద్దామంటూ క్యూబా భానుడు కరీబియన్ సముద్రం కడుపులోకి జారిపోయాడు. చల్లటి బీరు త్రాగుతూ అలాంటి అరుదైన దృశ్యాల్ని చూడటం మహదానందం. ఈ సరికి మేము స్థానికుల మాదిరిగా, 'బ్లాక్ బీన్స్', 'రైస్' తినటానికి అలవాటు పడిపోయాము. దీనిని' మోరోస్ వై క్రిస్టియానోస్' అంటే ఇంగ్లీషులో 'మూర్స్ అండ్ క్రిస్టియన్స్' అని పిలుస్తారు. ఎంతో మామూలుగా వినిపించే ఈ పేరు, ఆ ప్రాంతపు చరిత్రను ప్రోది చేసి, గుర్తు చేసే పదశబ్దమని నా స్పానిష్ మిత్రుడు డొమింగో వివరించాడు. నల్లటి శరీరం కలిగిన ముస్లిం మూర్స్ 'బ్లాక్ బీన్స్' అయితే, 'తెల్లని అన్నం' పాలిపోయినట్లు తెల్లగా ఉన్న స్పెయిన్ క్రిస్టియన్లు. వీరి మధ్య తరతరాలుగా జరిగిన యుద్ధానికి చిహ్నమే ఈ ఆహారమట. కాకపోతే, మా ప్లేటులో వడ్డించబడిన ఈ రెండూ పరస్పరం అనుకూలంగానే ఉన్నాయి. తరతరాలుగా యుద్ధకాండ కొనసాగినా, రెండు తెగల మధ్య చివరకు సయోధ్య తప్పదేమో.

ఉత్తర ఆఫ్రికా నుండి వచ్చిన అరబిక్ మూర్‌లు, దక్షిణ స్పెయిన్‌ను దాదాపు 700 సంవత్సరాలు పాలించారు. 15వ శతాబ్దం చివరిలో స్పానిష్ రాణి ఇసాబెల్లా, రాజు ఫెర్డినాండ్ మూర్ జాతీయులని ఓడించేంత వరకు వారిపాలన సాగింది. ఇటలీకి చెందిన కొలంబస్ తన నౌకాయానానికి, ఆ నాటి రాజులనుండి ఆర్థికసహాయం కోసం, దేశదేశాలు తిరిగాడట. అతను ముందుగా పోర్చుగల్ చక్రవర్తిని, తరువాత వెనిస్, జెనోవా పాలకుల్ని, ఇంగ్లండ్ రాజును కూడా కలిశాడట. కానీ అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాయి. కింగ్ ఫెర్డినాండ్, క్వీన్ ఇసాబెల్లాలు, భారతదేశానికి సముద్ర మార్గం కనుగొనేందుకు కొలంబస్‌కు నిధులు ఇచ్చారు. అనుకోకుండా అతను అమెరికాను కనుగొనటం చరిత్ర గతినే మార్చేసింది. ఇక్కడ నా ఆలోచనలు మరో దిశగా సాగాయి. ఫెర్డినాండ్, ఇసాబెల్లాను కలిసినప్పుడు, అతని పథకాన్ని వాళ్ళు నమ్మటానికి చాలా సమయం పట్టింది. చర్చలు చాలా ఏళ్లు సాగి, చివరికి 1492వ సంవత్సరంలో కొలంబస్‌కి సహకరించటానికి వారు అంగీకరించారు. అప్పటికే స్పెయిన్ వారు ముస్లిం అరబ్ మూర్‌లను దక్షిణ స్పెయిన్‌లో ఓడించారు. ఒకవేళ ఆ యుద్ధంలో ఫెర్డినాండ్, ఇసాబెల్లాలు ఓడిపోయి ఉంటే ఏమై ఉండేది? పశ్చిమంగా ప్రయాణించి

ఇండియాకు చేరటానికి కొలంబస్ వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉంది. కానియూరప్‌లోని ఇతర రాజులు, రాణుల నుండి తన నౌకాయానానికి సహాయం లభించనందు వలన, అతను ఆరబ్ మూర్‌ల నుండి సహాయం కోరి ఉండేవాడా? కోరితే వారు సహాయం అందించే వారా? అదే జరిగి ఉండి ఉంటే, అరబిక్ ముస్లింలు, యూరోపియన్ క్రిష్టియన్లతో కలిసి అమెరికాలో కాలు మోపి ఉండేవాళ్ళా? ప్రపంచ చరిత్ర ఏమై ఉండేది? ఆ సమయంలో పశ్చిమాన స్పెయిన్, ఉత్తర ఆఫ్రికా, అరేబియా, పర్షియా, సెంట్రల్ ఏషియా వరకూ, తూర్పున ఇండియా వరకు ముస్లిం పాలనలోనే ఉన్నాయి. మరి అలా జరిగి ఉంటే ప్రపంచ చరిత్ర ఏ విధంగా ఉండేదో?

'కాంచెన్‌చెరా' ట్రినిడాడ్‌లో ఒక ప్రత్యేకమైన కాక్‌టెయిల్. రమ్, నిమ్మరసం, తేనెల మిశ్రమాన్ని, మట్టి మధుపాత్రలో అందించటం వలన, ఆ ద్రవం ఒక ప్రత్యేకమైన రుచిని సంతరించుకుంటుంది. ఆ సాయంత్రం మార్తా మమ్మల్ని, ఊరంతా తిప్పుతూ, ఈ కాక్‌టెయిల్ రుచి చూపించటానికి ఒక పేరు పొందిన బార్‌కు తీసుకెళ్ళింది. 19వ శతాబ్దం చివరలో క్యూబా స్వతంత్ర పోరాటంలో జరిగిన గెరిల్లా యుద్ధ సమయంలో కనుగొన్న ఈ ద్రవం, క్యూబా వారికి గర్వకారణమట. ఈ కాక్‌టెయిల్ క్యూబన్ల విప్లవస్వభావాన్ని సూచిస్తుందని చెబుతూ, దీనిని ఆనందం కోసం కంటే ఒక ఔషధంగా తీసుకుంటారని మార్తా చెప్పింది. ఈ కాక్‌టెయిల్ వెనుక ఉన్న అద్భుత చరిత్రను అక్కడి స్థానికులు ఆనందాతిశయంతో వివరిస్తుంటే, అది పుట్టిన చోటే దానిని ఆస్వాదించగలగటం ఒక మధురానుభూతి. ఆ కాక్‌టైల్‌ని రెండిటి కంటే ఎక్కువ తీసుకోవాలనే బలమైన కోరికను అదుపు చేసుకున్నాను. లేకపోతే ఆ రాత్రి అది నన్నొక విప్లవకారుణ్ణి చేసేదే. ఆ కాక్‌టైల్ చరిత్రను ప్రక్కన పెడితే, అది చాలా రుచిగా ఉంది. తేనె, నిమ్మరసాల కలయిక ఎప్పుడూ బాగుంటుంది. దాని చరిత్ర, రుచితో పాటు 'క్యాన్ – చేన్ – చేరా' అనే పేరు కూడా మృదుమధురంగా ఉంది. క్యూబాలోని ఈ ట్రినిడాడ్ 'క్యాన్–చేన్–చేరా'ను ఎన్నటికీ మరువలేను.

'గౌంటనమేరా'అనే పాట నేను చాలా సార్లు విన్నాను. దీనిని ఇంగ్లీషులో 'గాంటనామెూ అమ్మాయి'గా అనువదించారు. ఇది హెూసె మర్తి రచించిన ఒక కవిత. ఈ కవితకు సంగీతాన్ని సమకూర్చి, ప్రపంచ ప్రజల మనసుల్లో నిలచిపోయే గీతంగా నిలబెట్టిన మధుర గాయకుడు, హెూసె ఫెర్నాండెజ్. ఉత్తరోత్తరా, అన్ని ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తర అమెరికాలో ఎంతో మంది ఈ కవితకు సంగీతాన్ని మేళవించాయి. ఇవన్నీ 'యు ట్యూబ్' లో అందుబాటులో ఉన్నాయి. దీన్ని నేను చాలా సార్లు క్యూబాలో ప్రత్యక్షంగా విన్నాను. అన్నింటిలోను నాకు ట్రినిడాడ్‌లో అతి తక్కువ సంగీత వాయిద్యాలతో ఒక నల్లజాతి గాయకుని స్వరంలో నిజాయితీగా వంపులు తిరిగిన పాట నాకు బాగా నచ్చింది.

మరుసటిరోజు మేము ప్రకృతి సౌందర్యాన్ని అనుక్షణం నూతనంగా ఆవిష్కరిస్తూ పోయే కరీబియన్ సముద్రతీరం వెంబడి ప్రయాణం చేసి, 'సీయాన్ ఫ్యూగోస్' చేరుకున్నాము. ఇది యునెస్కోవారసత్వ సంపదలో చేర్చబడిన మరొక ప్రాంతం. ఈ నగర నిర్మాణం ఒకనాటి ఫ్రెంచ్ వారి పద్ధతిలో ఉంటుంది. నగర వీధులు అడ్డం, నిలువు గీతలుగా ఉండి, ఇరుపక్కలా చెట్లతో, ప్రధాన కూడలి వైపుకు దారితీస్తూ ఉంటాయి. నిర్మాణ విశేషంగా కనిపించే నగర థియేటర్‌ను చూసిన తరువాత, కరీబియన్ తీరపు అందచందాలను కళ్ళలో నింపుకోవటానికి, నౌకా విహారం చేశాము. వాళ్ళూ వీళ్ళూ చెప్పినదాని బట్టీ, మేము బస చేసిన హెూటల్ 'లే యూనియన్' పైఅంతస్థు సూర్యాస్తమయం చూడటానికి మంచి స్థానం కాబట్టి అక్కడికి వెళ్ళటానికే నిర్ణయించుకున్నాము.

హెూటల్ 'లే యూనియన్'' దాని సహజవైభవంతో వెలిగిపోతూ ఉంది. సాయంత్రం తీరికగా వేడినీళ్ళ స్నానంతో అలసట కడిగేసుకుని, రూఫ్ టాప్ బార్‌లో అప్పటికే అక్కడకు చేరుకున్న నా మిత్రులని కలసుకున్నాను. బార్‌కి వచ్చింది మొదటగా మేమే కనుక, అక్కడ కాక్‌టైల్ తయారుచేసే డేనియల్ దృష్టి మా మీద పడింది. ఆ వెంటనే మేము హెూటల్ ఇంజనీర్ 'రోమోస్'తో కలిసిపోయాము. స్థానికులతో చొరవగా మాట్లాడటానికి, సహజ మనోభావాలు తెలుసుకోవటానికి ఇదే మంచి అవకాశం. డేనియల్, రోమోస్ ఇద్దరూ విద్యావంతులు, బాగా తెలివైన వాళ్ళు. ఇద్దరూ నిర్మొహమాటంగా, ప్రభుత్వానికి సంబంధించిన విషయాలతో పాటు, అన్ని విషయాల మీద వారి కచ్చితమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. క్యూబా ప్రజల స్వేచ్ఛాపూరిత ఆలోచనా విధానం, భావ ప్రకటన నన్ను ఆకట్టుకుంది. సామాన్యంగా నియంతృత్వ కమ్యూనిస్ట్ పాలనలో ప్రజలు మాట్లాడటానికి సంకోచిస్తారని అనుకుంటాము. క్యూబా లో అటువంటి పరిస్థితి ఏ కోశానా

కనిపించదు. బహుశా విప్లవ స్ఫూర్తి క్యూబా వారి నరనరాలలో జీర్ణించుకుని ఉందేమో. ప్రభుత్వ సిద్ధాంతాలకు, పోకడలకు వారు అనాలోచితంగా తల ఊపరు.

ఉద్యోగస్తులు సంతోషంగా లేరని, వాళ్ళ జీతాలు చాలా తక్కువ అని డేనియల్ చెప్పాడు. మేము డాక్టర్లమని తెలియటం వల్ల మా సంభాషణ అటు వైపు మళ్ళింది. ఒక డాక్టర్ నెల జీతం 30 క్యూబన్ పెసోలు, అది ముప్పై అమెరికన్ డాలర్లకు సమానం. అందుకే వారు ఆదాయాన్ని పెంచుకునేందుకు బార్లలో, రెస్టారెంట్లలో వెయిటర్లుగా పని చేస్తుంటారు. అయితే డేనియల్ చెప్పిన మరో విషయం ఏమిటంటే, క్యూబాలో ప్రజలందరికీ ఉచిత వైద్య సదుపాయం ఉంది. ఇక్కడి డాక్టర్లకు జీతం తక్కువైనా, వారికి సమాజంలో గౌరవం ఎక్కువ. క్యూబా చమురు కోసం వెనిజులా లాంటి ధనిక ఆయిల్ దేశాలతో, తమ డాక్టర్లను మార్పిడి చేయటం ఆసక్తికరమైన విషయం. వైద్యోనారాయణో హరి: అనుకునే దేశంనుండి వచ్చిన నాకు ఇది అనూహ్యం. క్యూబా వారి జీవన ప్రమాణం 75 సంవత్సరాలు. ఇది ఆధునిక ఐరోపా దేశాల వారి సగటు జీవన ప్రమాణాలతో సమానం. ఏమైనా, మరొక సూర్యాస్తమయాన్ని చూస్తూ, తాజాగా కలిపిన కాక్‌టైల్స్‌ని కొద్ది కొద్దిగా ఆస్వాదిస్తూ, స్వేచ్ఛాభావాలు గల ఇద్దరు స్థానికులతో మాట్లాడుతూ గడపిన సాయంత్రం ఒక మంచి అనుభవం. యు.కె. నుండి వచ్చిన నా సహచరుడు, డొమింగో ఒక స్పానిష్ వ్యక్తి. అట్లాంటిక్ మహా సముద్రంలో ఆఫ్రికా తీరాన ఉన్న 'కానరి ఐలాండ్స్' నుండి వచ్చాడు. అవి స్పెయిన్ ప్రధాన భూమికి 2000 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నాయి. అతడు ఉండే దీవి 'గ్రాండ్ కెనారియా'. అమెరికాకు వెళ్ళే స్పానిష్ నౌకలకు దోవలో ఆ దీవి ఎలాంటి సేవలందించేదో డొమింగో చెప్పాడు. స్పెయిన్ నుండి దక్షిణం వైపు ప్రయాణిస్తూన్న నౌకలు 'కానరీ' దీవులకు చేరుకుంటే, ప్రయాణంలో మొదటి అడుగు పూర్తి చేసినట్లు. అక్కడ తమకు కావలసిన ఆహారం, నీళ్ళు మొదలైన వాటిని మళ్ళీ సమకూర్చుకుని పడమటి దిక్కుగా క్యూబాకు బయలుదేరేవి. అక్కడి నుండి మిగతా అమెరికా ప్రాంతాలను చేరటానికి క్యూబా స్పానిష్ వారి కేంద్రస్థానం.

డానియల్, రోమోస్ ఏమంటున్నారో పూర్తిగా అర్థం కాకపోయినా ఆసక్తిగా ఉంది. డొమింగో సహాయంతో అంతా మామూలు సంభాషణగానే సాగిపోయింది. ఒక విధంగా ఇంగ్లీషుతో పాటు, స్పానిష్ కూడా అంతర్జాతీయ భాషే. మొత్తం సెంట్రల్ అమెరికా, మెక్సికో నుండి పనామా వరకు, బ్రెజిల్‌ను మినహాయించి, దక్షిణ అమెరికా అంతా దాదాపుగా స్పానిష్ మాట్లాడుతారు. ప్రపంచంలో ఇరవై ఒక్క దేశాల్లో స్పానిష్ ప్రధాన భాష. యునైటెడ్ స్టేట్స్‌లో కూడా ఇంగ్లీషు తర్వాత సాధారణంగా మాట్లాడే భాష స్పానిష్. నా ప్రయాణాలలో నేను గమనించింది ఏమిటంటే, స్పానిష్ మాట్లాడని ప్రపంచంలో నాలాంటి ప్రయాణికుడు ఇంగ్లీషుతో నెట్టుకు రావచ్చు. కాని స్పానిష్ మాట్లాడే ప్రపంచంలో కనీసం స్పానిష్ మీద అవగాహన కూడ లేకుండా తిరగటం కష్టం. వాళ్ళదొక ప్రత్యేక ప్రపంచం, అందమైన గొప్ప మాతృ భాష స్పానిష్ ఉండగా, వారు ఇంగ్లీషు ఎందుకు నేర్చుకోవాలి?

అమెరికా ఖండాల మీద స్పెయిన్ ప్రభావం గురించి మా సంభాషణ ఎంతో ఆసక్తిగా సాగింది. దాదాపు ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ప్రచండ శక్తిగా స్పెయిన్ నిలిచింది. 1492వ సంవత్సరంలో క్రిస్టఫర్ కొలంబస్ అమెరికాకు సముద్రమార్గం, కనుగొన్న తరువాత మెక్సికోలోని అజెటిక్, పెరూలోని ఇన్‌కా సామ్రాజ్యాలను కూడా స్పానిష్ వారు ఆధీనంలోకి తెచ్చుకున్నారు. చాలా అమెరికా దేశాలని స్పానిష్ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ విజయాలన్నీ స్పెయిన్‌కు ఎంతో సంపద చేకూర్చాయి. క్వీన్ ఎలిజబెత్ 1 పాలనలో ఇంగ్లండ్, స్పానిష్ నౌకాదళాన్ని, 1588వ సంవత్సరంలో ఓడించింది. ఆ తరువాత మూడు వందల సంవత్సరాల పాటు బ్రిటీషు వారి ఆధిపత్యానికి ఎదురులేదు. అప్పటి వరకూ సముద్రాలపై స్పానిష్ ఆధిపత్యమే కొనసాగటానికి కారణం, స్పానిష్ వారి మరఫిరంగులు, సైనికబలం, ఇంగ్లండు కంటే చాలా శక్తివంతమైనవవటమే. కాని ఈ యుద్ధంలో, స్పానిష్ వారి వ్యూహాపరమైన తప్పులతో పాటు, ఇంగ్లీషు నౌకాదళాధిపతుల సామర్ధ్యం, ఆనాటి వాతావరణం ఇంగ్లండ్‌కు సహకరించాయి. ఆ యుద్ధంలో ఒకవేళ స్పెయిన్, ఇంగ్లీష్ వారిపై విజయం సాధించి ఉంటే, లేదా స్పానిష్ వారు ఇంగ్లండ్‌పై దండయాత్ర చేసి విజయం సాధించి ఉంటే, బహుశా మనందరం ఈ రోజు ఇంగ్లీష్ బదులు స్పానిష్ మాట్లాడుతూ ఉండేవాళ్ళమేమో. మన జీవితాలను మలపటంలో చరిత్ర పాత్ర ఎంతో ఇటువంటి ఆలోచనల వలన అర్థం చేసుకోవచ్చు.

'అలా అయి ఉంటే' అనేది మన జీవితాలకే కాక, ప్రపంచ చరిత్రకు కూడ ముఖ్యమే. ఏదైనా సమస్య

ఎదురైనప్పుడు 'మరోలా జరిగి ఉంటే?' అనే ఆలోచన మొదలౌతుంది. ఉదాహరణకు, నేను వేరే చదువు చదువుకుని ఉండి ఉంటే? వేరే ఉద్యోగంలో ప్రవేశించి ఉంటే? వేరే వ్యక్తిని పెళ్ళి చేసుకుని ఉంటే? వేరే జీవనశైలిని అవలంబించి ఉంటే? ...ఇలా ఎన్నో. అలాగే చరిత్రలో కూడా. హిట్లర్ జర్మనీ, ఇంపీరియల్ జపాన్‌ల కూటమి రెండవ ప్రపంచ యుద్ధంలో గెలిచుంటే? 1857 సిపాయీ తిరుగుబాటులో భారత్ బ్రిటీష్‌ని ఓడించి, భారతదేశం నుండి తరిమేసుంటే? 15వ శతాబ్దంలో యూరోపియన్ నౌకల కంటే సాంకేతికంగా ఉన్నత స్థాయి నౌకాబలమున్న చైనా, అమెరికాను కనిపెట్టి, దానిని వలసరాజ్యంగా ప్రకటించుంటే? ఇలాంటి ఎన్నో విషయాల మీద ఊహలు చరిత్రను ఆసక్తికరంగా చేస్తాయి. వర్తమానాన్ని, చరిత్రకు సంధానం చేస్తాయి. మేము మా సంభాషణలు ముగించి, ఆ బార్‌ను వదిలి ప్రక్క రెస్టారెంట్‌లో భోజనానికి వెళ్ళబోతుండగా డేనియల్ "నేను ప్రత్యేకంగా తయారు చేసిన ఈ కొత్త కాక్‌టైల్‌ను రుచి చూడకుండా మీరు వెళ్ళలేరు'' అన్నాడు. దాని పేరు 'లే యూనియన్ స్పెషల్'.అది మైలుతుత్తం రంగులో కొంచెం మెరుస్తూ, విశేషంగా ఉంది. డేనియల్, అంచెలంచెలుగా సాగే దాని తయారీ విధానం, దానిని మేము రుచి చూసేటప్పుడు తెలిపిన కొన్ని మెళుకువలు అసాధారణంగా ఉన్నాయి.

హవానాకు తిరిగి వెళ్ళే మార్గంలో ప్రఖ్యాతి చెందిన బీచ్ రిసార్ట్ 'వరడెరో' లో కొంచెం సేపు ఆగాము. సముద్రం, సైకతం, సూరీడు...ఈ మూడిటి కలయిక ఎక్కడున్నా అది ఏ వయసు వారినైనా ఆకర్షిస్తుంది. మెక్సికోకు 'కాన్‌కూన్' ఎలాగో; క్యూబాకు 'వరడెరో' అలా. ఒక వారంపాటు కుటుంబం పిల్లలతో హాయిగా గడిపేందుకు అనువైన ఒక చిన్న ప్రపంచం. మాకు హవానాలో ఇంకా రెండు రోజులు ఉండే అవకాశం ఉంది. పినార్ డెల్ రియో అనే ప్రాంతంలో, హవానాకు పశ్చిమంగా 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న, 'వాయే విన్యాలె' అనే లోయకు వెళటానికి నిర్ణయించుకున్నాము. ఇక్కడి భూభాగమంతా ప్రత్యేకమైన అందం సంతరించుకుని ఉంది. పచ్చటి, నలు చదరమైన లోయలో, నేల నుండి ఉబికి వచ్చినట్లు, బల్బ్ ఆకారంలో, పచ్చని వృక్షజాలంతో కప్పబడిన సున్నపురాతి కొండలు ఉంటాయి. వాటిని 'మాగోటెస్' అంటారు. ఒక ఎత్తైన ప్రదేశం నుండి లోయ మొత్తాన్ని ఈ చూస్తే, 'మాగోటెస్ వ్యాలి' అనే ఆట బోర్డ్ మీద 'పీసెస్' మాదిరిగా ఈ రాళ్ళ గుట్టలు నిలబడి ఉంటాయి. ఆ గుండ్రని పెద్ద రాళ్ళతో గ్రహాంతర వాసులు చదరంగం ఆడుతున్నారా? అనిపిస్తుంది. 'వ్యాలీ విన్యాలె' ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేస్తుంది. క్యూబా ప్రీమియం బ్రాండ్ సిగార్స్ అయిన 'కోహిబా', 'మోంటే క్రిస్టో' రోమియో అండ్ జూలియట్' తయారీలో దీన్ని ఉపయోగిస్తారు. పచ్చటి వెడల్పాటి ఆకులతో నిండిన పెద్ద పొగతోట మధ్యలో పొగాకును నిల్వ చేసే పెద్ద గిడ్డంగి ఉన్న టొబాకో వ్యవసాయ క్షేత్రానికి మా గైడ్ మమ్మల్ని తీసుకెళ్ళాడు. అక్కడ పొగాకును శుభ్రం చేసి ఎండబెడుతున్నారు. దగ్గరలోనే సిగార్ తయారీ జరుగుతోంది. అక్కడ ఆడవారు చేతులతోనే సిగార్‌లను చుట్టుతున్నారు. ప్రతి యాత్రా స్థలంలో ద్రాక్షతోటలవద్ద, వైన్ రుచి చూసే కార్యక్రమం ఉన్నట్లే, ఇక్కడ సిగార్ కాల్చుకునే అవకాశం ఇచ్చారు. నేను చుట్ట కాల్చటంలో ఘోరంగా విఫలమయ్యాను. చుట్ట కాల్చటానికి కూడా ఒక టెక్నిక్ ఉంది. పైగా నాకు పొగ త్రాగే అలవాటు లేదు. 'వాలీ విన్యాలే ' లో పెరిగే పొగాకంత నాణ్యమైనది, సువాసన భరితమైనది ప్రపంచంలో ఎక్కడా లేదని అక్కడున్న ఒక రైతు సగర్వంగా చెప్పాడు. క్యూబన్ పెయింటర్ లియో విగిల్డో గోంజాలెజ్, 'మ్యూరల్ డే లా ప్రిహిస్టోరికా' అనే చిత్రాన్ని ఒక పెద్ద మాగోట్ మీద చిత్రించాడు. అది జలచరాలుగా మొదలై భూచరాలుగా మారిన మానవ పరిణామక్రమాన్ని చూపిస్తుంది. ఈ వ్యాలీకి ఈ లోయలో కొండ గుహల సమూహం కూడా ఉంది. మమ్మల్ని ఒక చిన్న బోటులో వీటి లోపలికి తీసుకెళ్ళారు. నేను ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో గుహలు చూశాను. కానీ ప్రత్యేకించి ఇది మాత్రం ఇండియాలో విశాఖపట్టణం సమీపంలోని అరకు లోయలో ఉన్న బొర్రాగుహలను గుర్తుకు తెచ్చింది.

ఆ రోజు సాయంత్రానికి మేము హవానాకు తిరిగి వచ్చాము. ఇక్కడకు వచ్చిన మొదటి రోజు సాయంకాలపు అనుభవాల తాలూకు అనుభూతులు మనసును మీటుతుంటే, పాత హవానా వీధుల్లో మళ్ళీ తిరగాలని నిర్ణయించుకున్నాము. ఇక్కడ ఏ ఒక్క సాయంత్రమూ 'లా బోడిగిటా' లో మోహిటో, 'లా ఫ్లోరిడిటా' లో డైకిరి లేకుండా గడవదు.

అమెరికన్ నోబెల్ అవార్డు గ్రహీత ఎర్నెస్ట్ హెమింగ్‌వేకు క్యూబాతో ఉన్న అనుబంధం గురించి మేము మాట్లాడుకుంటుండగా, 'లా ఫ్లోరిడిటా' లో పనిచేసే వ్యక్తి "మీకు సమయం ఉంటే, హవానాకి కొద్ది కిలోమీటర్ల

దూరంలోని మత్స్యకారుల గ్రామమైన కోజీమర్ సమీపంలో ఉన్న ఆ హెమింగ్‌వే గృహం సందర్శించదగినది" అని చెప్పాడు. హెమింగ్‌వే ఇరవై సంవత్సరాల కంటె ఎక్కువే అక్కడ నివసించాడని అతను చెప్పాడు. అతను ఎక్కువ కాలం పాటు నివశించిన ప్రదేశం ఇదేనట్లు. 'హెమ్మింగ్‌వే ఆత్మ' మమ్మల్ని 'లా ఫ్లోరిడిటా' హొటల్లో చూసి, "నా ఇంటికి రండి" అని ప్రేరేపించినట్లుగా అనిపించింది. చివరి రోజున, 'కోజిమెర్' కు వెళ్ళాము. అది హవానాకు బయట ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. హెమింగ్‌వే ఇల్లు, 'ఫింకా విజియా', ఒక విశాలమైన తోటలో ఉంది. హెమింగ్‌వే తన సొంత పడవ, 'పిలార్' మీద కరీబియన్ సముద్రంలో చేపల వేటకు వెళ్ళేవాడు. ఆ బోటును ఇప్పటికీ ఆ ఇంటి దగ్గరలోనే ఉంచారు. ప్రస్తుతం ఆ ఇంటిని, పరిసరాలన్నింటినీ ఒక అపురూపమైన మ్యూజియంగా మార్చారు.

బహుశా క్యూబాలో 'గ్రాన్‌మా' తర్వాత అంతటి ప్రసిద్ధమైన పడవ 'పిలార్'. క్యూబా విప్లవ ఆరంభంలో, 'ఫైడెల్‌కాస్ట్రో', చెగువేరా 'గ్రాన్‌మా' ను ఉపయోగించారు. ప్రపంచంలో హెమింగ్‌వే అభిమానులు, 'ఫింకా విజియా', 'కోజిమర్' లను చూడవలసిన ప్రదేశాలుగా భావిస్తారు. హెమింగ్‌వే 'కోజిమర్' గ్రామంలోని మత్స్యకారులతోఎంతో కాలం గడిపాడు. వాళ్ళ కోసం 'మెర్లిన్' చేపలవేటను ఒక క్రీడగా నిర్వహించే వాడు. ఆ సమయంలో, ఆ గ్రామ మత్స్యకారుల జీవనంలో, మిళితమైన 'ఓర్పు' ఆధారితంగా అతను రచించిన, *"The Old Man and The Sea"* అనే నవల అతనికి ఎంతో పేరుతో పాటు, నోబెల్ పురస్కారాన్ని కూడ సముపార్జించింది. 'గ్రెగోరియో' అనే స్థానిక మత్స్యకారుడు 'పిలార్' బోటుకు కెప్టెన్ మాత్రమే కాక చాలాకాలం పాటు హెమింగ్‌వే సహచరుడుగా ఉన్నాడు. అతను 104 ఏళ్ళ వయస్సులో, 2002 సంవత్సరంలో మరణించాడు. చివరి వరకు ఆ గ్రామంలో అతనొక పెద్ద ఆకర్షణ. హెమింగ్‌వేతో తనకున్న అనుబంధాన్ని కథలుగా చెబుతుండేవాడట. ఆ రోజు మా మధ్యాహ్న భోజనం 'లా టెర్రెజా' రెస్టారెంట్‌లో హెమింగ్‌వే ఇక్కడికి క్రమం తప్పకుండా వచ్చేవాడట. ఇక్కడికి హెమింగ్‌వే కోసం వచ్చే వారి వలన ఇది ఇంకా చెక్కు చెదరకుండా నిలచి ఉంది. ఇక్కడ చేపలతో చేసిన భోజనం అద్భుతంగా ఉంది. 'పిలార్' కెప్టెన్ అయిన 'గ్రెగోరియో' పేరుతో ఉన్న 'కాక్‌టైల్' తీసుకోకుండా భోజనం పూర్తి అయినట్టు కాదని మాకు తెలియటంతో, మేము ఆ లోటు రానీయకుండా చూసుకున్నాము. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమెరికన్ రచయిత, జర్నలిస్ట్ ఎర్నెస్ట్ హెమింగ్‌వే అభిమానులలో నేనొకడిని. ఇందుకు కారణం అతని అద్భుతమైన జీవితమే. చికాగోలో ఒక సంపన్న కుటుంబానికి చెందిన ఈ విశిష్టమైన వ్యక్తి, ప్రపంచంలో ఎన్నో ప్రాంతాలలో నివసించాడు. విస్తృతమైన యాత్రికుడు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అతను యువకుడు. రెడ్‌క్రాస్ సంస్థ పిలుపుకు స్పందించి వాలంటీర్‌గా చేరి ఇటలీలో అంబులెన్స్ డ్రైవర్‌గా తన సేవలు అందించాడు. అతను కొంత కాలం పారిస్‌లో కూడా నివసించాడు. ఆనాటి కవులు, కళాకారులైన జేమ్స్ జాయ్స్, స్కాట్ ఫిడ్జెరాల్డ్, పాబ్లోపికాసో, జాన్ మైరోలతో సహవాసం చేశాడు. పాత్రికేయుడిగా స్పానిష్ సివిల్ యుద్ధ వార్తలని ప్రపంచానికి అందజేశాడు. రెండవ ప్రపంచ యుద్ధంలోను, నోర్మండీ డి-డే, పారిస్ విముక్తి పోరాటంలో కూడా పాల్గొన్నాడు. అతను ఆఫ్రికాలో కూడా విస్తృతంగా పర్యటించాడు.



ఎర్నెస్ట్ హెమింగ్‌వే

హెమింగ్‌వే కు క్యూబా అంటే ప్రత్యేకమైన అభిమానం. తొలినాళ్ళలో తరచుగా క్యూబాను సందర్శిస్తూ 'ఆమ్‌బోస్ మండోస్' హోటల్లో ఉండేవాడు. 1954లో సాహిత్యంలో అతనికి నోబెల్ ప్రైజ్ వచ్చింది. అదే సంవత్సరం మొదట్లో తన నాల్గవ, (ఆఖరి) భార్య మేరీతో ఆఫ్రికాలో, కిలిమంజారో పరిసరాల్లో స్థానిక జాతులతో కలసి జీవిస్తూ, రచనలు చేస్తూ కొన్ని నెలలు గడిపారు. వారు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టే ముందు ఆఫ్రికాలోని అందమైన ప్రాంతాలను చూసేందుకు. ఒకే పైలెట్ ఉన్న సింగిల్ ఇంజన్ 'సెస్నా' విమానాన్ని అద్దెకు తీసుకున్నారు. అది అడవిలో కూలిపోయింది. ప్రముఖ అమెరికన్ రచయిత హెమ్మింగ్‌వే, అతని భార్య ఆఫ్రికా అడవుల్లో కనిపించకుండా పోయారని ఒక సంచలన వార్తగా వ్యాపించింది. బహుశా చనిపోయి ఉండవచ్చని అనుకొన్నారు. కాని స్వల్ప గాయాలతో బ్రతికి ఉన్న ఆ ముగ్గురినీ, వారి కోసం వెతుకుతున్న ఒక యువ పైలెట్ గుర్తించి, విమానంలో

వాళ్ళను ఎక్కించుకొని బయలు దేరాడు. దురదృష్టవశాత్తు ఆ ప్లేన్ కూడా కూలిపోయింది. ఈ సారి హెమింగ్‌వే తీవ్రంగా గాయపడ్డాడు. కాని దాదాపు చనిపోయినంతపని జరిగింది. తిరిగి కోలుకోవటానికి చాలా కాలం పట్టింది. అలా ఆయన రెండుసార్లు దాదాపు మరణపు అంచుల వరకు వెళ్ళి వచ్చాడు.

హెమింగ్‌వేకు ఫైడేల్‌క్యాస్ట్రోతో మంచి స్నేహం ఉంది. కాని అమెరికా వారికి చెందిన ఆస్తులు, ఎస్టేట్స్‌ను జాతీయ చేయటానికి క్యాస్ట్రో నిర్ణయం తీసుకున్నాక, హెమింగ్‌వే 1960వ సంవత్సరంలో క్యూబాకు వీడ్కోలు పలికాడు. అతను సేకరించిన 9000 పుస్తకాలతో పాటు తన 'ఫింకా విగియా' ఇంటిని క్యూబాకు ప్రజలకు వదలి వేశాడు. దానినే తరువాత మ్యూజియంగా మార్చారు. అక్కడ నుండి హెమింగ్‌వే అమెరికాలోని ఇడహోకు చేరుకున్నాడు. హెమింగ్‌వే అలుపెరుగని యాత్రికుడు. సాహసికుడు. అతని వ్యక్తిత్వం ఊహాతీతం. ఇడహోలో చేరుకున్న తరువాత మానసిక కృంగుబాటుకు గురై ఎంతో కాలం పాటు చికిత్స పొందాడు. క్యూబా నుండి వచ్చిన ఒక సంవత్సరానికే ఆయన తుపాకితో కాల్చుకుని చనిపోయాడు. మానసిక కృంగుబాటు, ఆత్మహత్య భావాలు వారి కుటుంబంలో కొత్త కాదట. హెమింగ్‌వే తండ్రి, సోదరితో సహా మరో అయిదుగురు కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారట.

మైకేల్ పాలిన్ బి.బి.సి. కి రూపొందించిన టెలివిజన్ సిరీస్‌లో హెమింగ్‌వేను చూసిన తరువాత అతనిపై నా ఆసక్తి ఎక్కువయింది.'హెమింగ్‌వే అడ్వంచర్' పుస్తకాన్ని నేను చాలసార్లు చదివాను. హెమ్మింగ్‌వే నివసించిన కోజిమర్ గ్రామానికి కూడా పాలిన్ వెళ్ళి, 'పిలార్' కెప్టెన్, గ్రెగోరియోను కలిశాడు. హెమింగ్‌వే *'Old man and the Sea'* అనే గొప్ప పుస్తకానికి ఆ టైటిల్‌ను సూచించింది తానే అని గ్రెగోరియో మైకేల్ పాలిన్‌కు చెప్పాడట. ఆ ఇద్దరూ కలిసి చేసిన సుదీర్ఘమైన సముద్రప్రయాణ అనుభవాల సారామే ఆ పుస్తకానికి ప్రేరణ. 'కోజిమర్'లోని ప్రజలు హెమింగ్‌వేను ప్రేమతో గుర్తు చేసుకుంటారు. ఆ గ్రామంలో ఉన్న హెమింగ్‌వే విగ్రహానికి కావలసిన లోహాన్ని, అక్కడి స్థానిక మత్స్యకారులు, తమ పాత పడవలనుండి తీసి ఇచ్చారట. యాత్రికులందరికీ ఆ విగ్రహంతో పాటు ఫోటోలు తీసుకోవటం ఆనవాయతీ.

ఈ యాత్రని హెమింగ్‌వేతో ప్రారంభించి, అతనితోనే ముగిస్తున్నాను. క్యూబా మీద ప్రభావం చూపిన విదేశీయుల్లో ఛే గువేరా తర్వాత, ఎర్నెస్ట్ హెమింగ్‌వేకు రెండవ స్థానం లభిస్తుంది. క్యూబా పై వారి ప్రభావం అంతగా ఉంది. నేను గమనించినదేమిటంటే వీరిద్దరిలో ఒకరు దక్షిణ అమెరికా వారు, మరొకరు ఉత్తర అమెరికా వారు. వీరిద్దరి వల్లనే ఎక్కువ టూరిస్టు సావనీర్లు, టీ-షర్టుల అమ్మకం జరుగుతుంది. క్యూబాలో ఇంకా వీరిద్దరిపై ఎనలేని ప్రేమ, అభిమానం ఉన్నాయి. దీనికి భిన్నంగా క్యాస్ట్రో అనేక దశాబ్దాలు అధికారంలో ఉండటం వల్ల ప్రజల ప్రేమను కొంత కోల్పోయాడు. ఈ ఇద్దరూ క్యూబాను, వారి ప్రజలను ప్రేమించారు, ప్రేమించబడుతున్నారు. వాళ్ళిద్దరినీ తమ స్వంత వారిగా క్యూబా ప్రజలు భావించారు. ఆ ఇద్దరీ ఆలోచనల వలన ఒక్క క్యూబానే కాక ప్రపంచమంతా ప్రభావితమయింది. అది వారిని అంతర్జాతీయ వాదులను చేసింది. ఇంత సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎయిర్‌పోర్ట్‌కు తిరిగి వెళుతున్నప్పుడు, మరికొన్ని రోజులు క్యూబాలో ఉందామనిపించింది.

నా వరకు, క్యూబా సరిగ్గా గుర్తించ బడనటువంటి దేశం. ఈ ప్రయాణాల విశిష్ఠత ఏమిటంటే, స్వానుభవపూరితమైన వాస్తవదృష్టి. అది మీడియా లేదా రాజకీయ ప్రచారాల వలన ప్రభావితమై వంకర పోయిన విషయ పరిజ్ఞానం కంటే మెరుగైనదని నా అభిప్రాయం.

క్యూబా దేశమే అందుకు నిదర్శనం. క్యూబాలో పద్ధతులు చాలా కఠినంగా ఉంటాయి, కమ్యూనిస్ట్ నియంత్రణ ఎక్కువనీ, అమెరికా, ఐరోపా ప్రసార మాధ్యమాలు బాగా ప్రచారం చేసాయి. కాని నేను ఒక్కసారి క్యూబా వీధులలో అడుగు పెట్టగానే క్యూబన్లు స్వేచ్ఛాజీవులని నాకు అర్థమయింది. నేను క్యూబాకి వెళ్ళి 10 సంవత్సరాలకు పైనే అయింది. కాని ఆ జ్ఞాపకాలన్నీ ఈ రోజుకూ నా మనసులో సజీవంగా, బలంగా ఉన్నాయి. క్యూబా నాకు చాలా ఇష్టమైన దేశాల్లో ఒకటి. అవకాశం దొరికితే మరోసారి ఆ ప్రపంచంలోకి వెళ్ళాలని ఉంది.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: ప్రొ. ఆదినారాయణ (భ్రమణ కాంక్ష)
జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)



# పింగళి వెంకయ్య

– గారపాటి కోటమ్మ

బహుముఖ ప్రజ్ఞాశాలి, దేశభక్తుడు, అధ్యాపకుడు, రచయిత, బహుభాషా కోవిదుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, భూవిజ్ఞాన శాస్త్రవేత్త, విద్యావేత్త, అన్నింటికి మించి జాతీయ పతాక రూపకర్త. వెంకయ్య ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని భట్ల పెనుమర్రులో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో ఆగష్టు 2, 1876లో శ్రీ హనుమంతరాయుడు, శ్రీమతి వెంకటరత్నం దంపతులకు జన్మించారు. బాల్యంలో 5 సంవత్సరాలు మాతామహులు అడివి వెంకటాచలపతి వద్ద గడిపారు. ఈయన మచిలీపట్టణానికి సమీపంలోని చల్లపల్లి సంస్థానంలో పోలీసు అధికారి. అందువల్ల వెంకయ్య ప్రాథమిక విద్యాభ్యాసం పెదకళ్లేపల్లి, భట్ల పెనుమర్రు, చల్లపల్లిలలో కొనసాగింది. ఆ తర్వాత బందురు హిందూ హై స్కూలులో చేరి 1890 లో సెకండరీ స్కూలు విద్య పూర్తి చేశాడు.

వెంకయ్య తన 19వ ఏట బొంబాయి వెళ్లి సైన్యంలో చేరి శిక్షణ పూర్తి చేశాడు. బోయర్ యుద్ధానికి కారణం–బోయర్ రాష్ట్రాలలో బంగారము, వజ్రాలు దొరకడమే. బోయర్ యుద్ధంలో బ్రిటిష్ దళాలకు మద్దతుగా వెళ్లిన భారతీయ సైనికులలో వెంకయ్య ఒకరు. యుద్ధంలో సైనికుడుగా దాదాపు ఒకటిన్నర సంవత్సరాలపాటు పనిచేశాడు. దక్షిణాఫ్రికాలో ఆంగ్లో – బోయర్ యుద్ధంలో పాల్గొని తిరిగి తల్లిదండ్రుల వద్దకు యార్లగడ్డ వెళ్లగా, వీది అరుగుమీద విస్తరి వేసి భోజనం పెట్టారు. అందుకు నిరసనగా వెంకయ్య భోజనం చేయకుండా వెళ్లిపోయాడు. తమ కొడుకు సముద్రయానం చేయడం, సైన్యంలో పనిచేయడం వాళ్ళకు నచ్చలేదు. ఆ రోజుల్లో సముద్రాన్ని దాటడం అంటే కులాన్ని కోల్పోవడమే. వెంకయ్య తండ్రి దివి తాలూకాలోని యార్లగడ్డకు కరణముగా పనిచేసేవాడు. ఏదో ఒక ఉద్యోగంలో చేరి కుటుంబ పోషణ చేయవలసిన బాధ్యత వెంకయ్య పై పడింది. మద్రాసు వెళ్ళి ప్లేగ్ Inspector గా ట్రెయినింగ్ పూర్తి చేసిన తరువాత బళ్ళారిలో ప్లేగు Inspector గా ప్రభుత్వం నియమించింది. గ్రామాలలో తిరిగి ప్లేగు నివారణ చర్యలు చేపట్టాడు. తరువాత ప్లేగ్ Inspector పదవి వదలి శ్రీలంకలోని కొలంబో కాలేజీలో చేరి సీనియర్ కేంబ్రిడ్జి చదువు పూర్తి చేసి 1906లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. పొలిటికల్ ఎకనామిక్స్‌లో Diploma సంపాదించాడు. సైన్యంలో పనిచేసిన అనుభవంతో రైల్వే ఉద్యోగానికి ప్రయత్నించారు. బెంగుళూరు–మద్రాస్ లైన్‌లో రైల్వే గార్డుగా నియమితులయ్యారు. కాని ఎక్కువ కాలం ఆ ఉద్యోగంలో ఉండలేకపోయారు.

దేశానికి ఏదో చేయాలనే కోరిక వెంకయ్యలో ఉంది. రహస్య విప్లవకార దళంలో చేరాడు. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడే గాంధీజీతో పరిచయం ఏర్పడింది. గాంధీజీ ప్రభావం ఇతనిపై గాఢంగా పని చేస్తుంది. క్రమంగా కాంగ్రెస్ కార్యకలాపాలలో పాల్గొనసాగారు. కాంగ్రెస్ కార్యక్రమాల పట్ల ఆకర్షితుడైన వెంకయ్య క్రియాశీలక పాత్రపోషిస్తూ 1906 నుండి క్రమం తప్పకుండా అన్ని ప్రదేశాలలో సభలకు హాజరయ్యాడు. 1906, డిసెంబర్‌లో అఖిల భారత కాంగ్రెస్ జాతీయ సమావేశాలు కలకత్తాలో జరిగాయి. సభకు దాదాభాయి నౌరోజీ అధ్యక్షత వహించారు. వెంకయ్య తన పిన్న తండ్రియైన లక్ష్మినారాయణతో కలిసి ఆ సభలకు హాజరయ్యాడు. తన పిన్నతండ్రికి చాలా మంది కాంగ్రెస్ ప్రముఖులతో సంబంధాలు ఉన్నాయి. తద్వారా వెంకయ్య ఆ సభలలో ప్రముఖులతో పరిచయాలు పెంచుకొన్నాడు. వెంకయ్యలోని ఉత్సాహాన్ని, కార్యదీక్షను గమనించిన కాంగ్రెస్ పెద్దలు వెంకయ్యను విషయ నిర్ణాయక సంఘ సభ్యునిగా ఎంపిక చేయడం జరిగింది. అప్పటి నుండి ప్రతీ సంవత్సరము కాంగ్రెస్ మహాసభలకు హాజరవుతూ వస్తున్నాడు. ఈ సభలలో మునగాల జమీందారు రాజానాయుని వెంకట రంగారావుతో పరిచయం ఏర్పడి తరువాత బాగా బలపడింది. రైతు కుటుంబమున జన్మించిన కారణము వలన వెంకయ్యకు తొలుత నుండి వ్యవసాయం అంటే

అభిరుచి ఎక్కువగా ఉండేది. మునగాల జమీందారు ప్రోత్సాహంతో వెంకయ్య 1906-1911 వరకు మునగాల సంస్థానంలో ఉండి పత్తిలో నూతన వ్యవసాయ విధానాలపై పరిశోధనలు కొనసాగించారు. అమెరికా నుండి వెంకయ్య కంబోడియా పత్తి విత్తనాలు తెప్పించి సాగుకు ప్రయత్నం చేశారు. తాను పరిశోధించిన అంశాల ఆధారంగా వెంకయ్య "వ్యవసాయ శాస్త్రం" అనే గ్రంథం ప్రచురించారు. ఆ పరిశోధనను పరీక్షించి, పరిశీలించిన రాయల్ అగ్రికల్చర్ సొసైటీ, లండన్‌వారు వెంకయ్యకు గౌరవ సొసైటీ సభ్యత్వం ఇచ్చారు. అప్పటి నుండి ఆయనను "పత్తి వెంకయ్యగా" పిలవసాగారు. పత్తి, చెరకు మొదలైన పంటలపై ప్రయోగాత్మక వ్యవసాయాన్ని జమీందారు ప్రోత్సాహించారు. వెంకయ్య జమీందారుకు గౌరవ సలహాదారుగా వ్యవహరించాడు. వెంకయ్య పత్తిపై పరిశోధనలు చేయడానికి మూలకారణం గాంధీజీ ఖాదీ ఉద్యమాన్ని ప్రచారం చేస్తున్న రోజులవి. మన దేశంలో పత్తి ఉత్పత్తులు పెరగవలసిన అవసరం ఉందని వెంకయ్య గమనించాడు. అందుకొరకే కళాశాలలో పని చేసే రోజుల్లోనే చల్లపల్లిలో వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని స్వేచ్ఛాపురం ఎస్టేట్‌గా నామకరణం చేసి వ్యవసాయ పరిశోధనలు మొదలు పెట్టారు వెంకయ్య.

మునగాల జమిందారీలో పత్తి పరిశోధనలు పూర్తి చేసుకొని తమ సొంత కృష్ణాజిల్లా మచిలీపట్టణంలోని ఆంధ్రజాతీయ కళాశాలలో అధ్యాపకులుగా 1911 లో చేరారు. తనకున్న మిలటరీ శిక్షణ అనుభవాన్ని విద్యార్థులకు ఉపయోగపడేలా వ్యవసాయ శాస్త్రములోను, గుర్రపు సవారీలోను శిక్షణ ఇచ్చారు. స్వాతంత్ర్యానంతరం నేషనల్ కేడిట్‌కోర్ (N.C.C.) ఆశయాలకు నాంది ప్రవచనం వెంకయ్య తన కళాశాలలో ప్రవేశపెట్టారు. విద్యార్థి దశలోనే సమాజ సేవ కూడా ప్రారంభం కావాలని అతని ఆశయం. వెంకయ్య మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో భూగర్భ శాస్త్రంలో డిప్లొమా కోర్సు చేసి వచ్చారు. వజ్రాలపై పరిశోధనకు అది బాగా ఉపయోగపడింది. శాస్త్రీయ దృక్పథం అలవరచుకొని రాతి నుండి వజ్రం లభిస్తుందని సిద్ధాంతీకరించాడు. వజ్ర కరూరు, హంపీ ప్రాంతాలలో తిరుగుతూ ఖనిజాన్వేషణ సందర్భంలో పరిశోధించిన అంశాలను పొందుపరుస్తూ 'తల్లిరాయి' అనే పుస్తకాన్ని కూడా రచించారు. పురాతన కాలంగా వస్తున్న నమ్మకం ప్రకారం బొగ్గు నిక్షేపాల నుండి వజ్రాలు వెలికితీస్తారని భావించేవారు కాని దానిని త్రోసిపుచ్చుతూ తల్లిరాయి ద్వారా వజ్రం వస్తుందని శాస్త్రీయంగా వెంకయ్య సిద్ధాంతీకరించారు. అంతేగాక ఖనిజశాస్త్ర పరిశోధకులు దానిని అంగీకరించారు. వజ్రపు తల్లి రాయిని వెంకయ్య కనుగొన్నారు. వజ్రాల తవ్వకంలో నిష్ణాతుడైనందున "డైమండ్ వెంకయ్య" అని పిలువబడ్డాడు. అందుకే భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత వెంకయ్యను ఖనిజశాఖ పరిశోధనా విభాగంలో సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. 1960 వరకు ఆయన ఆ పదవిలో ఉన్నారు. 1924-1944 వరకు నెల్లూరులో మైకాపై పరిశోధనలు చేశారు.

వెంకయ్య లాహోర్ వెళ్ళి అచ్చటి కాలేజిలో చేరి ఉర్దూ, జపనీస్ భాషలు అభ్యసించి వివిధ డిప్లొమాలు సంపాదించారు. 'గోటే' అను జపానీయ పండితుని వలన జపాన్ భాషను అభ్యసించారు. 1913 లో బాపట్లలోని ఒక స్కూల్లో జపనీస్ భాషలో ప్రసంగించి "జపాన్ వెంకయ్య"గా గుర్తింపు పొందారు. జపాన్ భాషపై ఇష్టాన్ని పెంచుకోవడానికి కారణం 1905లో చిన్న దేశమైన జపాన్ పెద్ద దేశమైన రష్యాను ఓడించడమే.

రెండవ బోయర్ యుద్ధ సమయంలో (1899- 1902) బ్రిటన్ జాతీయ జెండా అయిన యూనియన్ జాక్‌కు సైనికులు సెల్యూట్ చేయవలసి వచ్చినపుడు, భారతీయులకు ప్రత్యేకంగా జెండా ఉండవలసిన అవసరాన్ని వెంకయ్య గ్రహించాడు. కాంగ్రెస్ సమావేశాలలో బ్రిటీష్ జెండాను ఎగురవేయాలనే ఆలోచనను వ్యతిరేకించినందున, భారత జాతీయ కాంగ్రెస్ కోసం ఒక జెండాను రూపొందించడానికి వెంకయ్య ప్రేరణ పొందారు. అలాగే బంకించంద్రచటర్జీ వందేమాతర గీతాన్ని రచించారు. దేశభక్తిని చాటే ఈ గీతం యువతను ఉత్తేజపరచింది. రవీంద్రనాథ్ ఠాగూర్ "జనగణమన" గీతాన్ని రచించారు. 1912 లో తొలిసారిగా ఆ గీతం "తత్త్వబోధిని" పత్రికలో "భారత విధాత" అనే పేరుతో ప్రచురితమైంది. ఈ రెండు గీతాలు వెంకయ్యలో స్ఫూర్తిని నింపాయి. దేశానికి ప్రత్యేక జెండా ఉండాలనే తపనతో 1906 నుండి అఖిల భారత కాంగ్రెస్ మహాసభలకు హాజరవుతూ పతాక ఆవశ్యకతను నొక్కి చెబుతూ వచ్చాడు. అది 1921 ఏప్రిల్ 1వ తేదిన గాంధీజీ ఆమోదాన్ని పొందగలిగింది. వెంకయ్య 30 దేశాల జాతీయ పతాకాలను సేకరించి, వాటి రూపు రేఖలను, వాటిల్లో అంతర్లీనమైన దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేశాడు. "A National Flag For India"

అనే గ్రంథాన్ని 1916లో ప్రచురించి అందులో అన్ని దేశాల పతాక స్వరూపాలను విశ్లేషించారు. 1921, మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీలలో గాంధీజీ విజయవాడ వచ్చినపుడు జాతీయ పతాక ప్రస్తావన చేసి వారికి ఒక నమూనా చూపించారు.

వెంకయ్య మొదటి జెండా ఎరుపు మరియు ఆకుపచ్చ రంగులలో ఉంది. ఈ జెండాను గాంధికి బహుకరించారు. అయితే గాంధీజీ సూచన మేరకు తెల్లటి గీతను జోడించారు. మరల గాంధీజీ ఖాదీ చరఖా ఉంటే బాగుంటుందనీ అలా మార్పు చేయమని వెంకయ్యకు సూచించారు. మూడు గంటల వ్యవధిలో వెంకయ్య గాంధీజీ భావాలకు అనుగుణంగా త్రివర్ణ పతాకాన్ని రూపొందించి గాంధీజీకి చూపించారు. భారతదేశంలో త్రివర్ణం అంటే జాతీయ పతాకానికి చిహ్నం మరియు దేశ స్వాతంత్ర్యానికి అది ప్రతీక. Young India పత్రికలో గాంధీజీ "Our National Flag" అనే వ్యాసంలో 3 గంటలలో వెంకయ్య జెండా రూపకల్పన చేసిన అంశం ప్రస్తావించారు. ఆ ప్రకటనతో పింగళి వెంకయ్య "జెండా వెంకయ్య" గా ప్రసిద్ధికెక్కారు. ప్రజలలో దేశ సేవాసక్తిని పెంచుటకు, చైనా దేశపు ప్రజోద్యమ నాయకుడగు 'సన్‌యట్‌సేన్' యొక్క జీవిత కథను తెలుగులో వెంకయ్య రచించెను. 1929 డిశంబర్ 31న లాహోర్‌లో కాంగ్రెస్ సంస్థ అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ జెండాను ఆవిష్కరిస్తూ ఇది సంపూర్ణ స్వాతంత్ర్య జెండా అంటూ ఇప్పుడు ఈ జెండా ఆవిష్కరించబడింది అన్నారు. 1931లో జాతీయ జెండా కమీటిని కరాచీ సమావేశంలో ఏర్పాటు చేశారు. పతాకంలో రంగులు ఏ వర్గానికి చెందకూడదని కార్యకర్తలు భావించారు. ఎరుపు రంగుకు బదులు త్యాగానికి మారుపేరైన కాషాయాన్ని పొందు పరచాలని నెహ్రూ అభిప్రాయపడ్డారు. 1947 జూలైలో జరిగిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో జాతీయ పతకాన్ని ఆమోదించారు. స్వాతంత్ర్యానంతరం ఆ రంగులు అలాగే మిగిలిపోయాయి కాని మధ్యలో చేర్చిన చరఖాకి బదులు అశోక చక్రవర్తి ధర్మ చక్రం చిహ్నంగా జెండాలో అమర్చారు. 1947 ఆగష్టు 15 నుండి 1950 జనవరి 26వ తేదీ వరకు పతాకం భారత డొమినియన్ పతాకంగాను తరువాత గణతంత్ర ప్రజాస్వామ్య రిపబ్లిక్ జెండాగాను ప్రకటించబడింది. జెండాపై ఎలాంటి అక్షరాలు రాయకూడదు. భారత తొలి ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మన త్రివర్ణ పతాకానికి ఇచ్చిన వివరణ అద్భుతమనే చెప్పాలి. జాతీయ పతాకంలోని పై పట్టీలో ఉన్న కాషాయం రంగు త్యాగానికి గుర్తు ఇది స్వలాభాన్ని విడిచి పెట్టి తమ కర్తవ్యానికి అంకితం కావాలని సూచిస్తుంది. మధ్యలో తెలుపురంగు స్వచ్ఛతని, శాంతిని, నిజాయితిని, వెలుగునకు గుర్తు. క్రిందనే ఉన్న ఆకుపచ్చ రంగు విశ్వసనీయతని, ప్రకృతిని, పాడిపంటల్ని, సంపదను సూచిస్తుంది. మానవ ధర్మాన్ని ప్రబోధించే అశోక చక్రవర్తి ధర్మచక్రం నీలి రంగులో నిజాయితీకి ప్రతీకగా నిలుస్తుంది. అశోక చక్రంలో ఉన్న 24 ఆకులు (Spoke) ప్రతి వ్యక్తి నిర్వర్తించాల్సిన విధులను తెలియజేస్తాయి. అయితే ప్రముఖుల మరణ సమయంలో వారి పార్థివ శరీరంపై జాతీయ పతాకాన్ని కప్పి, దహన సమయంలో లేదా ఖనన సమయంలో దానిని తొలగించాల్సి ఉంటుంది.

పింగళి వెంకయ్య నిస్వార్థ సేవకుడు, నిజాయితీగల జాతీయ భావవాది, ఆదర్శవాది. ఒక ఉన్నత పరిశోధకుడు, నిరాడంబర రాజకీయ వేత్త. మరణానికి చేరువైన రోజుల్లో కూడా తన పార్థివ దేహంపై జెండాను కప్పమని కోరిన నిస్వార్థ దేశ సేవకుడు. గాంధీజీ సిద్ధాంతాల ప్రకారం వెంకయ్య జీవించారు. కాని చివరి రోజులలో సాపేక్ష పేదరికంలో 1963, జూలై4వ తేదీన విజయవాడలో కన్నుమూశారు. 1986లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై వివిధ రంగాల ప్రముఖుల విగ్రహాలతోపాటుగా పింగళి వెంకయ్య విగ్రహాన్ని కూడా స్థాపించారు. పింగళి వెంకయ్య 132వ జన్మదిన సందర్భంగా అయిదు రూపాయల స్మారక తపాళా బిళ్లను పోస్టల్‌శాఖ ప్రచురించగా 2009 ఆగష్టు 12వ తేదీన అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్. యెదుగూరి సందింటి రాజశేఖర రెడ్డి విడుదల చేశారు. 2015, జనవరి 4వ తేదీన పింగళి వెంకయ్య కాంస్యవిగ్రహాన్ని అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామాత్యులు ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంగణంలో ఆవిష్కరించినారు. భారతీయులంతా గర్వంగా తలయెత్తి తిలకిస్తూ, తలవంచి గౌరవించే త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరు చరిత్రలో శాశ్వితంగా నిలిచిపోతుంది.

మి

గారపాటి కోటమ్మ
హిస్టరీ లెక్చరర్, ఎస్.కె.వి.టి. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్,
రాజమండ్రి, ఫోన్ : 9441638653




# తెలుగు పౌరాణిక సినిమా

– కొట్టు శేఖర్

భారత చలన చిత్ర నిర్మాణం 1913 లో రాజా హరిశ్చంద్రతో ప్రారంభమయ్యిందన్న విషయం అందరికీ విదితమే. నిజానికి ధుండి రాజ్ గోవింద్ ఫాల్కే నిర్మించిన ఈ నిశ్శబ్ద చిత్రానికి ఒక సంవత్సరం ముందే రామచంద్ర గోపాల్ తోర్నే (దాదా సాహెబ్ తోర్నే) *శ్రీ పుండలీక* అనే చిత్రాన్ని నిర్మించినా రాజా హరిశ్చంద్ర ప్రాసెసింగ్ పూర్తిగా భారత దేశంలోనే జరుగగా శ్రీ పుండలీక సాంకేతిక ప్రక్రియ విదేశాల్లో జరగడం వలన రాజా హరిశ్చంద్రనే మొట్ట మొదటి భారతీయ చిత్రంగా పరిగణిస్తారు.

చలన చిత్ర నిర్మాణం తొలినాళ్ళ నుండి 1950 వ దశకం వరకు రాశిలో లో పౌరాణిక చిత్రాలదే పై చేయి. దీనికి కారణాలు నాలుగు. 1. దేశంలో అధిక సంఖ్యాకులైన హిందువులు భక్తి ప్రవత్తులు కలిగి పారిమార్థికత పట్ల ఆసక్తి కలిగి ఉండడం, 2. అప్పటికే పురాణ గాథలు, పౌరాణిక నాటకాలు ప్రజానీకంలో ప్రాచుర్యం పొంది ఉండడం, 3. పౌరాణిక చిత్ర నిర్మాణానికి కావలసిన మూల కథ, పాత్రలు, చిత్ర గమన రచన, నటనా విధానం, సంభాషణలు–ముఖ్యంగా పద్యాలు, భావ వ్యక్తీకరణ వివరాలు, అలంకరణలు, ఆహార్యం–స్థిరీకరించిన నిర్దిష్టమైన మూసలో సులువుగా లభ్యం కావడం మరియు 4. నాటికి ఆధునిక జీవన సరళి సమాజంలోకి చొచ్చుకు పోలేదు గనుక ప్రజలకు పౌరాణికాలు పట్ల మక్కువ తగ్గకపోవడం. ఈ కారణాలచేత భారత చలన చిత్రాల తొలి అడుగులు పౌరాణిక గాథలవైపే పడ్డాయి. మరాఠీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ రంగాలు పౌరాణికాలతో పయనించగా హిందీ, బెంగాలీ దర్శక నిర్మాతలు మాత్రం 1930 ల నుండే 'సోషల్ డ్రామా' లేదా సమకాలీన ఇతివృత్తాల వైపు మొగ్గు చూపడం గమనార్హం. హిందీ భాషా చిత్రాలలో పౌరాణికాలతో పాటు, సామాజిక, జానపద, చారిత్రక చిత్రాలు సమ నిష్పత్తి లో ఉండేవి. *'రాజా హరిశ్చంద్ర', 'శ్రీ పుండలీక'* లతో మొదలైన ఆ అమృత ధార నిర్విఘ్నంగా మరొక ఆరు దశాబ్దాల పాటు అన్ని భాషా చిత్ర సీమలను – ముఖ్యంగా తెలుగు సినీ రంగాన్ని, సుసంపన్నం చేసింది.

1940 వ దశకానికి సినిమా మన సంస్కృతిలో విడదీయరాని అంగమై పోయింది. తమిళ, మరాఠీ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమల్లో నిర్మించిన పౌరాణికాలు రంగస్థలం నుండి నేరుగా తెరపై సాక్షాత్కరించినవే. ఆ కాలంలో తెలుగులో నిర్మించిన పౌరాణిక చిత్రాలన్నీ పద్య నాటకం పై ఆధారపడి చిత్రీకరించినవే. అలాగే పద్యనాటకాలలో గాథలన్నీ పురాణేతిహాసాల నుండి ఉద్భవించినవే. పురాణ గాథల పుట్టు పూర్వోత్తరాలపై భిన్నాభిప్రాయాలున్నవి. చరిత్రకారులు, మానవ శాస్త్ర వేత్తలు, భాషావేత్తలు, భాష్యకారులు తమ తమ రంగాలకు చెందిన పద్ధతుల ద్వారా (కొన్ని శాస్త్రీయమైనవి కాగా మరికొన్ని అశాస్త్రీయమైనవి) పురాణాన్ని నిర్వచించారు. విశ్వజనీయమైన దృష్టితో చూసినట్లయితే పురాణమనేది మతంలో ఒక పార్శ్వంగా సాక్షాత్కరిస్తుంది. ప్రజలలో భక్తి ప్రవత్తులు పెంపొందించడానికి ఉపయోగించే ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. హిందూ మత గ్రంథాలలో, ధర్మ శాస్త్రాలలో నిక్షిప్తమైన ఆ గాథల సృష్టికర్తల గురించి ఖచ్చితమైన సమాచారం లేదు. కానీ విశాలమైన ఉపఖండపు భూభాగంలో భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యం నడుమ విస్తరించి వేళ్లూనుకున్న బహుళ సాంప్రదాయం లో పుట్టి, విరాజిల్లిన పురాణగాథల సమయ కాలంలో ఎక్కడా తప్పులు దొర్లలేదు. ఒక పురాణంలో అగుపించే పాత్ర మరొక గాథలో అగుపించదు.

శతాబ్దాలపాటు పాటు 'ఇవోల్వ్' కాబడిన ఈ పురాణాల కాల గతి ఖచ్చితంగా పాటించ బడింది. కొన్ని వందల 'రామాయణాల్లో' ఇతివృత్తం దెబ్బ తినకుండా పిట్ట కథల సృష్టి జరిగింది. ఈ ఉపాఖ్యానాలు (అనెక్ డోట్స్), మౌఖిక ఇతిహాసాలు (ఓరల్ హిస్టరీస్) మరియు ఉపవచనాలు (సబ్‌టెక్స్ట్) కాలక్రమేణా గ్రంథ, పద్య, గద్య, నాటక రూపాల్లో ప్రజల ముందుకు వచ్చాయి.

అవి కొన్ని శతాబ్దాలపాటు రూపాంతరం చెంది మన సంస్కృతిలో అంతర్భాగమయ్యాయి. పురాణేతిహాసాలుగా ప్రజల మన్ననలను పొందిన ఈ కథలు రామాయణ, మహాభారత, భాగవత, ఇతర పురాణాలనుండి సంగ్రహించబడి కవులు, నాటకకర్తలు, యోగులు, తత్వవేత్తలు, వాగ్గేయకారుల కల్పనా చాతుర్యానికి, సృజనాత్మకతకు, కళాతృష్ణకు అద్దం పడతాయనడంలో సందేహం లేదు. పురాణేతిహాసాలు సమకాలీన సమాజాన్ని కాచివడపోసే సమగ్ర వ్యాఖ్యానాలు. చతుర్విధ పురుషార్థాలకు దర్పణాలు. అవి సమకాలీన సమాజపు విలువలను ప్రతిబింబిస్తాయి. అందుచేతనే హైందవ పురాణేతిహాసాలు పితృస్వామ్య వ్యవస్థను శ్లాఘిస్తాయి. హేతువు, శాస్త్రీయ దృక్పథం మచ్చుకైనా కానరావు. ఆ మాటకొస్తే ఈ అవలక్షణాలు ప్రపంచ పౌరాణిక గాథలన్నింటిలోనూ కానవస్తాయి. మన పౌరాణికాలు వర్ణవ్యవస్థను, కుల పీడనను అక్కడక్కడా కొన్ని పాత్రల ద్వారా ఎండగట్టినా, స్థూలంగా 'యథాస్థితి' (స్టేటస్ కో)ని కొనసాగించడమే ధ్యేయంగా మనుగడ సాగించాయి. అయితే ఆ గాథలలో ఔన్నత్యాన్ని, సందేశాన్ని, కాల్పనిక గాథా రచనా కౌశలాన్ని, కొంత ప్రగతిశీలక పోకడలను తృణీకరించనలవి కాదు. మానవాతీత విన్యాసాలు, అతిశయోక్తులు, అతీంద్రియ శక్తులు, పాప పుణ్యాల చర్చ, కర్మ సిద్ధాంతాలు, కలబోసి రంగరించిన ఆ గాథలు మన సంస్కృతికి దృఢమైన నైతిక, తాత్విక పునాదులుగా భాసిల్లుతున్నాయని చెప్పక తప్పదు. నాస్తికుడైన రామ్ మనోహర్ లోహియా భారతీయ పురాణాలను వాటి అంతః సూత్రాలను లోతుగా అధ్యయనం చేసి అవి భారతీయ 'మూర్తిమత్వాన్ని' (ఇండియన్ పర్సనాలిటీ) మలిచాయని సెలవిచ్చాడు. ఈ పురాణగాథలను, గౌణేతిహాసాలను (సెకండరీ ఎపిక్స్) తెరపై అద్భుతంగా ప్రతిష్టించిన శిల్పులను వారి చాతురీ ధురీణతను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది.

తొలి తరం పౌరాణిక చిత్రాల దర్శక నిర్మాతలకు భారత ప్రేక్షకలోకం ఎల్లవేళల ఋణపడివుంటుంది. తమిళంలో రాజా కే శాండో, ఆర్.పద్మనాభన్, పీవీ రావు, కృష్ణ స్వామి సుబ్రహ్మణ్యం, ఎల్లిస్ ఆర్ దంజోన్ (అమెరికన్ అయిన ఈయన భారత సంస్కృతి పట్ల ఆకర్షితుడై తమిళ పౌరాణిక చిత్రాలను నిర్మించాడు), వై.వీ.రావు (యర్రగుడిపాటి వరదా రావు), బీ.ఎన్. రావు (ఈయన అసలు పేరు బాలకృష్ణన్ నాయర్), హిందీలో కంజీభాయ్ రాథోడ్, నాను భాయ్ వకీల్, తెలుగులో హెచ్ ఎం రెడ్డి, చిత్తజల్లు పుల్లయ్య, వై.వీ.రావు, మునిపల్లె సుబ్బారావు, రఘుపతి సూర్య ప్రకాష్ (రఘుపతి వెంకయ్య నాయుడు కుమారుడు), చిత్రావు నరసింహారావు, చిత్రావు నారాయణ మూర్తి, కడారు నాగభూషణం, కాళ్ళకూరి సదాశివ రావు, పీ.పుల్లయ్య,




మరాఠీలో భారత సినిమా పితామహుడు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే (దాదాసాహెబ్), బాబురావు పెయింటర్, ఉపఖండపు సినీ ప్రేక్షకులకు చిరపరచితుడైన రాజారామ్ వాంక్రుడే శాంతారాం (ఈ దర్శక దిగ్గజం 1931 నుండి 1970 దశకం వరకు రత్నాలలాంటి చిత్రాలను నిర్విరామంగా ప్రేక్షకులకు అందించిన ఏకైక దర్శకుడు), విక్రమ్ బెడెకర్, వై.వీ. రావు, కన్నడంలో కృష్ణ స్వామి సుబ్రహ్మణ్యం, వై.వీ.రావు, మలయాళంలో కృష్ణస్వామి సుబ్రహ్మణ్యం అనేక పౌరాణిక చిత్రాలను నిర్మించి నాటి ప్రేక్షకులను రంజింపజేశారు. పైన పేర్కొన్న వారిలో వై.వీ.రావు మాత్రమే తెలుగు, మరాఠీ, కన్నడ, తమిళ భాషలలో చిత్రాలను నిర్మించి తెలుగు వారికి గర్వకారణమయ్యారు. పైన ఉదహరించిన వారంతా అపారమైన దర్శకత్వ ప్రతిభ కలవారే. సాధ్యమైనన్ని చలన చిత్రాలను నిర్మించి చరిత్ర సృష్టించవలెనన్న తపన వీరిని అహరహమూ ప్రేరేపించేది. అనునిత్యమూ కళా ప్రక్రియలలో మునిగి తేలుతూ చిత్ర నిర్మాణంలో వినూత్న ప్రయోగాలకు తెర తీసి మన సాంస్కృతిక చరిత్రకు, బహువిధ సంస్కృతికి దశాబ్దాల పాటు సేవలందించిన ఈ లబ్దప్రతిష్టులను అభినవ విశ్వకర్మలుగా కొనియాడ వచ్చును. కాళిదాస (1931) నుండి మాయాబజార్ (1957) వరకు తెలుగు చలన చిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య నాయుడు ఆయన కుమారుడు రఘుపతి సూర్య ప్రకాష్ కలిసి నిర్మించిన నిశ్శబ్ద చిత్రం భీష్మ ప్రతిజ్ఞ (1921) తెలుగులో తొలి చలన చిత్రం. 1931లో తొలి తెలుగు టాకీ చిత్రం 'కాళిదాస' విడుదలైనప్పటినుండి నేటి వరకు సుమారు రెండు వందల పౌరాణిక చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఆస్వాదిం చారు. తొలి దశాబ్దమున్నర కాలంలో తెలుగులో తొంభై శాతం

పౌరాణికాలు నిర్మిత మయ్యాయి. 1940 వ దశకం నడుమ నుండి సాంఘిక చిత్రాల వైపు చిత్రసీమ బుడి బుడి అడుగులు వేయడం ప్రారంభించింది. హెచ్ ఎం రెడ్డిగా తెలుగు వారికి సుపరిచితులైన హనుమప్ప మునియప్ప రెడ్డి కాళిదాసు ను తెలుగు తమిళ భాషలలో నిర్మించి బహుభాషల్లో ఒకే చిత్రాన్ని తీసిన తొలి భారతీయ దర్శకుడిగా ఖ్యాతి గాంచారు. తొలి టాకీ చిత్రం 'ఆలం ఆరా' నిర్మాత దర్శకుడు అర్దే షేర్ ఇరానీ ఈ చిత్రాన్ని నిర్మించారు. జర్మన్ పరికరాలతో హడావుడిగా నిర్మించిన 'కాళిదాసు' సాంకేతిక లోపాలను అధిగమించలేకపోయినా విమర్శకుల ప్రశంసలను మాత్రం అందుకుంది. హీరో వెంకటేసన్ తెలుగు వారు కావున ఆయన తెలుగులో డైలాగులు చెప్పగా కథానాయిక రాజ్యలక్ష్మి తమిళంలో సంభాషించారు. కొందరు కాళిదాసు తొలి తమిళ టాకీ చిత్రంగా పరిగణించినా సినీ విమర్శకుడు రండర్ గై (మాడభూషి రంగదొరై) కాళిదాసును తొలి భారతీయ బహుభాషా సినిమాగా అభివర్ణించారు. కాళిదాసు నుండి తెలుగు పద్యనాటకాలు తెర పైకి ఎక్కడం అనే ప్రక్రియ ప్రారంభమయ్యి పౌరాణిక సినిమా నిర్యాణం చెందిన వరకు అప్రతిహతంగా కొనసాగింది.

1890 నుండి 1930ల మధ్యలో విరచితమైన పౌరాణిక పద్య నాటకాలే పౌరాణిక సినిమాలకు కథ, సంభాషణలను సమకూర్చి పెట్టాయి. పాండవ ఉద్యోగ విజయాలు, *సత్య హరిశ్చంద్ర, సతి సావిత్రి, లంకా దహనం, మోహిని భస్మాసుర, ద్రౌపది వస్త్రాపహరణం, శకుంతల, ప్రహ్లాద* మొదలగు బహుళ ప్రాచుర్యం పొందిన కథలే హెచ్ ఎం రెడ్డి, చిత్తజల్లు పుల్లయ్య, వై వీ రావు, (పుల్లయ్య, రావులిరువురూ రఘుపతి వెంకయ్య శిష్యరికం నెరిపారు) చిత్రపు నరసింహ రావు, చిత్రాపు నారాయణ మూర్తి, పీ పుల్లయ్య లాంటి దర్శక రత్నాల కరస్పర్శ వలన కళా ఖండాలుగా రూపు దిద్దుకున్నాయి. రాసి వాసిల పరంగా చిత్తజల్లు పుల్లయ్యను పౌరాణిక చిత్రాల దర్శక సామ్రాట్టుగా పేర్కొనవచ్చును. పైన పేర్కొన్న నాటకాలలో కెల్లా పేరుగాంచి నది బలిజేపల్లి లక్ష్మీకాంత రావు రచించిన సత్య హరిశ్చంద్ర. ఈ నాటకం ఇప్పటివరకు తొమ్మిది భారతీయ భాషల్లో ఇరవై ఐదు సార్లు సినిమాగా వచ్చింది. బలిజేపల్లి లక్ష్మి కాంత కవిగా సుపరిచితుడైన ఈయన కవిగా, నాటక రచయి తగా, సంభాషణ రచయి తగా నటుడిగా తన బహుముఖ ప్రజ్ఞతో తెలుగు ప్రేక్షక లోకాన్ని అలరించాడు. ఆంధ్ర నాటక పితామహుడైన ధర్మవరం


ఘటోత్కజుని మాయ

రామకృష్ణా చార్యులు, చందాల కేశవ దాసు, వల్లభ జోస్యుల రమణ మూర్తి, కోలాచలం శ్రీనివాసరావు, నాదెళ్ల పురుషోత్తం, కత్తి వీరాస్వామి, వడ్డాది సుబ్బరాయ కవి, నాగినేని వెంకట కవి, తిరుపతి వెంకట కవులు (దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెల్ల పిళ్ల వెంకట శాస్త్రి), చిలకమర్తి లక్ష్మి నరసింహం, పింగళి నాగేంద్ర రావు, తాపీ ధర్మ రావు, తాంధ్ర సుబ్రహ్మణ్యం, సముద్రాల ప్రభృతుల నాటకాలు, సంభాషణలు తెలుగు సినిమాకు ఆలంబనమయ్యాయి. వీరే కాక సురభి వారి నాటకాలు కూడా తెలుగు సినిమాకు సాంకేతిక పరంగా దిక్సూచిలా ఉపయోగపడ్డాయి.

పౌరాణికాల్లో నటించిన తొలి తరం నటీనటులలో ప్రముఖులు యదవల్లి సూర్యనారాయణ, సురభి కమల బాయి, కళ్యాణం (ఈల పాట) రఘురామయ్య, వేమూరి గగ్గయ్య, పారుపల్లి సుబ్బారావు, సీనియర్ శ్రీరంజని, ఎస్ రాజం, కన్నాంబ, ఋష్యేంద్ర మణి, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, ముదిగొండ లింగమూర్తి, అద్దంకి శ్రీరామమూర్తి, రామతిలకం, గౌరినాథ శాస్త్రి, పారుపల్లి సత్యనారాయణ, సి.హెచ్.నారాయణ రావు, నాగయ్య, కృష్ణవేణి, గరికపాటి వరలక్ష్మి, పువ్వుల సూరిబాబు, మొదలగువారు. వీరిలో నారాయణ రావు, నాగయ్య, కన్నాంబ, ఋష్యేంద్రమణులు, వరలక్ష్మిలు 1960, 70 దశకాల వరకు ముఖ్య పాత్రలలో నటించారు. ఈస్ట్ ఇండియా ఫిలిమ్స్, చమరియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్, ఆంధ్ర సినీ టోన్, వేల్ పిక్చర్స్, సౌత్ ఇండియా మూవీ టోన్, అరోరా ఫిలిమ్స్, శోభనాచల మోషన్ పిక్చర్స్, రాజరాజేశ్వరి ఫిలిమ్స్, ప్రతిభ పిక్చర్స్, ఏ వీ ఎం స్టూడియో, నాటి ప్రముఖ నిర్మాణ సంస్థలు కాగా వై వీ రావు, ఘంటశాల బలరామయ్య, మీర్జాపురం రాజా, ఏ వీ మెయ్యప్పన్ ప్రముఖ నిర్మాతలుగా ప్రసిద్ధి కెక్కారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంలో తొలి మహిళా నిర్మాత అయిన దాసరి కోటిరత్నాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడం ఎంతైనా సబబు. ఆమె 1935 లో సతీ అనసూయ చిత్రాన్ని నిర్మించారు.

ఆ తరం పౌరాణిక చిత్రాలకు గాలిపెంచల నరసింహ రావు, భీమవరపు నరసింహా రావు, హెచ్ ఆర్ పద్మనాభ శాస్త్రి, సాలూరు రాజేశ్వర రావు, పెండ్యాల నాగేశ్వర రావు, ఆర్ సుదర్శనం లాంటి మేటి సంగీత దర్శకులు స్వర కల్పన చేయగా భారీ సెట్లను కళా దర్శకులు, ఏ.కె. శేఖర్, గణపతి రావు వాడాంగేకర్, కె నాగేశ్వర రావు, టీ. వీ. సుబ్బారావు, తంగిరాల వెంకట సుబ్బయ్య శర్మ (టీ వీ ఎస్ శర్మ గా జగద్విఖ్యాతమయ్యారు)లు రూపొందించే వారు. అలంకరణ, ఆహార్యాన్ని జీ. సుబ్బారావు, కోటేశ్వర రావులు పర్యవేక్షించేవారు.

*మాయా బజార్* (1957) నుండి *దాన వీర శూర కర్ణ* (1977) వరకు 1940 వ దశకం ద్వితీయార్ధంలో పౌరాణిక చిత్రాల నిర్మాణం మందగించింది. జాతీయోద్యమం, గ్రంథాల యోద్యమం, బ్రాహ్మణాధిపత్య వ్యతిరేక ఉద్యమం, వామ పక్ష భావజాల వ్యాప్తి, చివరకు స్వాతంత్ర సిద్ధి వలన సినిమా సామాజికాంశాల వైపు దృష్టి సారించింది. అంతే కాక పెరిగిన పట్టణీకరణ, రేడియో జనిత ఆధునిక ఆలోచనలు, భావాల వ్యాప్తి, పెరిగిన జీవన ప్రమాణాలు ప్రేక్షకులను సోషల్ డ్రామాల పట్ల ఆకర్షితులను చేశాయి. బహుశా ఈ కారణాల చేతనే 1946 నుండి 1957 వరకు పట్టుమని పది పౌరాణికాలు కూడా విడుదల కాలేదు. కానీ అనూహ్యంగా 1957లో ఐదు పౌరాణిక చిత్రాలు విడులయ్యాయి. వాటిలో ఒకటి తెలుగు చలన చిత్రలోకానికే తల మానికమైన '*మాయా బజార్*'. ఈ చిత్రరాజం తెలుగు సినీ చరిత్రను తిరగ వ్రాసింది. అప్పటి వరకు పౌరాణిక చిత్రాల నిర్మాణంలో అవలంబిస్తూ వచ్చిన పద్ధతులను తోసి రాజని నూతన సాంకేతికతను ప్రవేశపెట్టి నరి కొత్త రూపావళిని (ప్యారడైమ్) సృష్టించింది. సుప్రసిద్ధ నాటకమైన శశిరేఖా పరిణయం అప్పటికే మరాఠీ, తమిళ, తెలుగులో తెరకెక్కింది.

కానీ 1957 లో విజయా నిర్మాణ సంస్థ కదిరి వెంకట రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన '*మాయా బజార్*' భారత చలన చిత్ర, ముఖ్యంగా తెలుగు పౌరాణిక చిత్ర నిర్మాణంలో మైలు రాయిగా నిలిచిపోయింది. భారీ తారాగణం, కళ్ళు మిరుమిట్లు గొలిపే సెట్లు, అత్యున్నత మైన సాంకేతిక విలువలు, నటీ నటుల ఎంపిక, మధురమైన స్వరాలు, కొత్త ఒరవడిని సృష్టించిన ఛాయాగ్రహణం, గిలిగింతలు పెట్టే హాస్యం అన్నింటినీ మించి ఉన్నత స్థాయి అభినయం కలబోసి మాయా




బజార్‌ను ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలిపాయి. నిజానికి మాయా బజార్‌ను ఆ తరువాత వచ్చిన పౌరాణిక చిత్రాలతో పోల్చితే అది ఒక ఫాంటసీలా అనిపించవచ్చును. ఉద్రేక పూరిత, విషాద సన్నివేశాలు, పద్యాలు లేని పౌరాణికం మాయా బజార్. అయినా నేటికీ ఆబాల గోపాలాన్ని అలరించడానికి కారణాలు బ్రహ్మాండమైన కథా గమనం (స్క్రీన్ ప్లే), కృష్ణ, ఘటోత్కచ, శశిరేఖల పాత్రలు, వాటిని నభూతో న భవిష్యతి అన్నట్లుగా పోషించిన ఆ ముగ్గురు అతిరథులు. తెలుగు సినిమా ప్రపంచంలో నట శిఖరాలను అధిరోహించిన కారణజన్ములు రామారావు, సావిత్రి, రంగారావులు. నిరుపమాన ప్రతిభా సంపన్నులైన ఈ నటత్రయం ధరించిన ఆ మూడు పాత్రలు తెలుగు ప్రేక్షకుల నీరాజనాలందుకోగా శ్రీకృష్ణుడిగా ఎన్టీఆర్ ఆర్జించిన కీర్తి అజరామరం. కృష్ణుని పాత్ర పోషణలో ఆయన కనపరచిన కొంటె తనం, సొగసు, సమ్మోహనాస్త్రం లాంటి చిద్విలాసం, రవి వర్మ వడ్డాది పాపయ్యల కుంచెల నుండి జాలువారి నట్లు మనోహరమైన కనుముక్కు తీరు తెలుగు సాంస్కృతిక యవనికపై ఆయనను శాశ్వత కృష్ణునిగా ప్రతిష్ఠించాయి. ఆయన కృష్ణ పాత్ర ధారణ ఆ చిత్రంతో ఆగిపోక మరొక రెండు దశాబ్దాలపాటు నిరాటంకంగా సాగి పదమూడు సార్లు తెలుగు ప్రేక్షక లోకాన్ని రెండు సార్లు తమిళ ప్రజలను అలరించింది. అదే సంవత్సరం వినాయక చవితిలో ఆయన కృష్ణుని పాత్రలో దర్శనమిచ్చాడు. దీపావళి, *శ్రీకృష్ణార్జున యుద్ధం, వీరాభిమన్యు, కర్ణ (తమిళం), శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణ పాండవీయం, శ్రీకృష్ణావతారం, శ్రీకృష్ణ విజయం, శ్రీకృష్ణ సత్య, శ్రీకృష్ణ ఆంజనేయ యుద్ధం, దానవీరశూరకర్ణ* మరియు *శ్రీమద్విరాటపర్వం* ఎన్టీఆర్‌ను కలియుగ కృష్ణునిగా తెలుగు వారి మనః ఫలకంపై ముద్రించాయి.

1957 నుండి మణిపూసల్లాంటి పౌరాణిక చిత్రాలను వివిధ నిర్మాణ సంస్థలు తెలుగు ప్రేక్షకులకు అందించాయి.

ఈ సంస్థల్లో ముందు వరుసలో ఉన్నవి విజయా, ఎన్.ఏ.టీ (తరువాతి కాలంలో రామకృష్ణ సినీ స్టూడియోస్), బీ.ఏ.ఎస్ మరియు రాజ్యం పిక్చర్స్. తెలుగు వారి సాంస్కృతిక సంపదగా చెప్పుకోదగ్గ అనర్ఘ రత్నాల్లాంటి పౌరాణిక చిత్రాలను అందించిన దర్శక బ్రహ్మలు చిత్తజల్లు పుల్లయ్య (ఈయన తొలి తరం దర్శకుడు), కె వీ రెడ్డి, బీ.ఏ.సుబ్బారావు, కమలాకర కామేశ్వర రావు, ఎన్ టీ రామారావు, సీ ఎస్ రావు, బాపు. వీరిలో సిసిల్ డి మిల్లి (టెన్ కమాండ్మెంట్స్ దర్శకుడు) తో పోల్చదగ్గ కమలాకర కామేశ్వర రావుకే అగ్రతాంబూలమివ్వాలి. రాసి పరంగానే కాక వాసి పరంగా కూడా ఆయన దర్శకత్వం వహించిన పౌరాణిక చిత్రాలన్నీ దృశ్య కావ్యాలే. పౌరాణిక చిత్రాలకు మాయాబజార్ ద్వారా కొత్త బాష్యాన్ని కె వీ రెడ్డి చెబితే, ఆ ప్రక్రియకు పరిపూర్ణత చేకూర్చింది కమలాకర, నందమూరిలే. సంగీతం విషయానికి వస్తే అమర గాయకుడు ఘంటశాలకు వంద డాక్టరేటులిచ్చినా చంద్రునికి నూలుపోగే. ఆయన గంధర్వ గానం, ఆర్ద్రతతో పద్యాలను ఆలపించే తీరు, కట్టిన శ్రావ్యమైన బాణీలు తెలుగు వారి తరగని సాంస్కృతిక సంపదగా కొనసాగుతున్నాయి. అదే వరుసలో సాలూరు రాజేశ్వర రావు (ఈ స్వర మాంత్రికుడు సంగీత దర్శకులందరికన్నా ఎక్కువ కాలం సంగీతామృతాన్ని శ్రోతలకు పంచి పెట్టారు), పెండ్యాల నాగేశ్వరరావు, సుసర్ల దక్షిణ మూర్తి, టీ వీ రాజు, కె వీ మహ దేవన్‌లు తెలుగు ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. ఘంటశాలతో పాటు జిక్కి, లీల సుశీల, మాధవ పెద్ది, బాలమురళీ కృష్ణ, పిఠాపురం నాగేశ్వర రావు, బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణలు తమ మధుర గానంతో తెలుగు వారిని రంజింపజేయగా శిరోజాలంకరణ, వస్త్ర ధారణ, మేకప్ కళను ఔపాసన పట్టిన ఆహార్య నిపుణుడు పీతాంబరం తన నైపుణ్యంతో పురాణ పాత్రలలో జీవాన్ని నింపారు. వజ్రా ల్లాంటి ఈ సినిమాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నృత్యాలకు వెంపటి చినసత్యం హీరాలాల్లు రూప కర్తలు. భారీ సెట్లు, అంతర్గత అలంకరణ రూప రచనా దురంధరుడు భారత చలన చిత్ర చరిత్రలోనే సాటి లేని కళా దర్శకుడు అయిన టీవీఎస్ శర్మ తెలుగు పౌరాణిక చిత్రాలకు బంగారు మెరుగులు దిద్దారు. పౌరాణిక చిత్రాలకు ఛాయాగ్రహణం ఆయువు పట్టైనది ఆ రంగంలో శేముషులైన మార్కస్ బార్ట్లే, రెహ్మాన్, కమల్ ఘోష్, రవికాంత్ నగాయచ్‌ల ఇంద్రజాలం ప్రేక్షక లోకాన్ని సంభ్రమాశ్చ ర్యాలకు గురిచేసింది. కెమెరాతో వారు జరిపిన విన్యాసాల వన్నె దశాబ్దాల తరువాత కూడా అణు మాత్రమైనా తరగలేదు.




ఇక పోతే ఆ రెండున్నర దశాబ్దాల కాలంలో పౌరాణిక చిత్రాలు అందించిన రస గుళికల్లాంటి గీతాలు ఈనాటికీ తెలుగు ప్రజలను అలరిస్తూనే వున్నాయి. మాయా బజార్ ప్రధాన పాత్రధారులపై యుగళ గీతాలను చిత్రీకరించ డంతో ఒక 'ట్రెండ్' ను సృష్టించింది. 'లాహిరి లాహిరి'తో మొదలైన మలయ మారుతం 'మ్రోగింది కళ్యాణ వీణా' (కురుక్షేత్రం), 'చిత్రం భళారే చిత్రం' (దాన వీర శూర కర్ణ) వరకు వీస్తూ ప్రేక్షకులను గగన వీధుల్లో విహరింపచేసింది. ఆ గానమధువును మనకు పంచి ఇచ్చిన కవి శ్రేష్ఠులలో అగ్రగణ్యులు సముద్రాల రాఘవాచార్య. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈయన కథ, సంభాషణలు రచించడంలోనే కాక దర్శకత్వంలో కూడా అందె వేసిన చేయి. పింగళి నాగేంద్ర రావు, సి. నారాయణ రెడ్డి, కొసరాజులు సన్ని వేశాలకు తగ్గట్లుగా భావ గర్భితమైన మధుర గీతాలను కథలలోనికి చొప్పించి నీరాజనా లందుకున్నారు.

పౌరాణికాలలో సంభాషణలు కథా గమనానికి, పాత్ర ఔచిత్యం తెలపడానికి ఎంతగానో ఉపకరిస్తాయి. పద్యనాటకాలకు అలవాటు పడిన తెలుగు ప్రేక్షకులకు పౌరాణికాలలో గ్రాంధికమే రుచిస్తుంది. మాయాబజార్‌లో సంభాషణలు సోషల్ డ్రామాలో వలే ఉన్నా అటు తరువాత సినిమా లలో సంభాష ణలు గ్రాంధిక రూపు సంతరించుకోవడం మొదలు పెట్టాయి. అదే విధంగా నట నలో పాత్రపోషణలో గాంభీర్యం (సీరియస్‌నెస్) పెరిగింది. ఈ రెండు అంశాలు ( గ్రాంధిక భాష వాడుక, సీరియస్ నెస్) 'దాన వీర శూర కర్ణ' తో తారాస్థాయికి చేరుకున్నాయి. ఆ సినిమాలో దుర్యోధనుడు గ్రాంధిక భాషలో (సంస్కృతీకరించిన తెలుగు) పలికిన సుదీర్ఘ డైలాగులు, స్వగతాలు సామాన్యులకు అర్ధం కావనేది సత్యం. అయితే మిమిక్రీ కళాకారులు, సామాన్యులు (లక్షలలో) ఆ డైలాగులను కంఠస్థం చేయడానికి కారణం ఎన్ టీ రామారావు శిఖరాగ్ర నటన. శ్రీ కృష్ణపాండవీయంలో ప్రధమంగా




ఆ ప్రయోగం జరిగింది. అలాంటి సంభాషణల సృష్టి కర్తలైన సముద్రాల, కొండవీటి వెంకట కవి, పింగళి ధన్యులు. దానవీరశూరకర్ణ లో సంభాషణల రచనలో వెంకట కవికి సహాయకారిగా కత్తి పద్మారావు కూడా ముఖ్య పాత్ర వహించారని సత్యం నేటికీ నిగూఢంగానే ఉండిపోయింది.

ఇకపోతే తెలుగు పౌరాణిక చిత్రాలను మన సంస్కృతిలో ఒక అవిభాజ్య అంగంగా ఇమిడ్చిన యుగకర్త లలో అత్యంత ముఖ్యులు మన నటీ నట శిఖామణులు. ఒకొక్కరూ ఒక్కో జ్వాలాముఖి. తమ నటనా వైదుష్యంతో యావత్ భారతాన్నీ ఆశ్చర్య చకితులను చేశారు. ప్రతి తెలుగు ఇంటా, నోటా దశాబ్దాల పాటు వారి పేర్లే వినిపించింది. నేటికీ టీ వీ పై మాయా బజార్, నర్తన శాల, లవకుశ, దానవీరశూరకర్ణ లు దర్శనమిస్తే మైమరచి కనీసం కొన్ని సన్నివేశాలైన వీక్షించే తెలుగు వారు లక్షల్లో ఉన్నారు. యూ ట్యూబ్ సంగతి సరే సరి. ఆ నట ద్రష్ట సమూహానికి యశ పతాక ఎన్‌టీ రామారావే ఆయన తాను నటించిన 48 పౌరాణిక చిత్రాలలో 25 పాత్రలను (నలకూబర, రామ, కృష్ణ, రావణ, వెంకటేశ్వర, భీమ, దుర్యోధన, కౌశిక, శివ, భీష్మ, ప్రభాస, అర్జున, బృహన్నల, కర్ణ, ఇంద్రజిత్, హరిశ్చంద్ర, విష్ణు, వాల్మీకి, కార్తవరాయ, సత్య దాసు, దుష్యంత, మశ్చీంద్ర, కీచక, యమ, విశ్వామిత్ర) పోషించారు. అన్నీ నాయక ప్రతినాయక పాత్రలే. అందం, గంభీర స్వరానికి చిరునామా అయిన ఆయన ఇన్ని పౌరాణిక పాత్రలను అద్వితీయ అభినయంతో పోషించి పండిత పామరులను మెప్పించి తెలుగు జాతికి గర్వ కారణ మయ్యా దనడంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు. ఆయన అవలీలగా చేసిన ఈ నట విన్యాసాన్ని అనధికార ప్రపంచ రికార్డుగా పరిగణించ వచ్చును. నట రాచమత్తేభం ఎస్ వీ రంగా రావు (21 పాత్రలు), కాంతా రావు (19), గుమ్మడి (25), అంజలి దేవి (20), జమున (16), ఎస్ వరలక్ష్మి (19), కృష్ణ కుమారి (18), జీ.వరలక్ష్మి (11), ధూళిపాళ (23), మిక్కిలినేని (23), ముక్కామల (18), సత్యనారాయణ (17), రాజనాల (16), శోభన్ బాబు (11), నాగయ్య (17) ప్రభాకర రెడ్డి (12), బాలయ్య (11), రామకృష్ణ (6), హర్నాద్ (6) లు తమ చక్కని వాచకం, అంద చందాలతో, సన్ని వేశానికి తగ్గ రసాన్ని ఒలికించి, సంద ర్భోచితంగా హావ భావాలను ప్రద ర్శించి ప్రేక్షకులను తన్మయులను చేశారు. వీరిలో




రామకృష్ణ, హర్నాద్‌లు మాత్రమే పది కంటే తక్కువ పాత్రలను పోషించారు. వీరితో పాటు పద్మనాభం, రేలంగి, రమణా రెడ్డి, గీతాంజలి ఆయా ఇతివృత్తాలకు తగిన హాస్యాన్ని అందించేవారు. మహానటి సావిత్రి ద్రౌపదిగా అద్భుతమైన నటనను ప్రదర్శించినా పౌరాణికాలలో పెద్దగా రాణించలేదు. వీరే కాక ఋషయేంద్రమణి, కన్నాంబ, గగ్గయ్య, నాగయ్య లాంటి తొలి తరం కళాకారులు కూడా ఈ రెండు దశాబ్దాలలో పౌరాణిక పాత్రలలో నటించారు. హీరోయిన్లలో విభిన్న స్త్రీ పాత్రలను మార్దవంతో, కరుణ ఒలికిస్తూ పోషించిన విదుషీమణి అంజలీదేవిదే అగ్ర పీఠం. వీరంతా తెలుగు కళామతల్లి ముద్దు బిడ్డలు, చిరస్మరణీయులు.

1957 నుండి వెలుగులు ప్రసరించిన ఉదయ కిరణాలు 1960 దశకం పొడుగునా ప్రకాశిస్తూ 1977 లో విడుదలైన దాన వీర శూర కర్ణ, కురుక్షేత్రం ల తరువాత మసక బారాయి. ఈ రెండు దశాబ్దాలలో దాదాపు 60 నుండి 65 పౌరాణిక చిత్రాలు నిర్మితమైతే 1977 నుండి నేటి వరకు 15 నుండి 18 చిత్రాలు మాత్రమే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. పౌరాణిక చిత్రాల విషయంలో సమాచార లోపం వలన ఖచ్చితమైన గణాంకాలు సమర్పించడం సాధ్యం కాకపోవచ్చును. కొన్ని పౌరాణిక సినిమాలు జానపద చారిత్రక ఇతివృత్తాలను స్పృశించడం వలన వాటిని ఏ కోవకు చెందినవో నిర్ధారించడం కష్టమే. అయితే ఆ సంఖ్య అటు గాని ఇటు గాని ఒక పది నుండి పదిహేనుకు మించి ఉండకపోవచ్చును. 1960 వ దశకంలో విడుదలైన తెలుగు పౌరాణికాలు సినీకళాకారుల నటనా పటిమకు, దర్శకత్వ ప్రతిభకు, శిల్ప కౌశలానికి, నైపుణ్యానికి ప్రతీకలుగా నిలిచాయి. ఈ సినిమాల ఇతివృత్తాలు పాతవే. రామాయణ, మహాభారతాలనుండి ఏరినవే. ఆ కథలు, పద్యాలు, వ్యాఖ్యానాలు 1957 తరువాత కొత్త పుంతలు తొక్కాయి. వ్యాపారాత్మక విలువల చొరబాటు తో పాటు చిత్రీకరణలో వీక్షకులను ఉల్లాసపరచే 'శోభ' (గ్లామర్) కాన వచ్చింది. అప్పటికే బహుళ ప్రజాదరణ పొందిన నటీ నటులు పౌరాణిక పాత్రలు వేయడంతో ఆ పాత్రలకు,

సినిమాలకు ఆదరణ పెరిగింది. మాయా బజార్ తెలుగు పౌరాణిక సినిమాను రంగ స్థల సూత్రాల చట్రం నుండి వెలుపలికి తీసుకువచ్చి తెరపై నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఆ ప్రక్రియ రెండు దశాబ్దాలపాటు విజయ వంతంగా కొనసాగు తుందని నాడు కె వీ రెడ్డి, నాగిరెడ్డి చక్రపాణిలు కూడా ఊహించి ఉండకపోవచ్చును. ఆ రెండు దశాబ్దాలలో తెలుగులో నిర్మితమైనన్ని పౌరాణిక చిత్రాలు మరే భాషలోనూ నిర్మించబడలేదు.

నర్తనశాల 1964 లో జరిగిన ఆఫ్రో ఆసియన్ ఫిలిం ఫెస్టివల్‌లో రెండు అమూల్యమైన పురస్కారాలను ఇద్దరు మహోన్నత కళా కారులు అందుకున్నారు. ఉత్తమ నటుడి (కీచక పాత్ర) అవార్డును యశస్వి ఎస్ వీ రంగారావు, ఉత్తమ కళా దర్శకుడి అవార్డును టీ వీ ఎస్ శర్మ అందుకుని తెలుగు వారి కీర్తి బావుటాను ఎగురవేశారు. ఐయోవా యూనివర్సిటీ వారు అర్జున పాత్ర నుండి బృహన్నల పాత్రలోనికి అలవోకగా మారిన ఎన్టీఆర్ నటనా వైదుష్యాన్ని ప్రశంసించారు. ఇతర భాషలలో అప్పుడప్పుడూ ఏ శివాజీ గణేశనో, రాజ్ కుమారో మెరుపులు మెరిపించినా అవి వారి వారి చిత్ర పరిశ్రమలపై గణనీయమైన ప్రభావాన్ని చూపలేదు. మాయాబజార్ నుండి దాన వీర శూర కర్ణ వరకు వచ్చిన పౌరాణికాల్లో అధిక శాతం విజయవంత మయ్యాయి. రామారావుకు కొంత మేరకు ప్రత్యామ్నా యంగా ఎదిగిన ప్రతిభా శాలి కాంతారావు నటించిన చిత్రాలు, అలాగే ఇతర నటీ నటులు నటించిన చిత్రాలు సైతం లాభాలు ఆర్జించాయి. ఆ కోవకు చెందినవే *భక్త ప్రహ్లాద, రామ కథ, వీరాంజనేయ, మైరావణ, పాదుకా పట్టాభిషేకం, భీమాంజనేయ యుద్ధం, తారా శశాంకం, సతీ అనసూయ, బాల భారతం* మొదలైనవి. 1970 నుండి పౌరాణిక చిత్రాల నిర్మాణం మందగించినా *శ్రీ కృష్ణ సత్య, సతీ అనసూయ, సంపూర్ణ రామాయణం, బాల భారతం, శ్రీరామాంజనేయ యుద్ధం, సీతా కళ్యాణం, యశోదాకృష్ణ, దావీశూకర్ణ, కురుక్షేత్రం* లాంటి ఆణి ముత్యాలు మన ముందుకు వచ్చి ప్రేక్షకాదరణ పొందాయి. పౌరాణిక చిత్రాలు దైవ భక్తితో, మరీ ముఖ్యంగా హైందవ సాంప్రదయాలతో ముడిపడిఉన్నా తెలుగు నేలపై అవి ఏనాడూ వైషమ్యాలను గాని, మతతత్వాన్ని గాని ఇసుమంతైనా పెంపొందించలేదు. ఆ పరిణామానికి కారణం తెలుగు ప్రజల సంస్కారం, లౌకిక తత్వం. ఎనభైవ దశకానికల్లా తెలుగు పరిశ్రమలో పౌరాణిక పాత్ర దారులు కనుమరుగవ్వడమో లేక వారికి వయసు పైబడి మునుపటి ప్రతిభ సన్నగిల్లడమో జరిగాయి. పౌరాణిక చిత్రాల మార్తాండుడు ఎన్ టీ ఆర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన పదును కోల్పోతున్న సమయంలో నిర్మించిన *'శ్రీమద్విరాట పర్వం'* (1979), *శ్రీ వెంకటేశ్వర కళ్యాణం* (1979), రాజకీయాలలో తల మునకలై నిర్మించిన *'బ్రహ్మర్షి విశ్వామిత్ర'* (1991) ప్రేక్షకులను నిరాశ పరచాయి. 1974 లోనే ఉద్దండులైన ఘంటశాల, ఎస్ వీ ఆర్ పరమపదించారు. గుమ్మడి, ధూళిపాళ, మిక్కిలినేని, ముక్కామల, రాజనాల, ప్రభాకర రెడ్డి, సత్యనారాయణ, బాలయ్యలు వృద్ధాప్యంలోనికి అడుగు పెట్టారు. స్త్రీ పాత్రధారులదీ అదే పరిస్థితి. ఈ పరిణామానికి తోడు యువ హీరో హీరోయిన్లు నటించే సాంఘికాల పట్లే ప్రజలు ఆకర్షితులవ్వడం, వామ పక్ష భావజాల ఇతివృత్తాలు, కౌమార దశ ప్రేమ కథలు, హిందీ చిత్రాల రీమేకులు ఉధృతమవ్వడం, ఆధునిక వేషధారణలకు, వినిమయ సంస్కృతికి సాంఘిక సినిమా ఆలవాలం కావడం లాంటి పరిణామాలను పౌరాణికాల క్షీణతకు కారణాలుగా ముక్తాయించవచ్చును.




తెలుగు పౌరాణిక చిత్రాలు భారత చలన చిత్ర పరిశ్రమలో ఒక ఉజ్జ్వల ప్రకరణాన్ని రచించాయనడంలో సందేహం లేదు. అయితే పర భాషల వారికి ఈ ఘనత గురించి పెద్దగా తెలియక పోవచ్చును. ఇప్పటి తెలుగేతర ప్రేక్షకులకు తెలుగు సినీ రంగం లో 'బాహుబలి' తోనే అటువంటి కథలు మొదలయ్యాయన్న అపోహ కూడా ఉండి ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ఫిలిం స్టడీస్‌లో పరిశోధన చేసే పరిశోధకులు తెలుగు పౌరాణిక చిత్రాలను లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అలాగే ఉన్నత ప్రమాణాలతో తెలుగు సినిమా మ్యూజియం నెలకొల్పి మన పౌరాణిక చిత్రాల ఔన్నత్యాన్ని లోకానికి చాటి చెప్పాలి.

డా. కొట్టు శేఖర్
మిజోరాం యూనివర్శిటీ, అయిజ్వాల్, ఫోన్: 8015392816

# ఉద్యమ కవిత

**– రాగ్యానాయక్ ఆడావతు**

చరిత్ర అయినా సాహిత్య చరిత్ర అయినా నిజం చెప్పాలి జరిగిన దాన్ని వక్రీకరించి సంస్కృతిని, భాషను చిన్న చూపు చూస్తూ, కొన్ని కులమతాలకు అనుగణంగా మలచుకుని చెప్పడం చరిత్ర క్షమించదు. వలసవాదుల తప్పుడు లెక్కలతో తరతరాలు వక్రమార్గంలో నడిపించే చరిత్ర చరిత్ర అనిపించుకోదు. కవులు, రచయితలు, రచయిత్రులు కొంత ఊహాలోకం లోనే, భావు ప్రపంచం లోనే విహారించిన వాస్తవికతను దూరంగా ఉంటే అది కలకాలం నిలవదు. చరిత్రను వక్రీకరించి సమాజాన్ని తప్పుదోవ పట్టించిన మనోభావాలను సహితం మార్చివేసిన చారిత్రకులను నిగ్గదీయగల కవులు మనకు అవసరం. నిజాన్ని నిర్భయంగా, నిర్ద్వందంగా చెప్పగల కవి దామెర రాములు వెనుకబడ్డ తెలగాణ చరిత్రను అంధకారంలో పడకుండా భావితరాలకు తన కవిత్వం ద్వారా అందించి తెలంగాణ ప్రజల జీవితాలు దేదీప్యం కావాలని తన ఉద్యమ స్వరాన్ని వినిపించిన మేటి కవి రాములు. ఏ విషయానైనా నిష్పక్షపాతంగా నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా చెప్పగలిగే వ్యక్తి. తన కవితలు ద్వారా వెనుకబడ్డ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కాంక్షిస్తూ తన రచనల ద్వారా వారి సమస్యలను సమాజానికి తెలియజేస్తూ తెలంగాణ అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిదాతగా ఉన్న గొప్ప వ్యక్తిత్వం గల మనిషి.

దామెర రాములు వరంగల్ జిల్లా కవి. గీసుకొండ మండలంలోని హవేలీ శాయం పేట గ్రామంలో పుట్టి, హైదరాబాదు, వరంగల్ మీదుగా ఆదిలాబాద్ వరకు దేహానికి దేశానికి కూడా జరగలవలసిన వైద్యం గురించిన అధ్యయన చింతనలతో ప్రస్థానం చేసిన దామెర రాములుకు కావ్య వస్తువు కూడా అదే అయింది. 1970లో విసరం దశకంలో వికసించిన కవి ఆయన. 1978 జగిత్యాల జైత్రయాత్ర, 1985 కారంచేడు ఘటనతో ఎగసిన దళిత ఉద్యమం, 1996 లో ప్రజాస్వామిక ఆకాంక్షగా వ్యక్తమైన తెలంగాణ అస్తిత్వ ఉద్యమం మూడింటితో పెనవేసుకొని, అభివృద్ధి చెందిన జీవిత దృక్పథం రాములుది. కోరస్, నెత్తుటి వెన్నెల, జయహే తెలంగాణ కొర్రాయి, అసలుముఖం భిన్నకాలం మొదలైన కవితా సంపుటాలను రాశారు. దామెర రాములకి తెలంగాణ మట్టి అంటే చాలా నమ్మకం. దానిని నమ్ముకుంటే అది దారి చూపిస్తుందని, అది అన్నం పెడుతుందని నమ్మిన వ్యక్తి మానవతా విలువలు లేని సమాజం కాదని, ఎలుగెత్తి చాటాడు. మానవజాతి వికాసానికి తన రచనలు ద్వారా దారిచూపాడు. దామెర రాములు మానవతావాద కవిత్వంలో ఎంతో వైవిధ్యం ఉంది. ప్రతి కవితలో మానవీయ విలువలను రసరమ్యంగా వర్ణించారు. ముఖ్యంగా కోరస్, నెత్తుటి వెన్నల, జయహే తెలంగాణ, కొర్రాయి అసలు ముఖం, భిన్నకాలం మొదలైన రచనల్లో అడుగడుగున మానవత్వాన్ని, మానవతా విలువలను భవిష్యత్తుకు సందేశాన్ని అందించే ప్రయత్నం చేశారు. రచయిత మనోదృక్పథాలపై సమాజం యొక్క ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఆ సమయంలో రచయిత సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకొని కాలంతో పాటు నడవగలిగి ఉండాలి. అప్పుడే ఆ రచనలు పాత విలువల నుండి విముక్తమై కొత్తగా వికసించగలుగుతాయి. వర్తమానకాలపు అంశాలనూ భావనలనూ, ఆలోచనలనూ రచయిత ఎంత వరకు తనవిగా చేసుకున్నారనే దానిమీద అతని విజయం ఆధారపడి ఉంటుంది. ఈ పద్ధతిలో చూసినప్పుడు దామెర రాములు కాలంతో పాటు నడిచి తెలంగాణ ఉద్యమ చరిత్రను, పోరాట నేపథ్యాన్ని స్వంత బుద్ధితో ఆలోచించి రచనలు చేశారని ఈ పరిశోధన ద్వారా తెలుస్తుంది. ఇక మూడవ అధ్యాయంలో కవిత సంపుటాలను విశ్లేషించాను.

ప్రతి కవితా సంపుటిలో ఆయన ఆశయం తెలంగాణలో సమసమాజం నిర్మించాలని భావన. ఆయన భావజాలాన్ని తెలంగాణ వేలుకొలువుగా, మేలిమి తలపుగా మార్చి నవతెలంగాణ ఏర్పరడానికి కారణ

ముందని చెప్పడంలో అతియోశక్తి లేదు. మానవీయతను మానవ చైతన్యాన్ని ప్రతిష్టించడం కోసం కవిత్వాన్ని ఆశ్రయించారు. దామెర రాములు కలల నుండి జాలువారిన ప్రతి అక్షరం మానవతా విలువలతో కూడి చైతన్యవంతమైన సాహిత్యంగా రూపుదిద్దుకుంది. ఆయన కవిత్వ నేపథ్యానికి ఆయన జీవితమే పునాది. తన రచనల్లో తెలంగాణ ప్రాంత ఇతివృత్తాన్ని ఎన్నుకొని ఆ ప్రాంతంలో ఉండే ప్రజల జనజీవన విధానాన్ని చరిత్రను, సంస్కృతిని చిత్రించడానికి ప్రయత్నం చేశారు. తెలంగాణలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏండ్లు గడిచినా ప్రజా జీవనంలో ఏ మార్పులు రాలేదు. నిజాం ప్రభువులు అంతరించిన వారి ఆరాచకత్వానికి అనవాళ్ళ అక్కడక్కడా నిలిచి ఉన్నాయి. అలాగే భూస్వాములు వారి కులాల తగువులాటలో అమాయక ప్రజల ప్రాణాలతో జీవితాలతో ఆడుకుని వారికి సరైన విలువ నీడను కూడా లేకుండా చేశారు. అందువల్లనే అనేక మంది బడుగు, బలహీన వర్గాల వారు వలసలు వెళ్ళి చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. వీటిని దామెర రాములు తన కవితల ద్వారా వివరించారు. తెలంగాణ సమాజ సమాజం కోసం మానవ మానస వికాసం కోసం తన కలానికి పదును పెట్టిన కవి. తెలంగాణ రైతుల దుర్భర పరిస్థితులను కళ్ళకు కట్టించారు. నేలను నమ్ముకొని నేలకోసం రైతులు పడ్డ అవస్థలను తన కవితల ద్వారి ప్రతిబింబించారు.

ప్రజలు తెలిపే చిన్న నిరసన ప్రకటనలు, ఉద్యమాలు మొదలుకొని చిట్టిచివరి పోరాట రూపమైన సాయుధ ప్రతిఘటన వరకు అన్నీ ఆయన కవిత్వానికి ప్రరణే. అసంఘటిత కార్మిక సమూహాల్ని ఉద్యమ సమాయత్తం జేయటమే ఆయన కవిత్వం ధ్యేయం. మెరుగైన జీవితం కోసం కనీసం జీవించే హక్కు కోసం ఉద్యమ సమాయత్తం అని దళిత ప్రాంతీయ మైనారిటీ అస్తిత్వ పోరాటాలే కానివ్వండి, వర్గ పోరాటలే కానివ్వండి. అన్నీ ఆయన కవిత్వానికి ప్రేరణే అని చెప్పాలి. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే కవిత్వం అంతిమ లక్ష్యం జనం హృదయ సీమల్ని ఆకట్టుకుని స్థిరపడాలి. జనరంజకం కావాలి. విశ్వజనీనత అంతర్లీనంగా ఉండాలి. వాస్తవికత కాల్పనికత మిళితంగా చదివించే గుణం కలిగినదిగ ఉండి తీరాలి. ఈ కవితా గుణాలన్నీ దామెర రాములు రచనల్లో పుష్కలంగా ఉన్నాయి.

*'అతని కవిత*
*వర్గపోరుని ధ్వనిస్తూ*
*జనం పెదాల మీద*
*మరీ నాలుకలమీద*
*ఇంకా హృదయ పొరల్లోంచి*
*గొంతుకల్లో మారుమ్రోగ*
*వేరే "ముద్రణ" ఎందుకు ?*

రాములు గత నాలుగు దశాబ్దాలుగా ఉద్యమ కవిగానే ఉంటున్నారు. అది విప్లవమా, దళితమా, ప్రాంతీయమా, స్త్రీవాదమా, మైనారిటీ వాదమా ఏదైనా కానివ్వండి. మనిషి మనుగడ చుట్టూ వాతావరణం, బలహీనతలు, అణచివేతలు, ఈర్ష్యాద్వేషాలు, వివక్షలు, అమలినశృంగారం, ఇలా కాకున్నా కవిత్వ కూడలిలో నిలుచొని కవితాగానం చేస్తున్నారు. సమాజంలో అనమాతన ఉన్నంతకాలం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంటుందంటారు.

*కంపలో చిక్కొంది*
*నా గుండెకాయ..*
*చుట్టూ కలయజూస్తే*
*ప్రతి ముల్లు ముల్లుకీ వో గుండె !*
*దూరంగా పల్లె..*
*చీకటి బంధాల్లో చిక్కుకొంది ..*
*ఇహ లాభం లేదు*
*నా గుండెని*
*తూర్పుకొండ మీదికి విసరివేస్తా !*
*కరకర పొడుచుకొస్తాడు*
*అరుణారుణ భాస్కరుడు '*

ఉద్యమాల్లో ఎగుడుదిగుడులున్నా, సమాజం అనేకానేక మలుపులు తిరుగుతున్నా కవిత్వరచన కొనసాగింపు రచన దామెర రాములు ప్రయాణంలోని విశిష్ట గుణం. విప్లవోద్యమం, దళితోద్యమం, తెలంగాణ ప్రాతీయ ఉద్యమం సమాజాన్ని, సాహిత్య ప్రపంచాన్ని కదిపి కుదిపాయి. ఈ క్రమాన్ని గమనిస్తూనే నడుస్తున్న చరిత్రని తన కవిత్వంలో రికార్డు చేస్తూ వస్తున్నారాయన. ఇటువంటి ఉద్యమ కవితలు ఎవరికైనా చైతన్యాన్ని తీసుకొస్తాయి.

*'వారెవ్వా ! ఏందిర బాయి ఈ ధూంధాం*
*మా జిల్లాలో గూడ ఆడుంద్రి బిడ్డా పాడుంద్రి బిడ్డా*

*కళాకారుల్ని ఆహ్వానిస్తుండ్రు*
*ప్రభంజనానికి తెరదీస్తుండ్రు'*

సాహిత్యాన్ని ఒక అభిరుచిగా కాకుండా ఎంతో దీక్షగా, ఒక యజ్ఞంలా కొనసాగించిన వ్యక్తి ఆయన. ఆది నుండి నిర్మల్ కవులలో తెలంగాణ వాదాన్ని తలకెత్తుకొని ఉద్యమానికి ఊతమిచ్చిన వారిలో అగ్రగామి వారే. తెలంగాణ భాష, యాస అంటే వారికెంత మక్కువో వారి కవిత్వమే చెబుతుంది. ఆయన కవితా సంపుటి పేరు 'కొర్రాయి' అని పెట్టడమే దానికి నిదర్శనం.

*"ఇంటింటా తెలంగాణ జెండా ఎగురెయ్యాలే*
*ఇంటింటా తెలంగాణ దీపం వెలుగించాలె*
*ప్రతి పల్లె తెలంగాణ గంట మోగాలె"*

తెలంగాణ రాష్ట్రసాధనలో కవులు, రచయితలు, కళాకారులు చేసిన కృషి అనుపమానం, దీనిలో భాగంగా రాములు తన కవితలలో తెలంగాణ ప్రజలల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రతి పల్లె తెలంగాణ గంట మోగాలె అంటు తెలంగాణ ప్రజా ఉద్యమానికి తన కవిత్వం ద్వారా ఉద్యమ స్వరాన్ని అందించారు.

*"ప్రపంచం ప్రేమార్తితో*
*భూగోళం కలయజూసినప్పుడు*
*భారతావనిలో భాగ్యనగరం*
*ప్రేమకు ప్రతిరూపం*
*ఆత్మకు అనువాదం*
*సుఖదు:ఖాల ద్వంద్వాలకు*
*పర్యాయపదం*
*త్యాగానికి సంకేతం*
*కోట్లాది తెలంగాణ బిడ్డల*
*చెమటా నెత్తురు కంకరగా*
*నిర్మించబడిన శ్రమైక స్వప్నం*
*సుందర నగరం"*

తన కవిత్వంలో వాడిన చెమట బిందువులు, పిడికిలి, భూగోళం, నక్షత్రాలు మొదలైన ప్రతీకలు పుంఖాను పుంఖాలుగా మన హృదయంమీద జలపాతంలా విరుచకపడతాయి. సహృదయాన్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. ఇందులో కవి వాడిన చెమట నుండి సమస్త భాగ్యభోగ్యాలూ రూపొందుతాయి. అయితే చెమట ఉత్పత్తికి మూలస్థానం మానవ హృదయమే. అయిన చెమటను ఎవరు పట్టించుకోరు. కవి ఇటువంటి చక్కటి పదజాలముతో రాములు కవితా రచనలు చేశారు.

*"ఇవాళ నువ్ పక్కనబెట్టిన నాపాటే*
*రేపు నెత్తిన బెట్టుకునే*
*అపురూప ప్రజాస్వామ్యమౌతోంది*
*దూలం బాడ్మెతోటి చెక్కినట్టు*
*ఎడ్ల కొమ్ములకు రంగులేసినట్టు*
*సారెమీద కుండ లింగాకృతితో*
*రూపుదిద్దుకున్నట్లు కొలువదీరినట్టు*
*మగ్గంమీద జరీచీర*
*పసిగా ముసిముసిగా వికసించినట్టు*
*పాదరక్షల్ని పవిత్రంగా సిద్ధంచేసినట్టు*
*కలుపు మొక్కల దురాక్రమణ నుంచి*
*పంటని కంటికి రెప్పలా కాపాడినట్టు*
*నీ పాట నలుగురికి పనికొచ్చేది*
*ఇగురం చెప్పేదీ తొవ్వ జూపేదీ..*
*ఆం ఇదోపాటా? పద్యమా?*
*దీంట్లో ఏం సారం సంగీతముందనీ*
*చిన్నయ సూరిని వాదంలోకి దించకు*
*రాజుల గురించి పుక్కిటిపురాణాల గురించి*
*హిట్లర్ ముస్సోలినీకంటే కరడుగట్టిన*
*ఫాసిస్టు అపార్థిడ్ మనుధర్మం*
*గురించి రాయనందుకా చెప్పు మరి ?*
*నీ పాట నెందకు పక్కన బెడతావ్ కక్కుమరి"*

ఇందులో వివిధ వృత్తులను పరిచయం చేశారు. వడ్రంగా, కుమ్మరి, కమ్మరి, సాలె, చెప్పులుకుట్టేవాడు (మాదిగ), రైతులు వృత్తులను వివరించారు. ఈ కవితలో శ్రామికుల గీతాలను మరుగున పడనీయకుండా వెలుగులోనికి తేవాలని కోరుకుంటాడు. ఈ సమాజంలో పైన తెలిపిన వృత్తుల పట్ల చాలా చిన్న చూపు, హేయభావం ఉందని, వీరిని ఎగతాళిగా చూడటం కనబడుతుందని, వీరు తమ సేవకులని వీరిని చిన్న చూపు చూడటం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీ పాటల ద్వారా గేయాల ద్వారా సమాజంలో చైతన్యాన్ని తీసుకురా అప్పుడే వృత్తి గౌరవం (డిగ్నిటీ ఆఫ్ లేబర్) వస్తుందని అప్పుడే బహుజనుల దైన్యస్థితిపోతుందని ఆశించారు.

ప్రజలవైపు నిలబడ్డ కవి తన సామాజిక బాధ్యతను నేరవేర్చుడానికి తుది వరకు పోరాడతాడు. మొదట విప్లవ కవిత్వంలో నాంది పలికిన తరువాత దామెర రాముల రచనలు తెలంగాణ ఉద్యమానికి పురుడు పోశాయి. తెలంగాణ మలి ఉద్యమంలో తన కవిత్వాన్ని ప్రజల పక్షం వహించి రాయడం వలన వాదులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పటంలో అతిశయోక్తి లేదు. అనేక సమస్యలతో సతమతమవుతున్న తెలంగాణ సమాజాన్ని తన రచనలతో ముందుకు నడింపించారు. ఈ పోరాటం తెలంగాణలోని అన్ని ప్రాంతాలను, అన్ని రంగాలను ప్రభావితం చేసింది. ప్రజలలో ఊహించని చైతన్యాన్ని తెచ్చింది. ఈ పరంపరలో ఉద్యమాన్ని ప్రతిబింబించే కవిత్వాన్ని మనం చూడవచ్చు. సమాజంలో ప్రతి ఉద్యమానికి స్పందింటం తెలంగాణ కవి లక్షణం. భారతదేశంలో చూస్తే తెలంగాణ ప్రాంతీయ సాహిత్యానికి ఒక విశిష్టత ఉంది. నాటి పాల్కూరికి సోమన మొదలుకుని నేటి దామెర రాములు వరకు తమ తమ ప్రత్యేకతలను నిలుపుకుంటున్న వారే. వీరు లక్షలాది మందిని ఆలోచింప జేసే కదిలించే సాహిత్య రచనలను సృష్టించారు. సమైక్యాంధ్రలో తెలంగాణ సాహిత్యానికి భాషకు, సంస్కృతికి తీరని అన్యాయం జరిగింది. భాషా సంస్కృతులు నిరాదరణకు గురికావడం వల్ల తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపడంలో తన వంతు కర్తవ్యాన్ని ఎప్పుడూ మరువని బలమైన గొంతు దామెర రాములుది తెలంగాణ భౌగోళికంగా, చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా, సంస్కృతికంగా సాహిత్య పరంగా దామెర రాములు రచనలు ఈ ప్రాంతానికి గల ప్రత్యేక భూమికను నిలబెట్టాయి. దామెర రాములు విప్లవ కవిత్వంతో నెత్తుటి వెన్నెలను కురిపించాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి గొంతుకలిపి కోరస్ వినిపించాడు. జయహే తెలంగాణ అని ప్రతిధ్వనించాడు. రాష్ట్ర వ్యతిరేకులకు కొరడాయిగా మారాడు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అసలు ముఖంతో మానవీయ గీతాలు ఆలపించాడు. భిన్నకాలంతో మంచి సమాజం.

డా. రాగ్యానాయక్ ఆడావతు
ఫోన్ : 9705181797

## ప్రవచన సుధాకరుని వేణునాదం

*మోపూరు వేణుగోపాలయ్య గారు వృత్తికి, ప్రవృత్తికి సమన్యాయం చేయటం కాకుండా నిబద్ధతతో జీవించారు. ముప్పై ఆరేళ్ల పాటు నెల్లూరు వి.ఆర్.కళాశాల లో తెలుగు అధ్యాపకులుగా పనిచేసి 99లో పదవీ విరమణ చేశారు. ఎందరెందరో ప్రసిద్ధులు వారి శిష్యులయినా నిరాడంబరంగా ఉండేవారు. అనంతర కాలంలో రెండు దశాబ్దాల పాటు ప్రతిరోజూ సాయంత్రం నెల్లూరు లోని మూలపేట సరస్వతీ సమాజంలో రామాయణ,భారత,భాగవతాలపై ప్రవచనాలు చెబుతుండేవారు. శేషజీవితమంతా గ్రంథ పఠనంలోను,ప్రవచనాలు చెప్పటంలోనూ గడిపేశారు. సాక్షాత్తు భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారే వారి శిష్యులు. అలాగని వేణుగోపాలయ్య గారిలో ఎక్కడా అతిశయం లేదు,ఆడంబరమూ లేదు.. ఏ సమయంలో ఎవరికి ఏ సందేహమొచ్చినా అది తీర్చటం తన బాధ్యత అనుకునే వారు. తెలుగు, సంస్కృత భాషల్లో దిట్టే అయినా తెలుగంటే మక్కువ. అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారు. కవిత్రయంలోని తిక్కన అంటే అపారమైన ప్రేమ. తిక్కన పద్యంలేకుండా ఆయన ప్రవచనం ఉండేది కాదు. ప్రవచన సుధాకరుడిగా ఖ్యాతి గడించారు.*




*దురదృష్టవశాత్తు ఎందరినో తీసుకుపోయిన కొరోనా వారిని కూడా మింగేసింది. సాహిత్యలోకానికి దుఃఖాన్ని మిగిల్చింది. వారి శిష్యులు, సన్నిహితులు,మిత్రులంతా కలిసి శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక ఇటీవలే వెలువరించారు. వారి స్మృతులను ఈ స్మారక సంచికలో గుది గుచ్చారు. అదెలాగూ చేస్తారు. కానీ విశేషమేమిటంటే తెలుగు సాహిత్యానికి సంబంధించి, అలనాటి సాహిత్య ప్రముఖుల గురించి ఇప్పటి సాహిత్య ప్రముఖుల చేత అరవైకి పైగా వ్యాసాలు రాయించారు. అందమైన,ఆకర్షణీయమైన పుస్తకాన్ని మన చేతిలో పెట్టారు. అన్నీ రమ్యంగా ఉన్నవే. గురుఋణం ఈవిధంగా తీర్చుకోవటం సంతోషించాల్సిన విషయమే కదా. మరో సంతోషించాల్సిన విషయమేమిటంటే అమూల్యమైన ఈ పుస్తకానికి వెలకట్టలేనంత అని గౌరవమివ్వటం. ఈ పుస్తకం చదవగానే నిరాడంబర,సద్గుణశీలి మోపూరు వేణుగోపాలయ్య గారి వ్యక్తిత్వం, రూపం కళ్ళముందు కదలాడతాయి.*

(ప్రతులకు : టి.రమణయ్య, నెల్లూరు, ఫోన్:9491239884)

# దేదీప్య కాంతుల ఉల్కాపాతం
# గద్దర్

– వై. పార్థసారథి



ఏడు మహా ద్వారాల థేబ్స్ నగరాన్ని ఎవరు నిర్మించారు?
గ్రంథాల్లో మీకు చక్రవర్తుల పేర్లు లభిస్తాయి
రాజులు బండరాళ్ళను మోశారా?
బాబిలోన్ అనేకసార్లు ధ్వంసమైంది.
అన్నిసార్లు దానిని పునర్నిర్మించిందెవరు?
పసిడి కాంతుల లీమా లో కార్మికులు ఎలాంటి గృహాల్లో నివసించారు? చైనా మహా ప్రాకార నిర్మాణం తర్వాత మేస్త్రీలు ఎక్కడికెళ్ళారు?
రోమ్ మహానగరం నిండా ఉన్న విశాలమైన ఆర్చీలను నిలబెట్టిందెవరు?
కవిత్వంలో కొనియాడబడే కల్పిత అట్లాంటిస్‌లో కూడా, సముద్రం దానిని చుట్టుముట్టిన రాత్రి,
అందులో మునిగిపోతున్న వారు అప్పుడూ తమ బానిసల కోసం కేకలు వేశారు.
యువకుడైన అలెగ్జాండర్ భారతదేశాన్ని జయించాడు. అతనేమైనా ఒంటరిగా వచ్చాడా?
ఏడేళ్ళ యుద్ధాన్ని రెండవ ఫ్రెడరిక్ గెలిచాడు
ఆ గెలుపు ఎవరివల్ల సాధ్యమైంది?
ప్రతి పుటకు ఒక విజయం
విజేతలకు విందును వండి వడ్డించిందెవరు?
ప్రతి పదేళ్ళకో మహానుభావుడు
అతనిని భరిస్తున్నదెవరు?
ఎన్నో కథనాలు?
ఎన్నో ప్రశ్నలు?

బెర్టోల్ట్ బ్రెక్ట్ 1935లో తన 'పఠించే కార్మికుడి నుండి' లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా సమాధానాల కోసం నిరీక్షిస్తున్నాయి. అలాగే అజంతా గుహలను తొలిచిందెవరు? వారిని పోషించిందెవరు? ఎల్లోరా ఆలయాన్ని కొండతొలచి నిర్మించిన స్థపతి ఎవరు? ఆయనకున్న సహాయకులెందరు? – మనకూ ఈ ప్రశ్నలు తలెత్తుతాయి.

చరిత్ర పరిణామాల క్రమం గతంలోనే కాదు, భవిష్యత్తులోను ఉనికి వుంటుంది. పాలకులు, కుహనా చరిత్రకారులు ఎంతగా మార్చాలని, రూపుమాపాలని చూసినా అనుభవ పాఠంగా కొనసాగుతూనే వుంటుంది.

ప్రతి దశలోను మానవుడు ఏదో ఒక పథాన్ని ఎంచుకుని సామాజిక ఘర్షణలలో తాను ఎంచుకున్న మార్గం సరైందో కాదో తెల్చుకుంటాడు. క్రిస్టఫర్ కాడ్వెల్ విశ్లేషణలో "కవిత్వాన్ని సమాజం నుండి వేరు పరచలేము. ఎందుకంటే అది మానవ ప్రవృత్తిని స్పృశిస్తుంది. కవిత్వ రహస్యమంతా సమాజ ప్రవృత్తి, మానవ సహజాత వాసనలలో వుంటుంది. సహజత్వంతో మానవతకూ, నాగరికతతో మానవతకూ ఏర్పడ్డ వైరుధ్యమే కవిత్వానికి అవకాశం కల్పించింది."

ఈ సంఘర్షణల సమాహారమే చరిత్రగా రూపుచెందుతుంది. ఇందులో రుధిరం, స్వేదం చిందించినవారి భావాలకు, బాధలకు గుర్తింపు ఉండదు. వివిధ కాలాలలో విభిన్న రకాలుగా అసంతృప్తి నుండి, వేదన నుండి, అణచి పెట్టుకున్న బాధల నుండి కొత్త మనుషులు, కొత్త విలువలతో నల్లని బొగ్గు నుండి మండే మెరుపుల వర్షపు అగ్నితరంగాల విస్ఫోటనంతో తమ ఉనికిని ప్రదర్శిస్తారు. గద్దర్ ఆ కోవకు చెందినవాడు. గదర్ పదం అచ్చుతప్పుగా గద్దర్‌గా ముద్రితమైనప్పటికి, చరిత్ర పుటలలో నూతన అర్థాన్ని సృష్టించింది.

### ప్రజా వాగ్గేయకారులు

సంగీత, సాహిత్య రచనలు చేసి, గానం చేసేవారిని, ఆశువుగా అప్పటికప్పుడు పదబంధాలను కూర్చి పండిత పామర జనులను చైతన్యవంతులుగా మార్చేవారు వాగ్గేయ కారులుగా పిలువబడతారు. నయనార్లు, ఆళ్వారులు దైవ సంబంధ గీతాలతో అలరించగా, తుమ్మెద పాటలు, గొబ్బెమ్మ పాటలు, చందమామ రావో పాటలతో తాళ్ళపాక అన్నమాచార్య, ఎందరో మహానుభావులంటూ స్వరపరచిన త్యాగయ్య, లాలిపాటలతో పాటు సంగీతానికి గణితాన్ని జోడించి, 'మాయమాళవగౌళ' రాగాన్ని సృష్టించిన పురందరదాసు, పలుకే బంగారమాయెనా అని, ఎవడబ్బ సొమ్మని కులుకుచున్నావు అంటూ వాపోయిన రామదాసు, ఆత్మశుద్ధి లేని ఆచారాలు, చిత్తశుద్ధి లేని శివపూజలెందుకన్న యోగి వేమన, సామాజికంగా కుటుంబపరంగా నిర్లక్ష్యానికి గురవ్వడం వలన శ్రీకృష్ణుని భర్తగా భావించి కవితలల్లిన మీరాబాయి, కవిత్వంతో, పాటతో, మానసిక, కుల, శారీరక బానిసత్వాన్ని వ్యతిరేకించిన సంత్ రవిదాస్, ధ్రుపద రాగాన్ని స్వరపరచిన తాన్‌సేన్, అభంగ భక్తిగీతాలను రచించిన తుకారాం, మత సామరస్యం కోసం కవిత్వం ద్వారా కృషి చేసిన కబీర్‌దాసు, మతాలలోని వివిధ అపభ్రంశా లను సూక్తుల ద్వారా ఎండగట్టి కొత్తమతాన్ని సృష్టించిన గురునానక్, భక్తి గాధలను అలలు అలలుగా పొంగించిన పోతన మనకు వివిధ రూపాలలో అనునిత్యం దర్శన మిస్తుంటారు. ఇది నిరంతరం నడుస్తున్న సహస్రాబ్దాల, శతాబ్దాల చరిత్ర. వివిధ కాలాలలో, ఆయా సామాజిక పరిస్థితులను బట్టి వాగ్గేయకారులు, సంగీత సాహిత్య ద్రష్టలు వివిధ వాఙ్మయాలను సృష్టించారు. ప్రజా సారస్వతాలను పరిపుష్టం చేశారు.


గద్దర్ - ధూం ధాం

సామాజిక పరిస్థితులు గతిశీలంగా వుంటాయి. గత ఆరు దశాబ్దాలలో అనేక వర్గాల ఉద్యమాలు సంచలన శీలంగా, ప్రభావవంతంగా ముందుకు వచ్చాయి. వర్గపోరాట పంథాలతోపాటు, సామాజికన్యాయం, దళిత, స్త్రీవాద ఉద్యమాలు, ప్రాంతీయ, అస్తిత్వవాదం వివిధ రూపాలలో, విభిన్న పద్ధతులలో వ్యక్తమవుతూ వచ్చాయి. ఈ క్రమంలో అనేకమంది ప్రజావాగ్గేయకారులను సమాజం సృష్టించింది. కుళ్ళి కంపుకొడుతున్న ఫ్యూడల్ సంస్కృతిని చీల్చి చెండాడే పదజాలంతో వరసపెట్టి కవితలను రచించిన శ్రీశ్రీ, ఏం పిల్లడో ఎల్దమొస్తవా అంటూ ఆడి పాడిన వంగపండు ప్రసాదరావు, పల్లె కన్నీరెడుతుందో నాయనా అంటూ పల్లెలు, ప్రకృతిని మూలాలుగా సజీవ ప్రజాసాహిత్యం సృష్టించిన గోరటి వెంకన్న, జయ జయహో తెలంగాణ జననీ జయకేతనం అంటూ గర్జించిన లోకకవి అందెశ్రీ ఈ క్రమంలో ముందుంటారు.

### దుఃఖిత భూమి వీరుడు

దుఃఖిత భూమికి, సమాజానికి వీరుల అవసరం ఏర్పడుతుంది. కల్లోలకాలం జన్మనిస్తుంది. ఇది ఒక రంగం కాదు. శాస్త్ర, సాహిత్య రంగాలన్నింటిలో ఇది మనం గుర్తించవచ్చు. పాటలు రాయడం, పాడడం, ప్రదర్శించడం, మాటలో, భావంలో, వ్యక్తీకరణలో ఆవేశాన్ని చూపడం, ఉద్యమ వంధాలలో, పోరాటాల బాటలో తనకంటూ ఒక ప్రత్యేక ఆహార్యం కల్పించు కుని, అనునిత్యం ప్రజల బాధలను ఏదో ఒక వేదికపై పాటలను దశాబ్దాలుగా ఎలుగెత్తి చాటడం ఇవన్నీ ప్రజా యుద్ధనౌకగా పిలవబడ్డ గద్దర్‌కు ఉమ్మడిగా చెప్పుకో వలసిన విషయాలు. ఆయనేమీ రాగాలను సృష్టించ లేదు. ఆయన పాటే రాగమైంది. మాటే సంగీత తరంగమైంది. గోచి, గొంగడే ఉద్యమ గుర్తింపుగా మారింది. ఆ స్వరమే తెలంగాణ గొంతుకైంది. ఆ గర్జనే యువతకు స్ఫూర్తి దాయకమైంది. చివరకు ఐసియులోను పాటే చివరి శ్వాస అయింది.

అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్‌ల బుర్రకథల రచన ప్రదర్శనలతో ప్రారంభమైన గద్దర్ సాహితీ ప్రయాణం జానపదాలు, గొల్లసుద్దులు, ఒగ్గుకథలు,

యక్షగానాలు, ఎల్లమ్మ కథలను పాటలతో, మాటలతో కలిపి చెప్పే ఒరవడి కవిగా, గాయకుడిగా, విప్లవకారుడిగా, సామాజిక చైతన్య స్ఫూర్తిగా నూతన సమాజ కాంక్షకు అనుగుణంగా రూపుచెంది అరుణ రంజితమైంది.

విప్లవోద్యమ పాటలేగాక అనేక సామాజిక, ఆర్థిక దోపిడీ అంశాలపై పాటల ద్వారా గద్దర్ ప్రజలను ఆకట్టుకున్నాడు, ఆలోచింపజేశాడు. తల్లిని దృష్టిలో ఉంచుకుని రాసిన 'సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో' పాట వ్యవసాయ కూలీ చేసిన తల్లుల సజీవ బతుకు చిత్రం. 'పాసిపోయిన బువ్వ, మాడిపోయిన గటక' అంటూ వారి దైన్యాన్ని పురుషాధిక్య పోకడలను ఎండగట్టింది. ఆడపిల్ల పుడితే గుండెల మీద కుంపటిలా భావించే సమాజ నికృష్ట ధోరణిని గద్దర్ ప్రజా భాషలో విషాద స్వరంగా పలికించాడు.

సోదర సోదరీ సంబంధాలను, కుటుంబ భావోద్వేగాలను పాటలతో తనదైన శైలిలో చూపించడం గద్దర్ సునిశితత్వం.

*'మల్లెతీగకు పందిరివోలె*
*మస్కసీకటిలో వెన్నెలవోలె*
*నీ పాదంపై పుట్టుమచ్చనై చెల్లెమ్మా*
*తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా...'* అని

అన్నా చెల్లెళ్ళ అనుబంధాన్ని వర్ణిస్తూనే! ఆడపిల్లలపై ఆంక్షలను ఎదిరిస్తూ 'ఆటలాడుకో, పాటలు పాడుకో' అంటూ ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేశాడు గద్దర్.

గుండెల నిండా భావనా శక్తిని నింపుకున్న గద్దర్ భావకవులు మాత్రమే చెప్పగలిగే విషయాలను, భావుకత నుండి ఉద్యమం వైపు మరల్చగలగడం అబ్బురపరుస్తుంది.

*'పొద్దు తిరుగుడు పూవు పొద్దును ముద్దాడె!*
*అడవిలో వెన్నెలమ్మ ఆకుల ముద్దాడె!....* అంటూనే
*యుద్ధంలో వీరులను తుపాకి ముద్దాడే!*
*ఆ తూటాలు ముద్దాడె! ఒరిగిన భూమి ముద్దాడె!*
*రణ భూమిని ముద్దాడె!...* అంటూ ముద్దును కూడా

త్యాగధనులతో కలిపి వర్ణించగలగడం అనితరసాధ్యం.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో విప్లవకారులు పాడి, ఆడిన...

*బండెనక బండి గట్టి,*
*ఏ బండిలో వస్తవురో నైజాము సర్కరోడా,*
*నాజీల మించినవురో నైజాము సర్కరోడా...*
*... నీ గోరి కడ్తము కొడుకో నైజాము సర్కరోడా....*

అనే పాటను 'మా భూమి' చిత్రంలో గద్దర్ స్వంతంగా పాడడంతో పాటు నటించిన విధానం ద్వారా అది ఆయన స్వంతమైంది. అమరవీరులపై ఎన్నో పాటలు వచ్చినప్పటికి, తెలంగాణ ప్రజల ప్రజా సంస్కృతిని, సంబంధాలను పల్లెప్రజల బాణీలతో అమరవీరుల త్యాగాలను కలిపి చెప్పడం సాహిత్యంలో శిఖరాయమానంగా నిలిచిపోతాయి.

*వందనాలు వందనాలమ్మా మా కూనలు*
*చుక్కల్లో కలిసి పోయినారా*
*చుక్కలల్ల కలిసి మీరు సూర్యులై మెరిసినారా*
*ఏ దిక్కు లేనోల్లకు, దిక్కుచూపే సుక్కలైనారా...*

లెనిన్ జార్ చక్రవర్తుల సైన్యంలోని వారంతా పేద రష్యా రైతాంగ బిడ్డలేనంటూ చెప్పి, వారి తుపాకులు బోల్షివిక్‌లపై కాక రాజ్యాంగ యంత్రాంగంపై ఎక్కుపెట్టాలని చెప్పినట్టు, గద్దర్ కూడా పోలీసులను పొట్టకూటికి పోలీసులైన వారి తుపాకి గుండు విప్లవకారులపై గురిపెట్టవద్దని పాట ద్వారా కోరడం విశేషం. ఒకరినొకరు అయిదు సంవత్సరాల పాటు చూసుకోకుండా, ఉత్తరం, పత్తరం లేకుండా, ఉన్న తన సహచరి విమలపై గద్దర్ పాడిన పాట.

*'మీటరు ఫాక్టరీలో విమలక్కా*
*సద్దికట్టుకుని బస్‌స్టాండుకు వచ్చి*
*ఉరికి ఉరికి బస్సులో ఎక్కితే*
*నీ సీటు నీకివ్వరు*
*బతుకంతా నరకమే నా యక్కా*
*నీ పాట పాడుతా విమలక్కా*

సహచరి కష్టాలలోని బాధలపట్ల ఆవేదనను, స్త్రీ పక్షపాతిగా వారి కష్టాలను, శ్రమను ఎత్తిచూపుతాయి. విప్లవోద్యమం నుండి వివిధ కారణాల వలన దూరం జరిగినా ప్రజానీకం ఆయనను విప్లవకారునిగానే గుర్తించింది. పార్లమెంటు పంథాలో బహుజనులకు అధికారం కావాలంటూ

*'బానిసలారా లెండిరా*
*ఈ బాంచన్ బతుకులు వద్దురా* అంటూ

మేలుగొల్పడం,

*'అల్లుడి నోట్లో శని ఉన్నట్లు*

సకల సంపదలు గల దేశంలో దరిద్రమెట్లుందో' అంటూ,

ప్రపంచీకరణలో టివి వాడకం పెరిగి మానవ సంబంధాలు మరింత ధ్వంసమయ్యే పరిస్థితిని నిరసిస్తూ...

*కయ్యం పెట్టిందిరో*
*కలర్ టివి ఇంటికొచ్చి*
*దయ్యం పట్టిందిరో నా పెండ్లం పోరలకు....*

ఇలా సమాజంలోని ప్రతి రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలను పాట రూపంలో హత్తుకు పోయేటట్లు చెప్పగలగడం ఈ తరంలో గద్దర్‌కు మాత్రమే చెల్లింది.

ఇవన్నీ ఒక ఎత్తైతే మలిదశ తెలంగాణా ఉద్యమంలో గద్దర్ పేరు ఉద్యమానికి మరో వాచకంగా మారుమోగింది. ప్రతి ఇంట్లో. బస్సులో, కారులో, పాన్‌షాప్‌లలో ఎక్కడ చూసినా అదే పాట.

*'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా*
*పోరు తెలంగాణమా, పోరు తెలంగాణమా,*
*కోట్లాది ప్రాణమా, కోట్లాది ప్రాణమా'*

తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి ప్రజలను ఉద్యుక్తులను చేసిన ఉద్యమ తరంగంగా నిలబడింది.

సహజాత మానవప్రవృత్తికి నాగరికతా క్రమంలో ఏర్పడ్డ వైవిధ్యాలను ప్రజల ప్రతినిధిగా, దోపిడీపై తిరుగుబాటు దారునిగా పాటలను జనంబాణీలో చెప్పగలగడమే గద్దర్ గొప్పతనం.

దశాబ్దాలుగా ప్రజలను ప్రజాబాణీలో నిరంతరం చైతన్య పరచిన గద్దర్ గొంతు మూగపోయింది. ఆ గొంతు పాడడం ఆపివేసింది. శ్రీశ్రీ సుప్రసిద్ధ కవితా సంకలనం 'మహా ప్రస్థానం' శీర్షిక మహాభారతంలో పాండవులు స్వర్గానికి చేసే ప్రయాణాన్ని చెబుతుంది.

అన్నీ ఇతరులకు చేసి తనకంటూ ఏమీ మిగుల్చుకోని యోగి బుద్ధుడని వివేకానందుడు విశ్లేషించాడు. ఆ బాటలోనే మహాబోధి విద్యాలయంలో గద్దర్ మహాభినిష్క్రమణం జరిగింది.

పీడిత ప్రజల కన్నీళ్ళకు, సమసిపోని వ్యథలకు వకాల్తా పుచ్చుకున్న గళం ఆగిపోయింది. చరిత్రలో నూతన అధ్యాయాన్ని తెరిచింది.

గదర్ గళం ఇప్పుడు ఎక్కడ గర్జిస్తోందో?

గద్దర్ గజ్జెలు ఇప్పుడు ఎక్కడ ఘల్లు మంటున్నాయో?

**ప్రొఫెసర్ వై. పార్థసారథి**
**పరిపాలనాశాస్త్ర ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం,**
**హైదరాబాద్, ఫోన్ : 9000438090**

ఆగష్టు సంచిక ముఖచిత్రం "అనంతశయుడి" దారుశిల్ప గురించి పేపర్ లో చదివినప్పుడు ఓహో అనిపించింది. ***మిసిమి*** "అట్టలమీద ఫోటోలు చూచిన తరువాత అద్భుతం అనిపించింది.



శరత్ బాబు, గిరిధర్, ఇద్దరి అనుభవాలు విన్నతరువాత, చేతులెత్తి నమస్కారం చేయాలని పించింది. ఇంతటి చక్కటి విషయాన్ని, అందించిన సంపాదకులు అభినంద నీయులు. లోగడ ఒకసారి, రాసాను, "చిత్రకళా నీరాజనం" మరో సంపుటి ప్రచురించమని. ***మిసిమి*** లో బొమ్మలు చూస్తుంటే ఒక సంచికకు సరిపడా మ్యాటర్ ఉందనుకొంటాను. అవ్ కోర్స్, "కాంగ్రేగుల" లేకపోవటం మీకు పెద్ద లోటే. ఐనా మీరు తలచుకొంటే చేయగలరని నా నమ్మకం. ప్రయత్నం చేయగలరని ఆశిస్తూ .

*– మనోహర్ పంత్*

నమస్తే. శుభోదయం అశ్వనికుమార్ గారు. ***మిసిమి*** వచ్చింది. శరత్ గారితో చాలా బాగుంది ఎంత కష్ట పడ్డారో ఎంత పట్టుదల అనంతశయనుడు అలరించాడు. గజదారు శిల్పం అబ్బుర పరిచింది. నిమ్మగడ్డ గారి ప్రయాణాలు, విశేషాలు ఎంత బాగుంటున్నాయో! అద్భుత దారు శిల్పం బాగా రాసారు. అభినందనలు.





నా లేఖ ప్రచురించారు. ధన్యవాదములు. ఫోటో కూడా బాగా వచ్చింది. ***మిసిమి*** మీ ఆధ్వర్యంలో ఇంకా బాగా రూపు దిద్దుకోవాలని ఆశిస్తూ అభివాదాలతో

*– విజయబక్ష్*

# కమలమ్మ కమతం

– సి.ఎస్. రావు

కమలమ్మ కమతం నవల రాసిన సి.ఎస్.రావు, పూర్తిపేరు చింతపెంట సత్యనారాయణ రావు. పుట్టిన ఊరు తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం. పెరిగిన ఊరు దానికి దగ్గర్లోని మాధవరాయుడుపాలెం. పట్టభద్రుడు. చదువు పూర్తయ్యాక తమ ఊరికే చాలా ఏళ్ళు సర్పంచ్. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే నాటకాలలో వేషాలు వేసి మంచి నటుడన్న పేరు గడించాడు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం, రాజకీయ అనుభవం, నాటకానుభవం, ఇలా పలు రంగాలలో అనుభవంతో ఉద్యోగ బాధ్యత మీద హైద్రాబాదుకి వలసవచ్చాడు. నారాయణగూడాలోని దీపక్‌మహల్ ఎదురుగా సందులో నివాసం. అదే వీధిలో చిత్రకారుడు చంద్ర, ప్రఖ్యాత రచయిత త్రిపురనేని గోపీచంద్ గారి నివాసాలూనూ. ఆ సందుకి ఎదురు సందులోనే కేశవ్ మెమోరియల్ స్కూల్లో ఉపాధ్యాయ వృత్తి సి.ఎస్. రావుకి. గోపీచంద్ గారి పెద్దబ్బాయి డాక్టర్ రమేష్‌బాబు, తన నాటక సమాజం, గోపీచంద్ ఆర్ట్స్ తరఫున నాటకాలు వేసేవాడు. ఆ నాటకాల్లో సి.యస్. రావు ఒక నటుడు. ఆ సందర్భంగా మాటల్లో ఒకసారి రమేష్‌బాబు, 'ఎంతైనా రచయిత రచయితే. మా నాన్నగారి వల్ల మాకూ విలువ, నువ్వు రచయితవు కావు' అని సి.ఎస్. రావుని పరుషాలాడాడు. దాంతో దాన్ని ఓ ఛాలెంజ్‌గా తీసుకున్నాడు రావు. చదువుకునే రోజుల్లో కొన్ని రచనలు చేసి వాటిని వదిలేశాడు. తిరిగి రచన ఆరంభించాడు.

అప్పుడే నారాయణగూడాలో 'న్యూవేవ్' రచయిత గ్రూపు ఏర్పడింది. అందులో చేరాడు రావు. అందులో వాళ్ళు, వయసు క్రమంలో శ్రీపతి, సి.యస్.రావు, శ్రీ కంఠమూర్తి భైరవయ్య, డి. వెంకట్రామయ్య, నేను అంటే వి. రాజారామమోహన్‌రావు (న్యూవేవ్ అన్న పేరు పెట్టింది నేనే) చంద్ర. తిరిగి రచన ఆరంభించిన రావు మొదటి కథ 'కొరడా', జ్యోతి మాసపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక 1969లో వచ్చింది. ఆ తర్వాత వరసగా రచనలు చేశాడు రావు. ఆ వరసలోదే 'కమలమ్మ కమతం' రావుకి రాయటం రాదు. డిక్టేట్ చెయ్యటం అలవాటు. తను చెప్పింది ఎవరో ఒకళ్ళు రాసేవారు.

'కమలమ్మ కమతం' నవలని ముందు, బంగారమ్మ కమతం' అని కథగా రాశాడు. దాన్నే పెంచి కమలమ్మ కమతం నవల చేశాడు. ఇది చతుర మాసపత్రిక 1978 ఫిబ్రవరి ఆరంభ సంచికలో వచ్చింది. దాన్నే పి.ఏ.పి. వారు 1979లో సినిమాగా తీశారు. ఆ సినిమాకి రావే కథ, సంభాషణలు. సినిమా కోసం నవలలోని ముగింపుని మార్చారు. అసలు కమలమ్మ కమతం నవలలోని కథని, సినిమాకోసం చేసిన మార్పుని పరిశీలిస్తే, ఆనాటి ప్రజల నాడి, వ్యాపారధోరణి తెలుస్తాయి. రావుకి పట్టుదల ఎక్కువ. కార్యశూరుడు. ప్రాచుర్యం గల రచయితగా మారటమే కాక, శ్రీమాన్, పరచూరి వెంకటేశ్వరరావు, రాళ్ళపల్లిలాంటి వాళ్ళు తనింటికే వచ్చే నాటక కేంద్రంగా ఇంటిని మార్చాడు. కొత్తక నాటక సమాజం పెట్టారు. ఆ రకంగా అప్పటి ఛాలెంజ్‌ని విజయంగా మార్చుకున్నాడు. అంతే కాదు రావు మంచి లౌక్యుడు. ఆ లౌక్యం కమలమ్మ కమతం సినిమా రచనలోనూ ఉంది. అదేమిటో చూద్దాం.

అది రామన్నపాలెం. ఆ ఊళ్ళోని అన్ని ఇళ్ళకన్నా రాయలం గారి ఇల్లే పెద్దది. ఆయనది యాభై ఎకరాల కమతం. ఆయన ఆ ఊరి ప్రెసిడెంట్. ఆయన భార్య కమలమ్మ. వాళ్ళకి ఒక బాబు. దురదృష్టవశాత్తు పెళ్ళైన అయిదేళ్ళకే రాయలం గారు గతించారు. కమలమ్మ వితంతువైంది. ఆయన మరణానికి బంధువర్గమే కాకుండా ఊరు ఊరంతా విచారించింది. పదిరోజులు వాళ్ళంతా ఆ ఇంటిముందే ఉన్నారు. అలా ఉండటానికి కేవలం వాళ్ళ విచారమే కాక, మరో కారణం వుంది. అది యాభై ఎకరాల కమతం. కమలమ్మ ఒంటరి ఆడది. కమతం అజమాయిషీ తమకి ఇస్తుందేమో నన్న ఆశ. కమలమ్మ ఏం పలుకలేదు. కమలమ్మ అన్నగారు నరసింహం ఉన్నాడు. అందరూ అనుకున్నట్లు కమతం అజమాయిషీ అతనికే దక్కింది. నరసింహ వ్యసనపరుడు. ఒళ్ళు వంగని బద్ధకస్తుడు. యాడాదిలో పాతిక వేలు అప్పు చూపించాడు. అజమాయిషీ అతన్నించి తనే తీసుకుంది కమలమ్మ. నమ్మకమైన పాలేరు



రాముడి మీదే ఆధారపడింది. రాముడు దళితుడే అయినా, నమ్మినబంటు. వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేస్తున్నాడు. నరసింహం ఖాళీగా ఆ ఇంట్లోనే ఉంటున్నాడు. అతన్ని బాగానే చూస్తోంది కమలమ్మ. అలా అయిదేళ్ళు గడిచాయి. కమలమ్మ యాభై ఎకరాల్ని అరవై ఎకరాల కమతం చేశాడు రాముడు. ఆరోజు ఉగాది. ఖర్చుకని వందరూపాయలు కమలమ్మ దగ్గర తీసుకుని ఊరి రామాలయం చేరాడు నరసింహం. అప్పటికే అక్కడ ప్రెసిడెంట్ వెంకటయ్య, మునసబు రంగారావు, పూజారి అప్పలాచారి ఉన్నారు. వాళ్ళతో పేకాటలో చేరాడు నరసింహం. కమలమ్మ కమతం నవలారంభం ఇది.

ప్రెసిడెంట్, మునసబు, పూజారి దుష్టత్రయం. ఊరిని దోచుకు తినటం, ఆడాళ్ళని చెరచటం, సుఖలాలస వాళ్ళ ప్రవృత్తి. పలకమారిన బంగినపల్లి మామిడిపండులా మంచి యవ్వనంలో ఉన్న కమలమ్మ మీద, ఆమె కమతం మీద వీళ్ళ కన్నుంది. కమలమ్మ బైటవాళ్ళందరితో తెరచాటునుంచే మాట్లాడుతుంది. ఎదురుపడదు. ఆమె కనిపిస్తేనేనా, ఏదోరకంగా తమ ఎత్తు సాగించొచ్చని వీళ్ళ ముగ్గురి యత్నం. తమ పాచిక పారటానికి నరసింహాన్ని ఉపయోగించుకోవాలనుకున్నారు. ప్లాన్ చెప్పింది ఆచారి. నరసింహాన్ని తాగించి, వ్యసనాల్లో ఇరికించి, పదివేలకి నోటు రాయించాడు. ఆ నోటు వంకతో కమలమ్మ దగ్గరకెళ్ళారు. నోటు బాకీ పదివేలూ ఇచ్చేసింది. కానీ, కమలమ్మ తెరదాటి వీళ్ళ ముందుకి రాలేదు. బాకీ తీర్చటమే కాక, నరసింహానికి మరికొంత డబ్బిచ్చి ఆ ఇంట్లోంచి వెళ్ళగొట్టింది. కొడుకుని పట్నంలో మంచి స్కూల్లో చేర్చింది. ఇంక ఆ పెద్ద ఇంట్లో కమలమ్మ, రాముడు, పనిమనిషి చుక్కమ్మే.

రాముడికి రత్తితో పెళ్ళైంది. ఒకరోజు పాము నుంచి కమలమ్మని రక్షిస్తూ తప్పనిసరై, అసంకల్పంగా కమలమ్మని తన కౌగిలిలోకి తీసుకున్నాడు రాముడు. బలమైన వాడి ఆ స్పర్శ కమలమ్మలో కామ భావనలు కలిగించింది. కానీ రాముడికి అటువంటి ఉద్దేశం కొంచమేనా లేదు. కమలమ్మ అన్నం పెట్టే తల్లి. కన్నతల్లిలాంటిదే అన్న నమ్మకం. క్రమేపీ కమలమ్మలో కామ వికారాలు పెరిగాయి. బూతు పుస్తకాలు చదివే వ్యసనం పట్టుకుంది. తనకి లేని సుఖం రాముడి ద్వారా రత్తి పొందుతోందన్న అసూయ పట్టుకుంది. చివరికి రత్తి చావుకి పరోక్షంగా కమలమ్మ కారణం అయింది. రత్తికి పురిటిరోజులు. ఆ రాత్రి వర్షం. రత్తికి నెప్పులు. రాముడిని ఇంటికి వెళ్ళనీకుండా, గేదె ఈనుతోందని బలవంతంగా ఆపేసింది. రత్తి కానుపు కష్టమైంది. రాముడి కోసం మనిషి వస్తే రాముడు ఊరు వెళ్ళాడని అబద్ధమాడి పంపించేసింది. కానుపు అవక, వాతం కమ్మి రత్తి చచ్చిపోయింది. మర్నాడు నిజం తెలిసింది రాముడికి. చివరికి కమలమ్మ దగ్గరికి వచ్చి, తల్లిలా చూసుకున్నందుకు ఇది ప్రతిఫలం అని అరిచి వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళటం వెళ్ళటం ఊరొదిలి వెళ్ళిపోయాడు. కమలమ్మకి ఫిట్స్ జబ్బు పట్టుకుంది. ఆచారి వైద్యం పేరుతో వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కమలమ్మ అంగాంగాలు ముట్టుకుని తృప్తి చెందాడు. అతని శృంగార శక్తి అంతవరకే. ఆ తర్వాత వెంకటయ్య వెళ్ళి రాత్రంతా అనుభవించాడు. మర్నాడు మునసబు. ఆ రకంగా కమలమ్మ, ఆమె కమతం ఈ దుష్టత్రయం చేత చిక్కటం జరిగింది. ఇదీ నవల ముగింపు.

చాకలి మంగి, దాని సంసారం, పాలేరు వేదయ్య, వాడి పెళ్ళాం ఇలా ఇంకా మరికొన్ని పాత్రలు ఈ నవలలో ఉన్నాయి. వాటికన్నా ముఖ్యంగా గ్రామీణ వాతావరణం, రీతి రివాజులు సజీవంగా ఉన్నాయి. సి.ఎస్. రావు రచించిన కమలమ్మ కమతంలో ఓ విశిష్టత, విశేషం ఉన్నాయి. నిర్భయంగా, అందరిలా నైతికత అన్న మూర్ఖపు ఆలోచనని అధిగమించి కఠిన వాస్తవాన్ని, అత్యంత నిజాయితీతో చూపించగలిగాడు. గ్రామాల్లో అన్యాయాలు అలాగే ఉన్నాయి. ఇది చాలా చాలా అరుదు రచయితపరంగా.

ఇంకా సినిమా వరకూ వచ్చేటప్పటికి, రావు అలా ఉండటం కురదలేదు. సినిమాలో కమలమ్మ, ఆస్థిని, ఇంటిని, పిల్లాడి బాధ్యతని ఉత్తరం ద్వారా రాముడికి అప్పగించి ఊరొదిలి వెళ్ళిపోతుంది. రాముడు సినిమా హీరో కాబట్టి, చివర్లో చాలా ఆవేశమైన, ఆదర్శ ఉపన్యాసం ఇచ్చి, ఊరి వాళ్ళందరి ముందూ, ఈ దుష్టత్రయం నిజరూపం వెల్లడి చేస్తాడు. ఊరివాళ్ళు ఎదురుతిరిగి వాళ్ళని తంతారు. రాముడు ఆ ఇంటిని ఓ దేవాలయంలా చూస్తూ ఉండిపోతాడు. అదీ అప్పటి ట్రెండ్.

ఏది ఏమైనా, చదువుతుంటే చాలా ఆసక్తికరంగా సాగే నవల 'కమలమ్మ కమతం'.

రాజా రామమోహన రావు
ఫోన్ : 9394738805

# విద్యా బుద్ధులు నేర్పని సాంకేతికత

**- శ్రీరాములు గోసికొండ**

1945 లో స్థాపించబడిన ఐక్యరాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రపంచ శాంతికి కృషి చేస్తుంది. దీనిలో ప్రస్తుతానికి 195 దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. ఈ అంతర్జాతీయ సంస్థ సభ్య దేశాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొల్పడానికి పాటుపడుతుంది. ఇది మానవ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసే విద్య, కళలు, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం (సైన్స్) అనే నాలుగు అంశాలపై నిరంతరం పరిశోధనలు చేస్తూ, వెల్లడైన అంశాలను బట్టి సభ్య దేశాలకు సలహాలు, సూచనలు, విజ్ఞప్తులు ఇవ్వడమే కాకుండా హెచ్చరికలు కూడా జారీ చేస్తుంది. ఇలా విద్యారంగంలో చేసే పరిశోధనల్లో భాగంగా, యునెస్కో చదువులపై టెక్నాలజి ప్రభావాన్ని అంచనావేయడానికి 14 దేశాల్లో ఒక అధ్యయనాన్ని చేసింది. గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్టును 'విద్యలో సాంకేతికత' అనే పేరుతో ఈ మధ్యనే విడుదల చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం, కోవిడ్ సమయంలో బడులు మూతపడి ఆన్లైన్ విద్య తప్పనిసరైనప్పుడు, వారి పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్లు, ట్యాబులు, ల్యాప్ టాపులను ఎంతో ఖర్చు చేసి కొనడం జరిగింది. అయితే కోవిడ్ తర్వాత కూడా వీటి వాడకం ఏ మాత్రం తగ్గకుండా పాఠశాలలు అలాగే కొనసాగిస్తున్నాయి. ఇంకా, ప్రభుత్వాలు, కొన్ని సంస్థలు బడుల్లో ఉపాధ్యాయుడు లేకున్నా ఏమీకాదు అనే విపరీత ధోరణితో ఉన్నాయని ఈ అధ్యయనం వెల్లడించింది. అలాగే, కొత్తగా ఉపాధ్యాయులను నియమించకుండా, కేవలం రికార్డు చేసిన పాఠాలు చూపించడం వల్ల పిల్లలు అభివృద్ధి చెందలేరని కుండబద్దలు కొట్టింది. ఇలా డిజిటల్ పరికరాలను పాఠశాల స్థాయిలో అతిగా వినియోగించడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని ఈ రిపోర్ట్ అభిప్రాయపడింది.

డిజిటల్ ఉపకరణాల వాడకం వల్ల వచ్చే నష్టాలు పాఠశాల స్థాయిలో డిజిటల్ సాధనాల్లో ఒకటైన స్మార్ట్ ఫోన్‌ను అతిగా వాడటం వల్ల విద్యార్థులు చదువుపై అశ్రద్ధ వహించడం, హోం వర్క్ చేసేటప్పుడు గానీ పరీక్షల సమయంలో గానీ నిర్లక్ష్యంగా ఉండటం, ఇంట్లో పుస్తకాలు పట్టకపోవడం, ఒకవేళ పట్టినా పట్టుమని ఒక గంటసేపు కూడా కుదురుగా కూర్చోని చదవకపోవడం, పదేపదే స్మార్ట్ ఫోన్ వంక చూడడం, మాటిమాటికి సామాజిక మాధ్యమాలైన ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్, వాట్స్ ఆప్, యూట్యూబ్‌లను చూడడం, చిరాకు, కోపం, అశాంతి, ఆందోళన వంటి మానసిక సమస్యలు, తలనొప్పి, కంటి వ్యాధులు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా బడిపిల్లలకు ఇటు చదువూ సరిగ్గా రావటంలేదు, అటు సభ్యత-సంస్కారమూ రావడం లేదు. ఇక్కడ చదువు రాకపోవడం అంటే విద్యార్థులు, వారికి చెప్పిన పాఠాల్లోనుండి కనీస పరిజ్ఞానం (బేసిక్ నాలెడ్జ్), సామర్థ్యాలు, నైపుణ్యాలు నేర్చుకోలేక పోతున్నారని అర్థం. ఉదాహరణకు బడికి వెళ్ళే పిల్లలు వారి యొక్క కింది తరగతికి సంబంధించిన తెలుగు/ఏదైనా మాతృభాష పుస్తకంలోని ఒక్క పేరాను కూడా తప్పులు లేకుండా చదవలేకపోవడం,

నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఎంతగానో ఉపయోగపడే చతుర్విధ గణిత పరిక్రియలైన కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం చేయలేక పోవడం, అలాగే భారతదేశ జాతిపిత పేరు కూడా చెప్పలేకపోవడం, ఇలా చెప్పుకుంటూ పోతే పుస్తకాల్లో ఏయే పాఠాలున్నాయో తెలియకపోవడం, జనరల్ నాలెడ్జ్ లేకపోవడం, దేశంలో రోజూ జరుగుతున్న విషయాలపై కనీస అవగాహన ఉండకపోవడం, తను నివసిస్తున్న ప్రదేశం (గ్రామం/పట్టణం/నగరం) గురించి కూడా ఎటువంటి సమాచారం తెలియకపోవడం వంటివి ఎన్నో ఉన్నాయి. అలాగే సభ్యత-సంస్కారం అంటే బడికి వెళ్ళే పిల్లలు మంచి నడవడికను, సద్బుద్ధిని అలవర్చుకోలేక పోతున్నారని అర్థం. ఉదాహరణకు బడికి వెళ్ళే పిల్లలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించక పోవడం, వారి



యందు వినయ విధేయతలు ప్రదర్శించక పోవడం, పెద్దలను ఎదిరించి మాట్లాడటం, సౌమ్యంగా మాట్లాడక పోవటం, ఇతరులకు సహాయం చేయక పోవడం, స్వార్థస్వభావం కలిగి ఉండటం, పరకులం/పరమతం వారితో స్నేహం చేయకపోవటం, నిమ్న కులాల వారిని తక్కువగా చూస్తూ వివక్ష చూపడం, జంతువులు-పశు పక్ష్యాదుల పట్ల దయాగుణం లేకపోవడం, ప్రేమ పేరుతో క్లాస్మేట్ లను వేధించడం, చెడు అలవాట్లైన జూదం ఆడటం, మద్యం సేవించడం, పొగ త్రాగడం మొదలైన వాటికి ప్రభావితం కావడం, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనడం. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ తరం బడిపిల్లల్లో చాలామందిలో క్రమశిక్షణ లోపించడమే కాకుండా వారికి ఇంగిత జ్ఞానం (కామన్ సెన్స్) కూడా ఉండటం లేదన్నమాట.

ఈ యునెస్కో నివేదిక ప్రకారం దాదాపు సగం మంది ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలను ఎలా వాడాలనే అంశంపై కనీస శిక్షణకూడా ఇవ్వలేదని, వారికి సైబర్ భద్రత మీద ఎలాంటి అవగాహన లేదని తేటతెల్లమయింది. ఇంకా డిజిటల్ ఉపకరణాలను కొనడం పేద కుటుంబాలకు ఆర్థికంగా భారం అవుతుందని తద్వారా నిరుపేద విద్యార్థులు సరైన విద్యను పొందలేకపోతున్నారని అధ్యయనంలో వెల్లడైంది. మరొక ముఖ్య విషయమేమిటంటే, ఇలా పాఠశాల విద్యలో టెక్నాలజి వాడటం వల్ల విద్యార్థుల్లో చదువులు మెరుగుపడ్డాయనడానికి ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి రుజువులు లేవని ఈ నివేదిక నివేదించింది. కానీ, విద్యా టెక్నాలజిని అమ్మే కంపెనీలు మాత్రమే మార్కెటింగ్ టెక్నిక్ లో భాగంగా వారికి అనుకూలంగా కొన్ని సాక్ష్యాలను చూపిస్తూ, వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఈ మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా విద్యా ప్రణాళికలపై ఇటువంటి కంపెనీల ప్రభావం ఎక్కువ కావడం కలవరానికి గురిచేస్తుందని అభిప్రాయపడింది. అందువల్ల విద్యలో డిజిటల్ సాధనాల వాడకం శృతిమించకుండా ఉండేందుకు ఈ నివేదిక కొన్ని సిఫార్సులు చేసింది.

యునెస్కో చేసిన సిఫార్సులు

బోధనలో వాడే టెక్నాలజి అనేది విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించేదిగా ఉండాలి. అంటే క్లిష్టమైన/అమూర్తమైన (అబ్స్ట్రాక్ట్) అంశాలను విద్యార్థి సులువుగా, తనకు తానుగా మరింత లోతుగా అర్థంచేసుకోవడానికి డిజిటల్ సాధనాలు వాడితే మంచిదన్నమాట. ఉదాహరణకు జీవ శాస్త్రంలో కిరణజన్య సంయోగ క్రియ ప్రక్రియ, మెదడులోని భాగాలు-అది పనిచేసే విధానం, గుండె (హృదయం), ఊపిరితిత్తులు, మూత్రపిండాలు పనిచేసే విధానం తెలియజేయడానికి; రసాయన శాస్త్రంలో ఆవర్తన పట్టిక (పీరియాడిక్ టేబుల్)లో వివిధ మూలకాల అమరిక, కార్బన్, గ్రాఫైట్, వజ్రం యొక్క ధర్మాలు, ఉపయోగాలు; భౌతిక శాస్త్రంలో న్యూటన్ గమన నియమాలు, రాకెట్ పనిచేసే విధానం, బెర్నోలి సిద్ధాంతం, విమానం ఎగిరే విధానం, ఉపగ్రహాల సహాయంతో టివిలు, ఫోన్లు, ఇంటర్నెట్ పనిచేసే విధానం, విద్యుత్ మోటార్ పనిచేసే విధానంబీ గణిత శాస్త్రంలో శంఖువు, గోళం, స్థూపం, మొదలగు వాటి ఘనపరిమాణ సూత్రం రాబట్టడం, సాంఘీక శాస్త్రంలో భూమి యొక్క అంతర్నిర్మాణం, సౌరకుటుంబం, వాతావరణంలోని వివిధ పొరలు, ఇతిహాసాల్లోని ముఖ్య ఘట్టాలు, దర్శనీయ స్థలాలు, పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవం, మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం, సిపాయిల తిరుగుబాటు, మొదలగు వాటిని కూలంకషంగా తెలుసుకోవడానికి గానీ, తన సందేహాలను తనే నివృత్తి చేసుకోవడానికి గానీ విద్యార్థి యూట్యూబ్లో ఉచితంగా లభించే ఎన్నో వీడియోల్లోనుండి మంచి కామెంట్స్తో పాటు ఎక్కువ మంది చూసిన ఒకదాన్ని ఎంచుకొని ఏకాగ్రతతో వీక్షించవచ్చు.

విద్యావ్యవస్థకు ఉపాధ్యాయుడే వెన్నెముక. విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడే ప్రధానమని, బోధనలో వాడే డిజిటల్ పరికరాలన్ని ఉపాధ్యాయుడికి సహాయకారిగా మాత్రమే ఉండాలని, అవి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయం కావని ఈ యునెస్కో నివేదిక నొక్కి చెప్పింది. అంటే ఏ టెక్నాలజి అయినా ఉపాధ్యాయుడి పనిని సులభతరం చేసి, సమయాన్ని ఆదా చేసే విధంగా ఉండాలన్నమాట. ఉదాహరణకు జీవ శాస్త్రంలో ఆకు అడ్డుకోత నిర్మాణం, చర్మం యొక్క నిర్మాణం, మైటోకాండ్రియమ్, గుండె (హృదయం), ఊపిరితిత్తులు, మూత్రపిండాల, నాడీ వ్యవస్థ మొదలగునవి; రసాయన శాస్త్రంలో పరమాణువు,

వివిధ మూలకాలతో పాటు కార్బన్, గ్రాఫైట్, వజ్రం నిర్మాణాలు, సిమెంట్ తయారీ విధానం, పెట్రోలియం ఉత్పత్తి పద్ధతిబీ భౌతికశాస్త్రంలో మానవుడి కన్ను- కెమెరా పనితీరులను పోల్చడం, న్యూక్లియర్ రియాక్టర్ పనిచేసే విధానంబీ గణిత శాస్త్రంలో స్వరూప త్రిభుజాలు, గ్రాఫులు, వృత్తానికి స్పర్శరేఖ గీయడం మొదలగు వాటిని ఉపాధ్యాయులు వివరించాలంటే, ముందుగా ఆయా బొమ్మలను బోర్డు మీద వేయవలసి ఉంటుంది. దీనికోసం ఉపాధ్యాయులు ఎంతో సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. అలాకాకుండా, అందుబాటులో ఉన్న ఏదైనా విద్యా టెక్నాలజి సంస్థ అందించే నమూనాలు గానీ, వీడియో పాఠాలు గానీ లేదా యూట్యూబ్‌లో ఉచితంగా లభించే వీడియోల సహాయంతో పాఠం చెప్పి, ఉపాధ్యాయుడు ఎంతో సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఇంకా ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తల యొక్క జీవిత చరిత్రలు, వారు మానవాళికి చేసిన మేలును చెప్పాలంటే వీడియో చూపించడమే ఉత్తమం. అలాగే సాంఘీక శాస్త్రంలో కూడా ఇతర దేశాల యొక్క సంస్కృతి, పండుగలు, ఆ ప్రజల యొక్క ఆహారపు అలవాట్లు, కట్టూ-బొట్టూ, కట్టుబాట్లను వీడియో రూపంలో ప్రదర్శించవచ్చు.

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావుల పోరాటపటిమను, వారి త్యాగాలను వీడియోల ద్వారా కళ్ళకుకట్టినట్టు చూపించవచ్చు. మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో లభించే ముఖ్య ఖనిజాలు, పండించే ప్రధాన పంటలు, మాట్లాడే భాషలు, చారిత్రక ప్రదేశాలు, వేష ధారణలను డిజిటల్ పటాలు/వీడియోల సహాయంతో వివరించవచ్చు. అలాగే వివిధ భాషలకు సంబంధించిన పాఠాలను, కఠినతరమైన అంశాలను వివరించడానికి కూడా విద్యా టెక్నాలజిని వినియోగించవచ్చు. ఈ మధ్య కాలంలో పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) స్థాయిలో చదివే పిల్లలకు పద్యాలు, పాటలు, కథలను వీడియో రూపంలో ప్రొజెక్టర్/స్మార్ట్ బోర్డుపై చూపించడం సర్వసాధారణం అయింది. అయితే విద్యార్థులు ఏ తరగతి వారైనా, అది ఏ విషయం (సబ్జెక్టు) అయినా, వీడియో చూపెట్టిన తర్వాత ఉపాధ్యాయుడు ఒక్కసారి ఆ పాఠంలోని ముఖ్యాంశాలను లేదా సారాంశాన్ని క్లుప్తంగా వివరించాల్సి ఉంటుంది. ఎందుకంటే, అందరు విద్యార్థులు కేవలం వీడియోలు చూడడం ద్వారానే నేర్చుకోకపోవచ్చు. ఈ తరం విద్యార్థులకు చదువు యొక్క విలువను, అది వ్యక్తిగత లక్ష్యసాధనకు, సమాజంలో ఉన్నత స్థానానికి చేరి తనకంటూ ఒక మంచి గుర్తింపు, గౌరవాన్ని తేవడంలో ఎలా దోహదకారి అవుతుందో చెప్పాల్సిన అవసరం ఉంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టి, చదువునే నమ్ముకొని పేదరికాన్ని జయించిన నాటి అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్, భారత మాజీ రాష్ట్రపతి డా. అబ్దుల్ కలామ్ నుండి నేటి అనంతపురం ఏఎస్‌పి అమిటి హనుమంతు, కూలీ పనులు చేస్తూ రసాయన శాస్త్రంలో పిహెచ్‌డి పూర్తిచేసిన డా. సాకే భారతి వరకు ఎవరైనా సరే వారి జీవిత చరిత్రలు వీడియోల రూపంలో చూపిస్తే, విద్యార్థులు వారి నుండి స్ఫూర్తి పొంది, చదువుపై కొంత మక్కువ పెంచుకొనే ఆస్కారం ఉంటుంది.

మన దేశం తక్షణం తీసుకోవాల్సిన చర్యలు

ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందిన దేశాలైన ఫ్రాన్స్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ దేశాలు యునెస్కో చేసిన సిఫార్సులను అమలుచేయనున్నట్లు ప్రకటించి, ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచాయి. స్మార్ట్ ఫోన్ అంటే ఎంతో కాయిసు, ఉత్సాహం చూపించే ఈ తరం పిల్లలకు టెక్నాలజి లేకుండా కూడా జీవించడం నేర్పించాలి. స్మార్ట్ ఫోన్ ఇవ్వకపోతే ఈ తరం పిల్లలు ఎంతగా మొండికేస్తున్నారో చూస్తున్నాం కూడా. పాఠశాల స్థాయిలో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యలో టెక్నాలజి వినియోగాన్ని తగ్గించాలి. వ్యాపార ప్రయోజనాలకంటే కూడా విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధికి పాటుపడే విధంగా తగినంత మోతాదులోనే డిజిటల్ సాధనాలను పాఠశాల విద్యలో భాగం చేయాలి. ఎప్పటికప్పుడు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సైబర్ చట్టాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలి. విద్యావ్యవస్థకి ఊపిరిగా ఉండే ఉపాధ్యాయుడికి, విషయ పరిజ్ఞానం పెంపొందించేలా, డిజిటల్ సాధనాలను సరైన రీతిలో వాడేవిధంగా శిక్షణనివ్వాలి, రాబోయే తరాలు తాము నేర్చుకున్న విద్యతో డబ్బులు సంపాదించే వారిగానే కాకుండా, మంచి బుద్ధులున్న పౌరులుగా తీర్చిదిద్దేలా, దేశ బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ, ప్రపంచానికి 'విశ్వగురువు' అయ్యేవిధంగా విద్యావేత్తలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు యునెస్కో సిఫార్సుల ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలి.

డా. శ్రీరాములు గోసికొండ,
అసిస్టెంట్ ప్రొఫెసర్, నర్సీ మోంజీ డీమ్డ్ యూనివర్సిటీ,
హైదరాబాద్.

# తాళ్లపాక
# శిథిలమైన చారిత్రక సంపద

– గూడూరు యానాదిరాజు

దేశంలో మన కళలు, సంస్కృతి సంప్రదాయాలు, నాగరికతలకు ఎన్నో ప్రాచీన నిర్మాణాలు అద్దంపడతాయి. అలాంటి అద్భుతమైన ఆలయాలు, అతిప్రాచీనమైన కట్టడాలు, అపురూప సౌందర్యం ఉట్టిపడే శిల్పాకళా కృతులు, శిలాశాసనాలు, చెరువులు, మెట్లబావులు వంటి ఎన్నింటినో అలనాటి పాలకులు మనకు కానుకలుగా అందించారు. ఇవి ఆ యా గ్రామాల్లో నెలకొన్న చారిత్రక సంపదకు ప్రతీకలుగా కనిపిస్తాయి. కాలగమనంలో పురాతన ఆలయాలు, అద్భుతమైన కట్టడాలు చాలా ప్రదేశాలలో శిథిలమై పోతున్నాయి. అలాంటి పురాతన కట్టడాలలో, ఆలయాల్లో గుప్త నిధులు ఉన్నాయంటూ దుండగులు తవ్వకాలు జరిపినా, ముఖ్యంగా పురాతన మహిళా ప్రాంగణం ప్రత్యేక స్థలాలు, శిథిల పురాతన ఆలయం స్థలాలు, చెరువులు దురాక్రమణ దారులు ఆక్రమించుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. శిథిలమైన ఆలయాలను ప్రభుత్వం సహాయంతో పురావస్తుశాఖవారు పరిశోధనలు జరిపి వాటి చరిత్ర ఆధారంగా పునర్నిర్మించవలసిన అవసరం ఉంది. అలా శిథిలమైన శిల్పాలు, శాసనాలు మరియు కూలిపోయిన ఆలయాలు, ప్రాచీన కట్టడాలు అనేక ప్రాంతాలలో దిబ్బలు దిబ్బలుగా కళతప్పి పడివున్నాయి. తాళ్లపాకలో శిథిలమైన అలాంటి ప్రాచీన కట్టడాల ఆనవాళ్ళు ఉన్న జాగాలను గురించి తెలుసుకొందాము.

1. పాటిగడ్డ తాళ్లపాక గ్రామంలో ఉత్తరంవైపు పాటిగడ్డ ఉండేది. ఈ వ్యాసకర్తనైన నేను (గూడూరు యానాదిరాజు) ఈ గ్రామం వాడినే. నేను బాల్యంలో స్నేహితులతో కలసి అప్పుడప్పుడూ పాటిగడ్డ మీదికి వెళ్లివస్తూ ఉండే వాణ్ణి. అప్పటి పాటిగడ్డ దాదాపు 10 ఎకరాల దాకా ఉండి ఉంటుంది. దూరం నుంచి చూచే వాళ్లకి ఆ స్థలం దిబ్బలు దిబ్బలు కనిపించేది. ఈ పాటిగడ్డకు ఉత్తరం మామిడితోపు ఉండేది. అదునులో పొలం పనుల కోసం, మామిడి కాయల కోసం గ్రామ ప్రజలు అటువైపు వెళ్లే వాళ్లు. ఈ పాటిగడ్డ గురించి వివరంగా తెలుసుకొందాము. పాటి అంటే ఏమిటి? పాటికి పూర్వరూపం పాడు. కొన్ని గ్రామాలకు చివర గ్రామ పర్యాయవాచిగా పాడు వస్తుంది. ఉదాహరణకు పూసపాడు, ఓరంపాడు, ఈ పాడు అని చివర రావడానికి ఒక కారణం చెబుతారు. అంటే ఒకప్పుడు బాగా ఉండి, పాడైపోయిన తరువాత మళ్లీ నిర్మాణం చేసిన గ్రామానికి చివర పాడు అని చేర్చేవారట. ఆంధ్రలో పూసపాడుకు చెందిన క్షత్రియులు పూసపాటి వారయ్యారు. అలాగే ఆకేపాడుకు చెందిన రెడ్లు ఆకేపాటి వారయ్యారు. ఈ పాటి ఒకప్పుడు అందమైన గ్రామమో! సుందర నగరమో! అయి ఉంటుంది. ఆ చోటు పాడైపోయింది. పాడుగా మిగిలింది. కాలక్రమంలో ఆ పాడు... పాటిగా మారింది. మళ్లీ అక్కడ గ్రామం ఏర్పడలేదని అర్థం చేసుకోవాలి. అలాంటిదే ఆనాటి తాళ్లపాక పాటి గడ్డ.

ఈ పాటి గడ్డ ప్రాంతంలో ఆనాటి పాలకులు కట్టించిన గొప్ప కట్టడాలు ఉన్నట్లు, ఆకట్టడాలు అత్యంత రమణీయమైన శిల్ప కళలకు కాణాచిగా వెలుగొందాయని ప్రతీతి. ఇక్కడ పురాతన కట్టడాలు నేలమట్టమైనట్లు అవశేషములున్నవి. వీటి ఆధారంగా గతంలో పురావస్తుశాఖ త్రవ్వకాలు జరిపినట్లున్నారు. ఇక్కడ బయల్పడిన విగ్రహాలను, చారిత్రకాంశాల విశేషాలను పురావస్తుశాఖ కడప మ్యూజియంకు తరలించారని అందులో బౌద్ధ నిర్మాణాల అవశేషాలు కూడా ఉన్నవని గ్రామపెద్దలు చెపుతుంటారు. ఈ పాటి గడ్డపై తిరిగే వాళ్లకు ఒకప్పుడు చిన్న బంగారు నాణేలు, కాసులు దొరుకుతుండే వని మా చిన్నతనంలో తాతలు ముత్తాతలు చెబుతుంటే చెవులు రిక్కించి వినేవాళ్ళం. ఇదే అదును చేసుకొని నిధులు, నిక్షేపాలు ఉంటాయని దురాశ పరులు గతంలో ఈ ప్రదేశంలో త్రవ్వకాలు త్రవ్వినారట. ఇక్కడ ఒకటి రెండు అంగుళాల మందం కలిగిన కుండ పెంకులు, శిలలు, శిల్పశిథిలాలు, కొన్నిచోట్ల బావులున్న

ఆనవాళ్ళు అందులో బానలు, కాగులు, పెద్ద సైజు ఇటుకలు బయల్పడినట్లు గుర్తించారు. ఈ విషయాలను రూఢీపరచే విధంగా పాటిగడ్డ ప్రక్కన వరిపొలం బావి పూడిక త్రవ్వకం సందర్భంగా జరిగిన సంఘటన గురించి తెలుసు కొందాము. సుమారు 35 సంవత్సరాల క్రిందట తాళ్లపాక గ్రామంలో పాటిగడ్డకు తూర్పు, ఊరి శ్మశానవమునకు దగ్గఱ తన వరిపొలం నందు పాతవ్యవసాయ బావిలో ఈ గ్రామరైతు దక్షిరాజు నర్సరామరాజు పూడిక తవ్విస్తున్న సందర్భములో జరిగిన సంఘటన ఇది. సుమారు 40 అడుగుల లోతునందు బావి తవ్వుతుంటే అక్కడ ఇటుకలు, మట్టి పాత్రలు, కాగులు, బానలు... అందులో పూర్వం రాజులకు చెందిన బంగారు నాణేలు, ఆ భరణాలు ఉన్నాయట. బావి తవ్వుతున్న కూలీలు ఎవరికి దొరికినవి వారు దాచుకొని కడుపునొప్పి అని చెప్పి పని ఎగ్గొట్టి అక్కడినుండి ఒక్కొక్కరుగా వెళ్లిపోయారట.

ఆ తర్వాత వారు సమీపంలో ఉన్న రాజం పేటకు వెళ్లి బంగారు నగలు తయారు చేసేవాళ్ళకు, ఆ నాణేలు, అభరణాలు అమ్ముకున్నారట. ఇది అంతా తెలుసుకొన్న రైతు కొన్ని రోజులు తర్వాత, ఆ రోజున కూలిపని చేసిన వారినందరిని పిలిపించి జరిగిన సంఘటనకు సంబంధించిన నిజాలను తెలుసుకొందామన్న అభిప్రాయంతో వారిని విచారించగా వారెవ్వరూ అక్కడ జరిగిన వాస్తవ విషయాలు చెప్పలేదట. కానీ వారు అక్కడ లభించిన బంగారు నాణేలు, రాజముద్రికలు, ఆభరణాలు రాజంపేటలో అమ్ముకున్నారన్న విషయం ఆ తర్వాత కొన్ని రోజులకు వారి దగ్గఱి బంధువులతో అన్నట్లు ఊరివాళ్లు చెప్పుకుంటూ ఉంటే తెలిసింది. ఆ వస్తువులు దాచి భద్రపరచి ఉంటే పాటిగడ్డ చరిత్ర కొంతవరకైనా తెలిసుండేది. ఇప్పుడా అవకాశం కూడా లేదు. ఈ ప్రాంతంలోని పురాతన భవనాలలో పూర్వం కళలను ఆదరించి ప్రోత్సహించిన రాచరికపు ఛాయలు పై సంఘటన ఆధారంగా మనం ఊహించవచ్చు. ఈ వ్యాసకర్త (యానాదిరాజు) పెద్దక్క అంజనమ్మ. ఆమె భర్త దక్షిరాజు నర్సరామరాజు. వీరు తాళ్లపాకలో నివాసం ఉన్నారు. ఆయన నాకు స్వయాన బావగారై నందున ఆయన ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. కాలం మార్పు తెస్తుంది కదా! క్రమంగా గ్రామ జనాభా కూడా పెరిగింది. నేను చూస్తూ చూస్తూ ఉండగానే పాటి గడ్డ క్రమక్రమంగా అదృశ్యం అయి, ఇళ్లుగా మారిపోతూ వచ్చింది. అప్పుడది పూర్వపు పాటిగడ్డ అని చెప్పుకో వలసిందేగాని పాటి గడ్డ ఆనవాళ్లు లేకుండా పోయాయి.

2. నేరేళ్ల గడ్డ–తాళ్లపాకను ఆనుకొని ఉన్న చెరువు మధ్యలో గల ఎత్తు దిబ్బలాంటి ప్రదేశాన్ని నేరేళ్ల గడ్డ అని అంటారు. దీనిపై ఒక శివలింగం ఉన్నది. వైశాఖ శుద్ధ పూర్ణి (మొలకల పూర్ణిమ) నాడు గ్రామంలో ప్రజలు నవధాన్యాల మొలకల కట్టలు తీసుకొని వచ్చి ఈ లింగాన్ని ఆ కట్టలతో తడువుతూ సేవించే ఆచారం ఉండేది.

3. గురప్పమానుగడ్డ–తాళ్లపాకకు తూర్పువైపు పొలాల మధ్యలో ఉన్న దిబ్బలుగా ఉన్న ప్రదేశాన్ని గురప్పమానుగడ్డ అని అంటారు. ఇక్కడ శివలింగము, దాని పీఠము ఉన్నాయి. కాబట్టి ఇక్కడ పురాతన శివాలయం ఉన్నట్లు భావించవచ్చు. ఈ ప్రదేశాలను పరిశీలించి చూసిన తరువాత కొన్ని శతాబ్దాల క్రిందట తాళ్లపాకలో శైవానికి ఎంత ప్రాముఖ్యత ఉందో ఊహించుకోవచ్చు.

4. పావురమ్మ గుడి – పావురమ్మకు తాళ్లపాక గ్రామంలో ఎత్తైన గోపురముతో ఒక గుడి వుండేది. ఈ గుడి చాల పురాతనమైనది. ఈ గుడిలో చతుర్భుజాలతో శక్తి స్వరూపిణి పావురమ్మగా కొలువై వుండేది. ఆ దేవత ఒక్కొక్క చేతిలో శూలం, ఢమరుకం, ఖడ్గము కల్గి నాల్గవ చేయి వరదహస్తం చూపుతున్నది. గ్రామం మధ్యలో ఉన్న ఆనాటి పావురమ్మ గుడి చాలా సంవత్సరాల క్రిందటే కూలిపోయింది. పావురమ్మ విగ్రహం ఆదరణ లేకుండా అక్కడి శిథిలాలపై పడి ఉంది.

దేవాలయాలను రెండు వర్గాలుగా విభజించు కోవచ్చు. 1. గ్రామ దేవతాలయాలు, 2. శిష్టదేవతా లయాలు. మొదటిది గ్రామరక్షణ కోసం తరతరాలుగా గ్రామ సంస్కృతిలో నిలద్రొక్కుకున్న శక్తి దేవతలు. ఉదాహరణకు తాళ్లపాకలో గంగమ్మ, సత్తెమ్మ, అంకాలమ్మ మొదలైన దేవతలు శిలల రూపంలో కొలువై వున్నారు. ఈ గ్రామదేతలకు గ్రామ వీథులలో, బయలు ప్రదేశములలో వేప, రావి వృక్షాల క్రింద చిన్న చిన్న గుడులు ఉంటాయి. ఈ దేవాలయాల్లో చెప్పుకోదగ్గ వాస్తుశిల్పం కనబడదు. ఈ శక్తి దేవతలను ఆరాధించే వారు సాదారణంగా బ్రాహ్మణేతరులు. ఇప్పటికీ తాళ్లపాక గ్రామంలో ప్రజలు శక్తి దేవతలకు బోనాలు, పూజలు చేస్తూ వున్నారు. కానీ తాళ్లపాక ఊరి మధ్య ఎత్తైన గోపురముతో నిర్మించిన పురాతన పావురమ్మ గుడి శిష్టదేవతాలయము పోలి ఉండేది. 20వ శతాబ్ద ప్రారంభం నుండి యిక్కడ ధూప దీప ఆరాధనలు చేయడం

లేదని గ్రామ పెద్దలు చెబుతున్నారు. పూర్వకాలంలో అంటే సుమారు ఆరు శతాబ్దాల క్రిందట వైభవోపేతంగా వెలసినట్టి ఈ గుడి 1970వ దశకం నాటికి పూర్తిగా శిథిలమై పోయిందని తెలుస్తుంది. శిష్టదేవతాలయం లాగా వాస్తుశాస్త్రాను గుణంగా ఈ దేవాలయాన్ని పునర్నిర్మాణం చేసి పునరుద్ధరించితే బాగుంటుంది.

5. శిలాశాసనాలు - తాళ్లపాక పొలంలో అన్నమయ్య గరిక కోసిన స్థలములో శాసనాలున్న శిలలు ఉన్నాయి. సుమారు 4 అడుగుల వెడల్పు, 7 అడుగుల పొడవు గల బండలపై చెక్కిన శాసనములు, వాటిపై శ్రీ వేంకటేశ్వరుని పట్టెనామములు, శంఖచక్రాలు చూసిన తాళ్లపాక ప్రజలు ఆ శిలాశాసనాలకు పూజలు చేస్తుంటారు. ఈ శిలాశాసనాలను వెలికి తీసి భద్రపరచి అందులోని వివరములను వెలుగులోకి తీసుకురావలసిన అవసరం ఉంది. మనం రేపటి తరాల కోసం మరింత జాగ్రత్తగా శాసనాలను భద్రపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

6. అన్నమాచార్య విగ్రహం - 20వ శతాబ్దం విశేషించి ద్వితీయార్థంలో తాళ్లపాక శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆండాలమ్మ, ఆమె కుటుంబ సభ్యులు పూజార్లుగా సుదీర్ఘకాలం స్వామి సేవ, పూజలు చేసేవారు. ఈ వ్యాసకర్తనైన నేను (గూడూరు యానాదిరాజు) చిన్నతనం మిత్రులు కలసి ఆ ఆలయం ప్రాంగణంలో ఆడుకుంటూ... దేవాలయంలో చదివే శ్లోకాలు, స్తోత్రాలు, గుడిగంట శబ్దాలు వింటూ అక్కడ పంచే ప్రసాదాలు తింటూ పెరిగాము. సుమారు అర్ధశతాబ్ది క్రిందటి వరకు తాళ్లపాక చెన్నకేశవస్వామి ఆలయంలో వెనుక వైపు పడమరదిక్కు ప్రహరీ గోడకు చేర్చివుంచిన నిలువెత్తు రాతి ప్రతిమ ఉండినది. ఆ ప్రతిమ ఆకృతిని ప్రత్యక్షంగా చూసినందున... ఎడమచేత దండె నుంచుకొన్నట్లు, కుడి చేయి ఆలాపనగా పైకెత్తినట్లుందని నాకు గుర్తుంది. అప్పటికే ఆ ప్రతిమ ఒకటి రెండు చోట్ల విరిగి పోయినట్లు గుర్తొస్తుంది. అప్పటికి ఆ ప్రతిమ ఎవరిదని గ్రామ ప్రజలకు తెలియదు. అక్కడ లభించే పూలు ఆ ప్రతిమ పాదాలచెంత ఉంచి మ్రొక్కుతూ ఉండే వాణ్ణి. అప్పటికి గ్రామంలో ఎవరికి అన్నమాచార్యుల రూపం ఎలా ఉందో తెలియదు.

క్రీ.శ. 20వ శతాబ్దం ప్రారంభంలో తాళ్లపాక కవుల వాఙ్మయాన్ని కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రి పరిశోధించి వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సందర్భములో తి.తి.దే. వారు 1949వ సంవత్సరములో 'దినము ద్వాదశి నేడు తీర్థదివసంబు నీకు / జనకుండ అన్నమాచార్య విచ్చేయవే' అన్న పదం ఆధారంగా అన్నమాచార్య వర్ధంత్యుత్సవాలను ఆరంభించారు. ఆ సమయంలోనే చిన్నన్న ద్విపదలో రచించిన అన్నమాచార్య చరిత్రను శాస్త్రిగారు పరిష్కరించి వెలుగులోకి తెచ్చినారు. ఆ తరువాత అన్నమయ్య జయంతి ఉత్సవాలు కూడా తి.తి.దే.వారు ప్రారంభించారు. తిరుమల సంకీర్తన భాండాగారం గోడ మీద శిలాశిల్పాలను తాళ్లపాక వాగ్గేయకారుల ఆకృతులని మొదటిసారిగా వేటూరి ప్రభాకరశాస్త్రి గుర్తించడం జరిగింది.

వేటూరి ప్రభాకరశాస్త్రి ఆజ్ఞ మేరకు ఆయన శిష్యుడు నాటి పరిశోధన విద్యార్థి ఉదయగిరి శ్రీనివాసాచార్యులు సంకీర్తన భాండారంలోకి దిగి అన్వేషిస్తుండగా, తాళ్లపాకవారి అరగోడల మీదున్న లాంటివే ఉబ్బెత్తు మూర్తులున్న రెండు తామ్ర చిత్రఫలకాలు సరికొత్తగా లభ్యం కావడం జరిగింది. ఆ మూర్తులు అద్దంలో గోచరించే మిర్రర్ ఇమేజన్ వంటివి కావు. అవి ఉద్దేశపూర్వకంగానే చెక్కిన ఇద్దరు వ్యక్తుల వేర్వేరు మూర్తులు. ఆ ఆకృతులలో ఎడమ చేతి దండె కల వృద్ధమూర్తి అన్నమయ్యదనీ, కుడి చేతి దండెకల యువమూర్తి పెదతిరుమలయ్యదనీ గురుదేవులు ప్రభాకరశాస్త్రి గుర్తించారు. అది ఆ తరువాత పరిశోధనలవల్ల నిరూపితమైంది కూడా. ఈ విషయం ఆచార్య వేటూరి ఆనందమూర్తి తన సిద్ధాంత గ్రంథములో వెల్లడించారు. ఇలా తి.తి.దే.లో తాళ్లపాక వాఙ్మయ పరిశోధనా ప్రస్థానం జరుగుతున్న విషయాన్ని తెలుసుకొన్న తాళ్లపాక వాస్తవ్యులు కళాసాహిత్యరంగాలలో ప్రసిద్ధి చెందిన డా॥బాలరాజు కృష్ణంరాజు తాళ్లపాక అన్నమాచార్యుల చరిత్ర గ్రామ పెద్దలకు తెలియజేశాడు. అప్పటినుండి తి.తి.దే. వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనేక విధాలుగా సిఫార్సులు చేయించి గ్రామం అభివృద్ధికి, ఆలయాల అభివృద్ధికి విశేష కృషి చేసిన గొప్పవ్యక్తి డా॥ బాలరాజు కృష్ణంరాజు. ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహం ప్రస్తుతం అన్నమయ్య ధ్యానమందిరం ఎదురుగా చూడవచ్చు.

1974 మే 14వ తేది తాళ్లపాక కృష్ణంరాజు కృషి ఫలితంగా తి.తి.దే.వారు నిర్వహించిన సభలో గ్రంథా విష్కరణోత్సవము జరిగింది. వేటూరి ఆనందమూర్తి రచించిన 'తాళ్లపాక కవులు - వివిధ సాహితీ ప్రక్రియలు' కృతిని దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి గౌ॥శ్రీసాగి సూర్యనారాయణరాజుగారు దేవస్థానము పక్షమున స్వీకరించారు. అదేకృతిని గౌ॥ మండలి కృష్ణారావుగారు

అన్నమాచార్య సంస్మరణి సంస్థ తరపున స్వీకరించారు. ఆ గ్రంథం అట్టపై ప్రభాకరశాస్త్రి గుర్తించిన అన్నమాచార్యుల చిత్రాన్ని ముద్రించినారు. ఈ సమయంలో ఈ చిత్రాన్ని తాళ్లపాక చెన్నకేశవస్వామి ఆలయంలో ఉన్న ప్రతిమతో పోల్చి చూసినప్పుడు అది అన్నమాచార్యుల విగ్రహమేనని తెలిసింది. అలా తి.తి.దే. వారు నిర్వహిస్తున్న సభలలో ప్రదర్శిస్తూ వచ్చిన అన్నమాచార్యుల ఆకృతి తాళ్లపాక ప్రజలు చూస్తూ ఆనందించేవాళ్ళు. తిరుమలనే ప్రధాన కేంద్రంగా చేసుకొని నివాసమున్న అన్నమయ్య చివరి దశలో 'యెన్నిక దినాల చేత నెప్పుడేడబదునో/కన్నవారి చేతికి గక్కన నియ్యరే' అంటూ తనని స్వగ్రామం చేర్చమని తన వారిని అర్థించాడు. తను కోరుకున్నట్లే తుది దినములలో అన్నమయ్య కుటుంబం వారితో కలసి తాళ్లపాకయందే ఉన్నాడు. పుట్టి పెరిగిన తన సొంతూరు మీద అన్నమయ్యకు ఎంత ప్రేమ ఉన్నదో ఊహించుకోవచ్చు.

అన్నమయ్య పరమపదించిన తర్వాత తండ్రిపై ఉన్న ఆరాధనాభావంతో పెదతిరుమలయ్య 16వ శతాబ్దంలో అన్నమయ్య శిలాప్రతిమ చేయించి, తాళ్లపాక చెన్నకేశ్వస్వామి ఆలయం పరిసరములలో ప్రతిష్ఠించాలని భావించి ఉంటాడు. పెద తిరుమలయ్య కుటుంబం పూర్తి సమయం తిరుమలలోనే ఉన్నట్లుంది. సమయం, అవకాశం కలసిరాక ఆ శిలా ప్రతిమను తాళ్లపాకలో ప్రతిష్టించే వీలుకల్గలేదేమో! అందువల్ల ఆయన ప్రతిమను చెన్నకేశవస్వామి ఆలయంలో ఉంచి ఉంటాడని ఊహించవచ్చు. ఈ ఆలయానికి దగ్గఱలో తి.తి.దే. వారు అన్నమయ్య నూతన విగ్రహం ప్రతిష్ఠించి, అన్నమయ్య ధ్యాన మందిరము నిర్మించినారు. ఈ సందర్భంలోనే ఆ పాత అన్నమాచార్య శిలా ప్రతిమను తి.తి.దే. వారు గాని లేదా పురావస్తు శాఖవారు గాని తాళ్లపాక నుండి తరలించినట్లు తెలుస్తుంది. శిథిలమైన ఆ అన్నమయ్య శిలా ప్రతిమ ప్రస్తుతం తిరుమల మ్యూజియంలో వున్నది.

7. వీరశిల (వీరులస్వామి) – వీరగల్లు ఆంధ్రదేశములో ప్రాచీనమైన వీరశిలాశాసనము క్రీ.శ. 3వ శతాబ్దమునకు చెందినదిగా గుర్తించబడినది. ఈ శాసనము కడప జిల్లా సిద్దవటం తాలూకాలోని గంగపేరూరులో గలదు. ఈ శాసనము ఆవుల మందలను శత్రువుల బారి నుండి రక్షించుటకు ప్రాణములు అర్పించిన వీరుని గురించి తెలుపుచున్నది. దీనిని గమనించినపుడు వీరత్వానికి సంబంధించిన మహాభారతములోని విరాటపర్వము ఉత్తర గోగ్రహణము గుర్తొస్తున్నది. వీరశిలా శాసనాలు క్రీ.శ.3వ శతాబ్దము నుంచి క్రీ.శ. 18వ శతాబ్దము వరకు తెలుగు నాట ఉన్నట్లు తెలియచున్నది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ మతపరమైన కారణముల కొరకు ఆత్మార్పణ గావించు కొన్న వారిని వీరులుగా పేర్కొంటాము. వారి గౌరవార్థము వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా దేవాలయములు, వ్యవసాయ క్షేత్రములు, బావులు, చెరువులు రహదారుల ప్రక్కన వీరశిలలు వేయించి స్మరిస్తున్నారు. వీరశిలలను స్వరూప స్వభావములనుబట్టి 1. శిల్పము, శాసనములు కలిగిన వీరశిలలు, 2.కేవలము శాసనములు మాత్రమే కలిగిన వీరశిలలు, 3. కేవలం శిల్పము మాత్రమే కలిగిన వీరశిలలు అని మూడు తరగతులుగా విభజించవచ్చు. మూడవ తరగతికి చెందిన వీరశిలల వలన నాటి వీరుల వేషధారణ గురించి, పట్టుకొని యున్న వివిధ రకములైన ఆయుధములను గురించి యుద్ధభంగిమల ద్వారా ఆసక్తికరమైన సమాచారము లభించినను, వీరుని మరణము గురించి ఎటువంటి వివరణ లభించదు. ఇలాంటి వీరశిల (వీరుల స్వామి) తాళ్లపాక ఆనుకొనివున్న చెరువు గట్టున గలదు. వీరుని ఎడమకాలు ముందుకు , కుడికాలు వెనుకకు గలదు. వీరుడు నడుముకు వస్త్రమును ధరించినట్లుంది. రుద్రాక్షమాలను పోలిన దండనొక దానిని వీరుడు మెడలో వేసుకున్నట్లు కనిపిస్తున్నది. చెవులకు ఆభరణము లున్నట్లున్నవి. తలపై కిరీటము పెట్టి కొన్నట్లు విశదమగుచున్నది. వీరుని నడుముకు కుడి ప్రక్కన కట్టుకున్న వర ప్రక్కకు అడ్డముగా వున్నది. అందులో పొడవైన కత్తి ఉన్నట్లుంది. అంబుల పొదను తన వెనుక వైపున వీపునందు కట్టుకొని ఉన్నాడు. ఎడమచేతిలో బాణము, కుడి చేతితో విల్లు ఎక్కుపెట్టి ఉన్నాడు. వీరుడు బాణం వేగముగా వదులుతున్నట్లు ప్రతిమలో విల్లు భంగిమలను బట్టి తెలియుచున్నది.

ఈ వీరశిలను పరిశీలించి చూస్తే సామాజిక ప్రయోజనం కోసం తన ప్రాణాలను అర్పించిన వీరుడికి స్మృతి చిహ్నంగా వేయించిన వీరశిలాశిల్పముగా గమనించవచ్చు. ప్రజల రక్షణ కొరకు ఉపయోగించిన ఆయుధాలు, పోరాటంలో పోరాడే విధానము, వీరుల సాహసం మొదలగు విషయాలు ప్రతిబింభించే విధంగా మరణించిన వీరులకు వేయించిన ఈ వీరశిలా శిల్పము ఉన్నట్లుంది. వీరుల శిలలను నిలుపుట అంటే వీరుని ఆత్మను అందులో ఆవాహన చేసి ప్రతిష్ఠాపించుట. అనగా

వీరుని ఆత్మ వీరశిలతో ఉంటుందన్న నమ్మకముతో దానిని ఆరాధించుచున్న సాంప్రదాయం మనలో ఉంది. ఇలాంటి మర్యాదను ఆచంద్రతారార్కముగా ఉండవలయునని, రాబోవు తరములవారి వరకు వీరశిలలకు ఈ మర్యాద జరుపవలెనని వాటిని ప్రతిష్ఠించిన వారు కోరి ఉంటారు. ఇలా ఆరాధన చేయుటచే సంతృప్తిపొందిన వీరుల ఆత్మలు కరువును పోగొట్టి సకాలంలో వర్షములు వచ్చి, పంటలు పుష్కలంగా పండుటకు సహాయపడతాయని భావించే వారు. తాళ్లపాకలో కూడా వీరులస్వామికి నిష్టతో 108 బిందెల నీళ్లు పోస్తే సకాలంలో వర్షాలు పడతాయని ఈ నాటికీ గ్రామస్తులు విశ్వశిస్తున్నారు. ఇలాంటి వీరశిలలన్ని సమగ్రంగా పరిశోధన చేస్తే ఆనాటి సామాజిక, సాంస్కృతిక విషయాలతో పాటు ప్రజల వేష భాషలు, ఆయుధాలు మొదలైన విశేషాలు వెలుగు చూస్తాయి.

8. నీలిమందు తొట్టెలు నీలిమందు ఇండిగో మొక్క ఆకుల నుండి తయారవుతుంది. వస్త్రాలకు సహజ అద్దకంగా వాడేదే నీలిమందు. నీలిమందు ఎలా తయారు చేస్తారో చూద్దాము... నీలిమందు మొక్కలకి నీలం రంగు పూలేమి పూయవు. ఆకుపచ్చని ఆకులనుంచే ఆరంగు తీసేవారు. ఈ మొక్కల ఆకుల్ని పెద్ద తొట్టెలో ఉంచి దానిని నీళ్ళతో నింపి వాటి మీద రాళ్లు ఉంచి నానబెడతారు. ఆ నీళ్లు లేత పసుపు రంగులోకి మారాక రాళ్ళూ, ఆకులు తీసేస్తారు. తరువాత ఆ నీళ్లలో సున్నపు నీళ్లు పోసి బాగా కలిపితే చిక్కని రంగు అడుగుభాగానికి చేరుకుంటుంది. పైనున్న నీటిని ఒక పద్ధతి ప్రకారం వేరొక తొట్టెలోనికి పంపేసి అడుగున ఉన్న చిక్కని పేస్టును ఎండబెట్టి నీలిమందును తయారు చేస్తారు. బ్రిటీషు పాలకులు, వస్త్రపరిశ్రమ యజమానులు ఆనాడు నీలిమందుకున్న డిమాండును బట్టి దేశంలోని రైతుల్ని బలవంతంగా నీలిమందుపంటను పండించమనే వారు. అలా అంగీకరించని రైతులకు ఆంక్షలు విధించేవారు. పన్నులు పెంచేవారు. దీంతో రైతులు ఇష్టం లేకున్నా తప్పని సరిగా పంట వేయాల్సి వచ్చేది. ఆ విధంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ గ్రామరైతులు నీలిమందు మొక్కల పంట పండించేవారు. నీలిమందు తయారీ కోసం పూర్వం సున్నము, ఇసుక, ఇటుకలతో ప్రత్యేకంగా తొట్టెలు నిర్మించేవారు. అదేవిధంగా నీలిమందు తొట్టెలు తాళ్లపాక సిద్ధేశ్వరాలయం ఉత్తరం దిక్కులో ఒకటి, పావురమ్మ గుడి వెనుక వైపు మరొకటి గ్రామ రైతులు నిర్మించారు. అవసరానికి నీలిమందు తొట్టెల్లో నీళ్లు నింపుటకు సమీపంలోనే బావులు కూడా తవ్వించారు. బావులలోని నీటిని కపిల తోలి తొట్టెలు నింపేవారు. తాళ్లపాకలో నిర్మించిన యీ నీలిమందు తొట్టెల సముదాయములో పూర్వం గ్రామరైతులు, పై తెలిసిన పద్ధతి ప్రకారం నీలిమందు తయారు చేసేవారు. తాళ్లపాకలో తయారైన నీలిమందురకం నాణ్యమైనదిగా ప్రాచుర్యం పొందినట్లు ప్రతీతి. దేశంలోని వివిధ ప్రాంతాల వ్యాపారస్థులు ఇక్కడికి వచ్చి నీలిమందు కొనుగోలు చేసేవారట.

ఇలా నీలిమందు మొక్కల్ని పండిస్తే పోనుపోను నేలసారం తగ్గిపోతుందని, ఇతర ఆహార పంటలకి భూమి పనికి రాదనే అపోహ రైతుల్లో ఉండేదట. ఈ కారణంగా ఆ మొక్కల్ని పెంచడానికి రైతులు ఇష్టపడేవారుకాదు. అదే సమయంలో బీహారులోని చంపారన్ నీలిమందు రైతుల పోరాటం దేశంలోని రైతులందరిని చైతన్యపరచి, ఆందోళనా మార్గం వైపు నడిపించింది. ఈ పరిస్థితులలో నీలిమందు పండించాలన్న బ్రిటీషు ప్రభుత్వ ఆదేశాల్ని తాళ్లపాక గ్రామ రైతులు ధిక్కరించారు. దీనిని బట్టి ఆనాటి బ్రిటీషు ప్రభుత్వంపై పోరాటం చేయటంలో గ్రామరైతులు చూపిన ధైర్యసాహసాలు మనం ఊహించుకోవచ్చు. మంచి రకం నీలిమందు దొరకక పోవడంతో ప్రత్యామ్నాయం కోసం వెతకడం ప్రారంభించారు. 19వ శతాబ్దంలో అడాల్ఫ్ బేయర్ కృత్రిమ నీలిమందును కనుగొనడంతో క్రమంగా రైతులు నీలిమందు మొక్కలు సాగు చేయడం, నీలిమందు తొట్టెలను ఉపయోగించడం మానుకొనినారు. ఈ కారణంగా తాళ్లపాకలో నీలిమందు తొట్టెలు శిథిలమై పోయినవి. అక్కడున్న బావులను కూడా పూడ్చివేశారు. జనాభా పెరిగి గ్రామం ఇటీవల బాగా విస్తరించినందువల్ల పూర్వ కాలం నిర్మించిన నీలిమందు తొట్టెల ఆనవాళ్లు కూడా ప్రస్తుతం కనుమరుగైనవి. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక వారసత్వ కట్టడాల పరిరక్షణ కోసం పార్లమెంటులో 1959లో ప్రత్యేకచట్టం చేశారు. ఈ చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారమే పురావస్తుశాఖ పని చేయాల్సి ఉంది. ఇటీవల ఇలాంటి స్థలాలను ఆక్రమించుకున్న దురాక్రమణదారుల పర్వంపై కేంద్ర సాంస్కృతిక పర్యాటకశాఖ మంత్రి స్పందిస్తూ చట్టానికి పదును పెడతామని దురాక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అంటున్నారు. అలాంటి చర్యలు వీలైనంత త్వరగా అమలుపర్చాలని మనస్ఫూర్తిగా ఆశిద్దాం

గూడూరు యానాదిరాజు
షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, సెల్‌నెం : 9701857260

# జాతీయోద్యమం స్త్రీసాహిత్యం-దళితులు

- జంధ్యాల కనకదుర్గ

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటినా దళితుల అభివృద్ధి ఇంకా మిగిలే ఉండటానికి కారణం దళితస్పృహ కొరవడటమే. అందుకే దళితస్పృహకుగల చారిత్రక నేపథ్యంలోకి తొంగిచూడాలసిన అవసరం ఉంది. వర్ణవివక్ష గల హిందూమతాన్ని బ్రిటిష్ వారు అజ్ఞానమతంగా పేర్కొని స్వాతంత్ర్యార్హత లేదన్నారు. అ క్రమంలోనే బ్రిటిష్ వారు సమాజంలో అంటరానివారుగా భావింపబడే అస్పృశ్యులను క్రైస్తవమతస్థులుగా మార్చాలను కొన్నారు. అందుకే భారతీయులలో దళితస్పృహ జాతీయోద్యమ సమయంలో ఏర్పడటానికి ఆనాటి రాజకీయ వాతావరణవే ముఖ్యమైన కారణంగా అర్థమౌతుంది. జాతీయదృక్పథంతో సంస్కరణలలో భాగంగా అస్పృశ్యత నిర్మూలనమై సమానత్వ సాధనదిశగా సాగి భారతీయులందరూ ఒకే జాతి అనే భావన కలిగి జాతీయత బలపడితేనే స్వాతంత్ర్య సంపాదన సాధ్యమౌతుందని భావించారు. అందుకేసత్యాగ్రహఉద్యమ కార్యక్రమాలలో హరిజనోద్ధరణకు ప్రాధాన్యతను యిచ్చారు.

బ్రిటిష్ వారు తమ పాలనను సుస్థిరంచేసుకోవటానికి విభజించి పాలించే రాజనీతితో హిందూముస్లిమ్ల మధ్యన విభేదాలనేకాక, హిందూవులమధ్య కూడా వర్గ, వర్ణ భేదాలను సృష్టించదలచి శాసనసభలలో వర్గ విభేదపు ప్రాతినిధ్యం ఉంటే తమకు ఉపయోగం అని భావించి 1932 ఆగస్టు 10న ''కమ్యూనల్ అవార్డు''ను ప్రకటించాడు. దానిలో ముస్లిములు, క్రైస్తవులు, శిక్కులు, యూరోపియనలతో పాటు అస్పృశ్యులకుకూడా రాష్ట్ర, కేంద్ర శాసనసభలలో ప్రత్యేకనియోజక వర్గాలను కేటాయించారు. అస్పృశ్యులుకూడా హిందూవులేనని, వారిని హిందూవుల నుండి వేరుచేయరాదని గాంధి నిరసించినా, మాలవ్య ముందుకువచ్చి పూనాలో సభను ఏర్పాటుచేసాడు దానికి అస్పృశ్యుల నాయకులు, వారిలో అగ్రస్థానానికి చెందిన అంబేత్కరు హాజరు అయ్యాడు. సభలో చర్చల తరువాత నాయకులందరూ రాజీకివచ్చి ఒక ఒడంబికను చేసుకున్నారు. అదే పూనా ఒడంబడిక.

1932 లో పూనా ఒడంబడికలో అస్పృశ్యులమీద ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించారు. ఇదంతా అస్పృశ్యులను క్రైస్తవులుగా మారకుండాచేసి హరిజనుల కింద వారిని గుర్తించి అగ్రవర్ణాలవారు కలుపుకొని ముందుకు పోయే ప్రయత్నం చేయటం కొంతగా భారతీయుల ఐకమత్యాన్ని కాపాడగలిగింది. అస్పృశ్యులను కలుపుకొనే రాజకీయ వాతావరణం ఏర్పడగలిగిందనేది చరిత్ర స్పష్టంచేసింది. ఆ రాజకీయవాతావరణంలో సాంఘిక సమానత్వ సాధన ఉంటేనే అది ఫలప్రదమవుతుందని భావించిన నాటి రచయితలు సమాజాన్ని చైతన్య పరచటానికి సాహిత్యాన్ని సాధనంచేసుకున్నారు. 20 శతాబ్దప్రారంభంనుండి స్త్రీలు పురుషులతోపాటు సమానత్వాన్ని కోరుకునే క్రమంలో మానవహక్కుల స్పృహ ఏర్పడటంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలను కొన్నారు. అంతేకాక, తమవలె సమాజంలో గౌరవ ప్రదమైన జీవనహక్కులు లేని అస్పృశ్యులను గురించిన ఆలోచనలుపెంచుకునే క్రమంలోనే జాతీయోద్యమ కాలంలో వారిని కలుపుకొని భారతీయులు ఐకమత్యాన్ని కాపాడుకోగలిగితేనే స్వాతంత్ర్యం వస్తుందనే భావన కలగటంతో స్త్రీలలో దళిత స్పృహకూడా ఏర్పడింది. దానితో సమాజంలో దళితస్పృహను కలిగించటానికై స్త్రీలు సాహిత్యాన్ని సృజించారు. చారిత్రక నేపథ్యంకల దళిత స్పృహ నేటికీ కొనసాగటానికై ఆ నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. 1932 లో పూనా ఒడంబడిక రాజకీయంగా చేసుకున్నప్పటికీ సామాజికంగా ఆచరణలో ఉంటేనే భారతీయులమధ్య ఐకమత్యం పెరిగి బ్రిటిష్ వారిని ఎదుర్కోగలమనుకొన్న స్త్రీలు తోటి స్త్రీలలో దళితస్పృహను పెంచాలనుకొన్నక్రమంలో చిలకపాటి భారతీదేవి 1933 గృహలక్ష్మిపత్రికలో ఒక వ్యాసం రాస్తూ దేశారిష్టాలు తొలగాలంటే అస్పృశ్యత పోవాలనీ,లింగవివక్షతతో స్త్రీలు, సామాజిక వర్గదృష్టితో హరిజనులు బాధితులుగా ఉన్నారనీ, వారి అభివృద్ధి ఉంటేనే స్వాతంత్ర్యసాధన మరింత సులభతరమైతుందని చెప్పింది. ఆసంవత్సరం మార్చిలో ప్రచురితమైన వ్యాసంలో స్థానాపతి రుక్మిణమ్మ పంచములకు దేవాలయప్రవేశం ఉంటాలని తెలియ చేసింది.

దేశిరాజు భారతీదేవి 1933మే గృహలక్ష్మి పత్రికలో అస్పృశ్యతా నిర్మూలన అనే వ్యాసంలో పంచములనగా సంకరజాతి వారు కారనీ, గుణగణాలను బట్టి వర్ణాలు ఏర్పడ్డాయనీ, మాలతనయుడైన పరాశరుడు బ్రహ్మర్షి అయ్యాడనీ, మాలకన్యయైన అరుంధతిని వివాహమాడిన వశిష్టుణ్ణి రాముడు గురువుగా గౌరవించాడని తెలిపింది. అంతేకాక, శాకాహారులు, మాంసాహారులు విడిపోయి పరస్పరం గౌరవంగా బ్రతికారనీ, ప్రస్తుతకాలంలో స్త్రీలు వారికి విద్య, శుభ్రతనేర్పి జాతి, మత విచక్షణలేక ఏకమై ఉంటేనే దేశస్థితి తొలగుతుందని చెప్పింది. దేవాలయాలలో మాలవారిని రానిచ్చినంత మాత్రాన మైలబడరు కాబట్టి స్త్రీలు అస్పృుతా నివారణకై తమ అధీనంలో ఉన్న కార్యక్రమాలలో అస్పృశ్యులను ఆహ్వానించాలనీ, మాలస్త్రీలు కూడా పరిశుభ్రత పాటించే విధంగా తయారవ్వాలని చెప్పింది. జాతిసమైక్యతతో సత్యాగ్రహ ఉద్యమ కాక్యక్రమాలలో ఒక్కటై మెలగటానికి అవసరమైన అస్పృశ్యతానివారణకు స్త్రీలే ఎక్కువగా బాధ్యత వహించాలని తెలియజేసింది.

1933 మే నెల గృహలక్ష్మిలోనే మందా ముత్యాలమ్మ తన వ్యాసంలో స్త్రీలు ప్రత్యేక సభలు జరుపుకొని పురుషులతో సమానహక్కులు కావలెనని తీర్మానం చేస్తున్నారనీ, అస్పృశ్యతా నివారణమువంటి కార్యక్రమాలలో జనసామాన్యంలో స్త్రీలు చైతన్యం కలిగిస్తున్నారని తెలిపింది. మానవులెవరైన వారి వృత్తిని ముగించి పరిశుద్ధ స్నానం చేసిన తరువాత స్పృశ్యులే అగుదురనీ, పిల్లల మలమూత్రములు తీసే తల్లి అస్పృశ్యురాలిగా భావిస్తున్నామా అని ప్రశ్నించుకోవాలని తెలియజేసింది. అంతేకాదు, పూర్వకాలంలో ఏకులంలో పుట్టిన వారైనా బ్రహ్మజ్ఞానం కలిగిన వారయ్యారనేది గుర్తుంచుకోవాలనీ, తండ్రి చెప్పులు కుట్టేవాడైతే అస్పృశ్యుడిగా భావించినా అతని కొడుకు కలెక్టరయితే స్పృశ్యుడిగానే భావిస్తున్నారనీ, హరిజనుల నుద్ధరించటం అటుంచి, ఇండ్లలో దేవాలయాలలో, పాఠశాలలో వారికి ప్రవేశం కల్పించాలని తెలియజేసింది. హరిజనోద్ధరణకై హేతుబద్ధమైన అభిప్రాయాలు వెల్లడించటం స్త్రీల మేధాశక్తికి, ప్రతీకంగా భావించి విజ్ఞానవంతులుగా ఆలోచింపజేయటం నేటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. 1934 లో పులవర్తి కమలావతీదేవి రాసిన వ్రాసిన 'మాదిగ వెంకడు' (జూన్ 1934 వాసవి) అనే మరొక కథలో ఒక డిప్యూటి కలెక్టరు తన ఆఫీసులోని మఱుగుదొడ్డిని శుభ్రంచేసే దళితకార్మికుడు అస్వస్థతతో ఒక రోజు పనికి రాకపోయేసరికి అధికారమదంతో ఆ డిప్యూటి కలెక్టరు రోగగ్రస్థుడైన ఆ కార్మికుడ్ని యింటినుండి పిలిపించి, మరుగుదొడ్డిని శుభ్రంచేయమనేసరికి అతడు చేయనని ఎదురు సమాధానం చెప్పినందుకు అతడ్ని చితగగొడ్తాడు. అప్పుడు మాదిగ సఫాయి కార్మికుడు తిరగబడి ఆ డిప్యూటి కలెక్టరును తిరిగి కొడ్తాడు. తనని బాధపెట్టిన కలెక్టరుమీద కోర్టులో ఫిర్యాదుచేయాలంటే ప్లీడర్లెవరూ సహకరించక పోయినా మాదిగ వెంకడి చేతిలో తన్నులుతిన్న కలెక్టరుగా అందరూ నవ్వుతుంటే ఆ కలెక్టరు మాత్రం ఆ ఊరినుండి బదిలీ చేయుంచుకుంటాడని పులవర్తి కమలావతీదేవి తెలియజేసింది. ఇక్కడ శ్రీశ్రీ గారి 'కనకదుర్గా చండ సింహం జూలుదులిపి ఆవులించింది' అనే కవిత గుర్తుకు రాక తప్పదు. స్త్రీ వ్రాసిన ప్రథమ దళితోద్యమ కథగా దీన్ని భావించవచ్చు. దళితుని తిరుగుబాటులోని సత్యాన్ని ఒక దళితేతర రచయిత్రిగా స్పష్టంచేసింది.

పరుచూరి భువనేశ్వరి మరియు అన్నపూర్ణాదేవి కలిసి వ్రాసిన 'తెలుగుబిడ్డ' (జులై 1933 గృహలక్ష్మి) అనే కవితలో హరిజనుల స్థితిని తెలియజేస్తూ హరిజనోద్ధరణలకై ప్రజలను చైతన్యపరుస్తూ "కడుపునిండార త్రాగంగ గంజి నీరు/కట్టుకొనుటకు చింపిరి బట్టలేదు/నిద్రవచ్చుచో జానెడు నేల లేదు/దీనహరిజనస్థితి యిదే తెలుగుబిడ్డ/ఉపవసించే గాంధి యిరువదొక్క దినము/వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచూ/పన్నమోర్చెను వారికే ప్రాణములను/పిరికి చేరదీయవదేని తెలుగుబిడ్డ/హరిజనోద్ధార కార్యంబునాదరించి/వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచు/వారు సోదరుల్ మనకంచు జేరదీసి/అలరుచుండుము దేశాల తెలుగుబిడ్డ/గాంధి మహాజ్వాల కఠిన తపస్సు/శీఘ్రకాలమున సిద్ధించు గాక" అని సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలలో భాగంగా ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి, ప్రజలంతా ఐకమత్యంతో పోరాడటానికిని దీనులైన హరిజనోద్ధారణ కావల్సిన అవసరాన్ని గుర్తించిన గాంధీ దాన్ని సత్యాగ్రహంలో భాగంచేసారు. వింజమూరి వెంకటరత్నమ్మ వ్రాసిన 'పాకీవాడు' (సెప్టెంబరు 1933 గృహలక్ష్మి) అనే కవితలో "నెయ్యుడా! నీవు తాకరాని నరుఉడంచు/శుచియెరుగనివాడవంచు జనవితతి/పల్కహేతువేమొకొ?

ప్రతి పదమునందు/శుద్ధినినువెంబడింప, మాసుఖము గోరి/నీ పవిత్రసేవాప్రవంతి బహుమతిన/వస్తు నివహంబ దవ్వగా బరిహరించి/తానుమాత్రము శుద్ధమై తనరునెపుడు /భూమికి విషప్రళయబాధ పొరయకుండ/పుడిమి నీవు రక్షింతువు మురికినుండి/మనుజునకు గల్గు దుర్యశోమల పదార్థ/మంతయు వహించుదాక మానవాళిసేవ/సలుపు ధైర్యసంపద మాకొసంగుమయ్య"అని అస్పృశ్యుడిగా భావింపబడే 'పాకివాడు' తమ జీవితాలకు శుభ్రతనొసంగు చున్నారనీ, మనుషుల మనసులలో మాలిన్యం పోగొట్టి మానవాళి సేవను అనుగ్రహించమని పాకివానిని కోరటం ఆనాటి హరిజనోద్ధరణలో భాగంగా చెప్పటం జరిగింది. వింజమూరి వేంకటరత్నమ్మ పాకిపనివారిని గురించి ఆలోచించమని వెన్నుతట్టటం సత్యాగ్రహ ఉద్యమానికి వెన్నెముక వంటి కవిత.

డి.యస్.రాజేశ్వరమ్మ వ్రాసిన 'అస్పృశ్యతా నివారణ మవసరమా' (మార్చి 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్వప్రయోజనార్థమైన వర్ణభేదములవల్ల సుహృద్భావం తగ్గి స్వరాజ్య సంపాదనకు అవరోధంగా ఉన్నదనీ. నాల్గు వర్ణములు పుట్టుకచేతగాక గుణకర్మలవల్ల ఏర్పడ్డాయనీ, భారతగ్రంథ రచనానంతరమే పంచమవర్ణము ఏర్పడిన దనీ, మానవధర్మము ఏకజనితులగు తోటి సోదరులను అంటరాదని నిషేధించుట తప్పనీ, హిందూసంఘమున స్థానం లేకపోవటం చేతనే పంచములు క్రైస్తవులను ఆశ్రయించుచున్నారనీ, వారిపరాధీనత భారతజాతీయతను బలహీనపరుస్తోందని చెప్పింది. భారతదేశాభివృద్ధికై అస్పృశ్యతాపిశాచాన్ని హతమార్చాలనీ ఐకమత్యముతో స్వతంత్ర్యోద్యమం ముందుకు సాగాల్సిన అవసరముందని తెలియజేసింది. హరిజనులను కలుపుకుంటూ స్వతంత్రోద్యమం సాగితేనే భారతదేశానికి స్వాతంత్రం సులభతరమవుతుందని భావించింది.

గొట్టుముక్కల వెంకాయమ్మ వ్రాసిన 'అయ్యోపాపం' అనే (మార్చి 1935 గృహలక్ష్మి) కథలో హరిజన దంపతులు అనారోగ్యంతో ఉన్న ఆమె తల్లిని చూడటానికి గ్రామానికి బయలుదేరి 15 మైళ్ళు నడిచేసరికి దారి మధ్యలో వేసవి కాలం కారణంగా దాహమై వరుసగా చలివేంద్రం పెట్టిన బ్రాహ్మణుని, మరొక బ్రాహ్మణ యిల్లాలినీ, వేశ్య యింటికి వెళ్ళి త్రాగునీటిని అడిగినా మాలలకు పోయమని వారిని తరిమిగొట్టారు. వారు స్పృహ తప్పిపడిపోయినప్పుడు ఒక సాహెబ్ ముందుకువచ్చి వారి దప్పిక తీర్చటంతో వారు తేరుకున్నారని తెలియజేస్తూ 'అస్పృశ్యత' మానవత్వాన్ని మంటగలిపిన విషయాన్ని తెలియజేసిన కథయిది. అస్పృశ్యులుగా సమాజంలో వారికి జరుగుతున్న అన్యాయాలను, చిత్రికరిస్తూ స్త్రీలు కథలు వ్రాసారు.

పాకల చంద్రకాంతమణి వ్రాసిన 'తండ్రియా? తనయుడా?' (సెప్టెంబరు 1937 గృహలక్ష్మి) అనే కథలో ఒక మాలపిల్ల క్రిందపడితే ఆమెను లేవదీసినందుకు మరియు చెరువులో మునిగిపోతున్న మాలపిల్లవాడ్ని రక్షించినందుకును ఆ మనవడిని ఒక అగ్రహారిక బ్రాహ్మణుడు ఇంట్లోనుండి వెడలగొడ్తాడు. కొడుకు ఉండాలనుకుంటే తన కూతుర్ని కూడా బయటకు పొమ్మని చెప్పేసరికి ఆమె వెళ్ళకుండా తండ్రి ఇంట్లోనే ఉండిపోతుంది. బయటకు వెళ్ళిపోయిన ఆ మనవడు మాలపాకలో కలరావస్తే హరిజన సేవా సంఘం తరపున మాలవారికి సహాయంచేస్తూ కలరా వచ్చి చనిపోతాడు. బ్రాహ్మణ నిర్భంధాలవల్ల చివరి క్షణాలలో ఉన్న తండ్రిని ఆ కూతురు వదలలేక అటు కొడుకు శవం దగ్గరకు వెళ్ళలేక ఆ తల్లి ఘర్షణపడింది. ఈ కథ అస్పృశ్యత సమాజంలో ఎంత బలంగా ఉందో తెలియచేస్తూ, నవనాగరిక యువకులు ముందుకొచ్చి అశ్పృశ్యతా నివారణకై పాటుపడితే సంఘం వారినెంత బహిష్కరిస్తుందో కూడా స్పష్టం చేయటం జరిగింది. కులవివక్షవల్ల సహజ మానవసంబంధాలు, సమాజ సంబంధాలు విచ్ఛిన్నం అవుతున్నాయనే ఒక సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించిన సాహిత్యం యిది.

చుండూరి రమాదేవి వ్రాసిన "ధర్మతల్లి"(మార్చి 1938 గృహలక్ష్మి) అనే కథలో దారిలో మాలపిల్ల అడ్డుగా వచ్చిందనీ ఆమెను అంటరాని పిల్లగా చూస్తూ మాయదారి స్వరాజ్యం( రాష్ట్రీయ స్వాతంత్ర్యం) రావటంతో మాలపిల్ల అలా నిర్భయింగా అగ్రవర్ణాల ప్రక్కన దారిలో నడిచిందని తిట్టిపోస్తుంది. ఆమె మరో సంఘటనను కూడా చెప్తూ తన సోదరిడికి జ్వరం వచ్చి ఉపాధిలేక, అన్నంలేక ఆకలితో అలమటించి ఒక బ్రాహ్మణ కుటుంబపు అరుగుమీద స్పృహతప్పి పడిపోతే ఆమెకు తాను మాలపిల్లనని తెలిసినా తనకు నోట్లో అన్నరసం పోసి బ్రతికించిందనీ, తన సోదరునికి కూడా అన్నాన్ని తీసుకెళ్ళమని ఇచ్చిందనీ, ఆమెయే దళితులపట్ల ధర్మదేవత అని భావించింది. ఇద్దరు అగ్రకుల స్త్రీల మనస్తత్వాలలోని తారతమ్యమే అస్పృశ్యతకు కారణమని గ్రహించాలనీ, కులము కారణం కాదని

తెలియజేసింది.పూనా ఒడంబడిక ప్రకారం అస్ప్రుశ్యులకు అధికసంఖ్యలో ప్రత్యేకనియోజకవర్గాలను కేటాయించటం వల్ల వారికి అధికారం వచ్చిందనే భావనతో ఆమె అలా మాట్లాడినట్లు అర్థమవుతుంది.

సి.వి.కృష్ణమ్మ వ్రాసిన 'అనాథ వనిత'(మే 1938 గృహలక్ష్మి) అనే కథనంలో మహాలయ అమావాస్య రోజున ఒక హరిజనస్త్రీ త్రాగుబోతైన తన భర్త బియ్యానికి డబ్బుతెచ్చి యివ్వక పోవటంతో ఆకలితో అలమటిస్తున్న తన కూతుళ్ళతో వచ్చి ఆమె వీధులలో బిచ్చం అడుగుకుంటూ తిరుగుతుంది. ఒకయింటి వనిత వారికి పెట్టటానికై అన్నం తీసుకొని వస్తుంటే అత్తగారు వచ్చి తిథిరోజున పెట్టకూడదని వారించిందనీ, తర్వాత ఆ హరిజనస్త్రీ సమీపంలోని చెరువులో పడి చనిపోయిన వార్త తెలిసిందనీ ఇటువంటి ఘోరాలు జరుగకుండా శాసనసభ్యురాండ్రు బాధ్యత వహించాలని తెలియజేసింది. రచయిత్రి ఈ కథలో హరిజనుల యొక్క బీదరికపు నిర్మూలనతో పాటు అస్పృశ్య నివారణకై శాసనసభ్యులు చట్టం తేవాల్సిన అవసరాన్ని సూచించింది. శాసనసభలలో హరిజనులకు ప్రత్యేకంగా అధిక స్థానాలను యిచ్చి గుర్తించటంతోపాటు వారికి సామాజిక అస్థిత్వన్యాయం అవసరమని ఆనాడే స్త్రీలు గుర్తించారు. తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ వ్రాసిన 'మేలుకొలుపు' అనే కవితలో(సెప్టెంబరు 1936 గృహలక్ష్మి) "మేలు కొనుమో భారతీయుడా/మేలుకొనుమో దేశభక్తుడ/ మేలుకో నీతల్లిదేశపు / గాంధి ప్రభుని సుబోధలందున/ గణ్యతనుంచి/జ్యోతివెల్గనజూడు/మానవభారతీయ దైవసృష్టిని/సర్వులునుసమమనెడిభావము/స్వాంతమందు నను/అంటరాదుముట్టరాదన/తుంటరత్వము మాని బుద్ధిని/ గనవయ్య ముక్తి" అనిగాంధీ చెప్పిన అస్పృశ్యతా నివారణను ఆలోచించమంది. ఆరకంగా ప్రజలంతా ఐక్యమై స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని బోధచేసింది.

ఆయపెళ్ళి రామలక్ష్మి వ్రాసిన 'ధన్యజీవులు' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన కొడుకు మాలవారికి వైద్యం చేయటం నచ్చక ఆతని తండ్రి యింట్లోనుండి వెళ్ళకొట్టగా అతనితో పాటు ఆతని భార్యకూడా వెంటవెళ్ళి మాలపల్లిలోనే ఉంటూ, వారిద్దరూ మాలపిల్లలకు చదువు చెప్తూ, రాట్నంవడకటం నేర్పిస్తూ, వారిని ఖద్దరు ధరించేటట్లు చేస్తూ ఉంటారు. అంతేకాక వారికి వైద్యంచేస్తూ వారిజీవితాలలో అభివృద్ధిని ఆకాంక్షించిన వారుగా ఆ భార్యాభర్తలిద్దరూ ధన్యజీవులనీ, మాలవారిని కూడా సోదరభావంతో చూడాలనీ, వశిష్ఠుడే అరుంధతిని భార్యగా స్వీకరించాడని గ్రహించాలని చెప్పింది. మధ్యలో అంతస్థుల తేడాతోనే వారు బీదరికం లోకి నెట్టబడటంతో వారికి పరిశుభ్రత లేకపోయిందనీ, వారిని అస్పృశ్యులని భావించటంకంటె కూడా వారికి శుభ్రత నేర్పి సోదరులక్రింద భావించటమే దేశసేవ అని తెలిపింది. మాలవారిని కలుపుకోవటం స్వాతంత్ర్య సాధనకు మార్గమవుతుందనే భావనను కలిగించే కథయిది. అస్పృశ్యతకు, బీదరికానికి, శుచికి, వెలికి ఉన్న స్వభావాన్ని అర్థం చేసుకోవాలని భావించింది.

సి.హెచ్.చంద్రమతి 'దిక్కుమాలు మాలబాలకుని రక్షణ' (జూన్, జులై 1944 హిందూ సుందరి) అనే కథను వ్రాస్తూ తన అనుభవంలో తెలిసిన వాస్తవ సంఘటన విషయంగా చెబుతుంది. కడపజిల్లా రాయచోటిలో డిప్యూటి కలెక్టరు గారు తన కుటుంబాన్ని సంఘం వెలివేసినప్పటికి భార్యాభర్తలుగా దిక్కులేని ఒక మాల బాలుడిని దగ్గరకు తీసి శుభ్రత నేర్పి, విద్య నేర్పించి పెంచిన విధానం హరిజనోద్ధరణ స్ఫూర్తిని కల్గిస్తుందనీ, అప్పుడే భారతీయులకు ఐకమత్యం పెరిగి, స్వాతంత్ర్య సాధన, దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేసింది. ఇది హరిజనోద్ధరణను ఆచరణలో పెట్టినదానిని రుజువుచేసిన సామాజిక ప్రయోగాత్మక సాహిత్యం. ప్రతిఇంట స్త్రీలు హరిజనులను ఆదరించగలిగితే సమాజంలో అస్పృశ్యులు కలిసిపోగలరనీ, స్త్రీలు తమ రచనలద్వారా తోటిస్త్రీలను చైతన్యపరచారు. దేశస్వాతంత్ర్యోద్యమంలో హరిజనోద్ధరణ రాజకీయప్రక్రియ అయినా నేడు అదిసాంఘికన్యాయమనీ, కర్మసిద్ధాంతంతో కాక సామాజిక స్వభావంతో, మానవత్వంతో కూడుకొన్నదని భావించి ఎవరికివారు కర్తవ్యాన్ని నిర్వహించాలి. ప్రజాస్వామిక సమాజంలో సమాన మానవహక్కులను అనుభవించగలహక్కు అన్ని వర్ణాలవారికి ఉంది. అందుకే స్వాతంత్ర్యానంతరంకూడా దళితసాహిత్యసృష్టి జరుగుతూనే ఉంది. ప్రతి ఒక్కరికీ దళితస్పృహ ఉండటం దేశనాగరికతకు, స్వాతంత్ర్యానికి చిహ్నంగా భావించాలి.

- జంధ్యాల కనకదుర్గ
ఫోన్ : 9494253456

## చిత్రగీతాలు
# జావళీలు

- ఎమ్. పురుషోత్తమాచార్య

### ఎందు ఎందని



**చిత్రం : మహాకవిక్షేత్రయ్య(1976)**
**రచన : సి.నారాయణరెడ్డి**
**సంగీతం : ఆదినారాయణరావు**
**గానం : పి.సుశీల**
**నృత్యం : మంజుల**

**<u>ముఖారి-త్రిపుట</u>**

*ఎందు ఎందని నిన్ను గో*
*విందా వెదికేది ॥ఎందు॥*
*ముందుగా రమ్మని మోస*
*గించేవా నా సామి ॥ఎందు॥*
*చ॥ అందగాడా నిన్ను పొందని నా మనసు వన*
*మందు గాచిన మధుర వెన్నెల గదరా ॥ఎందు॥*

చిత్రంలో రుక్మిణి ప్రేమ చెదరిపోయిన తరువాత వరదయ్యకు తనను ప్రేమించిన 'భామ' పై మనస్సు కుదురుకోలేదు. భామ వచ్చి ఓదార్చాక ఆమెను పెండ్లాడడానికి వరదయ్య అంగీకరించాడు. కాని వేశ్యకులాంగనను చేపట్టడానికి వరదయ్య తల్లి అంగీకరించలేదు. నృత్యపరీక్షలో ఉన్న భామ నర్తిస్తూనే వరదయ్యను ఏమైందని సైగ చేస్తుంది. అంగీకరించలేదని వరదయ్య తలను అడ్డంగా ఊపుతూ సైగ చేశాడు. భామ హతాశురాలై ఈ పాటను అభినయిస్తుంది. వరదయ్యగా అక్కినేని నాగేశ్వరరావు,రుక్మిణిగా ప్రభ,భామగా మంజుల అభినయించారు.

పల్లవి,అనుపల్లవి చరణాలలో బిందుపూర్వక మకారాన్ని ప్రాసగా చేసుకుని కవిగారు రచించినారు. విరహిణియైన గోపిక తానెక్కడని వెదికేది అంటూ వేసారిపోతూ ముందుగా రమ్మని మోసం చేస్తావా అని శ్రీకృష్ణుడిని అడుగుతున్న నెపంతో భామ వరదయ్యను నిలదీసినట్లుగా చిత్రించారు. వరదయ్య పెండ్లాడతాడని, అక్కమాట తీర్చినట్లవుతుందని ఎంతో ఆశ పెట్టుకున్న భామ మనస్తత్వాన్ని చరణం చక్కగా చిత్రించింది. అతన్ని పొందని తన బ్రతుకు అడవిగాచిన వెన్నెల అని ఆవేదన చెందింది. ప్రారంభంలో వీణపై అఠాణరాగం పోకడతో తానం వినిపించారు. తరువాత గోటువాద్యంతో 'ముఖారి' రాగాన్ని కొంత అస్పష్టంగా వినిపించి వదిలారు. అప్పుడు గాయని రిషభం నుంచి ఒక అక్షరం జాగా వదిలి 'రిమమామా వనీదదమా' అనే బాణీలో పల్లవిని ప్రారంభించారు. అనుపల్లవిని కూడా పాడి 'సామీ' దగ్గర వదిలాక గోటువాద్యంతో రెండు ఆవర్తాల బిట్టును ఇచ్చి పంచమం దగ్గర వదిలేశాక 'అందగాడు' చరణాన్ని 'పనిని దదమ' బాణీలో ఒక అక్షరం జాగా వదిలి అందుకున్నారు. రెండు పాదాలను రెండు సార్లు పాడారు. తరువాతి పాదాలను చకచకా పాడి పల్లవి,అనుపల్లవి పూర్తిగా పాడారు. చివరలో 'నా సామి' ని తారస్థాయి షడ్జమం మీద వదిలేస్తూ పాటను ముగించారు.

### ఎంత సొగసుగాడే



**చిత్రం : సంగీతసామ్రాట్ (1984)**
**రచన : వేటూరిసుందరరామమూర్తి**
**సంగీతం : రమేష్‌నాయుడు**
**గానం : పి.సుశీల**
**నృత్యం : జయప్రద**
**జతులు : కృష్ణమూర్తిరాజు**

**<u>బిలహరి-ఆది</u>**

*ఎంత సొగసుగాడే గోపాలుడు ॥ఎంత॥*
*ఎంత సొగసుగాడే ఇంతిరో ఎడదను*
*చింతన రేపిన చిన్ని మాధవుడే ॥ఎంత॥*

1. *శిరమున నెమలి పింఛము జొనిపినవాడు*
   *కురులను కలికితురాయి కట్టినవాడు*
   *కరముల సొంపగు మురళి పట్టినవాడు*
   *చిరుమువ్వలను గట్టి చిందులేసెడివాడు ॥ఎంత॥*
2. *కదవనిడుకొని వడివడి జనుచుండ*
   *అడుగుల సడులాయెనే*
   *తడబడి అడుగిడ తరువుల మాటున*
   *గడసరి మాధవుడు కనులానెనే*
   *ఆగెనే తమిదీరగ ఊగెనే*
   *వడివడి ఇటు సాగెనే పడతి మనసులాగెనే*

తమకము విడి  పరువులిడుచునే
పురము జేరి నా చెలియ కలలో
మరులు నింపెనే                    ॥ఎంత॥

చిత్రకథానాయిక పాత్రధారిణిగా జయప్రద అభినయించారు. ఆమెపై ఈ నృత్యగీతాన్ని చిత్రించారు. కథానాయకులుగా అక్కినేని నాగేశ్వరరావు నటించారు. క్షేత్రయ్యగారి రచనాస్ఫూర్తితోనే ఈ పాట పల్లవి కూడా రూపుదాల్చిందని చెప్పవచ్చు. పాట అంతా సుశ్రావ్యమైన ప్రాస నియమంతో అందంగా సాగింది. రెండోచరణంలో 'ద'కారాన్ని అనుప్రాసగా ఉపయోగించడం మరీ ముచ్చటగా ఉంది. మొదటి చరణంలో శ్రీకృష్ణుని సౌందర్యవర్ణన సాగింది. రెండో చరణంలో కడవ నెత్తుకుని వెళుతున్న గోపిక పట్ల గోపాలుని చిలిపితనాన్ని,అల్లరి చేతలను చక్కగా వర్ణించారు. రమేష్‌నాయుడుగారు బిలహరి రాగాన్ని తనదైన దృక్కోణంతో దర్శించి వినూతనమైన పోకడలో ఈ పాటను రూపొందించారు. ఆదితాళాన్ని ఖచ్చితమైన అక్షరకాలంతో పాటిస్తూ నడిపించారు. సుశీలమ్మగారి కమ్మని పాటకు జత చేసిన జతులను కొనగోలుగా చెప్పిన నృత్యాచార్యులవారు కృష్ణమూర్తిరాజుగారు.

మృదంగవిన్యాసం, వేణువు ఆలాపనతో నాలుగు ఆవర్తాలలో బిట్టును ప్రారంభించారు. 5,6 ఆవర్తాలలో వీణ బిట్టును వినిపించారు. 7,8 ఆవర్తాలలో చక్కని జతులను కొనగోలుగా రాజుగారు వినిపించాక ఒకటిన్నర అక్షరాల జాగాతో గాంధారం నుండి పల్లవిని ప్రారంభించారు. రెండుసార్లు పల్లవిని పాడి అనుపల్లవిని తీసుకున్నారు. రెండో సారి 'ఇంతిరో' పదం దగ్గర సంగతిని మార్చి 'చింతన' పాదాన్ని రెండు సార్లు పాడారు. తరువాత పల్లవిని ఎత్తుకుని బాణీ మారుస్తూ 'గపమగరి సనిదసా' అని పాడారు. తరువాత రెండు ఆవర్తాలలో జతులను కొనగోలుగా వినిపించాక స్వరాన్ని ప్రారంభించి రెండు ఆవర్తాలలో పాడి పంచమం నుండి ఒక అక్షరం జాగా వదిలి మొదటి చరణం 'శిరమున' అందుకున్నారు.

చరణంలోని మొదటి రెండు పాదాలను కలిపి రెండు సార్లు సాధారణంగా పాడాక మూడోసారికి 'పట్టినవాడు' దగ్గర ఒక ఆవర్తంలో ఆలాపనను తీసుకుని మధ్యమస్థాయి నుండి సంచరిస్తూ ఆరోహణ గమకంతో వినిపించి,తిరిగి అదే పాదాన్ని పాడి 4 వ పాదాన్ని రెండు సార్లు వినిపిస్తూ 'చిందులేసినవాడు' దగ్గర స్వరాలను కూడా చిందు లేయిస్తున్నట్లుగానే 'పదపదసని రిసనిదపమ' అంటూ భావాత్మకంగా పాడారు. తరువాత పల్లవిని అందుకున్నారు. రెండో చరణం ముందు రెండు ఆవర్తాలలో వేణువు బిట్టును ఇచ్చారు. మరో రెండు ఆవర్తాలలో జతుల కొనగోలును త్రిశ్రగతిలో ప్రారంభించి చతురశ్రగతిలో ముగిస్తూ అందంగా వినిపించగా,ఒక అక్షరం జాగా వదిలి పంచమం నుండి 'కడవ నిడుకొని' ని ప్రారంభించారు. 'సడులాయెనే' దగ్గర మిగిలిన జాగాను మృదంగం ముక్తాయితో నింపగా తిరిగి చరణాన్ని అందుకున్నారు. ఇక్కడినుంచి పాట వెంటే కొనగోలు అనుసరణ మొదలైంది. మూడో పాదం 'తడబడి' ని పైస్థాయికి పెంచుతూ పాడి, 'మాటున' దగ్గర చిన్న ఆలాపనను మరొకవిధంగా రూపొందించుకుని రెండు ఆవర్తాల్లో పాడి 'తడబడి' ని మళ్ళీ అందుకున్నారు. 'ఆగెనే' దగ్గరినుంచి లయగతిలో ఊపును చూపిస్తూ చురుగ్గా పాడారు. 'లాగెనే' దగ్గర లింకు ఆలాపన ఇచ్చి  మళ్ళీ 'ఆగెనే' దగ్గరినుంచి పాడారు. 'తమకము విడి' దగ్గరినుంచి ద్రుతగతిలోనికి మారి చివరిదాకా చకచకా పాడారు. చివరలో పల్లవిని అందుకుని రెండు వైవిధ్యమైన సంగతులతో పాడి ముగించగా మృదంగం ముక్తాయితో పాటంతా ముగిసిపోయింది.

**రాదేలనే రాజగోపాలుడు**




**చిత్రం : వసంతగీతం (1984)**
**రచన : రాజశ్రీ**
**సంగీతం: చక్రవర్తి**
**గానం : ఎస్.జానకి**
**నృత్యం : రాధ**

<u>శుద్ధసావేరి-ఏక</u>

రాదేలనే రాజగోపాలుడు రాదేలనే
ఓయమ్మ ఓయమ్మ                    ॥రాదే॥
రవ్వల మురళి రాగాలు చిలికి
పువ్వువిలుకాని నాపై పురిగొలిపి         ॥రాదే॥

1. కలలోన నా చెంప మీటి,కన్నుగీటి,
   కలికి రమ్మని చెంగు దూసి
   తన పెదవినే మదనలేఖగా దూసి
   మనసు మరులు విరియించి
   మరుల విరులు కురిపించి              ॥రాదే॥

2. జిలుగారు జాబిల్లి పువ్వు,వాని నవ్వు
పులకింతలకు మేలుకొలుపు,వాని పిలుపు
చిరుగాలితో నా చెవికి కబురంపి
చిగురు సెగలు రగిలించి
చిలిపి వగలు పలికించి ॥రాదే॥

రాజశ్రీగారి చలనచిత్రగేయరచనలో ఈ పాట ఒక చారిత్రికరసవద్ఘట్టపు మణిపూస. విరహగీతాన్ని ఇంత చక్కని కావ్యరచనామార్గంతో రచించడం గొప్ప విశేషమని చెప్పాలి. ఇందులో ఉపయోగించిన పదజాలం అంతా కవిసమయాలుగా మెప్పు పొందినవే. ఈ పాటను కథానాయిక రాధ మీద చిత్రించారు. ఆమె చక్కని హావభావాలతో అభినయించారు.

మురళి రాగాలను చిలుకుతూ మన్మథుడిని తనపైకి పురికొల్పిన రాజగోపాలుడు రాలేదన్న బాధను మనోహరంగా అభినయించారు. నాయిక తనను కలలో గోపాలుడు ఎన్నెన్ని రకాలుగా ప్రేమకు గురిచేశాడో మొదటి చరణంలో తలచుకున్నది. గోపాలుని నవ్వు,పిలుపు,వగలు అన్నీ గుర్తు చేసుకుంటూ దాని కారణం తెలియక ఆవేదన నిండిన అనురాగాన్ని ప్రకటిస్తున్నది. ''చెంప మీటి,కన్నుగీటి,చెంగు దూసి,లేఖ దూసి, విరియించి, కురిపించి,పువ్వు,నవ్వు,మేలుకొలుపు,పిలుపు'' మొదలైన సమతూకపు పదాలను ప్రయోగిస్తూ భావాధిక్యతను రచయిత మనోజ్ఞంగా ప్రకటించారు.

'పెదవినే మదనలేఖ చేయడం' అన్నమయ్య కీర్తనలో కనిపిస్తుంది. 'ఏమొకో చిగురుటధరమున' కీర్తనలో అమ్మవారి అధరాన్ని వర్ణిస్తూ "భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా" అన్నారు. అలాగే ఇక్కడ పెదవిని మదనలేఖగా నిరూపించారు. 'పులకింతలకు మేలుకొలుపు' అనే ఆలోచన ఎంతో ఉదాత్తసుందరంగా చెవికి వినిపిస్తున్నది. 'చిలిపి వగలు' ప్రయోగం బాగుంది. చక్రవర్తిగారికి బాణీల్లో నిలకడ చాలా తక్కువ. లలితవిషాదగీతాల్లోనే కొంచెం నిలకడను గమనిస్తాం. మిగతా నృత్యగీతాల్లో,యుగళగీతాల్లో ఆయన విపరీతమైన వేగాన్ని ఇష్టపడతారు. అందుకు ఈ విరహగీతం కూడా అతీతం కాలేకపోయింది. 'ప్రియుడు ఇంకా రాలేదు' అనే బెంగతో నింపాదిగా ఆలోచించాల్సిన గోపిక ఈ గీతం ద్వారా 'అబ్బ! తొందరగా వస్తే బాగుండు' అనే వేగిరపాటును అతివేగంతో ఊహిస్తున్నట్లుగా అర్థం చేసుకోవాలి. ఇదీ ఒక సొగసనే అనుకోవాలి. అయితే శుద్ధసావేరి రాగాన్ని ఎన్నుకోవడం పాటకు కొంచెం క్రొత్తదనాన్ని తెచ్చింది. అక్షరకాలం సరిపోలేదు కనుక ఏకతాళంగా భావించాలి.

మొదట నాలుగు ఆవర్తాలలో మృదంగవిన్యాసం వినిపించారు. తరువాత మరో నాలుగు ఆవర్తాలలో వీణ, వేణువు, వయొలిన్స్‌తో బిట్ ఇచ్చి పైషడ్జమంలో వదిలేయగా 'రాదేలనే' పల్లవిని పైషడ్జమంలో సమం నుంచి ప్రారంభించారు. పల్లవిని రెండు సార్లు మార్పు లేకుండా పాడాక అనుపల్లవి 'రవ్వలమురళి' ని మధ్యమం నుండి మొదలుపెట్టి ఒకసారి పాడి 'గొలిపి' దగ్గర 'దసరిమపదస' అంటూ ఆరోహణ గమకంలో పల్లవిని అందుకున్నారు 'రాదేలనే' పదాన్ని రెండుసార్లు రెండు రకాల సంగతులతో పాడారు. తరువాత ఆరు ఆవర్తాలలో వీణ, వేణువు, వయొలిన్స్‌తో వేగవంతమైన బిట్టు ఇచ్చాక మొదటి చరణం దైవతం నుండి సమంలో మొదలైంది.

మొదటి రెండు పాదాలను రెండుసార్లు ఏ మార్పూ లేకుండా పాడారు. తరువాత పాదం నుంచి వేగంలో వేగంగా మిత్రం పద్ధతిని తీసుకుని చరణాన్ని చివరిదాకా పాడారు. 'కురిపించి' దగ్గర చక్కని సంగతిని పలికిస్తూ పల్లవిని ఎత్తుకున్నారు. వీటిలో మిత్రాన్ని ప్రారంభించి నప్పుడు 'తన పెదవి' పదాన్ని అతీతపద్ధతిలో 'తన' ను 8 వ అక్షరం కాగానే అందుకోవడం విశేషం.

పల్లవి తరువాత అర ఆవర్తం నుండి స్వరవాద్యాలు బిట్టును ప్రారంభించి ఆరు ఆవర్తాలలో వినిపించగా రెండవ చరణం 'జిలుగారు'ను సమంలో దైవతం నుండి ప్రారంభించారు. కాని 5 వ అక్షరం నుంచి మొదలైంది కనుక అక్షరకాలం భగ్నమైంది. అందువల్ల ఇక్కడినుంచి ఏకతాళంగా భావించాలి. మొదటి చరణం బాణీలోనే దీన్ని కూడా వినిపించి పల్లవిని ఎత్తుకుని,అనుపల్లవితో పాటు మొత్తం పాడి 'రాదేలనే' దగ్గర ముగించగా పాటంతా ముగిసిపోయింది.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

# సూక్తి సురభి

– రెంటాల సాంబశివరావు

*మృద్ఘట ఇవ సుఖభేద్యో*
*దుస్సంధానశ్చ దుర్జనో భవతి।*
*సుజనస్తు కనకఘట ఇవ*
*దుర్భేద్య స్సుకరసంధిశ్చ॥*

దుర్జనః-చెడ్డవాడు, మృద్ఘటః ఇవ-మట్టికుండవలె, సుఖ-తేలికగా, భేద్యః-పగులు(తుంది) తాడు। చ-మరియును, దుస్సంధానః-అతకడానికి సాధ్యం కానిదిగా, భవతి-ఔ(తుంది) తాడు। తు-కానీ, సుజనః-మంచివాడు, కనక-బంగారుమయమైన, ఘటః ఇవ-కుండవలె, దుర్భేద్యః పగులగొట్టడం సాధ్యం కా(దు)డు। చ-ఇంకా, సుకర-తేలికగా, సంధిః-అతుకదగిన(ది) వాడు॥

దుష్టుడు మట్టి కుండ వలె తేలికగా పగిలిపోతాడు, తిరిగి అతకడం సాధ్యమే కాదు। అలాకాక సజ్జనుడు బంగారు కుండలాగా పగలుగొట్టడమూ తేలిక కాదు అలాగే అతకడమైతే చాలా తేలిక॥

*జీవంతం మృతవన్మన్యే*
*దేహినం ధర్మవర్జితమ్।*
*మృతో ధర్మేణ సంయుక్తో*
*దీర్ఘజీవీ న సంశయః॥*

ధర్మ వర్జితం-ధర్మమును గణింపని, జీవంతం-బ్రతికి యున్నవానినిగూడా, దేహినం-జీవిని, మృతవత్-మరణించినవానినిగానే, మన్యే-(నేను) భావిస్తాను। (అదే విధంగా) ధర్మేణ-ఆ ధర్మముతో, సంయుక్తః-కూడినవాడు, మృతః-మరణించినా కూడా, దీర్ఘజీవీ-చాలా కాలము జీవించియున్నవాడే। న సంశయః-అనుమానమే లేదు కదా॥

అధర్మవర్తనుడై బ్రతికే వానిని నేను మృతునిగానే భావిస్తాను। అలాగే ధర్మబద్ధుడైనవాడు మరణించినా కూడా వానిని చిరంజీవియే అని తలుస్తాను। ఇందులో అనుమానమే లేదు॥

*పరోక్షే కార్యహంతారం*
*ప్రత్యక్షే ప్రియవాదినమ్।*
*వర్జయేత్ తాదృశం మిత్రం*
*విషకుంభం పయోముఖమ్॥*

పరోక్షే-వెనకాల, కార్య-పనులను, హంతారం-పాడుచేయువాడును, ప్రత్యక్షే-ఎదుట, ప్రియవాదినం ఇష్టముగా మాట్లాడువాడును, పయః ముఖం-పైభాగమున పాలు కలిగియుండి, విషకుంభం-విషము నిండిన కుండయైన, తాదృశం-అటువంటి, మిత్రం-స్నేహితుని, వర్జయేత్-విడిచిపెట్టవేవలెను॥

మన యెదుట ఇచ్చకాలాడుతూ వెనకాల మన పనులను పాడుచేసే(గోతులు తీసే) మిత్రుని విడిచిపెట్టవేవలెను। ఎందుకంటే వాడు పైన పాలతో నిండి లోపల విషముతో కూడిన కుండవంటివాడు॥

*ప్రజానాం వినయాధానా-*
*ద్రక్షణా ద్భరణా దపి।*
*స పితా పితర స్తాసాం*
*కేవలం జన్మహేతవః॥*

ప్రజానాం-ప్రజలకు, వినయ-వినయగుణాన్ని, ఆధానాత్ నేర్పించుటవలనను, రక్షణాత్-రక్షించుటవలనను, భరణాత్ అపి-పోషించుటవలనను గూడా, సః-ఆ(దిలీప) మహారాజు, పితా-తండ్రియైనవాడు। తాసాం-ఆ ప్రజలయొక్క, పితరః-(తల్లి) దండ్రులు మాత్రము, కేవలం-ముఖ్యంగా, జన్మహేతవః-పుట్టుకకు కారణమైన వారు సుమా॥

మహాకవి కాళిదాసు రఘువంశ మహాకావ్యంలో రాజధర్మాన్ని స్పష్టంగా విశదపరిచాడు। పిల్లల పట్ల తండ్రి బాధ్యతలు-వినయవిధేయతలు నేర్పుట, రక్షించుట, పోషించుట అనునవి దిలీప మహారాజు ఆచరించి చూపించినాడు। వారి తల్లిదండ్రులు మాత్రము కేవలం వారి పుట్టుకకు కారణమైన వారు సుమా॥

*క్షారం జలం వారిముచః పిబంతి*
*తదేవ కృత్వా మధురం వమంతి।*
*సంత స్తథా దుర్జనదుర్వచాంసి*
*పీత్వా చ సూక్తాని సముద్గిరంతి॥*

వారిముచః-మేఘాలు, క్షారం జలం-(సముద్రములోని) ఉప్పు నీటిని, పిబంతి-(త్రాగుతాయి? తత్ ఏవ-ఆ ఉప్పు నీటినే, మధురం కృత్వా-తియ్యగా చేసి, వమంతి-వర్షిస్తాయి? తథా-అలాగే, సంతః-సజ్జనులు, దుర్జన-దుష్టులయొక్క, దుర్వచాంసి చ-చెడు మాటలను గూడా,

పీత్వా-త్రాగి(గ్రహించి), సు ఉక్తాని-మంచిమాటలను, సముద్గిరంతి-ప్రకాశింపజేస్తారు।
మేఘాలు సముద్రములోని ఉప్పు నీటిని గ్రహించి అమృత జలాన్ని వర్షిస్తాయి। అదే విధంగా సజ్జనులు దుర్మార్గుల చెడు మాటలను గూడా గ్రహించి లోకానికి సూక్తులను అందిస్తారు॥

*కమలే కమలా శేతే*
*హర శ్శేతే హిమాలయే।*
*క్షీరాబ్ధౌ చ హరి శ్శేతే*
*మన్యే మత్కుణశంకయా॥*

కమలా-లక్ష్మీదేవి, కమలే-పద్మమునందు, శేతే-ఉంటుంది। హరః-శివుడు, హిమాలయే హిమాలయ పర్వతముమీద, శేతే-ఉంటున్నాడు। చ-ఇంకా, హరిః శ్రీమహావిష్ణువు, క్షీరాబ్ధౌ-పాలసముద్రమునందు, శేతే-ఉంటున్నాడు। మత్కుణ శంకయా-నల్లుల బాధ అనే అనుమానముతో(అని), మన్యే-భావిస్తాను॥
శ్రీమహాలక్ష్మీదేవి పద్మమునందు నివసిస్తుంది। పరమేశ్వరుడు హిమాలయ పర్వత శిఖరముమీద ఉంటున్నాడు। విష్ణువు పాలసముద్రముపైన ఉంటున్నాడు। బహుశా నల్లుల భయముతో నేమో అని నేను అనుకుంటున్నాను॥

*వాసః కాంచనపింజరే నృపవరై ర్నిత్యం తనో ర్మార్జనం*
*భక్ష్యం స్వాదు రసాల దాడిమఫలం పేయం సుధాంభః పయః।*
*వాచ్యం సంసది రామనామ సతతం ధీరస్య కీరస్య భో*
*హాహా హంత తథా౽పి జన్మవిటపిక్రోడం మనో ధావతి॥*

ధీరస్య-ధైర్యము గల, కీరస్య-చిలుకకు, వాసః-నివాసమైతే, కాంచన-బంగారుమయమైన, పింజరే-పంజరమునందును, నిత్యం-ఎల్లప్పుడూ, తనోః శరీరమునకు, మార్జనం-మర్దనాదికమైతే, నృపవరైః-ఉత్తమరాజులచేతను, భక్ష్యం-భోజనమైతే, స్వాదు-రుచికరములైన, రసాల-మామిడియును, దాడిమ-దానిమ్మ, ఫలం-పండ్లను, పేయం-త్రాగేదైతే, సుధాంభః-అమృతమువంటి, పయః-నీరును, సంసది-సభలో, సతతం-నిత్యమును, వాచ్యం-పలికేదైతే, రామనామ-శ్రీరామనామము। భోః-అయ్యా, తథా అపి-ఐనప్పటికీ, (కీరస్య)మనః-ఆ చిలుక యొక్క మనస్సైతే, హాహా హంత-అయ్యయ్యో! జన్మ-తన పుట్టుకకు కారణమైన, విటపి-చెట్టుయొక్క క్రోడం-తొఱ్ఱనిగూర్చియే, ధావతి-పరిగెడుతూనే ఉంటుంది।
రామచిలుక నివాసము బంగరు పంజరము। ఉత్తములైన రాజులు లాలనగా చేసే మర్దనము। ఆహారము రుచికరములైన మామిడి, దానిమ్మ పండ్లు, త్రాగే పానీయము అమృత తుల్యమైన జలము, సభలలో నిత్యమూ శ్రీరామనామ జపము, ఆహా ఇన్నిన్ని సుఖభోగాలున్నా వాటిని లెక్క చేయకుండా ధైర్యము గల దాని మనస్సు మాత్రము తన జన్మస్థానమైన। చెట్టు తొఱ్ఱవైపే పరుగెడుతూ ఉంటుంది।

*అజారజః ఖరరజ-*
*స్తథా సమ్మార్జనీరజః।*
*దీపమంచకయో శ్ఛాయా*
*శక్రస్యా౽ పి శ్రియం హరేత్॥*

అజా-మేకల సమూహము యొక్క, రజః-ధూళియును, ఖరరజః గాడిదల ధూళియును, తథా-అలాగే, సమ్మార్జనీ-చీపురుయొక్క, రజః-ధూళియును, దీప-దీపాల యొక్కయును, మంచకయోః-మంచముయొక్కయును, ఛాయా-నీడయును, శక్రస్య అపి-ఇంద్రుడంతటివాడిదైనా, శ్రియం-సంపదను, హరేత్-నశింపజేస్తుంది॥
మేకల గుంపువల్ల ఏర్పడిన ధూళిగానీ, గాడిదల సమూహమువలన ఎగసిన దుమ్మైనా గానీ, చీపురు ధూళి గానీ, అలాగే దీపాలయొక్కయు,మంచాలయొక్కయు నీడలు గానీ సోకితే ఇంద్రు దంతటివాడి సంపదయైనా హరించి పోతుంది సుమా।

*పఠకాః పాఠకా శ్చైవ*
*యే చా౽న్యే శాస్త్ర చింతకాః।*
*సర్వే వ్యసనినో మూర్ఖాః।*
*యః క్రియావాన్ స పండితః॥*

పఠకాః-చదివేవారును, చ-మరియును, పాఠకాః ఏవ-చదివించేవారును, చ-ఇంకనూ, అన్యే-తదితరులైన, శాస్త్రచింతకాః-శాస్త్ర చర్చ చేయువారును, సర్వే-అందరునూ, వ్యసనినః-అలవాటు పడిన, మూర్ఖాః-అజ్ఞానులే। యః-ఎవ్వడైతే, క్రియావాన్-ఆచరించునో, సః-అట్టివాడే, పండితః-మహా జ్ఞాని॥
వేదములు, శాస్త్రములు చదివినా,బోధించినా, శాస్త్ర చర్చ చేసేవారునుకూడా అందు కలవాటు పడిన అజ్ఞానులు, అలాకాక ఆ చదివిన విద్యలను ఆచరించువాడే అసలైన పండితుడు।

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174

# దసరా రాజస్థాన్ -02

**– యన్. లక్ష్మి అయ్యర్**

భారతదేశపు రాష్ట్రాల్లో అతి పెద్ద రాష్ట్రమైన రాజస్థాన్ రాజుల అతి వైభవానికి ఐశ్వర్యానికి నిలయమైన రాష్ట్రంగా "వీర భోగ్యా వసుంధర" అని పేర్కొన్నబడ్డది. దీని రాజధాని జైపూర్ దీన్నే పింక్ సిటీ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాసంలో రాజస్థాన్లో దసరా, ఎలా జరుపుకుంటారు? దాన్ని గురించి చర్చిద్దాం. దానితో బాటు ముడివడి వున్నా జోద్‌పూర్ గురించి కూడా తెలుసు కుందాం

దీపావళికి ముందు వచ్చే నవరాత్రి లేదా దసరాను ఉత్తర భారత దేశంలో ఉన్న రాజస్థాన్ ప్రజలు శ్రీరాముని కథతో పాటు దసరాను దీపావళిని కలిపి తన ఐక్యతను చాటుకుంటారు. అదే కాక ఆ తొమ్మిది రోజులు యముడి యొక్క క్రూర దంతాలు బయటికి వస్తాయని వాటి నుండి మనల్ని రక్షించుకోవడానికి దేవీ నామస్మరణలో గడపాలని దేవీ భాగవతం చెబుతున్నది. విజయదశమి రోజు పాండవులు జమ్మి చెట్టు దగ్గర ఆయుధాలు వదిలి వెళ్లారని విజయదశమి రోజున తిరిగి తీసుకున్నారని చెప్పబడు తున్నది. ఇక రాజస్థాన్ విషయానికి వస్తే కోటా జిల్లా దసరా సంబరాలకు పేరుపొందినది. దేవి దుర్గకు అత్యధిక మహత్వం ఇచ్చి శ్రీరామ చంద్రుడే స్వయంగా ఆ తల్లిని కొలిచాడని చెప్పబడుతున్నది . దక్షిణ భారతదేశంలో దసరా సమయంలో బొమ్మలు పెట్టి దుర్గా సరస్వతీ లక్ష్మీ పూజలతో 9 రోజులు ఎలా కొలుస్తారో అలాగే ఇక్కడ దేవిని తొమ్మిది రోజులు ఉపవాసం ఉండి పూజిస్తారు. ఇక్కడ రామాయణంలోని ఒక ఘటన ముడిపడి వుంది దుర్గాదేవికి కాళీ మాతకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చే ఉత్తర భారత జనులు సాక్షాత్ శ్రీమన్నారాయణుడే రాముడు అవతారంలో వచ్చి దుర్గా దసరాను భక్తితో జరుపు కుంటారని చెప్తారు. దీనికి ఆధార గ్రంథంగా దేని భాగవతాన్ని భావించవచ్చు దేవీ భాగవతంలో ఆ లలితా మహాత్రిపుర సుందరిని అపరాజిత అని చెప్పబడింది అంటే ఆ తల్లికి ఓటమి లేనేలేదని అర్థము ఈ దేవీ భాగవతాన్ని ఆధారంగా చేసుకుని హిందీ సాహిత్యపు అత్యంత ప్రముఖ కవి సూర్యకాంత్ త్రిపాఠి నిరాల గారు కలకత్తాలోని కాళీమాతచే ప్రభావించబడి రామ్ కీ శక్తి పూజ అన్న గీతి కావ్యాన్ని రాశారు. రావణుడితో యుద్ధం చేసేటప్పుడు రాముడు మొదటి కొన్ని రోజులు తన సేనలన్నీ రావణుని సేనలు హతమార్చడం చూసి చింతించాడని కన్నీళ్లు కార్చాడని అప్పుడు జాంబవంతుడు అతనికి దుర్గాదేవిని కొలువమని హిత భోధ చేస్తాడు. మొదట కొన్ని రోజులు ఓటమి చెంది నిరాశ పడి ఉన్నప్పుడు రాముడు హతోత్సాహుడు అవుతాడు. ఆ సమయంలో జాంబవంతుడు రాముడికి ఒక్కసారి అతని శక్తి సామర్థ్యాల గురించి చెబుతాడు. అసత్యానికి అన్యాయానికి ప్రతిరూపమైన రావణుడి తపస్సుకే ఫలితాన్ని ఇచ్చే ఆ దేవి సత్యం సదాచారణ గల రామా! నీకు తప్పక విజయం సమకూరుస్తుంది, "నీ తపస్సు ఎప్పుడు వ్యర్థమవదు" అని ఉపదేశిస్తాడు అసత్యానికి నిలయమైన దుష్టుడైన రావణుడు శివ భక్తితో పాటు జగన్మోహిని జగన్మాతను కొలిచి ఆమె వరాల అనుగ్రహంతో విజయం సాధిస్తున్నాడని చెబుతూ" సత్యవంతుడైన శ్రీరాముడు ఆ దేవిని కొలిస్తే దేవి శ్రీరామునికి సహాయ పడుతుందని చెప్తాడు ఆ మాట విని రాముడు ప్రతిరోజు ఉదయమే లేచి 108 నీల పద్మాలతో దేవీమాత అర్చన ఆరంభిస్తాడు. అదే నవరాత్రి మొదటి రోజు. ఇలా తొమ్మిది రోజులు పూజించాలని పూజచేసే శ్రీ రాముని 9వ రోజు దుర్గ అతని భక్తిని పరీక్షింపదలచి ఒక నీల కమలాన్ని తీసుకొని వెళ్లి దాచి పెడుతుంది. పూజలో వున్నా శ్రీ రాముడు లేచి వెళ్లి ఇంకొక కమలాన్ని తీసుకురావాలంటే తన వ్రతభంగం అవుతుందని చింతింపనారంబించాడు. కొద్ది సేపు ఆలోచించిన రామచంద్రునికి తన తల్లి కౌసల్య గుర్తుకు వస్తుంది కౌసల్య రాముని ఎప్పుడూ పద్మనయనా రాజీవ నయనా అని పిలిచేది. రాముడు తన తల్లి మాటలు ఎప్పుడూ వమ్ము కాదని తలచి తన కంటిని ఒక పద్మంగా భావించి దుర్గను ధ్యానించి తన బాణంతో తన కన్నును పెకిలించడానికి ప్రయత్నిస్తాడు అప్పుడు దేవి దుర్గ అతని భక్తికి మెచ్చి తాను తీసుకు వెళ్లిన నీల తామర పువ్వును సమర్పించి "పూజను పూర్తి చెయ్యి! విజయం నీకే రామా అని ఆశీర్వదించి అనుగ్రహిస్తుంది. ఆ తల్లి దీవెనలు పొందిన రాముడు విజయదశమి రోజు రావణున్ని వధిస్తాడు. ఈ కథకు ప్రామాణికము దేవీ భాగవతంలో శ్రీ లలితా పరమేశ్వరిని "నారాయణ నయనార్చిత" అని చెప్పబడింది. ఇక్కడ దసరా జరుపుకునే విధానం: దసరాకు ఒక వారం ముందు ముందుగా అంటే నవరాత్రులకు ముందు ఇక్కడ రావణ్ బజార్ అని ఒక బజారు నిర్మింపబడుతుంది. ఈ

రావణ బజారు ఉత్తర భారతమంతా నిర్మింపబడుతుంది రాజధాని జైపూర్‌లో కోటాలో సుమారు 10 కిలోమీటర్ల వరకు ఈ రావణ బజార్ ఉంటుంది మూడు అడుగుల నుండి 450 అడుగుల వరకు వెదురు చెట్టు బద్దలను కాగితాలతోనూ ఈ పొడుగాటి బొమ్మలను తయారు చేస్తారు. ఈ బొమ్మలు చూడడానికి చాలా భయంకరంగా కనిపిస్తాయి. ప్రతి ఒక్క కాలనీలో కూడా ఒక్కొక్క బొమ్మను కొని వెళ్ళి కాలనీలో ఓ చోట పెడుతారు. ఆ బొమ్మ వెనకాల అనేక విధమైన మతాబులను దీపావళి బాంబులను కడతారు. రావణ వధ అయిన తర్వాత సత్యానికి సంబంధించిన విజయాన్ని సూచించే రాముడికి పాటలు పాడి అందరికీ ప్రేమతో మిఠాయిలను పంచుతారు విజయదశమి రోజు తెల్లవారి దుర్గా సప్తశతి చదివి దేవుని పూజించి తమ తమ బిడ్డలకు అక్షరాభ్యాసం కూడా చేస్తారు దక్షిణ భారతంలోలాగా వాహనాలను అలంకరించి రంగురంగుల పూలు బొట్లు పెడతారు.

ఉత్తర భారత దేశంలో ప్రముఖంగా రాజస్థాన్లో అమావాస్య నుండి తొమ్మిది రోజులు వ్రత మాచరించి విజయదశమి రోజు రంగుల  కాగితాలతో తయారైన వెదురు చెక్కలతో 10 తలలు గల పెద్ద రావణుని తయారుచేస్తారు దానితోపాటు కుంభకర్ణుడు ఇంద్రజిత్ మొదలగు రాక్షసుల బొమ్మలను కూడా తయారు చేసి ఆ పెద్ద బొమ్మ మీద విజయదశమి రోజు బాణంతో పెట్రోల్‌తో తడిసిన గుడ్డను కట్టి రాముని స్తుతిస్తూ ఆ రాక్షస బొమ్మల మీద విసురుతారు ఆ బాణం దానికి తగిలి పెద్ద పెద్ద మంటలను లేపుతూ ఆ బొమ్మలు దగ్ధమవుతాయి ఆ బొమ్మల మధ్యలో టపాకాయలను ఉంచి తయారు చేస్తారు ఆ మూడు బొమ్మలు దగ్ధమైన తర్వాత అది రావణ కుంభకర్ణ ఇంద్రజిత్తులను సంహరించినట్లు సంతోషించి దసరాను జరుపుకుంటారు. రాముడు సీత లక్ష్మణుడు హనుమంతుడుతో సహా అయోధ్యకు దీపావళి నాడు తిరిగి వచ్చినట్లు నమ్మి కొలుస్తారు.

ఇక వైదికంగా చూస్తే దశమి రోజు పది రోజుల గొప్పతనాన్ని ఇలా వర్ణిస్తారు పది ఇంద్రియాలు కోరికలు ఆశలు పేరాశలు కోప తాపాలు కామ క్రోధ లోభాలు మదమాశ్చర్యాలు మనసు అందులో ఉన్న తీరని కోరికలు అన్నింటిని జయించిన రోజుగా చెప్పి అసత్యం మీద సత్యానికి విజయం జరిగిందని ఆడంబరమైన శరీరములో ఉన్న ఆత్మ తన ఇంద్రియాలను వశ పరచి వాటి నిగ్రహ శక్తికి విజయం సాధించిందని అన్యాయంపై న్యాయపు విజయమని తమోగుణంపై సత్వగుణ విజయమని చెడు పై మంచి యొక్క విజయమని రాక్షసునిపై దేవుని విజయమని భోగంపై యోగం యొక్క విజయమని జీవుడి మీద పరమాత్ముని విజయమని పాటలు పాడి ఆ దేవుని పొగుడుతారు విష్ణు గ్రంథ లేదా అపరాజిత అనే నీలిరంగు గల పుష్పములు తీసుకొని దుర్గాదేవిపై అర్చించి పూజిస్తారు దేవి తన తొమ్మిది ఆకారాలతో ఆ మహిషాసురుని సంహరించిన వల్ల దేవి యొక్క మహిమలను పాడుతూ రావణ సంహారాన్ని రామ లీలగా జెరిపి ఘనంగా వేడుకలు చేసుకుంటారు

*ప్రథమం శైల పుత్రీతి ద్వితీయం బ్రహ్మ చారిణీం*
*త్రితీయం చండ ఘంటేతి ,కుష్మాండేతి చతుర్థకం*
*పంచమం స్కంద మాతేతి షష్ఠమ్ కాత్యాయనీతి చ*
*సప్తమం కాల రాత్రీతి మహా గౌరీతి చాష్టమం*
*నవమం సిద్ధ దాత్రీచి నవ దుర్గా ప్రకీర్తితా*

నవరాత్రి వ్రతం ఇక్కడ వీళ్లు శ్రావణమాసం అంతా వ్రతం చేసుకుని ఉపవాసం వుంటారు నవరాత్రి యొక్క తొమ్మిది రోజులు ఉపవాసం ఉంటారు సాయంత్రం పండ్లు మాత్రమే భుజిస్తారు లేదా కిచడి అనే పదార్థాన్ని తింటారు (కిచడి:సగ్గుబియ్యాన్ని నీటిలో పోసి నానబెట్టి అన్ని కాయగూరలతో పాటు (బంగాళా దుంపల ముక్కలతో జీలకర్రను వేసి ఉడకబెట్టి) ఎర్రగడ్డ వెల్లుల్లి మినహాయించి ఆ ఉడక పెట్టిన దానిమీద ఎర్ర మిరపకాయ ఉప్పు బెల్లం పొడిని కాస్త చల్లి తింటారు. కొంతమంది సాయంత్రం పూట తీపి పదార్థాన్ని మాత్రం తిని ఉపవాసం ఉంటారు ఇంకొక వింత కథ రాజస్థాన్‌కు  మాత్రమే సొంతమైనది. రాజస్థాన్‌లోని జోద్‌పూర్ పక్కనగల మండూర్ అనే గ్రామంలో ఉన్న రాజుగారి కుమార్తె మండోదరి అని శ్రీలంక నుండి ఆకాశమార్గాన్ని వివరిస్తున్న రావణుడు ఆమె సౌందర్యాన్ని చూసి అక్కడి రాజుతో సంబంధం కుదుర్చుకున్నాడని అక్కడ అల్లుడుగా అయ్యి ఆమెతోపాటు శ్రీలంకకు ఇక్కడ నుండి కొంతమందిని కూడా తీసుకెళు తున్న తీసుకెళ్లినట్లు చెప్పబడుచున్నది. ఇక్కడ రావణుడు అతని తమ్ముడు విభీషనుని పేరిట గుడులు కూడా ఉన్నాయి. రావణుడు శివున్ని అర్చిస్తున్న పెద్ద ప్రతిమ కూడా ఉంది. అంతేకాదు రావణుడి కుల దేవి మందిరం కూడా ఉంది. నామ్‌దేవ్ వైష్ణవ సమాజ్ అనే బ్రాహ్మణ జాతి వాళ్లు మండోదరికి బంధువులయి వాళ్లు రావణుని పెళ్లి జరిపించిన తర్వాత శ్రీలంకకు వెళ్లి 15 శతాబ్దంలో అక్కడి నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు చెప్పబడుచున్నది.

ఇక్కడ 150 కుటుంబాలు ఆ జాతికి చెందిన వాళ్లు అందుకే జోద్‌పూర్‌లో దసరా ఉత్సవాలు జరుపుకోరు బదులుగా రావణునికి శ్రాద్ధ తర్పణలు జరిపించి పిండ దానం చేస్తారు. రావణుడు అల్లుడు కాబట్టి అతని మీద ప్రేమతో రామలీల అక్కడ జరగదు. ఇదేలాగా కోటాలో కేతుల్ అనే చోట విభీషన్ని మందిరం కూడా ఉంది. రావణుడు శివుని పూజించేటట్లు ఉన్న పెద్ద ప్రతిమను ఫోర్ట్ రోడ్, జోధాపూర్ లో గల నవగ్రహ గుడిలో చూడవచ్చు. అక్కడ గాడిద ముఖంతో గల ఒక దేవి ఉన్నది. ఆ దేవి పేరు ఖరానా దేవి. ఆమె రావణుడికి అన్ని శక్తులు ఇచ్చినట్లు వినికిడి .ఇక్కడ రామలీల చిత్రాలను జత పరుస్తున్నాను జోద్ పూర్ రావణాసురుని దేవాలయం మరియు విశేషాలు రాజస్థాన్లో బ్లూ సిటీ (నీలి నగరం) గా పేరు గాంచిన నగరాల్లో జోద్ పూర్ రెండవ పెద్ద నగరం. జోధారావ్ అనే రాజపుత్ర రాజుచే స్థాపింపబడి మండూర్ ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన రాజుకు గుర్తుగా మిగిలిన సిటీ. ఇక్కడ కోటలు, దేవాలయాలు కోకొల్లలు. రావణుడికి గుడి వున్న ఒకే ఒక చోట యావద్భారతంలో ఇది ఒకటే. జోద్‌పూర్‌లో రకరకాలైన స్వీట్స్ లభిస్తాయి. థార్ ఎడారి ఇక్కడ నుండి 371 కి.మీ. మాత్రమే. రాజస్తాన్ లోని జోద్‌పూర్‌కు మండోర్ అని మరో పేరు కూడా కలదు. ఆ మండోర్ రాజ కుమారి మండోదరి సౌందర్యాన్ని చూసి మోహింపబడి రావణుడు ఆమెను పెళ్ళాడాడని, తమ రాజ్యపు అల్లుడికి ప్రజలు సంతోషంగా గుడి కట్టారని చెప్పబడుచున్నది ."నామదేవూ అనబడే వైష్ణవ సమాజపు (ఇక్కడ జాతిని సమాజ్ అని చెప్పుకుంటారు) వాళ్ళు మండోదరిని తమ జాతి రాజకుమారిగా గుర్తించి, తమ ప్రాంతంలోని మోదిగిల్ అనే బ్రాహ్మణజాతివారు రావణుడితో ఆమె వివాహాన్ని జరిపించి అతనితోబాటు శ్రీలంకకు వెళ్లి 15 వ శతాబ్దం లో వచ్చి ఇక్కడే స్థిరపడి పోయారని ఇక్కడి స్థానీయ గ్రంథాలను బట్టి తెలుస్తోంది. ఈ జాతికి చెందినా సుమారు 150 కుటుంబాలు ఇక్కడ ఇప్పుడూ వున్నాయి. దసరాలో రాజస్థాన్లో ఘనంగా జరిగే రామలీల ప్రదర్శన సమయాన జోద్‌పూర్ నివాసులు రావణుడికి పిండ దానమిచ్చి శ్రాద్ధ కర్మలు చేయిస్తారు. ఇదేలాగా కోటా నగరంలో ''కేతున్'' అనే చోట విభీషణుడికి గుడి వున్నది .

జోద్ పూర్ లోని రావణ విగ్రహం : రావణుడి పెద్ద విగ్రహం శివుని పూజిస్తున్న భంగిమలో,దానితోబాటు అతని కులదేవత ఖరణదేవి (ఖరం-గాడిద) విగ్రహాన్ని చూడ వచ్చు .

జోద్ పూర్ వెళ్ళే పర్యటకులకు సూచనలు: రావణ మందిరమే కాక చాలా దర్శింప దగ్గ దేవాలయాలు ఇక్కడ వున్నాయి.అందులో 1.అచల్నాథ్ మందిర్ (శివాలయము), చాముండా దేవి (చాముండి కాదు) దేవాలయం, ఉదయ మందిర్ కుంజ్ బిహారి, రాజ్రాన్ చౌడి,రసిక్ బిహారి మొదలగు శిల్ప కళాత్మకతతో కూడిన మందిరాలను దర్శించ వచ్చు .జోద్ పూర్‌లో అసంఖ్య కోటలు కలవు. ముఖ్యమైనవి : మేహ్రాన్ ఘర్ చాల అందమైన కోట. కోట లోపల మోతిమహల్, ఫూల్ మహల్ భవనాలు రమ్యంగా దర్శన మిస్తాయి. ఈ మహల్‌లో ఆ నాటి దివ్య వైభవ చిహ్నంగా వారు ఉపయోగించిన వస్తువులను ప్రదర్శనకై ఉంచారు. జోద్ పూర్ అంటే గుర్తుకు వచ్చేవి బిశనోయ్ తెగ జాతి వారు. ఇక్కడ వారి సంఖ్య చాలా ఎక్కువ. అక్కడ ఉన్న "ఖేజడ్లి" గ్రామంలో చెట్లతో బాటు తమను నరుకమని చెట్లను గట్టిగా వాటేసుకొని మరణించిన వారి సంఖ్య 363. క్రీ .శ 1730న అక్కడ పరిపాలించిన మహారాజు అభి సి శీ హ్ తన మహల్ నిర్మాణానికి అక్కడ వున్న "ఖేజడి చెట్టును (శమీ వృక్షాన్ని, జమ్మిచెట్టు) నరకడానికి సైనికులను పంపించాడు. కాని ఆ జాతికి చెందిన "అమృతదేవి బెనేవాల్" అనే మహిళ చెట్టుకు తనను హత్తుకుని "సిర్ కాటే రుఖ్ రహే తో భీ సస్తోజాణ్"(తల నరికినా పర్వాలేదు చెట్టు నరకడానికంటే నా ప్రాణపు విలువ చౌక" అని చెప్పుతూ ప్రాణాలు విడిచింది. ఆమెతో బాటు ఆమె ముగ్గురు కూతుళ్ళుఅదేలా ప్రాణాలు వదిలారు., పెద్ద ఉద్యమలా తయారై 360 మంది వృక్ష రక్షణకై ప్రాణత్యాగం చేశారు.(ఈ విషయాలను ఖేజడి ఆందోలన్ అని టైపు చేసి గూగుల్ లో కూడా చూసుకోవచ్చు) ఈ సమాజపు వాళ్ళు (జాతుల ) జింకలను, వృక్షాలను కన్నపిల్లల్లా ప్రేమిస్తున్న ప్రకృతిసంరక్షకులు. ఇలా జోద్ పూర్, రాజులకే నిలయమైన రాజస్తాన్ లో తనకంటూ ఓ విశిష్టత తోభారతీయ సంస్కృతిని సకల జీవరాశుల పై గల ప్రేమను జంభేశ్వర్ మహారాజ్ అనే ఓ తాత్వికుడి ద్వారా స్థాపింప బడ్డ బిశనోయ్(29 (బీస్ ంనౌ) సిద్ధాంతాలపై ఆధార పడి మానవ ప్రేమను విశ్వానికి ఎలుగెత్తి చాటుచున్నది. రాజస్తాన్ లోని నేటి తీపి పదార్థాలలో మేవా బర్ఫీ, పాల మీగడతో చేసే రబడి, మాల్ పూవా గోధుమ పాలతో చేసిన హల్వా ఇమారతీ అనబడే జాంగ్రీ మరియు జిలేబీలు ఘేవర్ ఒకటే మిటి రాజస్తాన్ అంటేనే విభిన్న పాల మిఠాయిల కేంద్రం.

ప్రా. లక్ష్మీ అయ్యర్
జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038

# కళా కడలిలో కొత్త కెరటాలు

– తంగెడ విశ్వేశ్వరప్రసాద్

పరిసరాలకు అనుగుణంగా కళాకృతులను రూపొందించడం వర్తమాన కళాధోరణి. దీని సృజన కారులు స్థానిక భౌగోళిక పరిసరాలను, ప్రకృతిని కాపాడడం పట్ల స్పృహను కలిగి వుంటారు. సహజ కళ, ప్రకృతి సిద్ధ కళాసృష్టి (Natural Art) వర్తమాన కళాత్మక కార్యక్రమం. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతికి భంగం వాటిల్లకుండా కళాకృతుల్ని రచించడంపై వీరి దృష్టి వుంటుంది. విషతుల్యమైన వస్తు వినియోగం లేకుండా ప్రకృతిలో సహజసిద్ధంగా దొరికే వస్తు సముదాయంతో కళను సృజించడం హరిత కళాలక్షణం. ఈ వివిధ రకాల ప్రక్రియలను ఉపయోగించడం కళాకారుని యిష్టాన్నను సరించి వుంటుంది. ఇస్తాంబుల్ అంతర్జాతీయ విమానాశ్రయం (IGA) చేపట్టిన "జీరో పాయింట్" ప్రాజెక్టు వేలాది ప్రయాణికులు తిరుగాడే నడవను డెనిజ్ సాడిచ్ కళాకృతుల ప్రదర్శనకు కేటాయించింది. సాంస్కృతిక కళారంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న సమాజానికి హితకరం, నిర్వహణా సౌలభ్యం కలగలిసిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించడం ద్వారా సందర్శకులను కార్య నిర్వహణలో, దాన్ని కాపాడుకోవడంలో, సహనీయతలో భాగస్వాములను చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

ఇస్తాంబుల్ విమానాశ్రయంలో సేకరించిన వ్యర్థాల నుండి, జీరో పాయింట్ ప్రాజెక్టు ఆశయానికి అనుగుణంగా పుట్టుకొచ్చినదే డెనిజ్ సాడిచ్ సృష్టించిన కళ. ఇది నేటితరం సంస్కృతి, కళల మిశ్రమం. సాడిచ్ కళాకృతులన్నీ IGA ట్రేడ్ లోగోలు; వాటా దార్లు, నిర్వాహకులు,



చిత్రం : ఫ్యాషన్స్



డెనిజ్ సాడిచ్ , చిత్రకారిణి

ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణీ కులు, అదీ–ఇదీ అని తేడా లేకుండా పనికి రావని పారేసిన విమానాశ్రయ చెత్త సేకరణ కేంద్రంనుండి తయారైనవే. ప్లాస్టిక్ వస్తువులు, పాత్రలు, సంచులు, సీసాలు, సీసామూతలు, వైరు ముక్కలు, చిరిగిపోయిన యూనిఫారాల ముక్కలు, గుడ్డ పీలికలు, గుండీలు, జీన్స్ పాంటు ముక్కలు, కాలం చెల్లిన పిల్లు మొదలైన వ్యర్థాల నుండి తయారైన ఇరవై అపురూప ముఖాకృతులు (పోర్ట్రేట్లు) కళాఖండాలుగా మారిపోయాయి. ఈ కళా ఖండాల ప్రదర్శన ఇస్తాంబుల్ ఎయిర్ పోర్టు అంతర్జాతీయ ప్రయాణీకులు ప్రాంగణంలో జనవరి 12, 2022 నుండి మూడు నెలలు కొనసాగింది. ప్రదర్శన వల్ల వచ్చిన ఆదాయంలో కొంత భాగం IGA అమెరికాలోని అతి పెద్ద గ్రోసరీ వ్యవస్థ సామాజిక బాధ్యతతో చేపట్టే ప్రాజెక్టులకు కేటాయించబడింది.

జీరో పాయింట్ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం–చేపట్టే కార్యక్రమాల ద్వారా సందర్శకుల్ని పరిసరాల పారిశుధ్యం, సంరక్షణకు నిబద్ధులు అయేలా చూడడం, పారేసే చెత్తనే ముడి సరుకుగా కళాసృజన చేయడం ప్రత్యేక కళా కౌశలంతో పని లేకుండా అతిసాధారణ వ్యర్థాల నుండి మనకు బాగా పరిచయమున్న ఆకారాలను సృజిస్తూ మనం అనవసరంగా, విచక్షణారహితంగా ఉపయోగించే వస్తువుల అవసరాన్ని, అలవాటును సవాలు చేయడం. మన అవసరాలు, జీవన శైలి పరిసరాలకు నష్టం కలిగించేవిగా ఉండకూడదని చెబుతుంది. ఇతర పరిశ్రమల లాగానే కాలుష్యరహితంగా కళా నిర్వహణ సాధ్యమేనని నొక్కి చెబుతుంది. డెనిజ్ సాడిచ్ సృష్టించిన ఆడ, మగ ముఖాకృతు లన్నీ ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచే భారీ పరిమాణంలో వుంటాయి. వీటి నిర్మాణంలో ఉపయోగించిన చెత్త వస్తువులు కూడా ఒకదానికొకటి సంబంధం లేని వ్యర్థాల

నుండి తయారైనవే. అన్నీ పునరుపయోగానికి (రీసైకిల్) వీలైనవే. జిప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కార్డు ముక్కలు, జీన్స్ బెల్టులు, ప్లాస్టిక్ తీగ ముక్కలు. వీటిలో కొన్ని. పది అడుగుల కన్నా పెద్ద పరిమాణంలో వుండే ఈ భారీ ముఖాకృతులు దూరం నుండి చూస్తే ఆయిల్ పెయింటింగులను మరిపించే అద్భుతమైన ఆకారాలు, దగ్గర్నించి చూస్తే నమ్మశక్యంగాని చెత్త వస్తువులు కూర్పు. అతిసాధారణ వ్యర్థ వస్తువులు – కళాఖండాలుగా మారిన తీరు ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. కొత్త అవగాహనతో ప్రయాణీకులు ముందుకు సాగుతారు. ఇస్తాంబుల్ ఎయిర్ పోర్టులో రీసైకిలింగు కొరకు సేకరించిన టన్నుల కొద్దీ చెత్తను చూసినప్పుడు ఆర్టిస్టుకు కలిగిన కొత్త ఆలోచన 'మనకే కాదు, మన తర్వాతి తరాల వారికీ కనువిప్పు కలిగించగలదని ఆశిస్తాను' అంటుంది. గొప్ప ఆర్టిస్టు అనగానే మనకు వెంటనే స్ఫురించేది పెద్ద పెద్ద కాన్వాసులు, తైలవర్ణాలు, కానీ ఈ టర్కీ ఆర్టిస్టు నవీన (అసాంప్రదాయక) మాధ్యమాలలో కళాఖండాలను సృష్టించగల నేర్పు సాధించింది. ఈమె పనితనపు ముఖ్య లక్షణం నైపుణ్యం సంక్లిష్టతల కలగలుపు.

డెనిజ్ సాడిచ్ (**Deniz Sagdic**) టర్కీ, మెర్సిన్ (Mersin)లో 1982వ సంవత్సరంలో జన్మించింది. కాదేదీ కవిత కనర్హం అన్నట్లుగా 'కాదేదీ కళా సృష్టికి అనర్హం అంటుంది డెనిజ్ సాడిచ్. 'రెడీ – రీమేడ్' పేరుతో గత ఇరవై సంవత్సరాలుగా ఈ రంగంలో కృషి చేస్తోంది. తన కళా సృజనకు వివిధ దేశాల భాషలకు చెందిన జనాలు వాడి పారేసిన వ్యర్థాలు మూలం. "సృజనాత్మక ప్రతిభ అవధులు లేనిది. ఆర్టిస్టులు ఏ వస్తువునుండైనా కళను సృష్టించగలిగిన ప్రతిభావంతులు. డెనిజ్ తన కళతో టర్కీ ఎయిర్ పోర్టుకు వన్నె తెచ్చింది" అని భారతీయ పారిశ్రామిక వేత్త హర్ష్‌మారీ వాలా వ్యాఖ్యానిస్తాడు. STIR-WORLD పత్రికతో మాట్లాడుతూ సాడిచ్ అంటుంది – "ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ ప్రయాణికులు ఎక్కువగా తిరిగే నడవలో నా చిత్రాలను ప్రదర్శించడం వల్ల ప్రయాణీకులు బహుళ సంఖ్యలో చూడగలుగుతారు. మనం విచక్షణా రహితంగా చేసే వస్తు వినియోగాన్ని వ్యర్థ శిల్పాల ద్వారా ఎత్తిచూపడం, మన అలవాట్లను మార్చుకోవాలని చెప్పడానికే, ఈ చెత్త సృష్టికి మీరే కారకులు, నా చిత్రాలు తయారయింది మీ వల్లే, నా వల్ల కాదు! నిజంగా ఇంత చెత్త వస్తు వినియోగం అవసరమా? ఇది మానవ మనుగడకు ఆవశ్యకం కానేకాదు, అని చెప్పడానికే ఈ ప్రదర్శన''. 'నేను ఉపయోగించే వస్తువులన్నీ నిరుపయోగ మైనవి. చెత్త నుండి కళాసృజన చేయడం నా ప్రస్తుత ప్రాజెక్టు. ఈ ప్రదర్శన వల్ల ఉన్నత శ్రేణికళకు, నిమ్న కళకు మధ్యనున్న భేదం ఎంతో చర్చకు తెరలేపింది. నా ఈ ప్రయత్నానికి చిత్రం కాదు దాని వెనకనున్న భావం ముఖ్యం (Conceptual Art) అన్న ఆలోచనకు ప్రతిస్పందనగా భావించవచ్చు అంటుంది. ఈ మార్గాన్నే ఎంచుకోవడానికి కారణం శాస్త్రీయ కళా పద్ధతిని నవరించాలన్న తపన. వ్యర్థాలను కళా సృష్టిలో ఉపయోగించడం వల్ల కళాకృతి వెనకనున్న ఉద్దేశాన్ని చూపించగలిగాను, కాన్సెప్ట్‌వల్ ఆర్టుకు కొత్త అర్థం చూపించాను', అని వివరణ యిస్తుంది. డెనిజ్ సాడిచ్ ఎన్నుకున్న మాధ్యమంలో వందల వేల సంఖ్యలో ఒకే రకం వస్తువులు కలిసిపోయి కళా కృతులుగా అవతరిస్తాయి. ఆమె అనుభవాల దృశ్యరూపాలే డెనిజ్ సృష్టించే పోర్ట్రేట్లు. ఏమాత్రం విలువలేని వస్తువులు అత్యంత విలువను సంతరించుకుంటాయి. చెత్తను అభిమానించడం, ఆరాధించడంతో దానికి గౌరవం పెరిగిపోతుంది. ప్రతి కొత్త చెత్త తనకు సవాలుగా నిలుస్తుంది. చెత్తతో అనేక ప్రయోగాలు చేస్తుంది. తను వాటిని పట్టుకుని, పరీక్షించి వాటిని ఎలా ఉపయోగించాలో ఆలోచిస్తుంది. నిర్జీవపు, నిరుపయోగపు చెత్త కళా రూపంగా పరివర్తన చెందడం వెనక చాలా శ్రమ, సృజన అవసరమౌతుంది.

డెనిజ్ సాడిచ్ కళా లక్షణం : పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించని స్నేహపూర్వక కళ, పనితనంలో వైవిధ్యం, వస్తువుల ఎన్నికలో నూతనత్వం, పని పురోగమిస్తున్న కొద్దీ చెత్త అద్భుతమైన కళారూపం ధరించడం, ఆలోచన నుండి అంతిమంగా ఆచరణలో కళాకృతి రూపుదిద్దుకోవడం ఒక రకంగా ప్రయాణం లాంటిదే. ఇతర కళాకారుల లాగానే మొదలైన తన కళాప్రస్థానం ప్రస్తుత దశకు చేరుకుంది. ఇటునుండి తన ప్రయాణం ఎటో? అంటుంది. కళకు మానవత్వం అబ్బితే మానవ జీవితానికి పర్యాయపదమౌతుంది. ప్రజలుకళ దగ్గరకు వెళ్ళడం కాదు, కళనే ప్రజలకు చేరువకావాలి అనే వాస్తవానికి ఇస్తాంబుల్ కళాఖండాల ప్రదర్శన చక్కని ఉదాహరణ.

## డోరిట్ లెనిన్ స్టెయిన్ (DORIT LEVIN STEIN)

ఇజ్రేల్ ఆర్టిస్టు 'రెనాయిర్ డానర్లు' ఆయిల్ పెయింటింగులను శిల్ప కళాఖండాలుగా పునస్సృష్టి చేసి చిత్ర, శిల్ప కళారంగాల్లో విశిష్టమైన గుర్తింపు పొందిన డోరిట్ లెవిన్ స్టెయిన్ గురించి తెలుసుకునే ముందు రెనాయిర్ డాన్సర్ల పూర్వరంగాన్ని పరికించడం అవసరం. రెనాయిర్ డాన్సర్లు చిత్ర వివరాలు, వాటి సృష్టికర్త రెనాయిర్‌ను పరిచయం చేసుకుందాం!

పీయర్ ఆగస్ట్ రెనాయిర్ (Pierre Auguste Renoir) ఫ్రెంచి బాషలో రెన్వా అంటారు. ఇతడు 20వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి కళాకారుడు. ఇంప్రెషనిస్టు శైలిలో పెయింటింగులు రచించడంలో అగ్రగణ్యుడు. స్త్రీ అందానికి పట్టం కట్టిన కళాకారుడు. రెనాయిర్ ఫ్రాన్స్ లియోజస్‌లో 1941లో జన్మించాడు. పీయర్ రెనాయిర్ కుటుంబమంతా కళాకారులే. రెనాయిర్ 1883లో చిత్రించిన తైలవర్ణ చిత్ర త్రయంలో మొదటిది డాన్స్‌ఎట్ బూజివాల్ (Dance at Bougival). ఇది ప్రస్తుతం మసాచుసెట్స్ - బోస్టన్ ఫైనార్ట్స్ మ్యూజియంలో ప్రదర్శించబడుతోంది. తన బోస్టన్ మ్యూజియం అత్యంత ప్రియమైన కళాఖండాల్లో దీన్ని ఒకటిగా చెప్పుకుంటుంది. బాల్‌రూం డాన్సర్ ద్వయంలో యువతి తల, ముఖం, కాళ్ల బ్రష్‌తో పూసిన సున్నితమైన లేత రంగుల్లో చిత్రతమైతే అందుకు విరుద్ధంగా డాన్సర్ దుస్తుల్లో శక్తివంతమైన బ్రష్ పనితనం కన్పిస్తుంది. గాలిలో తేలికగా ఎగురుతున్న భ్రమను కలిగించే డాన్సర్ దుస్తులు చిత్రించడంలో రెనాయిర్ ప్రతిభ వ్యక్తమౌతుంది. ఈ పెయింటింగు లండన్, న్యూయార్క్, పారిస్‌లలో ప్రదర్శించబడిన తర్వాత 1894 నుండి అనేక చేతులు మారి చివరికి 1937లో బోస్టన్ మ్యూజియం చేరుకుంది. ఈ చిత్రంలో డాన్స్ జంటలో పురుషుడు నేవీ – బ్లూ సూట్‌లో, యువతి ఆనాటి ఫాషన్ తేలిక పాటి పింక్ రంగు దుస్తుల్లో కన్పిస్తుంది. ఇరువురూ కెఫేలో ప్రేమగా, గుండ్రంగా తిరుగుతూ డాన్స్ చేస్తుంటారు. ఇది మిగతా రెండు చిత్రాలకన్నా బాగా ప్రజాదరణ పొందింది. తర్వాతి ఆర్టిస్టులకు అనేక కారణాల వల్ల ఆదర్శనంగా నిలిచింది. రెనాయిర్ పెయింటింగులలో రెండవది డాన్స్ ఇన్ ద సిటీ, మూడవది డాన్స్ ఇన్ ద కంట్రీ. వీటిని రెనాయిర్ ఇంపెషనిస్టు శైలిలో చిత్రించిన చివరి ప్రయత్నంగా చెప్పుకుంటారు. డోరిట్ లెవిన్ స్టెయిన్



డోరిట్ లెనిన్ స్టెయిన్

వివిధ ఆకారాల వర్ణమయ కళా ప్రపంచం మనకు ఆహ్వానం పలుకు తున్నట్లనిపిస్తుంది. అదొక స్వప్న లోకపు శిల్ప ప్రపంచం. అందులో వివిధ భంగిమల్లో డాన్స్ చేస్తున్న రూపాలు, కండ్లకు ఇంపైన రంగులు పూసుకున్న వర్తమాన కళాసౌందర్యం మనోహరంగా వుంటుంది. డోరిట్ లెవిన్ స్టెయిన్ పెయింటర్, శిల్పి. తన అసాధారణ ప్రతిభతో బ్రాంజి శిల్పాలను సృష్టించి వాటిలో చైనా వేదాంతాన్ని, పరిసరాలకు–మనిషి కదలికలకు గల సంబంధాన్ని జొప్పించింది. ఈమె చిత్రాలు లండన్‌రాయల్ అకాడమీతో సహా ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శించబడి మన్ననలందు కున్నాయి. ఈమె తీర్చిదిద్దిన లలితసుందర శిల్పాలు గిలిగింతలు పెడ్తే ఆనందంగా నవ్వుతున్నట్లుగా కన్పిస్తూ, అవి ప్రతిష్టించబడిన స్థలానికి వన్నె తెస్తాయి. ఆమె శిల్పాలన్నీ నిజ జీవితంలోని మనుషుల, జంతువుల, పుష్పాల ఇతర వస్తువుల నుండి పుట్టికొచ్చినవి. నాట్య భంగిమలో వున్న శిల్పాలు, ఆకులు, పూలు సంగీతానికి లయబద్ధంగా నాట్యం చేస్తున్నట్లుంటాయి. చుట్టానికి చాలా సాధారణంగా కన్పించినప్పటికీ వాటి వెనక వున్న సృజన, ప్రణాళికల కూర్పు; ఈ శిల్పాల తయారీలో ఆర్టిస్టు నేర్పు, ఓర్పు, సాధన కన్పిస్తాయి. నిత్యం సాధ చేసే నాట్యకత్తె కృషి వలె కఠోర సాధన వల్ల ఇది సాధ్యమైంది అంటుంది శిల్పి డోరిట్.

డోరిట్ లెవిన్ స్టెయిన్ ఇజ్రేల్ – హైఫాలో 1956 జన్మించింది. హైఫాలోవి టెక్నియాన్ – టెక్నాలజీ సంస్థ నుండి గ్రాఫిక్ డిజైన్‌లో బొమ్మలు వేయడం ముఖ్యాంశంగా పట్టా పుచ్చుకుంది. తర్వాత అవ్ని (AVNI) సంస్థలో పెయింటింగ్, శిల్ప కళను అధ్యయం చేసింది. అదే సంస్థలో 1985–1988 మధ్య చిత్ర శిల్ప కళను బోధించింది. 1988లోనే న్యూయార్కు సోహో గాలరీ నుండి విశిష్ట ఆర్టిస్టు అవార్డు అందుకుంది. 1969 నుండి

పెయింటింగు, శిల్ప కళ రెంటినీ జోడించి నూతన కళాకృతులను సృష్టించడంలో అనేక ప్రయోగాలు చేసి అల్యూమినియంతో తయారు చేసిన శిల్పాలకు పెయింట్ చేసే నూతన ప్రక్రియను సాధించింది. క్రమంగా బ్రాంజి శిల్పాల తయారీలో నైపుణ్యం సాధించి అనన్యసాధ్యమైన శైలిని సొంతం చేసుకుంది. తను రాసిన పుస్తకంలో 'శిల్పకళ'పై తన పని విధానాన్ని వివరించింది. స్కెచ్‌లు వేయకుండా నేరుగా తన చిత్తానికి తోచిన విధంగా స్టూడియోలో 3డి శిల్పాలను తయారు చేసింది. బ్రాంజి శిల్పాలను డాన్సర్ల రూపంలోకి మార్చడానికి ఎంతో ఏకాగ్రత అవసరం అని చెప్పుకుంది. ఈ ప్రక్రియకు మూలం అత్యంత ఆకర్షణీయమైన 'రెనాయిర్ డాన్సర్లు'. ఈ శిల్పానికి మూలాధారమైన రెనాయిర్ పెయింటింగు లోని యువ డాన్సర్ సుజానే ధరించిన గౌను గాలికి ఎగరడం, డాన్సర్ల ఉల్లాసం, సంతోషాన్ని ఒడిసిపట్టుకుని శిల్ప రూపం యివ్వడంలో ఎంతో ప్రజ్ఞను ప్రదర్శించింది. డోరిట్ కళాకృతులు ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటు వ్యక్తుల, ఆర్టు గాలరీల సేకరణల్లో కనిపిస్తాయి. న్యూయార్కు, మ్యూనిక్, జెనీవా, షికాగో, న్యూఢిల్లీ మొదలైన ప్రముఖ ఆర్టు గాలరీల్లో, అనేక మునిసిపాలిటీలలోని మ్యూజియా లలో బహిరంగ ప్రదేశాల్లో డోరిట్ శిల్పాలు ప్రతిష్ఠించ బడ్డాయి.

శైలీ – ప్రభావాలు : అనేక సంవత్సరాల సాధన తర్వాత సెయిజాన్, గోండి, క్లిమ్ట్, ని కీ–డి–సెయింట్‌లు ఆపైన పాప్ కళాకారులు, ఆధునిక శిల్పాకారాలను అధ్యయనం చేసి ప్రభావితురాలైంది. అంతిమంగా తన సొంత శైలిని సాధించగలిగింది. డోరిట్ శిల్ప – చిత్ర కళ మూడు దశలుగా కొనసాగింది. క్లాసికల్ బ్రాంజిదశ, రాతి – మిశ్రమ మాధ్యమాల దశ, ప్రస్తుత ఆకృత శిల్పదశ. ఎక్కువగా తన చిత్రాలకు బ్రాంజిని ఆ తర్వాత అల్యూమినియంను ఉపయోగించుకుంది. అందమైన రంగురంగుల రూపాలు, సున్నితమైన రేఖలు డోరిట్ శిల్పాల ప్రధాన లక్షణం. డోరిట్ శిల్పాల్లో మార్లిన్ మన్రో, ఫ్రిదాకాలో, క్వీన్ ఎలిజబత్, బుద్ధ, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ బీటిల్సు మొదలైనవి ప్రముఖమైనవి. గొప్ప కళాకారులంటే తనకెంతో ఇష్టమని, అందుకే వారికి శిల్పరూపాల్లో జీవం పోశానని అంటుంది. కళాకారుల శిల్పాలే కాకుండా వివిధ రకాల మనుషులు, వృత్తి పరికరాల శిల్పాలు – జగ్లర్, బైకర్, ఫాన్ లేడీ మొదలైనవి, జంతువుల శిల్పాలు – రాయల్‌కిస్, లవ్‌స్టోరీ, ఆవు, సీతాకోకచిలుక, గుడ్లగూబ, గద్ద, కోడిపుంజు మొదలైనవి సృష్టించింది. అక్షరాల కూర్పు రాశి చక్రంలోని గుర్తులన్నింటినీ శిల్పాలుగా మార్చింది. పైవన్నీ వర్తమాన కళకు ప్రతినిధులుగా నిలుస్తాయి.

**LOVE** – టైపోగ్రాఫిక్ ఆర్టు : ప్రేమ ఇతివృత్తంగా ముద్రణాశైలిలో అనేక శిల్పాలకు జీవం పోసింది. ఈమె శిల్పాలు విషయానికి తగ్గట్లు రూపుదిద్దుకుంటాయి. వాటిలో 'LOVE' శిల్పాలు ప్రముఖమైనవి. "ప్రేమ అనే ఒక్క మాట అనేక రకాల భావాలను, ఉద్రేకాలను తనలో ఇముడ్చుకున్న విస్తృతపదం. అది జాలి, దయల రూపం, ఆత్మీయత–అంకిత భావాల మిశ్రమం. ప్రేమను నిర్వచించే సమగ్రమైన మాటలు లేవు. కానీ ప్రతి వ్యక్తికీ ప్రేమతో విడదీయలేని సంబంధం వుంటుంది. ఇది క్లిష్టతరమైన, వివరణకు అందని నైరూప్య భావం. అందుకే ప్రేమ అనే పదానికి ప్రత్యామ్నాయంగా కళారూపాన్ని సృష్టించాను. 3డి రూపంలో ప్రేమ శిల్పాన్నీ చూసినప్పుడు, తాకినప్పుడు ప్రేమలోని గాఢత, అనుభూతి, ఆవేశం అర్థమవౌతుంది'' అని వివరణ యిచ్చింది. ఇది డోరిట్ స్వయంగా పెయింట్ చేసిన



అల్యూమినియ శిల్పం. రూపం ఒక్కటే ఐనా ఒక్కో శిల్పం ఒక్కో వర్ణ మిశ్రమం. Love శిల్పం హొటళ్ళు, మ్యూజియాలు మొదలైన చోట్ల ప్రదర్శించబడిన ప్రతిచోటా అక్కడి కళాభిమానుల్ని విశేషంగా ఆకర్షించి వారి మనసులపై చెరగని ముద్ర వేసింది. మొట్టమొదటి సారిగా 1965లో తన తండ్రి మరణానికి నివాళిగా Love శిల్పాన్ని తయారు చేసింది. ఆ తర్వాత ప్రముఖ వ్యక్తులకు కళాకారులకు 'హొమేజి సీరిస్' పేరిట Love శిల్పాల ద్వారా నివాళులర్పించింది. వారిలో పికాసో, జాన్‌మైరో, బీటిల్సు, కసామా, పోలాక్‌లు కొందరు. ఆకారం, వర్ణమిశ్రమంలో ప్రతి శిల్పంలోనూ వైవిధ్యం చూపించింది. డోరిట్ శిల్పాలు గృహాలంకరణలో ఆకర్షణీయంగా వుంటాయి. కొనదలుచుకున్న వారికి మార్కెట్‌లో దొరుకుతాయి కానీ వాటి ధరలు మాత్రం సామాన్యులకు అందనంత ఎత్తులో వుంటాయి.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# మనం మరచిన అన్నపూర్ణమ్మ

– షేఖ్ మహబూబ్ బాషా

బ్రిటిష్ వలస పాలనా కాలం నాటి తెలుగు సమాజాభివృద్ధికి ప్రతిభావంతులైన కొంతమంది 'అన్నపూర్ణమ్మ'లు విశేషంగా తోడ్పడ్డారు. ఆత్మూరి అన్నపూర్ణమ్మ, కొంగర అన్నపూర్ణమ్మ, పేర్ల అన్నపూర్ణమ్మ, వారణాసి అన్నపూర్ణమ్మ, వెల్లంకి అన్నపూర్ణాదేవి, యస్. అన్నపూర్ణాదేవి, మాగంటి అన్నపూర్ణాదేవి, దరిశి అన్నపూర్ణమ్మ మొదలైనవారు వీరిలో కొందరు మాత్రమే. సంఘ సంస్కరణోద్య మానికీ, జాతీయోద్యమానికీ ఎనలేని సేవలందించిన వీరిలో ఒక్క మాగంటి అన్నపూర్ణాదేవిని తప్ప మిగిలిన వారిని మనం మరిచిపోయాము. స్త్రీల సమస్యలు కేంద్ర బిందువులుగా ఇరవయ్యవ శతాబ్ది ప్రథమార్థంలో ముమ్మరంగా కొనసాగిన సంఘ సంస్కరణోద్యమంలో పురుష సంఘ సంస్కర్తల కృషికి ఏమాత్రమూ తగ్గకుండా పాల్గొని ఉద్యమాన్ని ముందుకు నడిపించడమే కాకుండా, విలువైన సంస్కరణోద్యమ సాహిత్యాన్ని కూడా సృష్టించింది దరిశి అన్నపూర్ణమ్మ (1907-1931). సంఘ సంస్కరణోద్యమం లోనూ, మహిళోద్యమంలోనూ అన్నపూర్ణమ్మ పోషించిన బృహత్తర పాత్రనూ, ఒక మేధావిగా సమాజ పురోగమనం కోసం ఆమె చేసిన రచనల్నీ పాఠకులకు పరిచయం చెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. దీనికై ఉపయోగించిన ప్రాథమిక ఆధారాల్లో ప్రధానమైనవి: దరిశి చెంచయ్య స్వీయచరిత్ర, నేనూ-నా దేశం (జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 1952), చెంచయ్యే రాసిన నా దివ్య స్మృతులు (ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1961), చెంచయ్య సంకలనం చేసిన మరపురాని అన్నపూర్ణ (పద్మా ముద్రాక్షరశాల, బ్రాడ్వే, మద్రాసు), వాసవి, గృహలక్ష్మి మొదలైన మాస పత్రికల సంచికలు.



గదర్ పార్టీ సంస్థాపకుల్లో ప్రముఖుడైన దరిశి చెంచయ్య మొదటి భార్య అయిన అన్నపూర్ణమ్మ 1907వ సంవత్సరంలో నాటి రాయలసీమలోని బళ్ళారిలో వైశ్య కులంలో జన్మించింది. ఆమె తల్లి సంస్కరణ దృక్పథం కలది. తన రెండవ కుమార్తె సుబ్బమ్మను రజస్వల అయ్యేంత వరకు ఆవి మదనపల్లె కళాశాలలో చదివించింది. 'వైశ్య కులంలో సుబ్బమే మొదటి ఇంటర్. బి.ఎ. బి.ఎ.ఎల్.టి., ఎమ్.ఎ.యల్.టి., లలో వరుసగా ప్రథమ స్థానాన్ని సంపాదించింది. తరువాతనే వివాహం చేసుకొన్నది' అని దరిశి చెంచయ్య అన్నాడు (నేనూ-నా దేశం, పు. 247). అన్నపూర్ణమ్మను సంస్కరణ భావాలు కల చెంచయ్యకిచ్చి వివాహం చేసింది. 'వైశ్య కులములో రజస్వలానంతర వివాహము ను ప్రారంభించింది అన్నపూర్ణమ్మగారి తల్లియేననుట సత్యదూరమనిపించు కోజాలదు' అని 1. 1. 1932 నాటి గృహలక్ష్మి (స్త్రీల పత్రిక) ప్రశంసించింది. అన్నపూర్ణమ్మ బళ్ళారి కాన్వెంటులోనూ, తిరువళిక్కేణి బాలికల ట్రైనింగ్ కాలేజీలోనూ, గుంటూరులోని శారదా నికేతనంలోనూ విద్యాభ్యాసం చేసింది. 15 సంవత్సరాల వయస్సులో దరిశి చెంచయ్యను వివాహమాడింది. బాల్య వివాహాలు విస్తృతంగా ప్రాచుర్యంలో ఉండిన నాటి పరిస్థితుల దృష్ట్యా అన్నపూర్ణమ్మ ఆలస్యంగానే పెళ్ళి చేసుకొందని చెప్పుకోవాలి. అయినా అంత త్వరగా పెళ్ళి చేసుకోవడం అన్నపూర్ణమ్మకు యిష్టముండింది కాదు. కానీ వాళ్ళమ్మ పులికంటే క్రూరమైన సామాజిక వెలికి భయపడి బలవంతపెట్టడం వల్ల పెళ్ళికి ఒప్పుకోవాల్సి వచ్చింది.

అన్నపూర్ణమ్మ మొదటినుండీ సంస్కరణ భావాలు కలదైనప్పటికీ పెళ్ళి తర్వాత వాటికి మరింత సానపెట్టి తనవంతు ప్రోత్సాహమందించాడు చెంచయ్య. 'మిక్కిలి చిన్నదగుటచే' అన్నపూర్ణమ్మను పెళ్ళాడడానికి చెంచయ్య సంకోచించాడు. కానీ 'దివ్యజ్ఞాన కళాశాల'లో పని చేస్తూండిన యం. వెంకటరావు, శ్రీమతి సుభద్రమ్మ దంపతులు అన్నపూర్ణమ్మను పెళ్ళి చేసుకోవడానికి ప్రోత్సహించారు. సంఘ సంస్కరణ, దేశహితైక కార్యాల

కోసం జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకొని వున్న చెంచయ్య 'మానసిక వికాసము బొందని ముగ్ధ' అయిన 15 సంవత్సరాల భార్యను తన భావాలకను గుణంగా మలచుకోవాలనుకున్నాడు. 'మా యొందరుల భావములేకమై ఒకరికొకరు సాయపడకున్నచో మా యిరువురి జీవితములు నిరుపయోగములగునన్న సంగతి'ని గ్రహించిన వాడవడం వల్ల అన్నపూర్ణమ్మకు 'జెప్పవలసిన విద్యాబుద్ధుల'ను నేర్పించనారంభించాడు. ఆమెను 'ఆదర్శ నారీ రత్నముగ' తీర్చిదిద్దాలనుకున్న చెంచయ్య ఆమె ముందు రెండు మార్గాలనుంచాడు. ఒకటి: ఇళ్ళే ప్రపంచంగా జీవించడం; రెండోది: ప్రపంచాన్నే ఇళ్ళుగా భావించి బతకడం. మొదటిది 'పూర్వ పద్ధతి– లోకమునందుండు మామూలు రీతి.' దీన్ని అనుసరిస్తే 'ఐహిక సుఖములు, భోగభాగ్యములు, సుసంతానములు, గృహచ్ఛిద్రములు' మొదలైన వాటిలో చిక్కుకొని 'సంకుచిత హృదయు'లైనప్పటికీ, భార్యాభర్తలు 'అన్యోన్య మనస్కులై' సుఖించవచ్చు. కానీ 'ఇది స్వసుఖమునకు కారణము గావచ్చు గాని పరులకు నిష్ప్రయోజనము. తమ తమ జన్మల సార్థకమొనర్చుకొనగల సావకాశమిందు గానరాదు.' ఇక రెండో మార్గం చాలా కష్టతరమైంది. ఇందులో 'ప్రాపంచిక సుఖములు' పెద్దగా వుండకపోవడమే కాకుండా, అనేకమైన 'అంతరాయములు' వుంటాయి. 'ధనార్జనమును, సుందరాభరణములకిందు తావులేదు. సేవాధర్మమే దీని పరమావధి.' ఈ మార్గంలో ప్రయాణిస్తే మాత్రం 'ఒక మహోన్నత' కార్యాన్ని సాధించగలుగుతారు. ఏ మార్గం కావాలో సొంతంగా నిర్ణయించుకొమ్మని అన్నపూర్ణమ్మతో 'అన్నపూర్ణా! నీకీ మార్గములందేది బాగున్నదో యోజింపుము; నిర్ణయించుకొమ్ము; రెండవ మార్గము సాధించుట బహు కష్టము; అయిననేమి? ఆకల్పాంతము తీరని యశశ్చంద్రికలు నిన్నావరించును. జీవితమును బహు సున్నితముగ యొనర్చుకొనగల్గుదువు; జీవయాత్ర బహు సులభసాధ్యమగును; కాని నగలు, నాణెములు, చక్కని దుస్తులు దొరకవు; దొరికినను వాటిపై యిచ్ఛయుండదు' అని రెండో మార్గాన్ని అలవంబిస్తే కలిగే సాధక బాధకాలను వివరించాడు (దరిశి చెంచయ్య, 'అన్నపూర్ణ దేశసేవకు నా ప్రోత్సాహము', మరపురాని అన్నపూర్ణ, పు. 203–224).

సమాజ శ్రేయస్సును కాంక్షించిన అన్నపూర్ణమ్మ కంటకప్రాయమైందని స్పష్టంగా తెలిసినప్పటికీ రెండో మార్గాన్నే ఎంచుకొని భర్తకు అన్ని రకాలుగా సహాయ సహకారాలందించింది. భర్తకు 'ప్రియురాలై' ఇంటా, సంఘ సంస్కర్తియై బయటా – రెండింటా గెలిచింది. స్త్రీ విద్యోద్యమం, బాల్యవివాహ వ్యతిరేకోద్యమం, రజస్వలా వివాహోద్యమం, వితంతు పునర్వివాహోద్యమం, వితంతు శరణాలయ స్థాపన, కళావంతుల సంస్కరణ, వివిధ కులాలతో సహపంక్తి భోజనం, జాతీయోద్యమం, మహిళోద్యమం మొదలైన రంగాలన్నింటిలో ఆశ్చర్యం గొలిపే విధంగా వెలుగొందడమే కాకుండా. పత్రికల్లో వ్యాసాలూ, కథలూ ప్రచురించడం ద్వారా వలసాంధ్రలోని సార్వజనిక క్షేత్రాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది.

అన్నపూర్ణమ్మ పాల్గొన్న ఉద్యమాలన్నింటిలోకీ ప్రముఖంగా పేర్కొనదగ్గది వితంతు పునర్వివాహోద్యమం. బ్రాహ్మణుల్లో వలెనే వైశ్యుల్లోనూ వితంతు సమస్య చాలా తీవ్రంగా వుండేది. విచ్చలవిడిగా జరిపిన బాల్య వివాహాలూ, వాటివల్ల వాటిల్లిన నిర్బంధ వైధవ్యాలూ, 'రండా' గర్భాలూ విలయతాండవం చేసేవి. చాలా మంది అనుకుంటున్నట్లు వీరేశలింగానంతర కాలంలో వితంతు పునర్వివాహోద్యమ ఉధృతి ఏమాత్రం తగ్గలేదు. తన పి.ఎచ్.డి. సిద్ధాంత వ్యాసంలో ఈ వ్యాకర్త నిరూపించినట్లు వీరేశలింగం అనంత కాలంలో అది పతాక స్థాయికి చేరింది. ఎక్కువ మంది మహిళలు పాల్గొననారంభించడం వల్ల వుద్యమం మరింత ముందుకు దూసుకెళ్ళింది. బ్రాహ్మణ, వైశ్యులతోపాటు మిగతా కులాల్లోకి కూడా వుద్యమం ప్రవహించింది. వైశ్యులలో సంఘ సంస్కరణకు దరిశి చెంచయ్య గట్టిగా కృషి చేశాడు. 1920ల్లో జరిగిన వితంతు పునర్వివాహోద్యమం దరిశి చెంచయ్యా, ఆయన సహచరులూ నడిపిందే. భర్తతో కలిసి అన్నపూర్ణమ్మ వైశ్య, కమ్మ, విశ్వబ్రాహ్మణ మొదలైన కులాల్లో మొత్తం 18 వితంతు పునర్వివాహాల్ని జయప్రదంగా జరిపించింది. 19వ శతాబ్దంలో ఏ విధంగా అయితే కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మమ్మ దంపతులు వితంతు పునర్వివాహోద్యమానికి వెన్నెముకగా నిలిచారో, అదే విధంగా 1920ల్లో దరిశి చెంచయ్య– అన్నపూర్ణమ్మలు వెన్నెముకగా నిలిచారు. 'మా ఇంట్లో (వితంతువులైన) వధువులెందరో వుంటూండేవారు. నా భార్య అన్నపూర్ణమ్మ వారినెంతో ప్రేమగా చూసుకొనేది. ఇలాంటి సంఘసేవ చేయాలనే ఆశతోనే ఆమె నన్ను వివాహం చేసుకొన్నది. సంఘ సంస్కరణోద్యమాలంటే ఆమెకెంతో సంతోషం. వధువులతో ఆమె చాలా చనువుగా వుండేది. వారు వరుసలతో పిలుచుకొనేవారు. భార్యల సహాయం లేనిదే

స్త్రీల ఉద్యమాలను పురుషులవెంత శ్రమపడినా జయప్రదం చెయ్యలేము. నా ప్రథమ భార్య అన్నపూర్ణమ్మకు స్త్రీ ఉద్యమాలయందు ఎంతో ఉత్సాహముండేది. ఎందరో స్త్రీలు మా యింట్లో ఉండేవారు. వారందరిని ప్రేమతో ఆదరించేది అన్నపూర్ణ. వారు అన్నపూర్ణమ్మను ఎంతో ప్రేమించేవారు. జయాప జయాలు, ఫలితాలు మా యిద్దరివీని' అని వితంతు పునర్వివాహోద్యమానికి అన్నపూర్ణమ్మ అందించిన సహకారాన్ని ప్రశంసిస్తూ, తన విజయాల్లో ఆమె సమాన భాగస్వామి అని హృదయ పూర్వకంగా ప్రకటించాడు చెంచయ్య (నేనూ–నా దేశం, పు. 231–233). వితంతు పునర్వివాహోద్యమంలో పాల్గొన్న కారణంగా ఛాందస సమాజం ఛీ కొట్టినా, సొంత వూర్లోనే వున్న సమీప బంధువులు సైతం 'శుభాశుభ కార్యాలకు' పిలవకుండా బహిష్కరించినా, పునర్వివాహ వధూవరుల ఊరేగింపుల్లో పాల్గొన్నప్పుడు ఛాందసులు తనపై 'రాళ్ళ వర్షం' కురిపించినా బెదరలేదు. హిమవన్నగం వలె ఆత్మస్థైర్యంతో ముందుకెళ్ళింది అన్నపూర్ణమ్మ. ఒకరకంగా అన్నపూర్ణమ్మ వితంతు పునర్వివాహోద్యమానికి తన జీవితాన్ని బలిపెట్టిందనే చెప్పవచ్చు. శారీరకంగా బాగా 'బలహీనముగా' వున్నప్పటికీ, 1931 నవంబరులో ఒక వితంతు పునర్వివాహాన్ని నిర్వహించడానికి బందరు వెళ్ళింది. అక్కడి నుండి వచ్చిన తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురై నవంబరు 28న కనీసం పాతిక సంవత్సరాలైనా నిండని పిన్నవయస్సులోనే అన్నపూర్ణమ్మ చనిపోయింది.

అన్నపూర్ణమ్మ అభిప్రాయంలో పునర్వివాహం మాత్రమే వితంతువుల సమస్యకు పరిష్కారం కాదు; విద్య కూడా చాలా అవసరం. అందుకే 12 మంది వితంతువులను విద్యార్జన దిశగా ప్రోత్సహించింది. వారికోసం ఉపకార వేతనాల్ని యేర్పాటు చేసింది. ఈ విధంగా వితంతువుల విద్యాభివృద్ధికి తోడ్పడింది. ఆమె ప్రోత్సాహాన్నందుకున్న అనేకమంది వితంతువులు విద్యావంతులై జీవితాల్లో స్థిరపడ్డారు. 1927-1928 ప్రాంతంలో ఒకరోజు తన స్నేహితురాలైన తుర్లపాటి రాజేశ్వరమ్మతో కలిసి విజయవాడలోని రైవస్ కాలవగట్టుకు షికారుకెళ్ళింది అన్నపూర్ణమ్మ. ఎవరో వితంతువు శిశువును కని గొంతు నులిమి పారవేయగా కాకులు పొడుచుకు తింటూన్న హృదయవిదారకమైన దృశ్యాన్ని చూచి వికల మనస్కులైన స్నేహితురాళ్ళిద్దరూ ఏడుస్తూ యింటికొచ్చారు. వంచితురాళ్ళైన వితంతువుల కోసం ఏదైనా చేయాలని దరిశి చెంచయ్యతో కలిసి ఆలోచించి 'వితంతు శరణాలయా'న్ని స్థాపించారు. ఇందులో అన్నపూర్ణమ్మ కార్యనిర్వాహక సంఘ సభ్యురాలుగా పనిచేసింది. *ఆంధ్రపత్రిక* ఈ శరణాలయం గూర్చి బాగా ప్రచారం చేయడంతో ఎంతోమంది గర్భిణులైన వితంతువులు అక్కడికి రావడం మొదలు పెట్టారు; బిడ్డల్ని కని అక్కడ వదిలి వెళ్ళేవారు. అలా సుమారు 60 మందికి ఆ శరణాలయం నీడనిచ్చింది. విజయవాడలోని మహిళా డాక్టర్లు, ముఖ్యంగా గుడిపాటి వెంకటాచలం వదిన అయిన డాక్టర్ రంగనాయకమ్మ ఈ శరణాలయానికి ఎంతగానో సహాయపడింది. బిడ్డలు లేని దంపతులు యిక్కడి పిల్లల్ని తీసుకొనిపోయేవారు (నేనూ–నా దేశం, పు. 234–235).

అన్నపూర్ణమ్మ ఆంధ్ర సార్వజనిక క్షేత్రంలో పని చేయడం ప్రారంభించేనాటికి వలసాంధ్రలో మహిళోద్యమం బలంగా వేళ్ళూనుకొని ఉంది. ఆంధ్రలోని పలు పట్టణాల్లోనూ, కొన్ని గ్రామాల్లోనూ మహిళా సంఘాలు ఏర్పడి మహిళాభివృద్ధికి పాటుపడనారంభించాయి. యావదాంధ్ర స్త్రీల విశాల వేదికగా 'ఆంధ్ర మహిళా మహాసభ' 1910లో ఉనికిలోకి వచ్చి, ప్రతి సంవత్సరం ఆంధ్రలోని వివిధ ప్రాంతాల్లో వార్షిక మహిళా సదస్సులను నిర్వహించేది. 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్' ఆంధ్ర శాఖగా 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ' 1927లో యేర్పాటై ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మహిళా సమావేశాలను నిర్వహించేది. ఈ నేపథ్యంలో 1928లో ప్రఖ్యాతి వహించిన డాక్టర్ కొమఱ్ఱాజు అచ్చమాంబ విజయవాడలో 'భారత మహిళా మండలి'ని స్థాపించింది. దీనికి తుర్లపాటి రాజేశ్వరమ్మ అధ్యక్షురాలుగా వుండగా, అన్నపూర్ణమ్మ కార్యదర్శిగా వ్యవహరించింది. అంతే కాకుండా, 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్', బెజవాడ శాఖకు కూడా అనేక సంవత్సరాలు ఆమె కార్యదర్శిగా పనిచేసింది. 1929లో బొంబాయిలో జరిగిన నాలుగవ 'అఖిల భారత మహిళా సభ'కు 'ప్రతినిధులు'గా వెళ్ళిన ముగ్గురు ఆంధ్ర స్త్రీలలో అన్నపూర్ణమ్మ కూడా ఒకరు. ఈ విధంగా అన్నపూర్ణమ్మ సమకాలీన మహిళోద్యమంలో చురుకుగా పాల్గొని మహిళోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళడానికీ, మహిళాభివృద్ధికీ ఇతోధికంగా తోడ్పడింది.

క్షేత్రస్థాయి కార్యాచరణలో నిమగ్నమవడంతోపాటు మేధో రంగంలో కూడా గట్టిగా కృషి చేసింది అన్నపూర్ణమ్మ. అభ్యుదయ భావాల్ని సమాజంలో విస్తృతంగా వ్యాపింప

జేయదానికి సాహిత్య సృజననూ చేపట్టిన అన్నపూర్ణమ్మ కలం కొన్ని కథల్నీ, వ్యాసాల్నీ ప్రసవించింది. ఆమె రచనలు ఎక్కువగా వాసవిలో ప్రచురితమయ్యాయి. వాసవి సంఘ సంస్కరణ పక్షం వహించిన వైశ్యులు నడిపిన మాస పత్రిక. 'ఆర్యవైశ్య యువజన మహాసభ' తరపున 1926 మార్చిలో మద్రాసు నుండి వెలువడనారంభించిన వాసవికి వైశ్య కులస్థుల్లో ప్రముఖుడైన తుంపూడి భగవంతం గుప్త సంపాదకుడిగా పనిచేశారు. ప్రారంభంలో ఒక రూపాయిగా వున్న సంవత్సర చందాను తర్వాత రెండు రూపాయలకు పెంచారు. వాసవి ఎంత ప్రాచుర్యం పొందిందంటే ప్రారంభమైన సంవత్స రాంతానికే 2,150 మంది చందాదారులుగా చేరారు. హైదరాబాదు, బెంగుళూరు, మైసూరు మొదలైన సుదూర ప్రాంతాల్లోనే కాకుండా చిన్న-చిన్న పట్టణాలూ, గ్రామాల్లో కూడా వాసవికి ఏజెంట్లు వుండేవారు. వైశ్య కులస్థుల సర్వతోముఖాభివృద్ధి తన లక్ష్యంగా ప్రకటించిన వాసవి సంఘ సంస్కరణోద్యమ భావాలను విస్తృతంగా ప్రచారం చేసి ఎంతో మందిని ప్రభావితం చేసింది. స్త్రీల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించిన వాసవి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించి, రజస్వలానంతర వివాహాలనూ, వితంతు పునర్వివాహాలనూ గట్టిగా సమర్థిస్తూ అలుపెరుగని పోరాటం సాగించింది. స్త్రీవిద్యను ప్రోత్సహించింది. వైశ్యుల్లోని ఛాందసులను కడిగి పారేసింది. 'మేల్కొనుడు -వైశ్య సోదరులారా!' శీర్షికన దరిశి చెంచయ్య యిందులో పుంఖానుపుంఖాలుగా 'మేల్కొలుపు' వ్యాసాల్ని ప్రచురించాడు. 'వైశ్య వనితా రత్నములు' శీర్షికన ప్రముఖులైన వైశ్య స్త్రీల జీవనరేఖల్ని ప్రచురించి సమాజాభివృద్ధికి వాళ్ళు చేస్తున్న కృషిని ప్రశంసించేది వాసవి. అన్నపూర్ణమ్మే కాకుండా బత్తుల కామాక్షమ్మ, కాళంగి శేషమాంబ, పులవర్తి కమలావతీదేవి, శిఖరం కమలాంబ, తుంపూడి సత్యవతీ భగవతమ్మ, సమర్థి స్వర్ణమ్మ మొదలైన చాలామంది వైశ్య స్త్రీలు వాసవిలో తమ రచనల్ని ప్రచురించారు. వలసాంధ్రలో వైశ్య కులస్థులు చేపట్టిన సంఘ సంస్కరణోద్యమానికి వాసవి వెన్నెముకగా నిలిచిందనేది నిర్వివాదాంశం. వాసవిలోనే కాకుండా డా. కె. యన్. కేసరి సంపాదకత్వంలో 1928లో వెలువడ్డం ప్రారంభించి 1960ల్లో కూడా కొనసాగిన ప్రముఖ స్త్రీల పత్రిక అయిన గృహలక్ష్మిలో కూడా అన్నపూర్ణమ్మ రచనలు కొన్ని ప్రచురించబడ్డాయి.

"హైందవ స్త్రీల హక్కులు-కర్తవ్యములు" అనే వ్యాసంలో (వాసవి, జనవరి 1929, పు. 390-94) స్త్రీల హక్కులు-బాధ్యలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించింది అన్నపూర్ణమ్మ. స్త్రీ-పురుషుల మధ్య లింగభేదం తప్పిస్తే మరే విధమైన తేడా లేదని నొక్కివక్కాణించిన అన్నపూర్ణమ్మ, స్త్రీలు అన్ని రంగాల్లోనూ తమ శక్తి సామర్థ్యాలను గతంలో కనబర్చారనీ, వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ కనబర్చగలరనీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ప్రకటించింది. తన వాదనను నిరూపించడానికి రాచకార్యధురంధరులైన స్త్రీలనూ, శారీరకంగా బలశాలులైన స్త్రీలనూ, పండిత స్త్రీలనూ, కవయిత్రులనూ ఉదాహరణలుగా చూపెట్టింది. 'ఈ విధముగ అన్ని విషయములందును పురుషులతో సమానముగ స్త్రీలు కీర్తి గడించిరి' అని స్పష్టం చేసింది. పురుషులు కూడా శక్తి హీనులుగా ఉన్నారనీ, అందుకే వారు విదేశీయుల పాలనలో బానిసలుగా మగ్గుతున్నారనీ తెలియజేసిన అన్నపూర్ణమ్మ 'స్త్రీలు రాజ్య పాలనము చేసే యెడల ఇంతకంటె కనిష్టముగా చేయగలరా?'అని గట్టిగా ప్రశ్నించింది.

'ప్రస్తుత హిందూ స్త్రీల కష్టా'ల్లో బాల్య వివాహాలూ, అవిద్య ప్రధానమైనవని చెప్పిన అన్నపూర్ణమ్మ, బాల్య వివాహాలు స్త్రీ విద్యను ఏ విధంగా ఆటంకపరుస్తున్నాయో వివరించింది. అందుకే 'వివాహమునకు పూర్వమే ప్రతి స్త్రీ, పురుషుడు సంపూర్ణమైన విద్యావంతులై యుండవలెను' అనీ, విద్య అంటే 'కేవలము అక్షర జ్ఞానము' కలిగి ఉండడం కాదనీ, 'ప్రతి స్త్రీయును సుమారు పది పంద్రెండు సంవత్సరములైనను గురుకులవాసము చేసి విద్యనభ్యసించ వలెను' అనీ నిజమైన విద్య అంటే ఏమిటో స్పష్టపరిచింది. వివాహం విషయంలో తల్లిదండ్రుల జోక్యం పోయి తమ జీవిత భాగస్వాముల ఎంపిక విషయంలో వధూవరులకు ఎక్కువ స్వాతంత్ర్యం ఉండాలని కోరుకుంది. పాశ్చాత్య స్త్రీలకు వలె భారత స్త్రీలకు ఆజన్మాంతం బ్రహ్మచారిణులుగా వుండే అవకాశం లేదనీ, వివాహం చేసుకోవడం ఇష్టంలేని స్త్రీలకు బ్రహ్మచారిణిలుగా వుండిపోయే అవకాశం ఉండాలనీ చెప్పింది. అలాంటి స్త్రీలు పాశ్చాత్య దేశాల స్త్రీల మాదిరి తమ జీవితాల్ని సంఘసేవలో తరింపజేసుకోగలిగే పరిస్థితులుండాలని వాంఛించింది.

బాల్యవివాహ దురాచారానికి వ్యతిరేకంగా స్త్రీ, పురుష సంఘ సంస్కర్తలు ముమ్మరంగా సాగించిన వుద్యమం ఫలించి బ్రిటిష్ ప్రభుత్వం 1929లో బాల్య వివాహ నిరోధక చట్టాన్ని చేసింది. 1930 ఏప్రిల్ 1వ తేదీన అమల్లోకి వచ్చిన ఈ చట్టం 'శారదా శాసనం'గా ప్రసిద్ధి

చెందింది. ఈ చట్టం పట్ల సంతృప్తి వెలిబుచ్చిన అన్నపూర్ణమ్మ శాసనాన్ని జయప్రదం చేయడానికి 'శారదా సంఘాల్ని' స్థాపించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. బ్రిటిషిండియా ప్రభుత్వం శారదా చట్టాన్ని చేయక ముందే మైసూరు, బరోడా మొదలైన స్వదేశీ సంస్థానాలు బాల్య వివాహాల్ని నియంత్రించే చట్టాలు చేశాయి. కానీ హైదరాబాద్ సంస్థానం మాత్రం యిలాంటి చట్టాన్ని చేయలేకపోయింది. అందుకే హైదరాబాద్ లాంటి స్వదేశీ సంస్థానాల్లో శారదా చట్టం లాంటి చట్టాన్ని చేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది అన్నపూర్ణమ్మ. శారదా చట్టం బాలికల కనీస వివాహ వయస్సును 14 సంవత్సరాలకూ, బాలుర కనీస వివాహ వయస్సును 18 సంవత్సరాలకూ పెంచింది. కానీ చాలామంది యితర మహిళా మేధావుల్లాగే అన్నపూర్ణమ్మ కూడా దీంతో సంతృప్తి చెందక కనీస వివాహ వయస్సు స్త్రీలకు 16 సంవత్సరాలుగానూ, పురుషులకు 21 సంవత్సరాలుగానూ ఉండే విధంగా శారదా చట్టంలో సవరణ చేయాలని కోరుకొంది. స్త్రీలకు గానీ, పురుషులకు గానీ 'నిర్బంధ వివాహములు' ఉండకూడదంది. బహుభార్యత్వాన్ని నిరసించింది. పసి పిల్లల్ని ముసలివాళ్ళకిచ్చి పెళ్లి చేసే పద్ధతిని అసహ్యించుకొని అలాంటి 'అసమ వివాహములను జరిపించిన తలిదండ్రులు శిక్షాపాత్రులగుటకు రాజశాసన ముండవలె'నని కోరింది. వితంతు సమస్యపై స్పందిస్తూ 'చిన్న బాలికలను సైతము భర్త చనిపోయినపుడు వితంతువులని పిలుచుట, నిర్బంధ బ్రహ్మచారిణులుగా యుంచుట ధర్మమా?' అని ప్రశ్నించింది. వితంతువులపై రుద్దే నిర్బంధ బ్రహ్మచర్యాన్ని 'అన్యాయము' అని ఈసడించింది. 'ఇటువంటి అన్యాయము ఏ జాతియందు గాని, ఏ దేశమందు గాని, చివరకు పశుపక్ష్యాదులయందు గాని లేదు' అని తెలియజేస్తూ, వితంతువులకు పునర్వివాహాలు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది.

స్త్రీలకు ఆస్తిహక్కు ఉండాలని బలంగా వాదించిన అన్నపూర్ణమ్మ తన కాలంలో స్త్రీలకు సదరు హక్కు లేకపోవడాన్ని గూర్చి వాపోతూ ఈ విధంగా అంది: 'తల్లిగారి గృహమందు పుత్రులతో సమానముగ పుత్రికలకు ఆస్తి పంచి యివ్వరు. అత్తవారింటి యందైనను భర్త యాస్తిపై భార్యకు హక్కు లేదు. "రెంటికి చెడిన రేవడి మాదిరి" ఏ వైపు జూచినను స్త్రీలు నిరాధారులై యున్నారు. పుత్ర సంతతి లేక భర్త చనిపోయెనేని ఆస్తి వారసులకు చెల్లును. స్వయముగ కని పెంచిన కుమార్తెలకు హక్కు లేదు. వేరే మరియొక బాలుని దత్తత గైకొనిన యెడల ఆస్తియంతయు వాని పరము చేయుటకు వీలున్నది. క్రైస్తవులలో ఐరోపీయులలో భర్త చనిపోయిన తరువాత ఆస్తి భార్యకు చెల్లును. తదనంతరము ఆస్తి కొమారులకు కూతుళ్ళకు సమానముగ పంచి యివ్వబడును. బౌద్ధ మతము నందు గూడ యటులే జరుగుచున్నది. హిందూ సంఘమందు మాత్రమే స్త్రీకి ఆస్తిపై హక్కు లేదు. పై హక్కు లేని లోపము వలన స్త్రీ బానిస కంటె అధమము. బానిసచే పెంచబడి, బానిసను వివాహము చేసికొని, బానిసకు బిడ్డలై జనించినపుడు, పురుషులు బానిసలు గాకుండుటకు సాధ్యమా? వర్ణ వివక్షత లేక స్త్రీ పురుషుల హక్కులలో లోపము లేక యుండినటువంటి బౌద్ధ మతమును గాని, వేద మతమును గాని అవలంబించి యున్నపుడు మన దేశము పరాధీనము కాలేదు.' హిందూ సంఘం స్త్రీల పట్ల ఆస్తిహక్కు నిరాకరణ మొదలైన వివక్షాపూరితమైన పద్ధతుల్ని అవలంబించడం వల్లే స్వాతంత్ర్యం కోల్పోయి, బానిసత్వాన్ని కొని తెచ్చుకుందని అన్నపూర్ణమ్మ వాదించడం గమనార్హం. ఆస్తి హక్కు లేకపోవడం వల్ల స్త్రీలు వివక్షకు గురౌతున్నారని చెబుతూ 'తలిదండ్రులు కొమారులతో బాటు కొమార్తెలను గౌరవముగ చూచుట లేదు. తగినంత ద్రవ్యమును వెచ్చించి విద్య నేర్పించరు. కొమార్తెలకు పెట్టిన ఖర్చంతయు వృధాయని భావించెదరు. ఇన్నిటికిని కారణము స్త్రీలకు ఆస్తి హక్కు లేకపోవుటయే' అని విశ్లేషించింది. 'ఆస్తి విషయమందు స్త్రీలకు హక్కు కలిగిన నాడే సర్వ హక్కులు వచ్చినట్లు భావించవచ్చును' అని ఘంటాపథంగా ప్రకటించిన అన్నపూర్ణమ్మ దత్తత విషయంలోనూ, సంరక్షకత్వం విషయంలోనూ స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులుండాలని బలంగా కోరుకుంది. 1920ల చివరినుండీ ఆంధ్ర స్త్రీలు విడాకుల సమస్యను గట్టిగా చర్చించడం మొదలుపెట్టారు. 1928లో హరిసింగ్ గౌర్ కేంద్ర శాసనసభలో Hindu Marriage Dissolution Billని ప్రవేశపెట్టాడు. మొదటి నుండీ ప్రతిపాదిత విడాకుల చట్టం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవడం వల్ల గౌర్ తన బిల్లును వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

1931–33 మధ్య పలుమార్లు మళ్లీ ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ వ్యతిరేకత కారణంగా చట్టరూపం దాల్చలేక పోయింది. తర్వాత జి.వి. దేశ్‌ముఖ్ విడాకుల బిల్లును ప్రవేశపెట్టాడు. అప్పటికే, అంటే 1932లోనే స్వదేశీ

సంస్థానమైన బరోడాలో విడాకులను చట్టబద్ధం చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర స్త్రీలలో కొంతమంది విడాకుల చట్టాన్ని స్వాగతిస్తుండగా, చాలామంది తీవ్రంగా వ్యతిరేకించేవారు. రాయలసీమకు చెందిన కడప రామసుబ్బమ్మ లాంటి మహిళా మేధావులు విడాకుల చట్టాన్ని 'దారుణాస్త్ర'మనీ, దాన్ని కోరుకోవడమంటే 'కొరివితో తల గోకుకోవడమే'ననీ వాదించేవారు. చాలామంది స్త్రీలు విడాకుల చట్టాన్ని ఎంత తీవ్రంగా నిరసించేవారంటే 1934 నవంబరు 18న మదనపల్లెలో గుమ్మడిదల దుర్గాబాయమ్మ (దుర్గాబాయ్ దేశ్‌ముఖ్) అధ్యక్షతన జరిగిన ఎనిమిదవ 'ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ'లో విడాకుల చట్టానికి సంబంధించిన తీర్మానం చర్చకు రాగా కడప రామసుబ్బమ్మ దాన్ని తీవ్ర స్వరంతో వ్యతిరేకించింది. మెజారిటీ సభ్యులు ఆమెను బలపర్చగా ఆ తీర్మానం వీగిపోయింది. స్త్రీల సంపాదకత్వంలో వెలువడిన మొట్టమొదటి తెలుగు స్త్రీల పత్రిక అయిన హిందూ సుందరి కూడా విడాకుల హక్కును తీవ్రంగా వ్యతిరేకించింది. స్త్రీల సభల్లో విడాకుల చట్టం చర్చించ బడడం 'దేశ దౌర్భాగ్యం' అంది. 'భగవత్సముడగు భర్తయుండ విడాకుల చట్టముతో భారతనారికేమి సంబంధము?' అని ప్రశ్నిస్తూ విడాకుల చట్టం మొదలైనవి కావాలని చేసిన తీర్మానాలు 'స్త్రీ లోకమును ఎన్నటికైన పాడుచేసి తీరును' అని ప్రకటించింది ('కాకినాడ సభలు', ఫిబ్రవరి 1936). ఇలాంటి ఉదాహరణలు ఆంధ్ర స్త్రీలలో విడాకుల చట్టానికుండిన వ్యతిరేకతను స్పష్టంగా నిరూపిస్తాయి.

ఇలాంటి చారిత్రక సందర్భంలో దరిశి అన్నపూర్ణమ్మ విడాకుల చట్టాన్ని మనసారా స్వాగతించింది. 'స్త్రీలు స్వలాభమును గోరి (విడాకుల) చట్టము కొఱకు పోరాడుచున్నారనుట కేవలము సంకుచితాభిప్రాయము' అని నిక్కచ్చిగా తెలిపింది. 'భార్యను జూడగనే మండిపడు పురుషుఁడును, భర్తను జూచి మూతి విరుచు భార్యయును, హృదయములు కోసినను మచ్చుకైన అనురాగము కాన్పించక, నామకః భార్యాభర్తలని వ్యవహరింపఁబడుచు యమలోకము ననుభవించుట కంటె విడాకులిచ్చి ఎవరికి వారు స్వతంత్రులగుట ఉత్తమము గాదా? భార్య వ్యభిచరించుట తెలిసియు భార్యగా పరిగ్రహించుటయు, భర్త వ్యభిచారియైనను భర్తగ నెంచుట కంటెను విడిపోవుట సుఖము గాదా? న్యాయము గాదా?' అని సూటిగా ప్రశ్నించింది. విడాకులనేవి పాశ్చాత్యుల నుండి నేర్చుకొన్న పద్ధతి కానే కాదనీ, పూర్వం నుండీ భారతదేశంలో పాటించబడుతున్న భారతీయ సంప్రదాయమేననీ, 'ఏ కారణములవలననో' ఈ పద్ధతి హిందువుల్లోని కొన్ని కులాల్లో ఉండిపోయి, కొన్ని కులాల్లో లేకుండా పోయిందనీ వివరించింది. విడాకుల చట్టం వచ్చినంత మాత్రాన ప్రతి స్త్రీ విడాకులిచ్చేస్తుందని భావించడం 'హాస్యాస్పద'మని తెలియజేస్తూ, విడాకులకు అవకాశం వున్న క్రైస్తవ, మహ్మదీయ, బ్రహ్మసామాజికుల్లో 'వెయ్యింటికొకరిద్దరు మాత్రమే విడాకులిచ్చుకొనుట సంభవించుచున్నది' అని వాస్తవ పరిస్థితిని తెలియజేసింది. నిజమైన అనురాగము గల భార్యాభర్తలు విడాకులు తీసుకోరనీ, 'స్త్రీలకు ఉరిత్రాడు అయినటువంటిన్ని, పురుషులకు మానహీనమైనటు వంటిన్ని, అనారోగ్యకరమైనటువంటిన్ని, జారత్వము, బహుభార్యత్వమును మాన్పుట, క్రూరులగు భర్తలిడు బాధలను సహింపఁజాలక వందలమంది స్త్రీలు నుయ్యిల గొయ్యిల పాలగుచుండుట నడ్డుపెట్టుటకే' విడాకుల చట్టం కావాల్సి వచ్చిందని విశ్లేషించింది. 'పురుషులకు బానిసలుగ నుండుటకు బ్రహ్మ వారిని (స్త్రీలను) విధించినట్లును, స్త్రీలను అణగఁద్రొక్కి హింసించుటయే మగవారి కర్తవ్యమైనట్లు పురుషులు భావించుచు'న్నారనీ, పురుషుల హింస నుంచి స్త్రీలను రక్షించడానికి విడాకుల చట్టం అత్యవసరమని ఖరాకండిగా ప్రకటించింది.

కేవలం ఆంధ్ర, సంస్కృత భాషల్లో మాత్రమే పాండిత్యం కలిగిన పండితులు, పీఠాధిపతులు, పురోహితులు, పూజారులు మొదలైనవారు సంఘ సంస్కరణోద్యమానికి అడ్డు తగులుతున్నారనీ, 'పూర్వాచార పరాయణులు' రజస్వలానంతర వివాహాల్నీ, వితంతు వివాహాల్నీ, అస్పృశ్యతా నిర్మూలనా కార్యక్రమాల్నీ, విదేశయాత్రల్నీ, అంతర్వర్ణ భోజనాల్నీ (సహపంక్తి భోజనాలు), అంతర్వర్ణ వివాహాల్నీ వ్యతిరేకిస్తూ సామాజిక మార్పును అడ్డుకొంటున్నారని విమర్శించింది అన్నపూర్ణమ్మ. స్త్రీలపట్ల పురుషుల కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ 'స్త్రీలకు హక్కులనిచ్చి గొప్పవారిని జేసి గౌరవించినందున పురుషులు తమ తల్లులను, అక్కచెల్లెండ్రను, కొమార్తెలను బాగుచేసిన వారగుదురు. విద్యావంతులును, స్వతంత్రులును అయిన స్త్రీలు తమ పుత్రులను, భర్తలను ధైర్యశాలులుగను, దేశభక్తులుగను చేయుదురని వేరే చెప్పవలసిన అవసరము లేదు' అని స్త్రీలకు వారి హక్కులిస్తే వారు పురుషులకు అనేక విధాలుగా తోడ్పడగలరని వివరించింది. 'హిందూ దేశము తిరిగి ప్రపంచములో

గౌరవ స్థానమును అలంకరించునట్లు చేయుట స్త్రీ పురుషుల కర్తవ్యమై యున్నది' అని భారతదేశం పూర్వం అనుభవించిందని చాలామంది భావిస్తున్న "ఔనత్యాన్ని" పునఃస్థాపించడంలో స్త్రీ, పురుషుల బాధ్యతల్ని గుర్తు చేసింది. స్త్రీలకు 'పతిభక్తి మాత్రమే చాలద'ని నినదించిన అన్నపూర్ణమ్మ 'ఆత్మ బలము, దేహ బలము, దేశభక్తి, దైవభక్తి మొదలైన అనేక శక్తులను సంపాదించ'మని స్త్రీలకు పిలుపునిచ్చింది. అంతేకాకుండా, '(స్త్రీలకు) పతిభక్తి తప్ప మరేమియు కూడదనే పురుషులను స్త్రీలు గౌరవించు కాలము పోయినది' అని పురుషులను హెచ్చరించింది. గాంధీ, నెహ్రూ, లజపత్ రాయ్, సరోజినీ నాయుడు, అనిబిసెంట్ మొదలైన 'ఆదర్శప్రాయులై'న నాయకుల్లాంటి వారు 'అసంఖ్యాకంగా' దేశంలో జన్మించాలంటే స్త్రీలకు పురుషులతో సమానంగా అన్నిరకాల హక్కులూ కల్పించాలని డిమాండు చేసింది.

అన్నపూర్ణమ్మ ఘోషా/బురఖా పద్ధతుల్ని నిరసించింది. ఘోషా వలన 'స్వేచ్ఛగ బాహ్య విషయములందు జోక్యము కలిగించుకొనుటకు వీలుండదు' అనీ, దాని వలన 'అసమర్థత' కలుగుతుందనీ, 'అసమర్థతే అజ్ఞానము' అనీ ప్రకటించింది. దీనివల్లనే స్త్రీలు మౌఢ్యులుగా చిత్రీకరింప బడుతున్నారని విశదపరచింది. 'ప్రపంచమందు ఱాయి-రప్ప, చెట్టు-చేమ, గొడ్డు-గోడ ప్రతి వస్తువును సూర్యరశ్మి నుండి ప్రాణశక్తిని గ్రహించుచున్నవి. బురకా ధరించుట వలన సూర్యరశ్మి తగులక రక్తహీనలును, బలహీనలును యగుచున్నా'రని ఘోషా / బురఖా పద్ధతుల వల్ల స్త్రీలకు వాటిల్లే ఆరోగ్యపరమైన చెడుగుల్ని తేటతెల్లం చేసింది. వేశ్యావృత్తి 'ప్రజాకంటకమైనది' అని చాటిన అన్నపూర్ణమ్మ దాన్ని నివారించడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చి, ఆ దిశగా కృషి చేస్తున్న డాక్టర్ ముత్తులక్ష్మీ రెడ్డిని బహుధా ప్రశంసించింది. అస్పృశ్యతను నివారించడం 'ముఖ్యావసరము'గా భావించిన అన్నపూర్ణమ్మ 'అస్పృశ్యుల'ను హీనంగా చూసే 'అగ్రవర్ణా'లను తీవ్ర స్వరంతో నిందించింది. 'నిమ్న జాతుల యందుండు అసహ్య కరములగు అలవాట్లకు అగ్రవర్ణముల వారే కారణభూతులు. వారిని చేరదీయక, గ్రామములందు నివసించుటకు అనుమతించక, దేవాలయములలో పూజలు చేసుకొనుటకు ఉత్తరువు నివ్వక, అశుద్ధములను దిను కుక్క, నక్క, పంది, గాడిద మొదలైన మృగముల కంటెను అధమాధములనుగా చూచుచున్నాము' అని దళితుల పట్ల అగ్రవర్ణాల దుష్ప్రవర్తనను బట్టబయలు చేసింది. అగ్రవర్ణాలు పెట్టే 'బాధలు పడజాలక' దళితులు క్రైస్తవం లేదా ఇస్లాం మతాలలోకి మారి సౌభ్రాతృత్వాన్ని అనుభవిస్తున్నారని తెలియజేస్తూ 'క్రైస్తు వంటి, మహమ్మదు వంటి దయాళు డైన బుద్ధ భగవానుఁడు మన దేశమున బుట్టలేదా?' అని నిష్ఠురంగా ప్రశ్నించింది. అందరినీ సమానంగా చూడమని బుద్ధుడు చెప్పాడనీ, కానీ అతని ప్రవచనాలు పుస్తకాలకు మాత్రమే పరిమితమై పోయి కార్యాచరణలో సున్నాయే మిగిలిందని వాపోయింది. హిందూ సమాజం నుండి అస్పృశ్యతా జాడ్యం తొలగిపోవాలని గట్టిగా కోరుకున్న అన్నపూర్ణమ్మ అస్పృశ్యతా నివారణ కోసం గాంధీ మహాత్ముడు చేస్తున్న కృషిని వేనోళ్ళ కొనియాడింది. అన్నపూర్ణమ్మ కేవలం మాటల మేధావి కాదు; నమ్మిన దాన్ని చేసి చూపించే క్షేత్రస్థాయి క్రియాశీల మేధావి. అందుకే అస్పృశ్యతా నివారణ గురించి మాట్లాడ్డంతోనే సరిపెట్టుకోకుండా చనిపోవడానికి కేవలం కొద్ది రోజుల ముందు ఒక 'మాల పిల్లవానిని పోషించి విద్యాబుద్ధులు' చెప్పించాలనుకుంది. కానీ ఈ కార్యం నెరవేరకుండానే చనిపోయింది. వర్ణవ్యవస్థను నిరసించిన అన్నపూర్ణమ్మ సహపంక్తి భోజన కార్యక్రమాల్లో శ్రద్ధ చూపింది. బ్రాహ్మణులు మొదలు దళితుల వరకు అందర్నీ ఒకే విధంగా ఆదరించేది. బంధువులు నివారించినా పట్టుద లతో తన కార్యక్రమాన్ని కొనసాగించింది. సహపంక్తి భోజనానికి కూర్చున్న వివిధ కులాల 'అతిథుల విస్తళ్ళను, ఎంగిలి పాత్రలను' శుభ్రం చేయడానికి పని మనుషులు నిరాకరించినపుడు తనే ఆ పనులను చేసేది. 'జాతిమత భేదము లేక సహపంక్తి భోజనములలో పాల్గొనిన గాని హైందవ సంఘమందలి దురాచారములు అంతరించి మేలుకలగద'ని ఆమె వాదించేది.

రెండు భాగాలుగా రాసిన ''జాతీయత'' అనే వ్యాసంలో ప్రజలకుండే వివిధ అస్తిత్వాలను గూర్చి చర్చించిన అన్నపూర్ణమ్మ వాటిలో విశిష్టమైన అస్తిత్వమేదో తెలియజేసింది. ప్రజలకు కులాభిమానమూ, మతాభి మానమూ, దేశాభిమానమూ ఉండవచ్చునీ, కాని దురభిమానం మాత్రం ఉండకూడదనీ తెలిపింది. 'ఒక కులము ఎంత ఉన్నత దశ యందున్నను పర కులస్తులను నిరసించుట గాని, ద్వేషించుట కాని కూడదు' అని సూచించింది. కుల, మతాభిమానాల కంటే దేశాభిమానం మెరుగైందని స్పష్టం చేస్తూనే, దానికన్నా 'మానవ జాత్యాభిమానము సర్వోత్కృష్టమైనది. ఇట్టి యభిమానము

గలవారు ఒక దేశస్తులని గాని, ఒక మతస్తులని గాని, నల్లవారనియు, తెల్లవారనియు భేదము చూపరాదు. ఒక దేశము మఱియొక దేశముపై విరోధము వహించుట, దానిపై దండెత్తుట, అపజయమును గాంచిన దేశమును నానా బాధలు పెట్టి హింసించుట మొదలగునవి అసహ్య కరములుగను పాపభూయిష్టమైనవిగను' భావించాలన్న అన్నపూర్ణమ్మది విశాలమైన అంతర్జాతీయ దృక్పథం.

ప్రశంసనీయమైన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రస్ఫుటంగా ప్రకటించినప్పటికీ, భారతదేశానికున్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా జాతీయవాదం యొక్క అవసరాన్ని ప్రబోధించింది అన్నపూర్ణమ్మ. ప్రజలు కులమతాల కతీతంగా ఏకమై దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడాలని పిలుపునిచ్చింది. దేశం కోసం అందరూ ఒక్క తాటిపై నడవాల్సిన సమయంలో ఏ కులానికాకులం "ఎవరికి వారే యమునా తీరే" అన్నట్లు ప్రవర్తిస్తే 'గొప్ప పొరపాటు చేసిన వారగుదుము' అని హెచ్చరించింది. భారత జాతీయో ద్యమంలో పాల్గొనమని వైశ్యులకు ప్రత్యేకంగా పిలుపునిచ్చిన అన్నపూర్ణమ్మ వారు ఏ విధంగా దేశ స్వాతంత్ర్యోద్యమానికి సహాయపడవచ్చో తెలియజేసింది: 'విదేశ వస్తు వ్యాపారము మాని స్వదేశ వస్తువులను అమ్ముట, దాన ధర్మములకు ఉపయోగ పెట్టదలంచిన ద్రవ్యమును స్వరాజ్యోద్య మమునకు ఖర్చుపెట్టుట, యువకులు వాలంటీరులుగా చేరుట, ప్రచారకులు కొందరు బయలుదేరి ప్రతి గ్రామము (నందు) పర్యటనము చేయుచు గ్రామవాసులకు దేశ పరిస్థితులను స్వరాజ్యోద్యమము యొక్క మూల సూత్రములను బోధించుట (మొదలైనవి మాత్రమే కాకుండా), సంఘ సంస్కరణ విషయములను గూడ బోధించవచ్చును. త్రాగుడు మాన్పించుటకు ప్రయత్నములు సలుపవలెను.' జాతీయోద్యమం పట్ల తీవ్రంగా ఆకర్షితురాలైన అన్నపూర్ణమ్మ ఆంధ్రలో జరిగిన ఉప్పు సత్యాగ్రహం పట్ల మిక్కిలి సంతృప్తిని ప్రకటించింది. అందునా స్వకులస్థులైన వైశ్యులు అందులో పాల్గొనడంతో ఆమె ఆనందానికి మేర లేకపోయింది. 'వైశ్యులలో ననేకులు ఈ యుద్యమమునకు సహాయము చేయుచున్నారని వినుటకు ఎంతయో ఆహ్లాదకరముగ నున్నది. గుంటూరు పట్టణమందు వైశ్యులలో ఇరువది మంది పురుషులును, ఒక స్త్రీ శ్రీమతి కాళంగి శేషమాంబ గారును జైలుకు వెళ్ళుటకు సంసిద్ధులై వాలంటీరులుగా చేరినందుకు ఎంతయు సంతసము గలుగుచున్నది. ఆరు లక్షల మంది వైశ్యులలో నారీమణులు స్వరాజ్యోద్యమము నందు పాల్గొనలేదను నిందను బాపిన శ్రీమతి కాళంగి శేషమాంబగారు ఎంతయు స్తోత్రార్హులు. ప్రస్తుత ఉద్యమ తీవ్రతను బట్టి కొలది కాలములో వైశ్యులందరును ఈ యుద్యమము నందు పాల్గొనులాగున కనుబడుచున్నది' అని ఆనందాంబరాన్ని చుంబించింది.

"గాంధ్యవతారము" అనే వ్యాసంలో కలియుగంలో జన్మించిన గాంధీ అవతారము రామావతార, కృష్ణావ తారాలకన్నా 'గొప్పది' అని ప్రకటించింది అన్నపూర్ణమ్మ. గాంధీ అహింసా సిద్ధాంతంలో బలంగా నమ్మిన ఆమె 'రావణాసురుని, వాని అనుచరులను చంపక (వారిని) ధర్మ ప్రవర్తనులుగాఁ జేసి యుండిన యెడల రామావతార మును ఇంకను గొప్ప అవతారముగ భావించి యుండమా? కౌరవులను నాశనము చేయక తన శిష్యులుగా మార్చి యుండిన యెడల కృష్ణావతారము యత్యుత్తమమని భావించి యుండమా?' అని ప్రశ్నించి; శ్రీరాముడి, శ్రీకృష్ణుడి ఔదార్యరాహిత్యాన్ని చెప్పకనే చెప్పింది. త్రేత, ద్వాపర యుగాలకంటే కలియుగంలో 'అధర్మము' ఎక్కువగా ఉందనీ; అయినప్పటికీ, హింసను ప్రయోగించకుండా 'కలము, నాలుక' అనే రెండు ఆయుధాలతో 'ధర్మ సాంస్థాపన' కోసం గాంధీ పాటుపడు తున్నాడనీ, ఆయన నైతిక బలం ముందు శతృపక్షం వారి 'పశుబలము, సైన్యము, ధనము' నిరుపయోగమవుతున్నా యనీ వివరించి గాంధేయ మార్గాన్ని ప్రశంసించింది. హింసకూ, అహింసకూ మధ్య జరుగుతున్న యుద్ధంలో చివరకు 'ఆధ్యాత్మిక బలమే జయము గాంచుచున్నది. శతృపక్షము క్రోధమును మాని గాంధిగారి శిష్యవర్గములో చేరవలసిన అవసరము కనబడుచున్నది. ఇట్టి ఆధ్యాత్మిక శక్తిని గనుపరచిన గాంధి అవతారము పూర్వపు అవతారముల కంటె గొప్పది గదా!' అని గాంధీ మార్గాన్ని ఆకాశానికెత్తిపట్టి ఆయన పట్ల తనకున్న ప్రగాఢమైన అభిమానాన్ని చాటుకొన్నది.

అన్నపూర్ణమ్మ కథలు:

తన బౌద్ధిక కార్యాచరణలో భాగంగా అన్నపూర్ణమ్మ సృజనాత్మక సాహిత్యంలోనూ కృషి చేసింది. ఇప్పటిదాకా లభిస్తున్న ఆధారాల ప్రకారం ఆమె ఆరు కథలు రాసింది. "అచ్చొచ్చింది" అనే కథ ఇల్లు అచ్చిరావడమనే మూఢ నమ్మకం ఎంతటి ప్రమాదానికి దారితీయగలదో కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. మొదట పేదవాడై క్రమక్రమంగా ధనవంతుడైన సుబ్బిశెట్టి పరమ పిసినారి. హైదరాబాద్ నగరంలో 'పగలు వెలుతురు లేక రాత్రిళ్ళు గాలి'రాని

‘ఎలుకబొక్క’ లాంటి ఇళ్ళు కట్టుకుంటాడు. ఆ ఇళ్ళు అచ్చివచ్చిందని బలంగా నమ్ముతాడు. అనారోగ్యకరమైన ఇంట్లో ఉండడంవల్ల అతనికి కలిగిన సంతానమూ, భార్య పుల్లమ్మా చనిపోతారు. యాభై సంవత్సరాల వయస్సులో ‘రవ్వల నగల వర్షం కురిపించి చక్కని చుక్క’ అయిన సుందరమ్మను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. ఆమె ఇళ్ళు అసౌకర్యంగా వుందనీ, గాలి ఆడకపోవడం వల్ల ‘వంకాయలాగు ఉడికిపోతున్నా’ననీ తన బాధనూ, అసహనాన్నీ వ్యక్తపరచినా ‘నీవు వంకాయలాగు ఉడికినా సరే బెండకాయలాగు వేగినా సరే ఈ ఇల్లు అచ్చొచ్చింది’ కాబట్టి దీంట్లోనే పడుండాల్సిందే అంటాడు. పాపం సుందరమ్మకు గర్భంతో పాటు క్షయ కూడా వస్తుంది. ‘శుభ్రమైన గాలి యుండు ప్రదేశమున నివసించిన గాని రోగం కుదరదని’ డాక్టర్ హెచ్చరిస్తాడు. అయినా తన మూర్ఖత్వం వలన సుబ్బిశెట్టి డాక్టర్ చేసిన హెచ్చరికను పట్టించుకోడు. సుందరమ్మ చనిపోతుంది. అరవై సంవత్సరాల వయస్సులో సుబ్బిశెట్టి ఇంకో పెళ్ళి చేసుకుంటాడు. చీకటి ఇంటి కారణంగా మూడవ భార్య అయిన రంగమ్మకు కలిగిన నలుగు పిల్లలూ చనిపోతారు. ‘ఏ డాక్టరును విచారించినను యింటిలో గాలి సరిగ లేనందున బిడ్డలు కృశించి చనిపోవుట తటస్థించు చున్నదనిన్ని, ఊరి బయట బంగళాలో యుండిననే గాని జీవించరని చెప్పుచుండిరి.’ కానీ, పరమ లోభీ, మూర్ఖాగ్రేసర చక్రవర్తీ అయిన సుబ్బిశెట్టి మాత్రం ‘అచ్చొచ్చిన’ ఇంటిని వదిలి వెళ్ళడానికి ఏ మాత్రం ఒప్పుకోడు. మళ్ళీ మొగబిడ్డ కలిగి రెండు సంవత్సరాల తర్వాత చనిపోతాడు. ఈ విధంగా ఒకరి తర్వాత ఒకర్ని పెళ్ళి చేసుకున్నా తగినంత గాలీ, వెలుతురూ లేని ఇంట్లో నివసించడం కారణంగా సుబ్బిశెట్టి భార్యలూ, పిల్లలూ చనిపోతుంటారు. అయినా ఇళ్ళు అచ్చివచ్చిందనే మూఢనమ్మకం కారణంగా సుబ్బిశెట్టి ఇళ్ళు మారడానికి సిద్ధపడడు. ఒకరోజు తను ఎంత సంపాదించాడో లెక్కలు చూసుకుంటూ సుబ్బిశెట్టి కూడా చనిపోతాడు.

పైకి ఈ కథ ఆ కాలం నాటి వైశ్యుల గృహనిర్మాణ పద్ధతిపై ఎక్కుపెట్టిన తీవ్ర విమర్శగా కన్పించినప్పటికీ, సూక్ష్మంగా గమనిస్తే మొత్తం భారతీయుల గృహనిర్మాణ పద్ధతిపై విమర్శ అని అర్థమౌతుంది. ‘హిందూ’ గృహాల నిర్మాణ పద్ధతిపై విమర్శ సంఘ సంస్కరణోద్యమ సాహిత్యంలో ఒక అనివార్య భాగంగా ఉండేది. భారతీయుల జీవన శైలిపై బ్రిటిష్ వలసవాదులు చేసిన క్రూరమైన సాంస్కృతిక దాడిలో భాగంగా వారి ఇంటి సంస్కృతినీ, మరీ ముఖ్యంగా సరిగా గాలీ, వెలుతురూ ప్రసరించని భారతీయుల ఇళ్ళనూ తీవ్రంగా విమర్శించే వారు. చీకటిండ్లలో నివసించడం వల్ల భారతీయుల నాగరికత కూడా అంధకారంతో నిండి వుందని చీదరించుకునే వారు. ఈ విమర్శను బాగా వంటబట్టించుకున్న చాలామంది భారతీయ సంఘ సంస్కర్తలు తమ రచనల్లో హిందూ గృహాలపై విరుచుకు పడ్డారు. ఉదాహరణకు, “హిందూ గృహములు” అనే వ్యాసంలో (తెలుగు జనానా, ఏప్రిల్ 1902, పు. 305-307) టేకుమళ్ళ రాజగోపాలరావు భారతీయుల గృహ నిర్మాణ విధానాలపైనా, ఇంటి వస్తువుల్ని చిందరవందరగా ఎక్కడ పడితే అక్కడ పడేసే వారి మూర్ఖమైన అలవాటునీ తీవ్రంగా హేళన చేసి దారుణంగా దాడి చేశాడు. ఆంగ్లేయుల ఇళ్ళతో భారతీయుల ఇళ్ళను పోల్చి భారతీయుల ఇళ్ళు అపరిశుభ్రమైనవనీ, వారి అలవాట్లు అనారోగ్యకరమైనవనీ ఈసడించాడు. ఇలాంటి సాహిత్యానికి కొనసాగింపుగానే అన్నపూర్ణమ్మ రాసిన పై కథను చూడాలి. మొత్తానికి ఆమె భారతీయుల గృహనిర్మాణ పద్ధతి స్త్రీల ఆరోగ్యం దృష్ట్యా అత్యంత ప్రాణాంతకమైనదిగా నిరూపించే ప్రయత్నం చేసింది. “పుట్టింటి బిడ్డ అత్తింటి కోడలు” కథలో విడాకుల చట్టాన్ని గట్టిగా సమర్థించింది అన్నపూర్ణమ్మ. గారాబంగా పెరిగిన నవనీతానికి వేశ్యాలోలుడైన ముద్దుకృష్ణతో పదమూడేండ్ల వయస్సులో వివాహమౌతుంది. కాపురానికి వెళ్ళినప్పట్నుంచీ నవనీతం గృహహింస బారిన పడుతుంది. భర్త ఎంత కర్కోటకుడంటే వేశ్యల్ని ఇంట్లోకే తెచ్చి పెట్టుకొని వాళ్ళకు కూడా సపర్యలు చేయమని భార్యను ఆజ్ఞాపిస్తాడు. ‘అందరికీ చాకిరి చేయగల శక్తి’ తనకు లేదని దీనంగా చెబుతుంది నవనీతం. అన్నం వండే పెద్ద పాత్ర నవనీతం కాలిమీద పడి గాయమౌతుంది. అయినా మనసు కరగని ఆ త్రాష్టుడు ఆమెను ‘పశువును బాదినట్లు’ బాదడంతో మూర్ఛపోతుంది. ఇరుగు పొరుగు వాళ్ళతో తన గోడు చెప్పుకున్నా భార్యభర్తల గొడవల్లో తల దూర్చలేమంటారు వాళ్ళు. పైగా ‘పతివ్రతలకు భర్త ఎంత బాధించినను ఓర్చుకోవడమనే విధి’ అని పాతివ్రత్య ధర్మాన్ని ప్రబోధిస్తారు. ‘భర్త తన్ను ముక్కలు ముక్కలు చేసినను విచారించే దిక్కు లేకపోగా ముత్తైదువు చావు చచ్చిందని సంతోషించే వాండ్లు చాలా మంది యున్నట్లు’ నవనీతానికి అర్థమౌతుంది. ఇంతలో ఆమె తమ్ముడు రంగనాథం పండుగకు పిలుచుకొని పోవడానికి అక్క

ఇంటికి వచ్చి ఆమె పరిస్థితిని గ్రహిస్తాడు. అక్కను పంపమని అడిగితే ఆ రాక్షస బావ నిరాకరిస్తాడు. అత్తామామలొచ్చి బ్రతిమాలినా నసేమిరా వీలు కాదంటాడు. దీంతో నవనీతం తమ్ముడైన రంగనాథానికి 'మనోబాధ' అధికమై 'కటిక వాని బారి నుండి గోవులను రక్షించుటకు ధర్మశాలలు గలవు. అంతకంటెను అనేక రెట్లధికముగ బాధపడుచున్న హిందూ సంఘమందలి స్త్రీని సంరక్షించుటకు మార్గములు లేవు గదా' అని వాపోతాడు. 'మాయోపాయములచే' తన అక్కను భర్త బారి నుండి తప్పిస్తాడు.

యాభైవేల రూపాయలూ, నగలూ దొంగిలించి పుట్టింటికి పారిపోయిందని భార్యపై ఫిర్యాదు చేసి డబ్బూ, నగలు సహా భార్యను అప్పగించాలంటూ కోర్టులో వ్యాజ్యం వేస్తాడు నవనీతం భర్త. నవనీతం కోర్టుకు వెళ్ళి తన గోడంతా హృదయ విదారకంగా వెలిబుచ్చగా 'ప్రేక్షకుల హృదయములు కరిగి నీరై' పోతాయి. ఆమె బాధలు విన్న జడ్జి 'హిందూ లా ప్రకారం నవనీతం భర్త గృహమున కేగవలసినదే. ఈ విధముగ తీర్మానము చేయవలసెను గదాయని (నాకు) విచారము గలుగుచున్నది. నవనీతం వలె అనేక స్త్రీలు బాధపడుచున్నారని తెలియును. ఈ కష్టములు మాన్పుటకు ఒకటే మార్గం – విడాకుల చట్టం. నేడు ఈ విషాదకరమైన చరిత్రను విన్నవారందరు స్త్రీ హక్కుకొఱకు పోరాడుటకు ప్రయత్నము చేయవలెను. మీ సంఘమునందు నన్ను గూడ చేర్చుకోవలె' అని ఒకవైపు తన బాధను వ్యక్తం చేస్తూనే, యింకోవైపు విడాకుల హక్కు కోసం పోరాడమంటాడు. తానూ అందులో భాగమౌతా నంటాడు. రంగనాథం తదితరుల కృషి కారణంగా విడాకుల చట్టం పాసవుతుంది. చివరికి నవనీతం భర్త పశ్చాత్తాపపడి భార్యను తనతో తీసుకెళ్తాడు. రంగనాథం అక్కకు తన ఆస్తిలో సగ భాగం యిస్తాడు. ఈ కథ ద్వారా అన్నపూర్ణమ్మ గృహహింస వల్ల అష్టకష్టాలకు గురౌతున్న స్త్రీలకు విడాకులను ఒక పరిష్కార మార్గంగా చూపెట్టింది. విడాకుల చట్టాన్ని పాస్ చేయించడం ద్వారా దూరదృష్టితో కూడిన అభ్యుదయ దృక్పథాన్ని ప్రదర్శించింది. అంతే కాకుండా రంగనాథం ద్వారా తన అక్కకు సగం ఆస్తి యిప్పించి స్త్రీల ఆస్తి హక్కును కూడా బలంగా ప్రతిపాదించింది. సమకాలీనంగా కడప రామసుబ్బమ్మ మొదలైన చాలామంది మహిళా మేధావులు విడాకుల చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న చారిత్రక సందర్భంలో అన్నపూర్ణమ్మ విడాకుల చట్టాన్ని మనసారా స్వాగతించడం ఎంతో విశిష్టమైన విషయం. "సీతమ్మగారు" కథలో స్త్రీలకు న్యాయంగా దక్కాల్సిన ఆస్తి హక్కును చాలా ప్రభావ వంతంగా చర్చించింది అన్నపూర్ణమ్మ. సీతమ్మ–రామారావులకు పుట్టిన సంతానమంతా ఆడపిల్లలే! కాబట్టి సీతమ్మ మగపిల్లవాడు కలగాలని కోరుకుంటుంది. రామారావు తన అన్నలతో కలిసి వ్యాపారం చేస్తుంటాడు. అన్నదమ్ములు ఆస్తి పంచుకున్నట్లైతే రామారావుకు ఏడున్నర లక్షల భాగం వస్తుంది. విడిపోతే వ్యాపారంలో నష్టం వస్తుందనీ, అన్నలకు కష్టం కలుగుతుందనీ భావించిన రామారావు అన్నలతో కలిసే ఉంటాడు. ఒకరోజు అకస్మాత్తుగా అస్వస్థుడై రామారావు చనిపోతాడు.

స్త్రీలకు ఆస్తి హక్కు లేని కారణంగా సీతమ్మకు రామారావు అన్నల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సి వస్తుంది. 'ఏడున్నర లక్షలకు అధికారియగు భర్తకు యిల్లాలై యుండి, ఆర్గురు ఆడబిడ్డలకు తల్లియగు సీతమ్మ గారు విగతభర్త యగుసరికి, స్త్రీలకు ఆస్తికి అధికారము లేనందున స్వతంత్ర జీవనము చేయుటకు వీలు లేక యింటిలోని వారందరికి అడుగులకు మడుగు లొత్తవలసి యుండెను.' రామారావు చనిపోయేటప్పుడు తాము అతని కుటుంబానికి న్యాయం చేస్తామన్న హామీని సులభంగా మరచిపోయిన అతని అన్నలు సీతమ్మకు కేవలం పదివేల రూపాయలు యిస్తామంటారు. దీంతో హతాశురాలయిన ఆమె 'ఆహా! స్త్రీలెంత దౌర్భాగ్యులు. స్త్రీలకు స్వాతంత్ర్యము లేదా? స్వానుభవము వలన ద్రవ్యమున కధికారము లేకపోవుటయే అస్వాతంత్ర్యమని వెల్లడియగుచున్నద'ని అనుకొంటుంది. దీనికి సమాధానంగా ఆమె స్నేహితురా లైన చూడామణి 'పుణ్యభూమియని పేరు గాంచి, స్త్రీ స్వరూపిణి యగు ఆదిశక్తిని పూజించి, భారతదేశమును మాతృభూమియని భక్తితో సేవించు ఈ దేశమున స్త్రీలు ఆస్తి హక్కులు లేక బాధలు పడుచుండుట హాస్యాస్పదము. మహమ్మదీయ, క్రైస్తవ మతములలో స్త్రీలకు కొంత వరకు ఆస్తి హక్కు గలదు. (ఈ విషయంలో కేవలం) మగలను దూషించుట వలన ఫలితము గలుగదు. స్త్రీలు తమ హక్కుల కొరకు పోరాడవలయు' నని కర్తవ్యాన్ని బోధిస్తుంది. రామారావు చనిపోయేనాటికి సీతమ్మ గర్భవతి. కొంత కాలానికి ఆమెకు కొడుకు పుట్టినప్పటికీ పుట్టిన పది నిమిషాలకే చనిపోతాడు. అప్పుడు ఆమె స్నేహితురాలైన చూడామణి తెలివిగా ప్రవర్తించి పని మనిషి అయిన వెంకమ్మకు పుట్టిన అబ్బాయిని 'వేయి రూప్యములకు కొని సీతమ్మగారి కుమారునిగ' మార్చగా బిడ్డకు పార్థసారథి అనే పేరు పెడ్తారు. తండ్రి ఆస్తికి కొడుకు వారసుడౌతాడు కాబట్టి

తమ ఆస్తి పంచి యివ్వమని తన భర్త అన్నల్ని అడుగుతుంది సీతమ్మ. పార్థసారథి ఆమె కొడుకు కాదని వాదించి ఆస్తి పంచివ్వమంటారు వాళ్ళు. ఆమె కోర్టుకెళ్ళి ఓడిపోతుంది. అయినా నిరాశ చెందక హైకోర్టులో అప్పీల్ చేస్తుంది. కేసు మూడు-నాలుగు సంవత్సరాలు నడుస్తుంది. ఈలోగా తన భర్త అన్నల కుమారులు చనిపోతారు. మరికొంత కాలానికి వారు కూడా చనిపోతారు. కోర్టు తీర్పు సీతమ్మకు అనుకూలంగా వస్తుంది.

భర్త అన్నలు తన కుటుంబానికి చేసిన ద్రోహాన్ని క్షమించేసిన సీతమ్మ వారి భార్యలకు వారి ఆస్తి యిచ్చేయమని తన కుమారునికి చెబుతూ యిలా అంటుంది: 'అబ్బాయి! భార్యాభర్తలు జీవితాంతము వరకు సుఖదుఃఖములలో సమానముగ పాల్గొనుచుందురు. హిందూ మతము నందు మోక్ష సాధనకు భార్యాభర్త లిరువురు ప్రయత్నించవలెనని చెప్పుదురు. పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీనారాయణులు, సీతారాములు అని స్త్రీవాచకమునకే ప్రధాన స్థాన మొసంగెదరు. ఏ కారణము వలననో ప్రస్తుత సాంప్రదాయములందు స్త్రీలకు ఏలాటి న్యాయము అగపడుట లేదు. భర్తతో సుఖముగ కాలము గడపి బిడ్డపాపలను గని తుదకు భర్త మరణించిన, భర్త కష్టార్జితమును భార్య అనుభవించుటకు అధికారము లేదు. ఈ విషయము నాకు విపరీతముగ తోచుచున్నది. స్త్రీలకు పురుషులకు భేదము చూపక వారి భర్తల ఆస్తి వారి కొసంగుము.' దీంతో 'పార్థసారథి తల్లి యిష్ట ప్రకారమే పెదతండ్రుల ఆస్తిని వారి భార్యలకిచ్చెను.'

"సుశీల" కథలో భారత సమాజంలో అనాథలైన ఒంటరి స్త్రీలకు కలిగే అనేక రకాలైన కష్టాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించింది అన్నపూర్ణమ్మ. వితంతువైన మనోహరమ్మ తనకు భాగవతం చెప్పడానికి వచ్చే రామశాస్త్రితో వెళ్ళిపోవడం కారణంగా సుశీల పుడుతుంది. ఈ 'కళంకం' సుశీల జీవితాంతం వెంటాడుతుంది. సుశీల చిన్నప్పటినుండీ చదువులో బాగా చురుకైనది. ఎనిమిదో యేటే ఆమెకు పెళ్ళవుతుంది. దొంగతనాలు చేసే అలవాటున్నవాడు కావడంతో ఆమె భర్త జైలుపాలవుతాడు. తర్వాత చనిపోతాడు. సుశీల వితంతువైపోయినప్పటికీ చదువు కొనసాగిస్తుంది. కొంత కాలానికి తల్లిదండ్రులు కూడా చనిపోయి సుశీల అనాథగా మిగిలిపోతుంది. ఆమెకు చదువుకొని 'గౌరవముగ జీవించవలెనని కోరిక' ఉంటుంది. కానీ దారీ తెన్నూ తెలియదు. గోరుచుట్టుపై రోకటిపోటులా ఆమె 'ఒంటరిగ స్కూలుకు వెళ్ళి వచ్చుట దుర్భరమైనది. దుర్మార్గ సంఘము. రాళ్లు విసరేవారు, వెక్కిరించేవారు, నవ్వేవారు, చేతులు చరచువారు, ఉత్తరములు వ్రాసి పడవేయువారు, కుండలు గోకే ఆడదానికి చదువెందుకురా' అని ఎగతాళి చేసే పోకిరీల చేష్టలు మితిమీరి పోయాయి. వీటికి తోడు ఇరుగుపొరుగు అమ్మలక్కల సూటిపోటి మాటలు కూడా ఆమెను తీవ్రంగా బాధించసాగాయి. ఒక్క పొరుగింటి ముసలమ్మ మాత్రం ఆమె పట్ల సానుభూతితో ఉండేది. అదే సుశీల బాధామయ జీవితానికి కాసింత సాంత్వన యిచ్చేది.

ఇలాంటి సందర్భంలో బ్రహ్మసమాజ మందిరంలో రాజా రాంమోహన్ రాయ్ వర్ధంతి సభ జరుగుతుంది. ఉపన్యాసకుడిగా వయోవృద్ధుడైన ప్రకాశంగారు అక్కడికి వస్తాడు. ముసలమ్మ ఆయనకు సుశీల పరిస్థితి వివరించగా ఆమెను చదివించడానికి సుముఖత వ్యక్తం చేస్తాడు. అతని సహాయంతో సుశీల కలకత్తాలోని ఒక విద్యాసంస్థలో చేరుతుంది. కానీ, పోకిరీలు సుశీల దుర్నడత కలదని అక్కడి హాస్టల్ సూపరింటెండుకు ఆకాశరామన్న ఉత్తరం రాయగా, దాన్ని నమ్మి సుశీల ఎంతగా ప్రాధేయపడ్డా వినిపించుకోకుండా నిర్దయతో ఆమెను హాస్టల్ నుండి తీసేస్తారు. గత్యంతరం లేక సుశీల ప్రకాశంగారి దగ్గరికి తిరిగి వచ్చేస్తుంది. ప్రకాశంగారికీ, సుశీలకూ అక్రమ సంబంధాన్ని అంటగడుతుంది వక్ర సమాజం. ఈ అపవాదు నుండి తప్పించుకోవడానికి సుశీల ప్రకాశంగారిని తన్ను పెళ్ళి చేసుకోమని అడిగి పెళ్ళి చేసుకొంటుంది. అయినా వాళ్ళు భార్యా-భర్తల్లా కాకుండా, తాతా-మనుమరాళ్ళలా జీవితాన్ని గడుపుతుంటారు. సుశీల మహిళాభివృద్ధి కోసం పాటుపడుతుంది. ఈ కథలో తల్లిదండ్రులు చేసిన తప్పుకు పిల్లల్ని బాధ్యుల్ని చేయడాన్ని ప్రశ్నిస్తుంది అన్నపూర్ణమ్మ. ఒక స్త్రీ-ఒక పురుషుడు కలిసి ఉంటే సంఘం మోపే నీలాపనిందల్ని అసహ్యించుకొంది. అందుకే వృద్ధ వివాహాలకు తాను బద్ధ వ్యతిరేకి అయినప్పటికీ కథలో సుశీల-ప్రకాశంల వివాహం జరిపిస్తుంది. అయినా వారిని భార్యా-భర్తల సంబంధానికి దూరంగా ఉంచుతుంది. ఒంటరులైన అనాథ స్త్రీలు ఎదుర్కొనే అనేక సమస్యల్ని చర్చకు పెట్టి సమాజం నాగరికమవ్వాల్సిన ఆవశ్యకతను చాలా చక్కగా సూచించింది అన్నపూర్ణమ్మ.

"జ్ఞానాంబ" దొంగ స్వాములూ, మూఢ భక్తులకు సంబంధించిన కథ. 'పనిపాటలు లేక సోమరులై తిరుగు' బైరాగులూ, గోసాయిలూ, బ్రాహ్మణ గురువులూ మూఢ భక్తులను ఏ విధంగా పీల్చి పిప్పి చేసేవారో తెలియ జేస్తుంది. అంతేకాకుండా అంధ భక్తుల్లో మూఢత్వ జాడ్యం

ఎంత దట్టంగా పేరుకొనిపోయి ఉండిందో స్పష్టపరుస్తుంది. కేశవయ్య పరమ మూఢుడైన భక్తుడు. కాశాయాంబర ధారులు ఎవరు కన్పించినా తన ఇంటికి పిలిచి సపర్యలు చేసి జ్ఞానోపదేశం చేయమంటూంటాడు. అతని బలహీనత తెలిసిన దొంగస్వాములనేకమంది అతని ఇంట్లో నెలల తరబడి తిష్ట వేస్తుంటారు. 'గోషాయిలు, బావాజీలు నెలల పర్యంతం స్నానము చేయక పెద్ద పెద్ద గడ్డములను బెంచి ఒడలంతయు బూడిదఁ బూసుకొని వికృత స్వరూములు గలిగి రాత్రింబవళ్ళు గంజా పీల్చుచు నల్లమందు సేవించుచు బూతు పాటలు పాడుచు (అతని ఇంట్లో) కాలం గడిపేవారు.' నలుగురు తమ్ముళ్ళూ, వారి భార్యలూ కల పెద్ద సంసారంతో ఉన్న కేశవయ్య వారందర్నీ స్వాముల సేవలో నియోగిస్తుంటాడు. అతని కోడలు జ్ఞానాంబకు మాత్రం ఈ దొంగస్వాముల వాలకం (బూటకం) నచ్చక వారికి సేవలు చేయడానికి ఒప్పుకోదు. కేశవయ్య చీవాట్లు పెట్టి ఆమెకు అన్నం పెట్టవద్దని తన భార్యను శాసిస్తాడు. దీంతో శుష్కించిన జ్ఞానాంబ పుట్టింటికి వెళ్తుంది. ఆరోగ్యవతి అయ్యాక అత్తవారింటికి వెళ్ళమని చెప్పిన తండ్రికి ఆనాడు ఊడలుబారిన మూఢాచారాల్ని గూర్చి జ్ఞానాంబతో ఈ విధంగా చెప్పించింది అన్నపూర్ణమ్మ: 'నాన్న! వారి ఆచారములు చాలా విపరీతముగ నుండును. ఉదయం మొదలు మధ్యాహ్నం రెండు గంటల వరకు తడిగుడ్డలతో నుండి గురుపూజలు జరుపవలెను. పాత్రాపాత్ర వివక్షత లేక అతి దుర్మార్గులైనను కాషాయాంబరము ధరించిన వారికి సర్వోపచారములు జరిపెదరు. గురువులందు నమ్మకము లేని నన్ను నిర్బంధముగ సేవజేయుటకు నియోగించెదరు. వారు మూఢభక్తితో అనంతమైన ద్రవ్యమును ఖర్చు చేసెదరు. గ్రుడ్డి, కుంటి మొదలగు వాండ్లకు భిక్షం వేసిన యిల్లంతయు గుల్ల చేయుచున్నవాయని దూరెదరు. మా ప్రక్కయింటి యిల్లాలు చాలా కష్టదశలో నుండి గంజికి గూడ దొరకక అవస్థ పడుచుండగ (ఒక) పడి బియ్య మొసంగితిని. ఆ విషయం తెలిసి మా అత్తగారు నన్ను కొట్టిరి. ఏదీ తోచనపుడు రామాయణ భాగవతాది గ్రంథములు చదువుచుందును. స్త్రీలు చదువుచుండిన పురుషులకు చిన్నతనమని యింటి యందు ఏ గ్రంథములు గాని యుంచడము లేదు. బహిర్దినములందు పడు బాధలు అపరిమితములు. నాలుగు రోజులలో వాండ్ల మడి వలన ఒకటి రెండు పూటలు మాత్రమే అన్నము దొరుకును. ఈ బాధలన్నిటిని స్త్రీలకు గల నైజమగు ఓర్పుతో సహించితిని.'

డబ్బుని సోమరిపోతులూ మోసగాళ్లైన దొంగస్వాముల సేవలో దురుపయోగం చేయడం కన్నా ప్రజోపయోగ కరమైన కార్యాల్లో వెచ్చించడం సమంజస మైందనే విషయాన్ని కూడా ఈ కథ ద్వారా తెలియజేసింది అన్నపూర్ణమ్మ. అందుకే తండ్రి మరణానంతరం రెండు లక్షల ఆస్తికి వారసురాలైన జ్ఞానాంబ ఆ డబ్బును ప్రజోపయోగకరమైన పనుల కోసం ఖర్చు చేస్తుంది. అంతేకాకుండా, మరణశయ్యపై ఉన్న భర్త తనకిచ్చిన లక్ష రూపాయలను కూడా ప్రజాసేవకే వినియోగిస్తానని చెబుతుంది. అన్నపూర్ణమ్మ కథలు కొన్ని చాలా ప్రాథమికంగా ఉన్నాయి. చాలా విషయాల్లో అసహజంగా కూడా అన్పిస్తాయి. శిల్పపరంగా అవేం గొప్ప కథలు కావని యివ్వాల మనకన్పించవచ్చు. అయినప్పటికీ వాటి ద్వారా ఆమె వ్యక్తపరచిన భావాల దృష్ట్యా అవి అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వాటిని రాసిన కాలం 1920లు అని గుర్తించుకుంటే వాటిలో వ్యక్తమైన విషయం ప్రశంసార్హమైనదిగా మనం గుర్తించగలం.

నిరుడు వెలిగిన దారి దీపాలైన కందుకూరి రాజ్యలక్ష్మమ్మ, భండారు అచ్చమాంబ, మొసలిగంటి రమాబాయమ్మ మొదలగు 'యుగ స్త్రీలు' తెలుగునాట ఆధునిక స్త్రీపర్వ ప్రస్థానానికి శ్రీకారం చుడితే, దరిశి అన్నపూర్ణమ్మ లాంటి వారు సడలని పట్టుదలతో దాన్ని వేగవంతం చేశారు. చరిత్ర చక్రాన్ని వెలుతురు వైపు పరుగెత్తించారు. అన్నపూర్ణమ్మ చనిపోయాక ఆమె రచనల్ని దరిశి చెంచయ్య ఒక పుస్తకంలో క్రోడీకరించాడు. పుస్తకానికి ముద్దుగా మరపురాని అన్నపూర్ణ అనే శీర్షికనుంచాడు. భావితరాలు అన్నపూర్ణమ్మ కృషిని తప్పకుండా గుర్తుంచు కుంటాయనే విశ్వాసంతో పుస్తకానికి ఈ టైటిల్ పెట్టి వుండొచ్చు. కానీ విషాదమేమిటంటే సమకాలీన తెలుగు సమాజంలో చాలా మంది దరిశి అన్నపూర్ణమ్మనీ, ఆధునికాంధ్రదేశ నిర్మాణంలో ఆమె పోషించిన ఎప్పటికీ మరచిపోకూడని గొప్ప పాత్రనీ మరచిపోయారు. భండారు అచ్చమాంబ, మాగంటి అన్నపూర్ణాదేవిలవలె దరిశి అన్నపూర్ణమ్మ కూడా చిన్న వయస్సులోనే చనిపోవడం తెలుగువారి దురదృష్టం. అన్నపూర్ణమ్మ అకాల మరణం పట్ల హిందూ దినపత్రిక ప్రగాఢ సంతాపం ప్రకటించింది.

షేక్ మహబూబ్ బాషా
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ
హైదరాబాద్ - 500 0032, ఫోన్ : 91605 79705

# కాశీ పండా నన్ను నరకానికి పంపాడు

– కె. సత్యనారాయణ

“మాసానాం ఉత్తమే మాసే, మాసానాం అముక్ మాసే, అముక్ పక్షే, జంబూ ద్వీపే భరత్ ఖండే ఆర్యావర్త్ దేశాంతర్గతే అముక్ నామ్ సంవతసరే ....పితా కా నామ్ లీజియే, గంగామయ్యా కా నామ్ లీజియే.... సమర్పయామి “ లలితాఘాట్ మెట్లమీద రత్నాకర్ పండా (కల్పిత పాత్ర) మంత్రాలు చదువుతున్నాడు. ఆయన చెప్పినట్లు చేస్తున్నారు కర్మ చేస్తున్నవాళ్ళు. పొడవుగా, లావుగా ఉన్నాడు. శామనఛాయ శరీరం. బూరలా బయటకొచ్చిన పొట్ట. కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న నుదుట మీద గంధపుగీతలు. నుదుట మధ్యలో ఎరుపు శివలింగ చిత్రం. నోట్లో ఖిల్లీ. కాటుక రాసుకున్న కళ్ళు. గావంచా కట్టుకున్నాడు. భుజంమీద రెండుపక్కలా బంగారుజరీ ఉన్న కండువా వేసుకున్నాడు. మెడలో డజను రుద్రాక్ష మాలలు. చూస్తుంటే రత్నాకర్ ఉస్తాదులా ఉన్నాడు. రాగి చెంబులో గంగాజలం తీసుకున్నాడు. ఎదురుగా కూర్చున్నవాళ్లతో మూడుసార్లు తాగిస్తున్నాడు. ఈ దృశ్యం లలితాఘాట్ కే కాదు. చాలా ఘాట్లలో ఇదే దృశ్యం కనిపిస్తుంది. ఎటు తిరిగినా ఇదే వినిపిస్తుంది. అంతే. ఇది పండాల తంతు. ఆయనకు అంతే వచ్చు. రత్నాకర్ చాలామంది పండాల ప్రతినిధిరూపం.

రత్నాకర్ తెల్లారకముందే ఘాట్‌కు వస్తాడు. భాంగ్ సేవిస్తాడు. సంధ్యావందనం చేస్తాడు. ఇంతలో పిండప్రదానం కోసం కొందరు వస్తారు. కొందర్ని వేచి ఉండమంటాడు. పూజ చేసేవాళ్లచేత గంగలో స్నానం చేయిస్తాడు. పూజచేసినవాళ్ళు ఆయన కాళ్ళకు మొక్కుతారు. వాళ్ల దగ్గర నుండి రత్నాకర్ మొహమాటపడకుండా డబ్బులు వసూలు చేస్తాడు. రెండోగ్రూపు అప్పటికే గంగలో దిగారు. కొందరు విదేశీయులు అక్కడకు వచ్చారు. మొదట అక్కడ దృశ్యాన్ని వాళ్ల కెమేరాలో బంధించారు. ఆ తర్వాత వాళ్ళూ పూజకు సిద్ధమయ్యారు.“కమాన్ మేమ్ సాహెబ్, దిస్ సైడ్” అంటూ రత్నాకర్ వాళ్ళను స్వాగతిస్తాడు. వాళ్ల సమస్యలు అడుగుతాడు. వాళ్ల చేతిలో కొబ్బరి, పూలు, అక్షింతలు ఉంచుతాడు. ఆ తర్వాత వాళ్లచేత సంకల్పం చదివిస్తాడు. “దిస్ ఈజ్ లలితాఘాట్. మార్నింగ్ టైమ్, ఈవినింగ్ టైమ్, యూ కమ్ టుగెదర్ గంగా, యూర్ మనీ కంట్రోల్, యూర్ హస్బెండ్ కంట్రోల్, యూర్ చైల్డ్ కంట్రోల్, పుట్ ద కోకోనట్ ఆన్ హెడ్, అండ్ టేక్ ద డిప్ ఇన్ హోలీ మదర్ గంగా. “రత్నాకర్ సంకల్పంతో విదేశీయుల ముఖంలో సంతృప్తి కనిపిస్తుంది. పైసలు దండిగా ఇచ్చారు. కాశీఘాట్ల మీద పూజలు చేయించే వాళ్ళు మూడు వర్గాలు. వీరు పండాలు, తీర్థ పురోహితులు, ఘాటియాలు. తీర్థపురోహితులు ఘాట్‌లో వెదురు గొడుగు కింద కూర్చుంటారు. తరతరాలుగా వీరికి ఈ స్థానం వచ్చింది. వీరు ఇంటిసమస్యలు పోవడానికి పూజలు చేయిస్తారు. మంచి జరగాలని సంకల్పం చదివిస్తారు. గంగానదిలో అస్తివిసర్జన చేయిస్తే ముక్తి లభిస్తుందని హిందువుల నమ్మకం. పిండ ప్రదానం చేయిస్తే చనిపోయినవాళ్ల ఆత్మలు శాంతిస్తాయని విశ్వాసం. ఈ క్రియలు పండాలు చేయిస్తారు. రత్నాకర్ నోటితో తక్కువ, కళ్ళతో ఎక్కువ మాట్లాడుతాడు. అందరికీ ప్రసాదం పంచుతాడు. పంచడంలో కుల, మతభేదాలు పాటించడు. అతని దృష్టి ఎప్పుడూ ఎదుటివాళ్ల జేబుమీద ఉంటుంది. పిండి కొద్దీ రొట్టె అన్నట్లు, దక్షిణం కొద్దీ గంధపు బొట్టు. తక్కువ డబ్బులిచ్చే వాళ్లకు బొట్టు. ఎక్కువ ఇచ్చేవాళ్లకు నుదుట అంతా డిజైన్ లా గంధం రాస్తాడు. కొందరికి గంగా స్నానానికి ముల్తాన్ మట్టి ఇస్తాడు. దానితో చర్మం నిగనిగలాడుతుంది అంటాడు.

సమస్యలు పోవాలా, కోరికలు తీరాలా, ఆత్మలు శాంతించాలా....దేనికైనాగానీ సమాధానం ఉందంటాడు పండా. అన్నదానం, ధనదానం, గోదానం...శక్తిని బట్టి ముక్తి. యాత్రికులను స్టేషను నుండి తీసుకురావాలి. వాళ్ళను ఘాటుకు తీసుకువెళ్లాలి. గంగలో స్నానం చేయించాలి. పిండప్రదానానికి ఏర్పాట్లు చేయాలి. గుడికి తీసుకెళ్లాలి. దర్శనం చేయించాలి. కాశీలో తిప్పాలి. ఇక్కడి దేవుళ్ళ గురించి చెప్పాలి. మోక్షమార్గం తెలపాలి. వాళ్లను చీరల షాపుకు తీసుకు వెళ్ళాలి. ఇవన్నీ ఎవరు చేస్తారు? పండాలకు అంత సమయం లేదు. అందుకే భండర్ వ్యవస్థ. ఈ పనులు చేయటానికి పండాలు గుమస్తాలను పెట్టుకుంటారు. వాళ్లను భండర్‌లు అంటారు. వీళ్ళు బ్రాహ్మణులు కాదు. ఎక్కువగా యాదవులు. కొందరు

చాకళ్ళు, మంగళ్ళు. కానీ భండర్‌లు మాత్రం తమకు తాము జోషి బ్రాహ్మణులమని చెప్పుకుంటారు. భండర్‌ల కమిషన్ స్టేషన్ నుండే మొదలవుతుంది. ఆటో లేదా కారులో తీసుకెళ్తారు. పిండప్రదానసామగ్రిలో, గుండుగీసే మంగలి, గుడికి తీసుకెళ్లే పువ్వులూ, కాయలూ, పూజారి దక్షిణం అన్నింట్లో కమిషన్ ఉంటుంది. ఘాటులో గోదానం అడుగుతారు. లేదా ఆవు కొనుక్కునేందుకు డబ్బు అడుగుతారు. 'ఇక్కడ చెప్పులు పెట్టండి ' అన్న సంకేతంతో గుడి మొదలవుతుంది. ఎక్కడ చెప్పులుంచుతారో అక్కడే భండర్ ప్రసాదం, పూలు కొనిపిస్తాడు. గుడిలో ఉన్న ప్రతీ విగ్రహం దగ్గరకు తీసుకెళ్తాడు. ' మీ భక్తి కొలదీ దక్షిణం ఇవ్వండి' అని భండర్ ప్రతిచోట చెబుతాడు. తక్కువ ఇస్తే 'ఇదేనా మీ భక్తి? ఆ మాత్రానికి ఇంత దూరం ఎందుకు రావడం? 'అంటాడు. యాత్రికుల కాశీ యాత్ర పూర్తవుతుంది. భండర్ 'నా దక్షిణం ఏది?' అంటాడు. వారు తమకు తోచిందిస్తారు. "ఏమిస్తున్నారండి మీరు? మేమేమైనా బిక్షం అడుగుతున్నామా? " అంటూ గొడవకు దిగుతాడు. తిడతాడు. బలవంతంగా డబ్బులు వసూలు చేస్తాడు. క్రమేణా భండర్‌లు పండాల నుండి స్వతంత్రు లయ్యారు. గంగాఘాట్లలో మరో వర్గం పండాలు ఘాటియేలు. వెదురీనుల గొడుగు కింద బల్లమంచం మీద కూర్చునుంటారు. కిళ్లీ నమలుతుంటారు. కొబ్బరి చిప్పల్లో గంధం, బూడిద, పసుపు పక్కనే ఉంచుకుంటారు. అద్దం, దువ్వెన కూడా ఉంటాయి. వీళ్ళను ఘాటియేలంటారు. వీళ్ళు కూడా పండాలని చెప్పుకుంటారు.

వీళ్ళు ఘాట్లలో అన్నవస్త్రాల దానం తీసుకుంటారు. గంగఒడ్డున బ్రాహ్మణులు అలాంటి దానాన్ని స్వీకరించ రాదని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే సమాజంలో వీరికి గౌరవం తక్కువ. వీళ్లలో ఎక్కువమంది నిరక్ష రాస్యులు. వీరికి కర్మకాండలు రావు. సంస్కృత శ్లోకాలు కొన్ని ముక్కున బెడతారు. కొన్ని తంతులు నేర్చుకున్నారు. దానితో అస్తివిసర్జనం, పిండప్రదానం చేస్తున్నారు.

గంగాఘాట్ల మీద విగ్రహారాధన చేయకూడదు. అయినా ఘాటియేలు చిన్న శాలిగ్రాం విగ్రహాలు, కంచు విఘ్నేశ్వర విగ్రహాలను ఘాట్లలో పెట్టి పూజలు చేయిస్తారు. గోదానం కోసం ఆవుల్ని కూడా సిద్ధంగా ఉంచుకుంటారు. పండాలలో మరోవర్గం గంగాపుత్రులు. వీళ్ళు తీర్థ పురోహితులు. ధర్మప్రాణ వైదిక కర్మకాండలు తెలిసినవాళ్ళు. శాస్త్రాలు బాగా చదువుకున్నవారు. అన్నీ శాస్త్రోక్తంగా జరిపిస్తారు. వీళ్లకు పోటీగా ద్రవిడ తీర్థపురోహితులు వచ్చారు. వీరి మధ్య వివాదం పెరిగింది. గంగాపుత్రులు, ద్రవిడపురోహితుల మధ్య కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. గంగాపుత్రుల పక్షంలో పం. మదన్ మోహన్ మాలవ్య, ప్రసిద్ధ వైదిక విద్వాంసులు శ్రీ విద్యాధర గౌడ్ సాక్ష్యం చెప్పారు. గంగాఘాట్ల మీద పురోహిత హక్కు కేవలం గంగాపుత్రులకే ఉందని కోర్టు తీర్పు చెప్పింది. ద్రవిడపురోహితులకు, ఘాటియేలకు ఏ హక్కూ లేదని తీర్పిచ్చింది. 18 వ శతాబ్దిలో రాజులు దానాలిచ్చేవారు. ఇల్లూ, భూములు, నగలూ ఇచ్చేవారు. 1803లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఒక ఆర్డరు వేసింది. గంగ ఒడ్డున ఇచ్చే దానదక్షిణాలు కంపెనీ ఖజానాలో జమ చేయాలన్నారు. దీనిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. కోర్టుకెక్కారు. గెలిచారు. ఘాట్లమీద దానం తీసుకునే అధికారం 'గంగాపుత్రులకే 'ఉందని కోర్టు తీర్పిచ్చింది.

1850 తర్వాత కాశీ పండాలలో కొంత మార్పు వచ్చింది. అయినా వాళ్ళలో పెళుసుతనం అలాగే ఉంది. భాంగ్ తాగేవారు. కసరత్తు చేసేవారు. కొందరు కర్రసాము చేసేవారు. చాలా మంది వెదురుకర్ర చేత్తో పట్టుకునేవారు. పండాల కథ ఇక్కడితో పూర్తవలేదు. వీరిలో చాలామంది మల్లయోధులు. బబువా పాండే, బటుక్ పాండే, దావూజీ, పం. ఉమాదత్త మిశ్రా, అంజనీనందన మిశ్రా, ఛన్ను - మన్ను, బైరోనాద్, లక్ష్మణ్ సింగ్ వంటివారి గురించి కాశీలో ఎవరినడిగినా చెబుతారు. పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగటం ఇక్కడ పండాలకు అలవాటే. యాత్రికులకోసం, ఆధిపత్యంకోసం కొట్టుకునేవారు. బెంగాలీటోలాలోని బబువా పాండే తలమీద గమేలా పెట్టి, పైన తలపాగా చుట్టి తిరిగేవాడట. తనకంటే ఎత్తయిన లావు లాఠీ పట్టుకునేవాడు. ఆ కాలంలో పిస్టల్లు, తుపాకీలు అందుబాటులోకి రాలేదు. యాసిడ్ కూడా వాడేవారు కాదు. కత్తులు కూడా ఉపయోగించేవారు కాదు. ఇవన్నీ తర్వాత ప్రవేశించాయి. ఛన్నూజీ కుటుంబీకుడైన మదన్ మహారాజ్, ప్రముఖ తీర్థ పురోహితులు కృష్ణాజీ యాసిడ్ కారణంగానే చనిపోయారు. బెనారస్‌లో జిల్లాబహిష్కార శిక్ష దావూజీ పండాతో మొదలయ్యిందని చెబుతారు. ఆ రోజుల్లో కోర్టు టౌన్ హాల్ లో నడిచేది. దాంట్లో మెజిస్ట్రేట్ మాతాప్రసాద్ వర్మ. ఆయనపై కోర్టులో దావూజీ బూటు విసిరాడట. కేసుల కోసం పెద్ద పెద్ద లాయర్లను పెట్టుకునేవారు. జవహర్లాల్ నెహ్రూగారు వాదించిన

మొదటి కేసు బనారస్ పండాదే. ఆయన అలహాబాద్ హైకోర్టులో కృష్ణాజీ పండా కేసు వాదించారు. ప్రస్తుతం ఉన్న తీర్థపురోహితుడు గంగాధరశాస్త్రి గారు ఈ కృష్ణాజీ వంశజుడే. ఆంగ్లేయుల పాలనలో బెనారస్ ఎస్. పి. గారు ఒక ఆర్డరు వేసారు. పండాలు రైల్వేస్టేషనుకు వెళ్ళినప్పుడు తమ ఫోటో గుర్తింపుపత్రం తీసుకెళ్ళాలన్నారు. కృష్ణాజీ ఈ ఆదేశాన్ని ధిక్కరించారు. ఎస్.పి.గారు ఆయన మీద కేసు పెట్టి జైలుకి పంపారు. ఆ కేసు నెహ్రూగారు వాదించారు. గెలిచారు.

పండాల మధ్య గొడవ 1905-1955 మధ్య తీవ్రస్థాయికి చేరింది. ఆ కాలంలో పండా బయటకు వెళితే, వెంట లాఠీ పట్టుకున్న ఉస్తాదులు నలుగురు వెళ్లేవారు. మహావీర్ మహారాజ్ వెంట డజను ఉస్తాదులు ఉండేవారు. ఈ ఉస్తాదులు తర్వాత గూండాలయ్యారు. బనారస్ గుండాలను మహాకవి జయశంకర్ ప్రసాద్ రాసిన ' గూండా 'కథ చక్కగా చిత్రించింది. 'బనారస్ గూండాలను చూసి ఇంగ్లీషు కలెక్టరు కూడా జడుసుకునేవాడు ' అంటారు పం. రామ్ నారాయణ్ శర్మ. ఈ గూండాలకు కూడా కొన్ని నీతినియమాలుండేవి. వీళ్లకు కొన్ని ఆదర్శాలుండేవి. ఈ గుండా సంస్కృతి చాలా ప్రాచీనమైనది. కొట్లాట, యాసిడ్ వల్ల కొందరు పండాలు ప్రాణాలు కోల్పోయారు. 'సంఘర్ష్ 'హిందీ సినిమా పండాల పోట్లాటను చక్కగా చిత్రించింది. పండాల గురించి సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ కాశీనాథ సింగ్ ' కాశీ కా అస్సీ ' నవలలో వర్ణించారు. దీనిని ' మొహల్లా అస్సీ ' పేరుతో హిందీ సినిమా తీసారు. దీనిలో సన్నీడియోల్ పండాగా చక్కగా నటించారు. పం. ఉమాదత్త మిశ్రా, ఛన్నూ - మన్నూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుంది. మిశ్రాగారి కొడుకు యజ్ఞోపవీత కార్యక్రమం. కార్యక్రమ స్థలం శీతలాదేవి గుడికి ఛన్నూ-మన్నూ ఇంటి ముందు నుండి వెళ్ళాలి. సన్నాయి స్వరం విని ఛన్నూ - మన్నూ బయటకొచ్చారు. అందరూ వీరు గొడవ చేస్తారనుకున్నారు. కానీ వాళ్ళు పూజలో పాల్గొన్నారు. మిశ్రాగారు వాళ్ళిద్దరికీ తలపాగా కట్టాడు. అలాగే 1901లో బబువా పాండే, ఉమాదత్త మిశ్రాల మధ్య జిల్లా మేజిస్ట్రేట్ రాజీ కుదుర్చారు. పండా సంప్రదాయం ఈనాటిది కాదు. గంగతోపాటు కాశీ సంస్కృతిలో భాగమై ప్రవహిస్తుంది. పండాల మోసాలు కూడా గంగ అంత ప్రాచీనమైనవే. వీరి మోసాల గురించి కబీరు ఇలా రాస్తారు. "మాయా మహాఠగనీ హమ్ జానీ, తిరుగున్ ఫాస్ లియే కర్ డోలే బోలే మధురే బానీ, పండా కే మూరత్ వే బైఠీ తీరథ్ మే భయీ పానీ "గాంధీజీ 1902, ఫిబ్రవరిలో కాశీ వచ్చారు. రైల్వే స్టేషనులో పండాలు గాంధీజీని చుట్టుముట్టారు. "బెల్లం వెంట చీమల్లా, యాత్రికుల వెంట పండాలు. కాశీలో ఇది నా మొదటి అనుభవం " అన్నారు గాంధీజీ.

గాంధీజీ విశ్వనాథ మందిరం వద్దకు వచ్చారు. ఈశ్వరుణ్ణి వెదుకుతున్నారు. ఈశ్వరుడు దొరకలేదు. కానీ ఎటుచూసినా చెత్త, చెదారం. మురికి, మలినం. ఇది చూసి గాంధీజీ మనసు చెదరింది. దక్షిణం వేయడానికి మనసొప్పలేదు. ఒక పైసా దక్షిణం వేసారు. అక్కడున్న పండా కోపగించాడు. "ఇలా మమ్మల్ని అవమానిస్తే నరకానికి వెళ్తావు" అని గాంధీజీని తిట్టాడు పండా. "మహారాజ్. నాకు ఏది జరగాలో అది జరుగుతుంది. కానీ మీరు ఇలా నోరు పారేసుకోవడం బాగోలేదు. ఆ పైసా కావాలంటే తీసుకోండి. లేకుంటే అది కూడా దక్కదు" అన్నారు గాంధీజీ. "నీ పైసా ఎవడిక్కావాలి " అంటూ పైసా అక్కడే వదలి, గాంధీజీని తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు పండా. అతను మళ్ళీ తిరిగొచ్చి ఆ పైసా తీసుకున్నాడు. "కాశీ పండా నన్ను నరకానికి పంపించాడు" అన్నారు గాంధీజీ. బనారస్ పండాలను ప్రముఖ హిందీ కథాకారుడు శ్రీ కాశీనాథ్ సింగ్ తన ' కాశీ కా అస్సీ ' పుస్తకంలో వ్యంగ్యంగా చిత్రించారు. ఈ పుస్తకం ఆధారంగా ' అస్సీ మోహల్లా ' హిందీ సినిమా కూడా వచ్చింది. కాలం మారింది. ఘాట్లు మారాయి. పండాలూ మారారు. గోదానానికి బదులు పేటిఎం అడుగుతున్నారు. ఘాట్లవద్ద మఠాలు, ఇల్లులు చిన్న చిన్న హెూటళ్ళుగా మారిపోయాయి. పండాలు యాత్రికుల వాట్సాప్ గ్రూప్ నడుపుతున్నారు. యాత్రికులను ఎయిర్ పోర్టు నుండి తీసుకొచ్చే ఏర్పాటు చేస్తున్నారు. పండాల మెదడు కూడా వాణిజ్యీకరణ చెందింది. ఆధునికీకరణ మంత్ర తంత్రాలలోనూ చొరబడింది. మార్పు ఘాట్లలోనూ వచ్చింది. గంగాలోనూ వచ్చింది. వీటిపై జీవిస్తున్న పండాలలోనూ వచ్చింది.

పండాల వ్యవస్థ కాశీ సంస్కృతిలో భాగం. మనిషిని నమ్మకానికి కట్టిపడేసే తాడు పండా.

డా. కె. సత్యన్నారాయణ
ఫోన్ : 8333987838

# చదవండి...

– మిసిమి

**ఏది నిత్యం :** పదునెక్కిన హలం, మక్కెన కలం అంటూ కవిత్వాన్ని ప్రవహింపచేసిన మక్కెన శ్రీను ఇప్పుడు కథలతో మనముందుకొచ్చారు. కవులు కథలు రాసినా కవిత్వం వాటిలో ఉంటుందని మరోసారి నిరూపించారు. వారు వృత్తిరీత్యా విద్యార్థులకు పాఠాలు చెప్పే ఈ ప్రొఫెసర్ సమాజానికి అవసరమయిన జీవిత పాఠాలను సరళంగా చెబుతారు ఈ కథల్లో తమ తండ్రి మక్కెన సబ్బరామయ్యగారి సంస్మరణలో సాహిత్యకారులను గౌరవించే శ్రీనుగారు జీవితాను భవాలను కథలుగా మలచారు.

*పేజీలు: 94, వెల: ₹ 110/– ప్రతులకు: 9985219712*

**ధైర్యం అంటే :** పిల్లలు పుస్తకాలు కూడా పెద్దవారే రాస్తున్న కాలంలో పిల్లల కోసం పిల్లలే రాసిన పుస్తకాలు ప్రచురించరు. తానా – మంచికథలు సంయుక్తంగా పదేళ్లలోపు పిల్లలకు తెలుగులో పుస్తకాలు చదివే ఆసక్తి పెంచటానికి ఔత్సాహిక రచయితలు, చిత్రకారుల నుంచి బొమ్మల కథల పుస్తకాలను తానా, మంచి పుస్తకం ఈ సంవత్సరానికి గాను (2023) ఆహ్వానించాయి. అలా వచ్చిన పుస్తకాలలో ఈ పుస్తకం అదే "ధైర్యం అంటే" ఒకటి.




గాయత్రి వెన్నెల, సిరిమల్లిక అనే ఇద్దరు సిస్టర్స్ కలిసి రూపొందించిన పుస్తకం ఇది. సిరిమల్లిక బొమ్మలు వేస్తే గాయత్రి వెన్నెల అక్షరాలను పొదిగింది. ఇది అచ్చమైన పిల్లల పుస్తకం. నిజాయితీ, అమాయకత్వం జతగా మనలను ఆకట్టుకుంటాయి. "ధైర్యం అంటే భయాన్ని గెలవడమే కదా" అని ఈ చిన్నారులు చెప్పటం మనలను ఆశ్చర్యపరిచే విషయం. పిల్లల చేత పెద్దలు చదివించాల్సిన పుస్తకం.

*పేజీలు: 26, వెల: ₹ 5/–*

*ప్రతులకు మంచిపుస్తకం, ఫోన్ : 9490746614*

**నేను బుద్ధిగనే ఉంటా :** పెద్దవాళ్లకి బాల్యంలోకి వెళ్లాలనిపిస్తుంది. మరి చిన్నవాళ్లకు తొందరగా పెద్దవాళ్ళం అయిపోవాలనిపిస్తుంది! కాదంటుంది సిరివెన్నెల, గాయత్రి వెన్నెలల 'బుడ్డి' మాత్రం ''బుడ్డిగానే ఉంటా!'' అంటుంది. 2023వ సంవత్సరానికి తానా–మంచి ప్రచురణలు ఎంపిక చేసిన ఎనిమిది పుస్తకాలలో ఈ అక్కచెల్లెళ్ల మరో పుస్తకం ఇది. తెలుగు ఈతరం పిల్లలకు అబ్బటం లేదు అని ఆలోచించే పెద్దవారికి వారి పుస్తకాలు స్ఫూర్తినిస్తాయి.




ఇద్దరూ బొమ్మలు వేస్తారు. ఇద్దరూ కథను అల్లుతారు అలా అవసరమయినప్పుడు 'రోల్స్' మార్చుకుంటారు. చిన్నపిల్లలు ఎలా ఆలోచిస్తారు, ఆలోచనలు ఎలా ఉంటాయి అన్న ప్రశ్నకు సమాధానం ఈ పుస్తకం. పెద్దవాళ్లకు కనువిప్పు ఈ నిప్పులాంటి పుస్తకం.

*పేజీలు: 26, వెల: ₹ 5/– ప్రతులకు: 9490634849*

**తింగరి బుచ్చి :** పదేళ్ళ పిల్లలు చదువుకునేందుకు వీలుగా మంచి పుస్తకం – తానా ఎనిమిది పుస్తకాల్లో "తింగరి బుచ్చి" ఒకటి. డా. జాస్తి రామకృష్ణ గారు కథను రూపొందిస్తే, బాబు దుండ్రపల్లి బొమ్మలు వేసారు. చిన్న పుస్తకం... పెద్ద బొమ్మలు... చిన్నపిల్లలు పెద్దవాళ్లలా ఆలోచించడం, పెద్దవాళ్ల బాల్యపు మచ్చట్లలా తోస్తాయి. దాన్ని లోపమని చెప్పలేం కానీ



అనిపించడం మాత్రం అబద్ధం కాదు. అయినా పెద్దవాళ్ళ ప్రయత్నాన్ని అభినందించాల్సిందే.

*రచన : జాస్తి శివరామకృష్ణ, బొమ్మలు : మండపల్లి*

*పుటలు : 26, వెల: ₹ 5/– ప్రతులకు : మంచిపుస్తకం*

**పెద్దయ్యాక :** ఇది 'తానా–మంచిపుస్తకం' వారి మరో ప్రచురణ. రాసినది పదవతరగతి చదివే వివేక్ శాఖమూరి. పెద్దవాళ్ళకి పిల్లలు తాము చెప్పింది చేయాలి, చదవాలి అన్న కోరిక ఎక్కువ. పిల్లలు స్వతంత్రంగా ఏదన్నా చెబితే నచ్చక, నిరుత్సాహ పరుస్తారు. అది పిల్లలని ఎంత గాయపరుస్తుందో గమనించరు. వివేక్ చిన్నవాడు కాబట్టి అలాంటి అనుభవం చూసినట్టున్నాడు, కథగా మార్చాడు. పిల్లల కథలకు బొమ్మలు ప్రాణం.



ఆ చిన్న పదాలకు కదలిక తెస్తాయి బొమ్మలు. ఈ పుస్తకానికి 'చరణ్ పరిమి' వేసిన బొమ్మలు బావున్నాయి. చిన్నపిల్లలకు ఇలాంటి పుస్తకాలు అలవాటు చేస్తే పెద్దయ్యాక తెలుగు పుస్తకం వదిలిపెట్టరు.

*పేజీలు: 26, వెల: ₹ 5/- ప్రతులకు: మంచి పుస్తకం.*

**క్షేమంగా ఇంటికి :** మనం పిల్లలుగా ఉన్నప్పుడు అడవిలో రాత్రిపూట తిరగాలని, అడవి ఎలా ఉంటుందో చూడాలన్న కుతూహలంగా ఉంటాం. తన చిన్ననాటి కుతూహలాన్ని పిల్లల కథగా మలిచారు వావి కృష్ణ. ముప్పై ఏళ్లుగా విద్యారంగంలో ఉన్నారు. పిల్లలకు కథలు చెప్పటం అలవాటు. వారి కథనానికి చక్కటి బొమ్మలేశారు రాహుల్. కామిక్ బొమ్మలు గీయాలన్న కోరిక ఉన్నవాడు ఇలాంటి కథలు పిల్లలలో ఊహాశక్తిని పెంచుతాయి. తానా- మంచిపుస్తకం వారి మరో ప్రచురణ.



*పేజీలు: 26, వెల: ₹ 5/- ప్రతులకు: మంచిపుస్తకం.*

**నా పుట్టినరోజు ఎప్పుడు? :** అక్కాచెల్లెళ్ల మధ్య, అన్నదమ్ముల మధ్య ఓ పోటీ ఉంటుంది. అక్కకేది జరిగితే తనకు అదే జరగాలని పట్టుబట్టే తమ్ముడు కుటుంబంలో సహజం. ఆ చిన్న పాయింట్ ఆధారంగా చక్కటి కథను సృజించారు డా. హారిక చెరుకుపల్లి. వృత్తిరీత్యా డాక్టర్. వీరి ప్రవృత్తి రచనలు చేయటం. చిన్నపిల్లల్లోని అమాయ కత్వాన్ని బాగా పట్టుకోగలిగారు రచయిత్రి. బొమ్మలు బాగా అమిరాయి.



*ప్రతులకు: తానా-మంచిపుస్తకం ప్రచురణ*

**మరి నువ్వేమిస్తావు :** చెయ్యి తిరిగిన రచయిత ఏం చేస్తాడు! రచన ఎలా ఉంటే ఆకట్టుకుంటుందో ఆ దిశగా ప్రయత్నం చేస్తాడు. ఆ పని రచయిత బమ్మిడి జగదీశ్వరరావు చేశారు 'నువ్వు ఏమిస్తావు' అని చిన్నపిల్లవాడు అడిగినా సమస్త ప్రకృతి మనకు అన్నీ ఇస్తోందన్న సంగతిని ఈ కథ ద్వారా మనకు గుర్తు చేస్తారు. ఎ. శ్రీకాంత్ వేసిన బొమ్మలు కథకు ప్రాణం పోశాయి.



*పేజీలు: వెల: ₹ 50/-*

*ప్రతులకు: మంచి పుస్తకం*

**నేను పెద్దోడిని. కాదు కాదు చిన్నోడిని :** ఇప్పటి పిల్లల అల్లరి తల్లులు తట్టుకోలేకపోతున్నారు కానీ, కొన్నేళ్ళ కిందట పిల్లల అల్లరిని ముచ్చటగా చూసుకునేవారు తల్లులు. భార్యాభర్తలిద్దరు ఉద్యోగాలు చేయటంతో పిల్లల అల్లరిలోని మాధుర్యాన్ని కోల్పోతున్నారని అర్థమవుతుంది. అలాంటి తల్లీకొడుకు అనుబంధాన్ని గుర్తుచేశారు ఈ కథలో రవితేజ బొప్పూడి. బొమ్మలతో చక్కటి నేటివిటీ తీసుకొచ్చారు అంజని గోల్కొండ.



*పేజీలు: వెల: ₹ ప్రతులకు: తానా- మంచిపుస్తకం.*

**చిన్నారి కన్నీటి స్పర్శ :** ఇందిరాదేవి గారికి సినీ ప్రముఖులతో పరిచయం వారి రచనలకు ప్రోత్సాహం కలిగించాయేమో?! వీరి రచనలెన్నో - కథలు - కబుర్లు కూడా అన్ని ప్రముఖ దిన వార మాస పత్రికల్లో ప్రచురించారు. ఎందరో సినీ ప్రముఖులను మాటామంతితో - ముఖాముఖీగా పలకరించి రాశారు. అవన్నీ పత్రికలలో వెలుగు చూశాయి. ఎక్కడ ఘంటసాల గాన విభావరి జరిగినా వీరే వ్యాఖ్యాతగా ఉంటారు! అంతటి అభిమానం. ఘంటసాల శ్రీమతి సావిత్రి గారి జ్ఞాపకాలు రాశారు. ఈ చిన్నారి కన్నీటి స్పర్శ నవలకు ఎన్నో యదార్థ సంఘటనలు స్ఫూర్తి కావచ్చు. కాని ఇవన్నీ కల్పితం అంటారు ఇందిరాదేవి గారు.



*పేజీలు: 328 వెల: ₹ 200/- ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, ఫోన్ : 9550228719 (ఇందిరాదేవి)*

**బడి బువ్వ :** కతలు! గరిపెల్లి అశోక్ - బాలవికాస - కేరాఫ్ అశోక్.

ఈ కథలన్నీ బడిలో జరిగినవేనని అశోక్ గారే చెప్పారు - దీనినిబట్టి ఇవి ఎలా వుంటాయో ఊహించుకోవచ్చు. బడి-పిల్లలు-పంతుళ్ళు బడిగంట-ఆటమైదానం (ఉంటే) ఇవన్నీ వీరి ముడిసరుకు - పాత్రధారులు. మీరంతా పెద్దక్క పద్మావతి కథలు చదవాల!



*పేజీలు : 68 వెల: ₹ 80/-*

*ప్రతులకు: 9849649101*

# మిసిమి

మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi Publication**
**HDFC Current Account No. 50200069769243**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**

Misimi Publication

## మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు


రజ్జు సర్పభ్రాంతి


బైరన్


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


సిద్ధార్థ


సప్తపర్ణి



షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


నృత్యభారతి



పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.




దుర్యోధనుడు

మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.8.2023



శాంతి